# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

10 - 4 -2023 సంపుటి -1 రంజాన్ సంచిక(మే-ఏప్రిల్) సంచిక-2 రూ.25/-






## ఆస్కార్ అవార్డ్స


























చీఫ్ ఎడిటర్
**శ్రీమతి ఎ. శ్రీవిద్య**





ఎడిటర్
**శ్రీమతి కె. వీణ**

## సుమతి పాఠకులకు విజ్ఞప్తి

**తెలుగు సాహితీ జగత్తులోకి**
**శోభకృత నామ సంవత్సర ఉగాది రోజున**
**బుడి బుడి నడకలతో కాలిడుతున్న చిన్నారి**

# సుమతిని

**(సమగ్ర సకుటుంబ మాసపత్రిక)**
**మీ ప్రేమానురాగాలతో ఆదరాభిమానాలతో**
**ఆదరిస్తారని ఆశిస్తూ**

**- ఎడిటోరియల్ బోర్డ్**

## రచనలకు ఆహ్వానం

యువ రచయితలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కథలు, కవితలు, కార్టూన్లు స మకాలీన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాము. రచనలు తమ సొంతమేనని మరెక్కడా ప్రచురితం కాలేదని హామీ పత్రం తప్పని సరిగా జత చేయాలి.

రచనలన్నీ యునికోడ్ లో టైపు చేసి ఈ క్రింది ఇ మెయిల్ కు పంపగలరు

sumathi.kathalu20203@gmail.com

sumathi.kavitalu2023@gmail.com

sumathi.cartoons2023@gmail.com

లోపలి పేజీలలో....

# ఈ నెల కుసుమాలు...

## అందరి కోసం


4 ముఖచిత్ర కథ
7 అంతర్నేత్రం
18 వార్తల్లో వ్యక్తి
23 హెల్త్ టిప్స్
25 సెటైర్
29 చూడాల్సిన ప్రదేశం
38 రేపటి కోసం
46 ముఖా ముఖి
59 వినాల్సిన పాట
61 చదవాల్సిన పుస్తకం
63 చూడాల్సిన సినిమా
89 సాహితీ శిఖరాలు
90 జీవన చిత్రాలు
92 ఈ నెల స్మరణీయులు
96 పండుగ
99 పుస్తక సమీక్ష
106 సభలు-సత్కారాలు
107 గ్రంధావిష్కరణ
108 పుస్తక పరిచయం
111 సాహితీ పద సుమతి
112 చిత్ర కథ-చిత్రకవిత








## యువత కోసం


39 GPT-4 (టెక్నాలజీ)
41 ఫోటోగ్రఫి పాఠాలు (మూడో కన్ను)
44 యువతా తెలుసుకో
48 కరెంట్ అఫైర్స్
53 Python నేర్చుకోండి
87 క్రీడా ప్రపంచం


## మహిళల కోసం




17 డూడ్లింగ్
27 కొత్తగా వస్తున్నాయి
28 వంటా వార్పూ
82 ఆధ్యాత్మికం


## పిల్లల కోసం


109 పిల్లల కథ
110 పిల్లలు పిడుగులు


## కథలు, సీరియల్స్


9 తనువా ..హరి చందనమే (సరస కథ )
14 రాణా ప్రతాప్ (చరిత్రాత్మక సీరియల్)
20 గర్భ శ్లోకం (క్రైం సీరియల్)
32 కలవరమాయే మదిలో (హాస్యకథ)
55 అహింసా పరమో ధర్మః (కథ)
66 పరుగులు తీసే నీ వయసునకు(సీరియల్
71 బొమ్మ సాహసం (క్రైం కథ)
77 చెక్క గుర్రాలు (వాస్తవ కథ )
101 చరమాంకం (కథ)
103 పర్సోపాఖ్యానం (కథ)


## కవితలు


22 నేలను స్పర్శిస్తున్న ఆకాశం
24 తోలుబొమ్మలు
26 చిత్ర కవితలు
40 నాన్న (నానీలు )
45 అక్షర కురుక్షేత్రాలు
58 తడి ఆరని గాయం
65 రెడ్ లైట్ ఏరియా




**ముఖచిత్ర కథ**

# ఆస్కార్ అవార్డులు



ఆస్కార్ అవారు.... ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ జీవులందరూ ఆశగా ఎదురుచూసే ఏకైక అంతర్జాతీయ పురస్కారం .అటువంటి అవార్డు ఒకటి కాదు ఒకేసారి రెండు అవార్డులు మన దేశాన్ని వరించటం తో మన దేశ సిని అభిమానుల ఆనందానికి హద్దులే లేకుండా పోయాయి .తెలుగు సినిమా RRR చిత్రంలోని "నాటు నాటు ..." పాటకు ఉత్తమ ఒరిజినల్ పాటగా , "ఎలిఫంట్ విస్పరర్స్ "అనే లఘు చిత్రం, ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రంగా 95వ అకాడమి అవార్డులు గెలుచుకున్నాయి .

దశాబ్దకాలం తరువాత భారతీయ చిత్రాలకు ఆస్కార్ అవార్డులు రావటంతో ప్రధాని మంత్రి నుండి ముఖ్యమంత్రుల వరకు RRR చిత్ర దర్శకుడు రాజమౌళి ,సంగీత దర్శకుడు కీరవాణి , పాటల రచయిత చంద్రబోసు , ఎలిఫంట్ విస్పరర్స్ చిత్ర దర్శకురాలు కార్తికి గొంసల్వేస్ ను అభినందనలతో ముంచెత్తారు .

1982 లో గాంధీ చిత్రానికి ఉత్తమ వస్త్రాలన్కరణకు భాను అత్యా ఈ అవార్డు మొట్టమొదటి సారి అందుకున్నారు. అటు తరువాత 1992 లో మన దేశం గర్వించదగ్గ దిగ్గదర్శకుడు సత్యజిత్ రే కు ఆకాడమీ గౌరవ అవార్డు నిచ్చి సత్కరించింది .2009 లో ఉత్తమ సౌండ్ మిక్సింగ్ కు గాను రసూల్ పోకుట్టి ని(స్లం డాగ్ మిలియనీర్ ) ఆస్కార్ వరించగా ఆ సంవత్సరం ఉత్తమ ఒరిజినల్ పాటకు గాను పాటల రచయత గుల్జార్ కు సంగీత దర్సకుడు రేహ్మానుకు ఈ అవార్డులు లభించాయి .

**ఆస్కార్ అవార్డుల స్థాయిలో భారతీయ చిత్రాలు లేవా ?**

మన దేశంలో ఎంతోమంది అంతర్జాతీయ స్థాయిలో గర్వించతగ్గ దర్శకులు ,నటులు, నటీమణులు , సాంకేతిక నిపుణులు ఉన్నా వారెవ్వరికి ఆస్కార్ అవార్డులు లభించకపోవటంతో ఈ తరానికి ఈ సందేహం రావటం సహజమే .కాని ఆస్కార్ అవార్డు రానంత మాత్రాన మన దేశంలోని ప్రతిభ గల దర్శకులను, నటినటుల ప్రతిభను అనుమానించాల్సిన పని లేదు.

**"సత్యజిత్ రే , శ్యామ్ బెనగల్ , గురుదత్ , మ్రునల్ సేన్ ,బిమల్ రాయ్ , గిరీష్ కాసరవల్లి , ఆదుర్ గోపాలక్రిష్ణన్ వంటి దర్శకుల చేతుల్లోనుండి ఎన్నో ఆణిముత్యాల లాంటి చిత్రాలు వచ్చాయి."**

సత్యజిత్ రే , శ్యామ్ బెనగల్ , గురుదత్ , మ్రునల్ సేన్ ,బిమల్ రాయ్ , గిరీష్ కాసరవల్లి , ఆదుర్ గోపాలక్రిష్ణన్ వంటి దర్శకుల చేతుల్లోనుండి ఎన్నో ఆణిముత్యాల లాంటి చిత్రాలు వచ్చాయి . వీరికి ఆస్కార్ అవార్డు దక్కక పోవటం ఆ అవార్డుకే చిన్నతనం .

అదే విధంగా దిలీప్ కుమార్ , కమల్ హాసన్ , శివాజీ గణేశ్, రాజ కపూర్, రాజ్ కుమార్, ఎస్ వి రంగారావు , మోహన్లాల్ వంటి నటులకు ,సావిత్రి , శారద , నర్గిస్ , శ్రీదేవి , మధుబాల ,మీనాకుమారి తదితర నటిమణలకు ఈ అవార్డు దక్కలేదు .దీనికి కారణం బహుశా భారతీయ చిత్రాలపై విదేశియుల కున్న చిన్నచూపే తప్ప మరొకటి కాదు .


ఒక మాయాబజార్ , మల్లీశ్వరి , అనార్కలి , మొఘల్ ఎ అజాం, ప్యాస, షోలే వంటి చిత్రాలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నప్పటికీ ఏ విధమయిన అవార్డు రాకపోవటం మన దేశం పట్ల వాళ్ళ కున్న చులకన భావమే కాక మరేమిటి అని సందేహం వస్తుంది .సత్యజిత్ రే తీసిన చిత్రాలలో దేనికి అవార్డు ఇవ్వకుండా కేవలం గౌరవ అవార్డు ఇవ్వటం ఆయన స్థాయిని తగ్గించటం తప్ప మరొకటి కాదు.

# ఆస్కార్

**RRR కన్నా అద్భుత చిత్రాలు లెవా ?**

ఇప్పుడు కూడా ఎలిఫంట్ విస్పరర్స్ చిత్రానికి అవార్డు ప్రకటించటం పట్ల ఎవ్వరు ఆక్షేపణలు లేవనెత్త లేదు కానీ ,RRR లోని నాటు నాటు ..పాటకు అవార్డు ప్రకటించటంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వేల్లువెత్తుతున్నాయి . కేవలం అవార్డు కమిటిలోని జ్యూరి సభ్యులను లాబియింగ్ చెయ్యటం వల్లే అవార్డు దక్కిందని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి .మొదటి నుండి ఈ లాబియింగ్ లో వెనుక పడి పోవటం వల్లే మన భారతీయ చిత్రాలకు అవార్డులు దక్కలేదనే వాదన కూడా ఉంది .

నిజానికి నాటు నాటు పాటకన్నా అద్భుతమైన పాటలు లేవా ? వాటికి ఆస్కార్ అవార్డు ఎందుకు రాలేదని నేడు సగటు సిని అభిమాని మనసులో తొలిచే ప్రశ్న . హింది , కన్నడ ,తెలుగు ,మలయాళం ఇలా ఏ భాష తీసుకున్న ఎన్నో మధుర గీతాలు ఈనాటికి అభిమానుల గుండెల్లో మారు మ్రోగుతూనే ఉన్నాయి .ఏ చిత్రానికైనా ప్రేక్షకుల ఆదరణ కన్నా గొప్ప అవార్డు ఏది ఉండదు.ఆ విషయంలో కుడా RRR చిత్రం ముందు వరసలోనే ఉంది .RRR చిత్ర దర్శకుడు, నటీనటుల ప్రతిభను తగ్గించి చూపటం ఈ వ్యాసం ఉద్దేశ్యం ఏమాత్రం కాదు .కేవలం భారతీయ చిత్రాల పట్ల అకాడమి




అవార్డుల కమిటి చూపుతున్న వివక్షతను తెలియ చెప్పాలనే చిన్న ప్రయత్నము మాత్రమే .

ప్రతి ఏడాది మనదేశం నుండి ఒక ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసి ఆస్కార్ అవార్డుల కోసం పంపుతోంది ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా.మదర్ ఇండియా , మధుమతి ,సాహిబ్ బిబి అవుర్ గులాం ,ది గైడ్ ,ఆమ్రపాలి ,ఇండియన్ ,గురు ,దేవదాస్ ,బాండిట్ క్వీన్ వంటి 50 కి పైగా చిత్రాలు మన దేశం నుండి ఆస్కారుకు పోటి పడ్డాయి .వీటిలో దేనికి ఏ విభాగంలోనూ అవార్డు రాలేదు.

**ఆస్కార్ అవార్డు కు అర్హతలేమిటి ?**

ఏ చిత్రమైన ఆస్కార్ అవార్డుకు నామినేట్ అవ్వాలి అంటే , అది ముందుగా సినిమా హాళ్ళలో విడుదల అవ్వాలి. 40 నిమిషాల నిడివి కన్న ఎక్కువ ఉండి , సబ్ టైటిల్స్ తో విడుదలైన ఏ చిత్రం అయినా ఆస్కార్ కు పోటి పడవచ్చు .

## ది ఎలిఫెంట్ విస్పరర్స్



కార్తీక్ గొంసల్వేస్ దర్శకత్వం వహించిన " ది ఎలిఫెంట్ విస్పరర్స్ " లఘు చిత్రం 2023 కు గాను ఉత్తమ డాక్యుమెంటరి చిత్రంగా 95వ ఆస్కార్ అవార్డు కైవసం చేసుకుంది . చిత్ర కథ మొత్తం బొమ్మన బెల్లి అనే దంపతులు , రఘు అనే అనాధ ఏనుగు పిల్ల మధ్యే తిరుగుతుంది .

గాయపడిన ఒక అనాధ ఏనుగు పిల్లను తీసుకొచ్చి పెంచి పెద్ద చేసే క్రమంలో ఆ ఏనుగుకు ఆ దంపతులకు మధ్య పెనవేసుకునే అనుబంధాలను , మదుమలై అడవుల అందాల నేపధ్యంలో ఎంతో హృద్యంగా చిత్రకిరించటం జరిగింది.చెప్పువటానికి కథలో పెద్దగ విషయం ఏమి లేక పోయినా , ఒక జంతువుకు , ఒక మనిషికి మధ్య ఏర్పడే ప్రేమానుబంధా లను దర్శకురాలు ఎంతో హృద్యంగా చిత్రీకరించారు . చిత్రం ప్రతి దృశ్యంలో భారతీయా సంస్కృతి ,సంప్రదాయాలు, పచ్చటి పర్యావరణ అందాలు కనువిందు చేస్తాయి .

ఈ చిత్రం నిర్మించ టానికి దర్శకురాలు కార్తికి 5సంవత్సరాల పాటు ఏనుగులు పెంచే కట్టుయకన్ కుటుంబాలతో గడిపి వారి అలవాట్లను దగ్గరనుండి నేర్చుకోవటం వల్ల తెర మీద ఏ మాత్రం అసహజత్వం లేకుండా చిత్రీకరించాగాలిగారు.

# ఆస్కార్

మన దేశం నుండి ఫిలిం ఫెడరేషన్ అఫ్ ఇండియా అధికారికంగా సినిమాలను అస్కార్కు పంపుతుంది .RRR భారత ప్రభుత్వం నామినెట్చెయ్యక పోయినా వాళ్ళుసొంతంగా అకాడమీకి దరఖాస్తు చేసుకున్నారు .

**ఆస్కారు అవార్డుకు ఎంత ఖర్చవు-తుంది?**

ది గార్డియన్ పత్రిక లెక్కల ప్రకారం
1. పి ఆర్ ఓ కోసం 12–18 లక్షలు
2. అడ్వేర్టైస్మెంట్ కోసం 8 కోట్లు
3. నామినేషన్ ఖర్చు 6 కోట్లు
4. నామినేషన్ తరువాత కమర్షియల్ ప్రమోషన్ కోసం 12 కోట్లు
5. సినిమా ప్రదర్శనల కోసం 1.3 కోట్లు
6. డి వి డి , డిజిటల్ స్క్రీనింగ్ కోసం 2.5 కోట్లు
7. నటి నటులను తీసుకురావటానికి 7 కోట్లు
8. జ్యూరి సభ్యులకు విందులు వినో-దాలకు 10 కోట్లు

న్యూ యార్క్ టైమ్స్ లేక్కల ప్రకార 120 కోట్ల పైనే ఖర్చవుతుంది . RRR చిత్రం ఇందుకోసం 80 కోట్లు ఖర్చు బెట్టారని సామాజిక మధ్యమాలలో వార్తలు షికారు చేస్తున్నాయి .

2016లో 'విచారనై ' సినిమా అస్కా-రుకు భారత ప్రభుత్వం నామినేట్ చేసింది .దాని దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ ,
"ఆస్కార్ నామినేషన్ కు సినిమా ఎంపిక అయ్యిన తరువాత కనీసం 2 నెలలు లాస్ ఏంజల్స్ లో విందులు వినోదాలు ఏర్పాటు చేసి సినిమాను ప్రమోట్ చేసుకోవాలి . దీనికి పిఆర్ ఓ ను నియమించుకుని , ఆంగ్ల పత్రికల్లో యాడ్స్ ఇవ్వాలి. రిపోర్టర్ , హాలివుడ్ రిపోర్టర్ వంటి పత్రికలలో యాడ్స్ కు 24 లక్షలు ఖర్చు అవుతుంది .సినిమా ప్రచారం మిగితా ఖర్చులన్నీ కలిపి 10 కోట్ల పైనే అవుతుంది ."

ఈ ఖర్చులు తగ్గించినప్పు-డే ఉత్తమ చిత్రాలకు అవార్డులు దక్కుతాయ ని పలువురు సిని ప్రముఖులు అంటున్నారు . గతంలో




కేవలం వార్తా పత్రికల్లో మాత్రమే ప్రమోషన్ చేసేవాళ్ళు . కాని నేడు డిజిటల్ ప్రమోషన్ల కోసమే కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోంది .2023లో 10000మంది అర్హులైన ఓటర్లు ఆస్కార్ చిత్రాలకు తమ ఓటును వేసారు.మొదటి రౌండ్ లో ఎ విభాగానికి చెందిన ఓటర్లు అ విభాగంలో వచ్చిన చిత్రాలకు ఓటు వేస్తే, రెండవ రౌండు లో అందరూ అన్ని చిత్రాలకు ఓటు వేస్తారు .ఇక ఆఖరి ప్రిఫ్ఫెరెన్షియల్ రౌండులో మళ్ళి ఓటు వేస్తారు. వీళ్ళందరూ తమ చిత్రానికే ఓటు వేసేటట్లు చూసుకోవాలి .ఇన్ని ఇబ్బందులు అధిగామిస్తేగాని ఆస్కార్ మన చెంతకు చేరదు.

## ఎవ్రీ థింగ్ ఎవ్రీ వేర్ ఆల్ ఎట్ వన్స్

2023 కు గాను ఉత్తమ చిత్రంగా ఆస్కార్ అవార్డుకు ఎన్నిక అవ్వటమే కాక

ఉత్తమ నటి –మిచెల్లే యెహ

ఉత్తమ సహాయ నటి –లీ కర్టిస్

ఉత్తమ సహాయ నటుడు –కె హుయ్ క్వాన్

ఉత్తమ స్క్రీన్ ప్లే – డేనియల్ కావన్

ఉత్తమ ఎడిటింగ్ – పాల్ రోజర్

ఉత్తమ దర్శకుడు – డేనియల్ కావన్





## అంతర్నేత్రం

# అంతరంగంలో యుద్ధం




అంతరంగంలో యుద్ధం

జీవితం కాశీమజిలీ కథ కాదు. పంచతంత్రంలోని కథ అసలే కాదు. జీవితం ఒక యుద్ధం. మెలకువలోనే కాదు, కలలో కూడా నిత్యం ఘర్షణే.

ఈ ప్రపంచంలోని ప్రతి జీవి తన అస్థిత్వాన్ని నిలబెట్టుకోవటానికి నిత్యం జీవన పోరాటం చేయాల్సిందే.

పద్దెనిమిది రోజులు జరిగిన కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు తెలుసుకున్నది ఏమిటంటే యుద్ధం బయట లేదు. మనలోనే ఉంది. మన మనసులోనే నిత్యం సంఘర్షణ. ఈ మనసును నియంత్రించ గలిగితే జీవితం విలువ తెలుస్తుంది.

**"కస్తూరి మృగం తన పొట్టకిందె ఉన్న కస్తూరిని మరిచిపోయి జీవితమంతా పరుగు తీసినట్లు, మనశ్శాంతి కోసం మనిషి ఆరాటపడు తున్నాడు.**

కస్తూరి మృగం తన పొట్టకిందే ఉన్న కస్తూరిని మరిచిపోయి జీవితమంతా పరుగు తీసినట్లు, మనశ్శాంతి కోసం మనిషి ఆరాటపడు తున్నాడు.

అవగాహన లేనివాళ్ళు, జీవితాన్ని ఆటపాటలతో గడిపేస్తారు. బాల్యం, యవ్వనం, మధురమైన ఊహల్లో కరిగిపోతుంది. కౌమార్యం సంసారిక బాధలతో, వృద్ధాప్యం శారీరక బాధలతో నిండిపోతుంది. ఇక తనను గురించి తెలుసుకునే సమయమే లేక ఆరాట పోరాటాలతో బ్రతుకీడుస్తూ వుంటాడు.

జీవితాన్ని అపార్థం చేసుకోవటం వల్లే ఈ ఘర్షణలు. జీవితాన్ని అర్థం చేసుకుంటే నిజమైన జీవితం జీవించడం తెలుస్తుంది. వ్యవసాయ క్షేత్రాన్ని రాళ్ళు, కలుపు మొక్కలు లేకుండా బాగా దున్ని చదును చేసినప్పుడే విత్తనం అంకురించి మానుగా ఎదుగుతుంది.

**"నమ్మకాలు, భయాలు, కట్టుబాట్లు, ద్వేషాలు, ఆందోళనలు వదిలించుకుంటే మనసు ప్రశాంత స్థితిని చేరుకుంటుంది."**

నమ్మకాలు, భయాలు, కట్టుబాట్లు, ద్వేషాలు, ఆందోళనలు వదిలించుకుంటే మనసు ప్రశాంత స్థితిని చేరుకుంటుంది.

మనసును నిలకడగా ఉంచుకోగలిగితే ప్రశాంతత లభిస్తుంది. ఆలోచనల్ని వదిలించుకుని, ప్రశాంతత సంపాదించాలంటే ఎంతో శక్తి కావాలి. వైరుధ్యాలు అంతరించాలి. ఎప్పుడైతే మనసు అన్ని విధాలైన సంకల్పాలు, నమ్మకాల నుంచి విడిపోతుందో అప్పుడే అంతరంగాన్ని తెరిచి చూడాలి. అదే సత్య దర్శనం. ఈ సత్య సందర్శనం అయ్యాక మనసు నూతన తేజంతో నిండి పోతుంది. అప్పుడు ఒంటరితనం అనే బాధ ఉండదు. ఎవరి ఓదార్పు కోసమో మనసు ఎదురు చూడదు. ఈ ప్రశాంతత వల్ల మనిషి అంతర్ముఖుడవుతాడు. ఆత్మజ్ఞానాన్ని తెలుసుకుంటాడు.

**"నేను మంచివాడిని, అందరూ నన్ను మెచ్చుకునేలా ప్రవర్తించాలనే తపన వల్ల కూడా ప్రశాంతత దూరమౌతుంది. "**

నేను మంచివాడిని, అందరూ నన్ను మెచ్చుకునేలా ప్రవర్తించాలనే తపన వల్ల కూడా ప్రశాంతత దూరమౌతుంది.

పొంగిపోవడం, కుంగిపోవడం ఎప్పుడూ మంచి మానసిక స్థితి కాదు. ప్రశాంతత కోరేవాడు బాహ్య పరిస్థితులకు స్పందించడు.



# అవి - ఇవి

మనసులో అలజడి ఎంత తగ్గితే అంత శాంతి. మానసిక ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. జీవితం ఎవరికీ పూలపాన్పు కాదు. ఆధునిక మానవ జీవితం యాంత్రికం, వేగవంతం. వేగాన్ని పెంచుకుని అందరికన్నా ముందుండాలని మనిషి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఆ వేగానికి లక్ష్యం లేదు.

మౌనం, ప్రశాంతత నిస్సహాయంగా, అసమర్థతగా పరిగణించరాదు. అది శక్తిమంతుడి స్వీయ నియంత్రణ. ఎటువంటి పరిస్థితుల్లోనైనా నిబ్బరం, ధైర్యం, ఉదాత్తత, మనసుమీద ఆధిపత్యం గలవాడే నిజమైన ధీశాలి. అటువంటి వాడే తన అంతరంగాన్ని జయించగలడు.★★★

## తన్నులే ఇక్కడ ప్రసాదాలు

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిన్నహోత్తూరు గ్రామంలో వెల సిన సిద్ధరామేశ్వరస్వామి ఉత్సవాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. వీరభద్రస్వామి అవతారంలో వున్న పూజారి త్రిశూలం చేతబూని కేకలు వేస్తూ భక్తులను తన్నుతూ తిరగడం ఆకట్టుకుంది. ఆయన తన్నుల కోసం భక్తులు ఎగబడతారు. ఆయనతో తన్నులు తింటే కోరిన కోర్కెలు వీరభద్రస్వామి తీరుస్తాడని భక్తులు నమ్ముతారు. అనంతరం ఉగ్రుడైన వీరభద్రస్వామి అవతారంలో ఉన్న పూజారిని గ్రామస్తులు మిరప కాయల పొగబెట్టి శాంతింపజేశారు. పార్వతీపరమేశ్వరుల పెళ్లి చేసే విషయంలో విఫలమయ్యారని వీరభద్రస్వామి ఉగ్రుడై ఇలా గ్రామ పెద్దలను తంతాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇదే ఆచారాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు.

## నగ్న నిరశన

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేంబ్రిడ్జి యూనివర్సిటీలో డాక్టర్ విక్టోరియా బేట్‌మన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థులకు ఎకనమిక్స్(అర్థశాస్త్ర) పాఠాలు బోధించడం ఆమె పని. ఆమె కేవలం ఒక ప్రొఫెసర్ మాత్రమే కాదు, ఉద్యమకారిణి కూడా. ప్రభుత్వ విధానాలపై తరచూ నిరసన తెలియజేస్తుంటారు. అది కూడా నగ్నంగా. "నగ్నంగా ఉన్న నన్ను చూసి ప్రజలు అనేక రకాలుగా అనుకుంటారు. ఆమె ఒక స్టుపిడ్, ఇడియట్ అని, ఈమెకు వెర్రి అనుకుంటారు. కానీ, నేను వాస్తవాల గురించి ఆలోచించే వ్యక్తిని. అందుకే అలా నిల్చుంటాను" అని బేట్‌మన్ చెప్పారు. అయితే, ఆమె నగ్న నిరసనలు మాత్రం వివాదాస్పదంగా మారాయి.
తన తాజా పుస్తకాన్ని ఆన్‌లైన్ రిటైల్ సంస్థ అమెజాన్ నిషేధించిందని ఆమె చెప్పారు. పుస్తకం కవర్ ఫోటో లైంగికపరమైన అంశాలను సూచించేలా ఉందని భావించి బ్యాన్ చేసినట్లు బేట్‌మన్ చెప్పారు. సోషల్ మీడియా ఉద్యమంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని ఆమె చెప్పారు. సొంత శరీరంపై కూడా మహిళలకు స్వేచ్ఛ లేదని, వాళ్లు ఏదైనా చేయాలనుకుంటే అనుమతించే పరిస్థితులు లేవని ఆమె భావిస్తున్నారు. ఈ నియంత్రణ పోవాలంటే సెక్సువల్ రివల్యూషన్ రావాలని ఆమె భావిస్తున్నారు.ఆ కవర్ ఫొటోలో ఆమె శరీరం పూర్తిగా కనిపించేలా లేదు. అందులో ఆమె పొట్ట భాగం స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఛాతి భాగం రూపురేఖలు కనిపించేలా ఉంది."నా శరీరాన్ని ప్రదర్శించడం వల్ల నేను చెప్పాలనుకున్న విషయం విలువైనది కాకుండా పోతుందని భావించడం లేదు." అని బేట్‌మెన్ అన్నారు.

## నేను చావలేదు

ఇటీవల సామజిక మాధ్యమాల్లో చాలామంది తెరమరుగైన నటులు, నటీమణులు తెర ముందుకు వచ్చి మేము ఇంకా చావలేదు , దయచేసి మేము బతికుండగానే మమ్మల్ని చంపకండి అని వేడుకోవటం చూస్తుంటే ,మన సామజిక మాధ్యమాలు రేటింగు ల కోసం ఎంతగా దిగజారుతున్నాయో అర్థం కానిది కాదు . నోబుల్ బహుమాన గ్రహీత, ప్రసిద్ధ రచయిత రుడ్ యార్డ్ క్లిపింగ్ (1865-1936)విషయంలో కుడా అదే జరిగింది.ఆయన వ్రాసిన జంగిల్ బుక్స్ విశేష ప్రాచుర్యం పొందాయి.East is East and West is West - The Twain shall never meet అని తూర్పు దేశాల గురించి పశ్చిమ దేశాలగురించి ఆయన అన్నమాటలు ప్రపంచ ప్రసిద్ధి పొందినాయి.
ఒకసారి రుడ్ యార్డ్ కిప్లింగ్ బ్రతికుండగానే ఆయన చనిపోయి నట్లుగా ఒక పత్రిక వార్త వేసింది. అది చదువుకున్న కిప్లింగ్ ఆ పత్రికా సంపాదకులకు వెంటనే ఒక ఉత్తరం రాస్తూ "అయ్యా, మీ పత్రికలో నా . మరణ వార్త చదివాను. కాబట్టి నేను మరణించినట్లేనని భావించి మీ పత్రిక 3 చందాదార్ల లిస్టులో నుంచి నా పేరు తొలగించవల్సిందిగా ప్రార్థిస్తున్నాను" అంటూ తెలియజేశారు. తక్షణం ఆ పత్రికాసంపాకుడు కిప్లింగ్ వద్ద ప్రత్యక్షమై జరిగిన పొరపాటుకు క్షమించవల్సిందిగా వేడుకున్నాడు.

బహుమతి పొందిన కథ

# తనువా..హరిచందనమే

సరసమైన కథ



**కోనే నాగ వెంకట ఆంజనేయులు**

"ఈ నెల యిరవై రెండున నీకు పెళ్లిచూపులు. కనీసం రెండు రోజులు ముందుగా రా" అమ్మ నుంచి ఆజ్ఞాపన – ఫోన్ కాల్ రూపంలో రాగానే ఒక్కసారిగా నీరసం ముంచుకు వచ్చింది నాకు.

"అమ్మా! అప్పుడే పెళ్లేమిటి నాకు?" అప్రయత్నంగా అన్నాను ... కాదు ... అరిచాను ఫోన్ అదిరేలా.

అటు నుంచి అమ్మ నవ్వు.

"ఇంకా చిన్న పిల్లని అనుకుంటున్నావా నిన్ను నువ్వు? మొన్న అగస్ట్ లోనే యిరవై అయిదు నిండిపోయాయి తెలుసా నీకు?" అంది.

అమ్మ వైపు దగ్గర బంధువులు అక్కడ ఉండడంతో పదిహేడేళ్ల చిన్న వయసులోనే చదువుకోడానికి నన్ను అమెరికా పంపేశారు.

అమెరికాలో ఓ మంచి యూనివర్సిటీ లో సీటు వచ్చి – చదువు పూర్తి అయిన వెంటనే ఓ మంచి కంపెనీ లో ఉద్యోగం వచ్చేయడంతో – ఈ ఎనిమిదేళ్ల లో మాతృ దేశానికి వెళ్లడం వీలు కాలేదు నాకు.

ఉద్యోగంలో చేరి కొద్ది నెలలే కావడంతో పెళ్లి చూపులకు యిండియా వెళ్ళడానికి సెలవు దొరుకుతుందో లేదో తెలియదు. స్కైప్ లోనో, జూమ్ లోనో పెళ్లిచూపులు జరగడం అబ్బాయి వాళ్ళకి యిష్టం లేదట.

ఎందుకో సడెన్ గా గుర్తుకు వచ్చాడు హరి.

ఇందిరానగర్ లో మా యింటికి ఎదురిల్లే హరి వాళ్ళది. మా రెండిళ్లకూ మధ్యన రోడ్డు. నాకు ఊహ తెలిసినప్పటి నుండీ వాళ్ల యింటికి, మా యింటికి రాకపోకలుండేవి.

హరి వాళ్ళ అమ్మ గారు మా అమ్మని వదిన గారూ అంటూ పలకరించేవారు. కూరలు, అవకాయలు, పిండి వంటలు ఒకరి యింటి నుండి మరొకరి యింటికి సరఫరా అవుతుండేవి.

చిన్నప్పటి నుంచీ మిగతా ఆడా మగా పిల్లలతో కలిసి మెలిసి ఆడుకునే నాపై సడెన్ గా ఆంక్షలు మొదలయ్యాయి.

నన్ను ఒంటరిగా హరి వాళ్ళ ఇంటికి వెళ్ళనిచ్చేవారు కాదు మా యింట్లోని వాళ్ళు. వాళ్ళింట్లో హరి ఒక్కడే సంతానం. మా యింట్లో నేనొక్కదాన్నే.

అప్పటి వరకూ కలిసి కట్టుగా ఆడుకునే మా మధ్య ఈ ఆంక్షలు ఎందుకో నాకు అర్థం కాలేదు మొదట్లో. నేను 'పెద్దపిల్ల' ని అయిన తరువాత నుండే ఈ ఆంక్షలు మొదలయ్యాయని చాలా నెలల తరువాత గానీ గ్రహింపుకు రాలేదు నాకు.

మా నాన్న గారికీ, హరి వాళ్ల నాన్నగారికీ మధ్య అంతగా సాన్నిహిత్యం పెరగలేదు ఎందుచేతనో. వారిరువురి మధ్య ఉద్యోగాల్లో ఉన్న అంతరం వల్ల కాబోలు. వాళ్ళ అమ్మ, మా అమ్మ మాత్రం ఆప్యాయంగా ఉండే వాళ్ళు.

హరి వాళ్ళింట్లో జామ, సపోటా, బొప్పాయి మొదలైన పండ్ల చెట్లు ఉండేవి. మా పెరట్లో ఓ మామిడి చెట్టు మాత్రమే ఉండేది. మిగతా జాగాలో రంగురంగుల పూల

బహుమతి పొందిన కథ

# తనువా ..హరి చందనమే

మొక్కలు, కూరగాయల మొక్కలు పెంచేది అమ్మ.

చిలుక కొట్టిన ఎర్రటి జామ పళ్ళు నాకెంతో యిష్టమని తెలిసిన హరి అలాంటి పళ్ళు దొరికినప్పుడు నా కోసం ప్రత్యేకంగా తీసుకు వచ్చి యిచ్చేవాడు. అసలు నన్ను చూడడానికి రావడానికే అలాంటి పళ్ళ కోసం గాలించే వాడని నా అనుమానం, నమ్మకం.

మొదట్లో బాహాటంగా యిచ్చే వాడు గానీ ఆంక్షలు మొదలైన తరువాత రోడ్డు మీద కాపు కాసి నేను ఒంటరిగా కనిపించినప్పుడు యిచ్చేవాడు. అప్పుడు వాడి కళ్ళలో నా మీద కనిపించే అభిమానం క్రమంగా యిష్టంగా మారిపోవడం నేను గమనించకపోలేదు. క్రమంగా నేను కూడా వాణ్ణి యిష్టపడుతున్నానని గ్రహించాను.

ఓ రోజు అమ్మ మా పెరట్లోని మామిడి చెట్టు కాయలు కోయించి – కొన్ని కాయలు ఓ సంచిలో పోసి అత్త వాళ్లకు యిచ్చి రమ్మని పంపించింది.

అవి తీసుకున్న అత్త – అప్పుడే స్టవ్ మీద నుంచి దించిన వేడి వేడి యిడ్లీలు ఓ నాలుగు – ప్లేటులో పెట్టి కొబ్బరి చట్నీ వేసి యిచ్చింది తినమని.

అవి తినేసి గబగబా వెళ్లిపోతుంటే గుమ్మం దగ్గర అటకాయించేడు హరి.

"ఏయ్ ఆగు! అమ్మ తినమని యిస్తే దాచుకుని తీసుకు పోతున్నావేమిటి?" అని అడిగేడు దబాయింపుగా.

అత్త పెట్టిన యిడ్లీల గురించే అడుగుతున్నాడని అర్థం చేసుకుని "ఎక్కడా? తినేశానుగా?" అన్నాను ఆశ్చర్యంగా – నా ఖాళీ చేతులు చూపిస్తూ.

"తిన్న రెండింటి గురించి కాదు నేను అడిగేది – రహస్యంగా దాచుకుని తీసుకుపోతున్న ఆ రెండింటి గురించి" చిలిపిగా అన్నాడు – అప్పుడప్పుడే ఎత్తు సంతరించుకుంటున్న నా మెత్తని సున్నితమైన స్థానాల వైపు వేలు పెట్టి చూపిస్తూ.

సిగ్గుతో పారిపోయిన నేను ఆ తరువాత మళ్లీ ఎప్పుడూ ఛాతీ మీద చున్నీ లేకుండా హరి కంట పడలేదు.

మరో సారి అమ్మ – మా పెరటి తోటలో మొదటి సారిగా కాసిన లేత బెండకాయలు కానిని కోసి స్టీలు గిన్నెలో వేసి అత్త వాళ్లకు యిచ్చి రమ్మని పంపించింది సాంబారులో వేసుకోవడానికని చెప్పి. ఆ గిన్నెను రెండు చేతులతో జాగ్రత్తగా పట్టుకుని అత్తా వాళ్ళింటికి బయలుదేరేను.

"ఏంటవి?" గుమ్మంలోనే ఆపి అడిగేడు హరి.

"మా తోటలో కాసిన బెండకాయలు" అని చెప్పి లోపలికి దూసుకుపోబోతున్న నన్ను మళ్ళీ ఆపేడు "ఎన్ని?" అన్న ప్రశ్నతో.

"పది" చెప్పేను లెక్క బెట్టి.

"ఏదీ నన్ను చూడనీ...ఒకటి... రెండు...ఆరు... తొమ్మిది... పద్నాలుగు... యిరవై... ఏయ్ దొంగా! యిరవై అయితే పది అని అబద్దాలు చెబుతావా?" అన్నాడు చిలిపిగా.

నా చేతి వేళ్ళతో కలిపి లెక్క పెట్టేడని తెలిసి నేను పులకించి పోయాను – లేత బెండకాయలతో నా చేతి వేళ్ళను పొగుడుతున్నాడు అని అర్థమై.

"ఈ రోజు అమావాస్య కదా – చందమామ ఎలా వచ్చిందబ్బా" అంటూ ఆశ్చర్యం నటించాడు ఓ దీపావళి నాడు అమ్మ చేసిన స్వీట్స్ పట్టుకు వెళ్లి యిస్తే. నిజంగా ఆ రోజు అమ్మ నన్ను బహు ముచ్చటగా ముస్తాబు చేసింది.

నేను అందంగా ఉంటానని నా అద్దం తెలియజేసే వరకూ నాకు కూడా ఆ విషయం తెలిసి రాలేదు.

బహుమతి పొందిన కథ

# తనువా ..హరి చందనమే

అలా కనిపించని, వినిపించని మూగ ప్రేమ మా యిద్దరి మధ్య దినదిన ప్రవర్ధమానం కాసాగింది. అప్పటికి నాకు పదహారు, హరికి పందొమ్మిది ఏళ్ళు వచ్చాయి.

మరో సారి అమ్మ యిచ్చి రమ్మని పంపిన దొండకాయలు తీసుకు వెళ్ళేను హరి వాళ్ళ యింటికి. అత్తయ్య వంటగదిలో ఉన్నట్టు తెలుస్తోంది.

గుమ్మం దాటి యింట్లోకి అడుగు పెట్టిన నన్ను గబుక్కున రెక్క పట్టుకుని తన గదిలోకి గుంజుకున్నాడు హరి.

నేను తేరుకునే లోగానే నన్ను గట్టిగా కౌగిలించుకుని నా అధరాలపై తన పెదాలు ఆనించి గట్టిగా ముద్దు పెట్టాడు .

నేను యిష్టమై అరవలేదో, నోరు ఖాళీ లేక అరవలేక పోయానో యిప్పుడు చెప్పలేను.

తమకంగా తను – తన్మయత్వంతో నేను. అదే నా జీవితంలో మొదటి ముద్దు.

"ఒరేయ్ హరీ! ఏం చేస్తున్నావురా?" అన్న అత్తయ్య కేకతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాం యిద్దరం.

మొదటి ముద్దు తియ్యగా ఉన్నా అత్తయ్య కేకతో తియ్యక తప్పలేదు. నా పెదాల్ని వాడి పెదాల మధ్య నుంచి బలవంతంగా వెనక్కి లాక్కుని తుడుచుకున్నాను.

"దొండపండ్లు రుచి చూస్తున్నానమ్మా" గబుక్కున అనేశాడు హరి. నేను బిత్తరపోయి అలా చూస్తూ ఉండిపోయాను.

"దొండ పండ్లేమిట్రా" అడిగింది అత్తయ్య.

తొట్రుపడకుండా జవాబిచ్చాడు హరి –

"ఎదురింటమ్మాయి దొండకాయలు తీసుకు వచ్చిందమ్మా! అందులో ఓ రెండు దొండకాయలు ఎర్రగా పండిపోతేనూ – తింటున్నాను" అరుణిమ దాల్చిన నా పెదాల వైపే చూస్తూ చెప్పేడు కొంటెగా.

నాలో కంగారు మొదలయింది.

"దొండకాయలు పండితే కూరకి పనికిరావురా"

"అందుకే తినేశానమ్మా! బావున్నాయి తియ్యగా"

"పోరా... నీ పిచ్చి మాటలూ నువ్వునూ. ఆ అమ్మాయిని యిలా రమ్మను" అత్తయ్య అలా అనే సరికి వంటగది లోకి పరిగెత్తేను.

ఒంటరిగా దొరికినప్పుడల్లా నా కళ్లని చేప పిల్లలుగా, చేతుల్ని తామరతూళ్లుగా – యిలా నా ప్రతీ అవయవాన్నీ వర్ణిస్తూ బోనస్ గా ఆయా అవయవాలను చుంబించేవాడు. కొన్ని అవయవాలపై ముద్దుల్ని నేనే నిషేదించేదాన్ని.

అలా హరితో నా చనువు పెరిగి యిద్దరం ఒకరినొకరం విడిచి ఉండలేని పరిస్థితిలో నాకు అమెరికాలో ఉన్నత విద్యకు సీటు రావడం, నేను విమానం ఎక్కి వెళ్లిపోవడం త్వరత్వరగా జరిగిపోయాయి. మా యిద్దరి మధ్య ఉన్న ప్రేమ సంగతి మా రెండు యిళ్లలోనూ తెలియదు.

ఆ తరువాత మా యిద్దరి మధ్యా సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. మా టీనేజ్ ప్రేమ అక్కడితో ఆగిపోయింది. బహుశా మా చదువులపై, కెరీర్ లపై దృష్టి పెట్టడం వలన కాబోలు.

ఇప్పుడు వాడు ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో!

తన సంగతి ఏమో గానీ – నేను ఎప్పుడూ హరినీ, ఆ తీయటి అనుభూతుల్నీ మరిచి పోలేదు.

హరిది మోహమో, ప్రేమో తెలియదు గానీ – నేను మాత్రం స్వచ్ఛంగానే వాడి మీద ప్రేమ పెంచుకున్నాను అప్పుడు.

ప్రస్తుతంలోకి వస్తే – నన్ను

బహుమతి పొందిన కథ

# తనువా ..హరి చందనమే

చూసుకోవడానికి వస్తున్న అతని పేరు ప్రసాద్ అనీ, వాళ్లదీ మా ఊరేననీ, రాజీవ్ నగర్ లో ఉంటారనీ – అమ్మ నేను అడగకుండానే అతని వివరాలు తెలిపింది.

సందిగ్ధమైన మనసుతో అమ్మ చెప్పినట్లుగానే – అతి కష్టం మీద సెలవు దొరికించుకుని – పెళ్లి చూపులకు రెండు రోజుల ముందుగానే అమెరికా నుండి మా యింటికి చేరుకున్నాను.

రాగానే హరి వాళ్ల యింటి వైపు చూసేను. చాలా మారిపోయింది ఆ యిల్లు. ఎవరో కొనుక్కుని రెండంతస్తుల మేడ కట్టుకున్నట్టున్నారు.

యాంత్రికంగా రెండు రోజులు గడిచేయి. ఈ రోజే రాజీవ్ నగర్ నుంచి నన్ను చూసుకోవడానికి వాళ్ళు వస్తున్నది.

అమ్మ చెప్పినట్లుగా తను సెలెక్ట్ చేసిన నెమలి కంఠం రంగు చీర కట్టుకుని అద్దంలో చూసుకుంటే నాకు నేనే ముద్దొచ్చి – చీరలో నేను యింత అందంగా ఉంటానా అనుకుంటూ లోలోన మురిసి పోయాను.

'నా కూతురు బంగారు బొమ్మ' అంటూ అమ్మ ముచ్చట పడిపోయింది ఆ అలంకరణలో నన్ను చూసి. పిన్ని, మావయ్య – వాళ్ల కుటుంబాలతో సహా నిన్ననే వచ్చి యింట్లో సందడి సృష్టించారు.

సమయం పది అవుతుండగా నాన్న 'వాళ్ళొచ్చేశారు' అంటూ గుమ్మం దగ్గరకు వెళ్ళేరు ఆహ్వానించడానికి.

నా గది కిటికీ లోంచి రోడ్డు మీదకు దొంగ చాటుగా చూశాను. ఎలా వచ్చారు వాళ్లు? ఏ వాహనాల చప్పుడూ వినిపించలేదే!

కాసేపు తరువాత నన్ను హాల్లోకి తీసుకు వెళ్ళడానికి పిన్ని నా గదిలోకి వచ్చింది. తల వంచుకుని హాల్లోకి వెళ్లి నాకు కేటాయించిన కుర్చీలో కూర్చున్నాను.

కాసేపు వాళ్ళ మాటల తరువాత అమ్మ – "తలెత్తి అబ్బాయిని చూసుకోమ్మా" అంది.

నెమ్మదిగా తలెత్తి చూసేను. నా ఎదుటి సోఫాలోనే అతన్ని కూర్చో బెట్టినట్టు అప్పుడు గ్రహించాను.

నేను తలెత్తి చూసిన క్షణం లోనే అతనూ తలెత్తి నా వైపు చూశాడు.

అతన్ని ఎప్పుడో, ఎక్కడో చూసినట్లు అనిపించి ఆశ్చర్యంగా అతని ముఖం వైపే చూస్తుండి పోయాను.

'అరే... అతను...వాడు...హరి! అవును హరే.' ఈ ఏడెనిమిదేళ్లలో నాలాగే వాడిలోనూ చాలా మార్పు వచ్చింది. బాగా పొడుగ్గా, బలంగా కనిపిస్తున్నాడు. చిలిపిగా, హుందాగా చిరు నవ్వు లొలికించేడు నా వైపు చూస్తూ.

నా ఆశ్చర్యం, అయోమయం గమనించి – అందరూ ఒక్క సారిగా పగలబడి నవ్వేశారు.

నాకు అంతా వింతగా అనిపిస్తోంది. జరుగుతున్న దేమిటో నాకు అర్థం కావడం లేదు. నన్ను చూసుకోవడానికి వస్తున్నది ప్రసాద్ అని కదా చెప్పేరు. పైగా రాజీవ్ నగర్ నుంచి వస్తున్నారని చెప్పేరు మరి?

చూపులు తిప్పి అటూ యిటూ చూశాను. వచ్చిన వాళ్ళు ఓ పది మందికి పైగానే ఉన్నారు. హరికి అటూ యిటూ వాళ్ళ అమ్మా నాన్నలు. అత్తయ్యను వెంటనే గుర్తు పట్టేను. నా వైపు నవ్వుతూ ఎంతో ఆపేక్షగా చూస్తున్నారు ఆవిడ.

అంటే యిదంతా అందరూ కలిసి ఆడుతున్న నాటకమా? హరి నన్ను యిష్టపడుతున్నట్లు తెలియజేశాడా? నన్ను సర్ప్రైజ్ చెయ్యడానికే అందరూ నాకు పూర్తి వివరాలు తెలియజెయ్యలేదా?

యిదంతా నాకు గందరగోళంగా ఉంది. అయినా యిష్టంగా మాత్రం అనిపించింది.

**బహుమతి పొందిన కథ**

# తనువా ..హరి చందనమే

చిన్నప్పటి నుండీ కోరుకున్న వాడే నా వాడు కాబోతున్నాడనేనా!

"వదిన గారూ మీ చందనం బొమ్మ మాకు నచ్చేసింది. మరి మా అబ్బాయి తనకు నచ్చాడో లేదో కనుక్కోండి" కొంటెగా అంటున్న అత్తయ్య మాటలు నాకు అమృత ప్రాయమయ్యాయి.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు – హరి పూర్తి పేరు హరి ప్రసాద్ అని.

కొద్ది రోజుల్లోనే మా నిశ్చితార్థం జరిగిపోయింది. మరి కొద్ది రోజుల తరువాత 'చందన వెడ్స్ హరి' శుభలేఖలు పంచబడ్డాయి. అంగరంగ వైభోగంగా జరిగిపోయింది మా పెళ్ళి.

అన్నట్టు మాది ఇందిరానగర్ అన్నది కరెక్టే. హరి వాళ్ళు ఆ పాత యిల్లు పడగొట్టించి కొత్తగా డాబా యిల్లు కట్టుకున్నారట. మరి మా యింటికి ఎదురుగానే ఉన్న వాళ్ల యిల్లు కూడా ఇందిరానగరే కదా? కానీ కాదట –

ఎలా అంటే ఓ ఏడాది క్రితమే మా యింటి రోడ్డు దాటి అవతల వైపు ఉన్న ఏరియా అంతా రాజీవ్ నగర్ గా మార్చేశారట. అందుకే పెళ్లిచూపులకు వాళ్లంతా వాహనం అవసరం లేకుండానే ఎదురుగానే ఉన్న మా యింటికి నడిచే వచ్చేశారట.

హరి కూడా నాపై అమితమైన ప్రేమను పెంచుకుని పెళ్లంటూ చేసుకుంటే నన్నే చేసుకుంటానని వాళ్ళ అమ్మా నాన్న లకు చెప్పేడట. వాళ్ళు కూడా ఆనందంగా ఒప్పుకుని – మా అమ్మా నాన్నలతో మాట్లాడి – అసలు సంగతి నాకు తెలియనీయకుండా పెళ్లిచూపులు ఏర్పాటు చేశారట.

ఈ విషయాలన్నీ మా తొలిరేయి – కౌగిళ్లు, మల్లెలు, దుప్పట్లు నలిగిన తరువాత వచ్చిన విశ్రాంతి సమయంలో – చిరు చెమటలతో తడిచి 'ముద్దె'న నా మోముకు పట్టిన తడినీ రుచి చూస్తూ చెప్పేడు నా ప్రియ బాంధవుడు, నా చిన్న నాటి నేస్తం హరి ... కాదు ... కాదు ... హరి ప్రసాద్.

సందేహాలన్నీ తీర్చుకున్న తరువాత నా దేహాన్ని మరోసారి ప్రణయ రణానికి సన్నద్ధం చేశాను ఆనందంగా.

మా రెండు తనువులూ మళ్ళీ ఒక్క తనువై – తనువా ... ఉహూ ... హరి చందనమే!

★★★★★

## డిజిటల్ సమాధి

కేరళలోని త్రిస్సూర్కు చెందిన డాక్టర్ ఇవిన్ ఫ్రాన్సిస్ వైద్యుడిగా పనిచేసేవారు. సంగీతంలో, క్రీడల్లోనూ నిష్ణాతుడిగా ఉండే వాడు . 2021లో తన 28ఏళ్ల వయసులో. బాడ్మింటన్ ఆడుతూ ఆయన కన్నుమూశారు. అయితే, తమ బిడ్డ జ్ఞాపకా లను సజీవంగా ఉంచాలని భావించిన ఇవిన్ కుటుంబీకులు భావించారు. దీంతో అతడికి సంబంధించిన వివరాలు, జ్ఞాపకాలతో కూడిన ఒక వెబ్సైట్ను రూపొందించి, దాన్ని తను సంధానం చేస్తూ ఇవిన్ సమాధిపై ఒక క్యూ ఆర్ కోడును ఏర్పాటు చేశారు. తమ బిడ్డ జీవితం అందరికీ ఆదర్శంగా ఉండాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. "తను బతికు న్నప్పుడు ప్రజల వివరాలను క్యూఆర్ కోడ్లో భద్రపరిచేవాడు. ఇప్పుడు తన విషయం లోనూ అదే చేయాలని భావించాం. సమాదిని చూసిన వారికి కేవలం తన పేరు మాత్రమే కాక, వాడు ఎలా జీవించాడో కూడా తెలియాలి" అని ఇవిన్ తండ్రి ఫ్రాన్సిస్ పేర్కొన్నారు.

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్



- డా. పులిచెర్ల సాంబశివరావు

ఉదయా! మాతృదేశ స్వాతంత్ర్య పరిరక్షణా దీక్షాదక్షుడవై వర్ధిల్లుమయ్యా!'

'నా జీవితధ్యేయం అదే స్వామి!'

'అటు చూడు నాయనా!'

ఉదయసింహుడు స్వామి చూపినవైపు చూశాడు. అక్కడ రాణాకు ఒక విశాలమైన ప్రాంతం కనిపించింది!

'ఆచోట ఓ కోటను నిర్మించు! అది మీ శిశోదియావంశం వారి చేతిలోనే ఎక్కువ కాలం నిలుస్తుంది!'

'మరి చిత్తోడ్...?'

'దానికి త్వరలో ప్రమాదం ముంచుకు రానున్నది? ఇక్కడ నీవు నిర్మించే కట్టడాలు చాలాకాలం మీ ఆధీనంలోనే వుంటాయి."

యోగి చెప్పే ప్రతి మాటా అక్కడ చేరిన వారికి దివ్యవాక్కుగా అనిపించింది. అనుమానాలు అడిగే తెగువా, అడ్డుచెప్పే సాహసమూ అక్కడున్న వారెవరికీ లేవు.

ఉదయసింహుడు సభక్తికంగా సాధుపుంగవుని చరణారవిందాల ముందు ప్రణమిల్లాడు.

అంతలో అనుకోకుండా ఒక ఝంఝూమారుతం వీచింది. అడవి అల్లకల్లోలమైంది. దుమ్ము ఆకసానికెగసింది. వృక్షాలపై నుండి పక్షిగణాలు ఒక్క మారుగా లేచి రణగొణధ్వనులు చేశాయి. ఆకులలములు ఉవ్వెత్తున లేచి ఉదయ సింహునీ, ఆయన పరివారాన్నీ ఉక్కిరిబిక్కిరి చేశాయి.

ఒక్క తృటికాలంలో అంతా మళ్ళీ ప్రశాంతం! రాణా కళ్ళు తెరచి చూచేటప్పటికి అక్కడ సాధుపుంగవుడు లేడు! పరివారం పరిపరివిధాల వెతికారు! ఊహు; ఎక్కడా కనిపించలేదు. ఉదయసింహుడు ఆలోచనా మగ్నుడయ్యాడు.

ఈ మహాపురుషుడెవరు? సాక్షాత్తు ఏకలింగనాథుడే తనయందు కరుణతో కన్నుల ఎదుట కనబడలేదుగదా! ఆ దివ్య తేజస్సు, ఆ గంభీరవాక్కు సామాన్యులకు సాధ్యమా? ఇంతలో ప్రత్యక్షమై అంతలో అదృశ్యమయ్యాడే! ఎంత వింత! 'అనుమానం లేదు! ఆయన సాక్షాత్తు శివుడే!' ప్రభువు నోటివెంట ఈ మాటలు అప్రయత్నంగా వెలువడ్డాయి. ఈ అద్భుతాన్ని చూచినవారు ఎవరు కాదనగలరు? ఉదయసింహుడు పరిసర ప్రాంతాలను సునిశితంగా పరిశీలించాడు. సమీపంలో ఒక చెరువు కనిపించింది. రాణా తన అశ్వరాజాన్ని అధిరోహించి సరస్తీరానికి చేరాడు. పరివారం ప్రభువును అనుసరించింది. తటాకంలో రాణా కరచరణాలను క్షాళనం చేసుకొని దోసిటిలోకి నీరు తీసుకున్నాడు. నీరు నిర్మలంగా వుంది. పెదవుల కానించి ఒక్క గుటక వేశాడు. అమృతసదృశంగా అనిపించింది! అంతా రాణాను అనుసరించారు. ఆత్రంగా నీరు త్రాగి త్రేన్చారు. గుర్రాలు సంబరంగా జలపానం చేసి ఉత్సాహంతో సకిలించాయి.

'ఈ స్థలంలో ఈ చెరువు?' రాజు ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

వెంట వచ్చిన వృద్ధుడొకడు చెప్పాడు!

'ప్రభూ! ఈ చెరువు పేరు 'పిఛోలా'. దీన్ని ఈ అరణ్యంలో వుండే భిల్లుడు త్రవ్వించాడు. మీ వంశ మూలపురుషుల్లో ఒకరైన 'లాఖా'గారి కాలంలో నిర్మింపబడిన తటాకం ఇది!'

బప్పరావల్ వంశచరిత్ర అమోఘమైంది. ఎందరో మహాపురుషులుద్భవించారు. ప్రజాక్షేమం కోసం చివరకు ఈ నిర్జనారణ్యంలో కూడా ఒక

చరిత్రాత్మక
సీరియల్

# రాణాప్రతాప్

**జరిగిన కథ**

అక్బర్ చక్రవర్తి! అశేష సైన్యసమూహాలతో, విశేషాయుధ సంపత్తితో చిత్తోడ్ను కైవసం చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు! ఇవతల సోదర భారతీయులు – అంతఃకలహాలతో కుమ్ముదుమ్మవుతున్నారు!ఈ ఆలోచనలతో సతమతమవుతూ, మనశ్శాంతి కోసం ఉదయసింహుడు రాజధానిని విడిచి అరణ్యమార్గాన అనుచరవర్గంతో ఏకలింగనాథస్వామి సన్నిధికి చేరాడు.అక్కడ 'ఓం నమశ్శివాయ!' అంటూ వినపడింది. ఆ శబ్దం వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళితే ఓ సాధువు కనిపించాడు . 'ఉదయా! మాతృదేశ స్వాతంత్ర్య పరిరక్షణా దీక్షాదక్షుడవై వర్ధిల్లుమయ్యా అంటూ దీవించాడు

**ఇక చదవండి**

మహాతటాకం త్రవ్వించారు. తుదకు తనకీనాడు అది ఉపయోగపడబోతోంది!

ఉదయసింహుడు పితృదేవతలను ఆర్ద్రనయనాలతో సంస్మరించాడు. ఇంతలో చిత్తోడ్ నుండి ఒక వార్తాహరుడు వచ్చి ప్రభువుకు తియ్యటి కబురు అందించాడు. ఆయనకు మనుమడు జన్మించాడు. ఉదయసింహుని ప్రథమ పుత్రుడు ప్రతాపునికి కుమారుడు జన్మించాడు. అతడే అమరసింహుడు!

అంతా మరింత ముందుకు నడిచారు. చుట్టూ కొండలు! అల్లంతదూరంలో కొండల నుండి పారే జలరాశి! 'అది 'బేరచ్' నది ప్రభూ! పర్వతాల మధ్యనుండి ప్రవహించి, ఈ అరణ్యం గుండా దిగువకు పారుతుంది.ప్రశాంత ప్రదేశం! మూడువైపులా పర్వతాలు పెట్టని గోడల్లా వున్నాయి. తాను జీవితాంతం గాలించి వెదికినా నగర నిర్మాణానికి ఇంత సురక్షిత ప్రాంతం మరోటి లభ్యం కాబోదు. సాక్షాత్తు సాంబశివుడే తనకీ చోటును చూపాడు!

రాజుగారు తలుచుకుంటే కొరవేముంది! ఉదయసింహుడు చిత్తోడ్ చేరిన మరుక్షణమే మంత్రులతో సమావేశమయ్యాడు. అరణ్య మధ్యంలో తన అనుభవాన్ని ఆయన వివరించినప్పుడు అంతా ఆశ్చర్యచకితులయ్యారు.

'చిత్తోడ్ దుర్గం చేజారి పోతుంది' అని సాధువు చెప్పాడని తెలియగానే మంత్రుల ముఖాల్లో రంగులు మారాయి. వాళ్ళకు నమ్మశక్యంగాలేదు.

'మన దుర్గం దుర్గమమైంది.' 'చిత్తోడ్ కోట గిరిదుర్గం. అది అభేద్యమైంది!' తలా ఒక విధంగా అన్నారు. 'నాన్నగారూ! అక్కడ నూతన నగరాన్ని నిర్మించవలసిందే!'

అంతా అటు చూశారు. ఉదయసింహుని కుమారుడు ప్రతాపుడు వినయంగా అంటున్నాడు.

ప్రతాపునికి మొన్ననే పందొమ్మిదో ఏడు వచ్చింది. ★ నూనూగుమీసాలు ఈ మధ్యనే దట్టమై పైకి మెలిదిరిగాయి. ఉదయసింహునికి పాతికమంది సంతానం. అందులో సజీవులై వున్న ఇరవై మందిలో ప్రతాపుడే పెద్దవాడు. అతని స్నేహితులంతా భిల్లులే! వారితో కొండకోనల్లో ఆడిపాడీ దేహదారుఢ్యాన్నీ, సచ్ఛీలతనూ ప్రతాపుడు పెంపొందించుకున్నాడు.

ప్రతాపుడు ప్రతిదినమూ క్రమం తప్పక రాజసభకు వస్తాడు. శ్రద్ధగా రాజకీయ వ్యవహారాలను గమనిస్తాడు. కానీ సామాన్యంగా పెదవి కదపడు! అటువంటిది, ఇవాళ ప్రతాపుడు హఠాత్తుగా ఇలా తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా ప్రకటించేసరికి అంతా ఆశ్చర్యంతో తలమునకలయ్యారు.

ప్రభువు ప్రశ్నార్థకంగా చూశాడు. 'ఇప్పటికి రెండు పర్యాయాలు చిత్తోడ్పై శత్రుసైన్యాలు సమరం గావించాయి. కోట అనుపానులు నెమ్మదిగా వారి మదికెక్కుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కీడెంచి మేలెంచడం

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్

మంచిది. అదనంగా మనకో మహానగరం ఉండటం శ్రేయస్కరం అని నా అభిప్రాయం!' ప్రతాపుడు సుస్పష్టంగా తన మనసులో మాట చెప్పాడు.

మితభాషి అయిన తన పెద్దకుమారుడు ఇప్పుడిలా మాట్లాడాడంటే, అది సామాన్య విషయం గాదు. కొట్టివేయడానికి వీలు లేదు.ప్రతాపుణ్ణి చూస్తే తన తండ్రి రాణా సంగ్రామసింహుణ్ణి చూచినట్లే ఉంటుంది ఉదయసింహుడికి.

ఉదయసింహుడు కుమారుని ముందుచూపుకు మురిసిపోయాడు. వీళ్ళు చిత్తోడ్ గొప్పలే చెప్పుకుపోతున్నారు. లోపాలు తెలియనట్లు నటిస్తున్నారు.

చిత్తోడు శత్రుసైన్యం ముట్టడిస్తే యుద్ధం అచిరకాలంలోనే ఆగిపోవాలి! లేకపోతే లోపలున్న రాజపుత్రులు ఆకలిదప్పులతో మలమల మాడిపోవాలిసిందే! లోగడ రెండు పర్యాయాలు ఆ కష్టాలు తాము రుచిచూచి కూడా, వాటిని విస్మరించి మాట్లాడుతున్నారు. వీళ్ళు. ఒకవేళ దీర్ఘకాలం యుద్ధమే చేయవలసివస్తే – ఎదుటివాళ్ళను చంపడమో, లేక తాము చావడమో ఏదోఒకటి జరిగితీరాలి! అన్నపానీయాలు లోనికి చేరడానికి మార్గమే లేదు! కోటచుట్టూ నాలుగు వైపులా విశాలమైన బయలుప్రాంతం. శత్రువులు గుడారాలు వేసుకొని ఎన్ని రోజులైనా కోటమీద గుండ్ల వర్షం కురిపించవచ్చు. నిజంగా ఆ దివ్యపురుషుని వాక్కు అమృత వాక్కు....

'మనం అరణ్యమధ్యంలో నూతన నగరం నిర్మిస్తున్నాం!' ఉదయసింహుని కంఠంలో స్థిరనిర్ణయం ప్రతిధ్వనించింది. ఒక్క నిముషం తరువాత అంతా నూతన నగరం నమూనాను గూర్చి మాత్రమే మాట్లాడసాగారు!

గిర్వా పర్వతప్రాంతంలో 1559లో కోట నిర్మాణం ప్రారంభమయింది. సాధు పుంగవుడు ఆదేశించిన వేళావిశేషం ఎటువంటిదో గాని, పనులు చకచకా క్షణాల మీద జరిగిపోతున్నాయి. కొద్దిరోజుల్లోనే బేరచ్ నది దగ్గర పెద్ద కోట వెలసింది. ఉత్తరంగా ఉన్న కొండమీద 'మోతీమహల్' అనే సుందరభవనాన్ని నిర్మించాడు రాణా!

ఉదయసింహుడు తాను మునుపు మునిని సందర్శించిన స్థలాన్ని పునఃసందర్శించి, అక్కడ చక్కని మందిరాన్ని నిర్మించాడు. ఆ సమీపంలోనే మూడు తటాకాలను తవ్వించాడు. వాటికి 'చౌక్య' అని నామకరణం గావించాడు. తన పేరు శాశ్వతంగా ఉండేటట్లుగా ప్రజోపయోగార్థం ఒక పెద్ద సరోవరాన్ని త్రవ్వింప తలపెట్టాడు.

అది ఏప్రిల్ 4, 1566 గురువారం. ప్రతాప్ పాతికేండ్ల పరువంలో ఉన్నాడు. తండ్రి త్రవ్వించిన సరోవరానికి ప్రతాపుడు 'ఉదయసాగర్' అని పేరుపెట్టాడు. నాడు 'ఉదయసాగర్' దగ్గర జనసముద్రం ఉప్పొంగింది. రాణా ఉదయసింహుడు సమంత్రకంగా ఉదయసాగర్ సరోవర జలాలను ప్రజోపయోగార్థం వదిలాడు. రైతులకు భూములను పంచియిచ్చాడు. భవిష్యత్ రసపుత్రరాజుల పట్టాభిషేక మహోత్సవానికి పవిత్రస్థలంగా ఉపయోగపడింది ఈ ఉదయపూర్! తురుష్క ముష్కరులను ఊచకోతకోసి, భారత స్వాతంత్ర్య పరిరక్షణకు కంకణ దీక్షాదక్షులైన వీరహర్యక్షాలకు మూలకందమైంది ఈ ఉదయపూర్ ఇప్పటికీ దేశభక్తి ప్రపూరితులైన భారతమాత ప్రియపుత్రుల హృదయాలు దర్శనమాత్రం చేత గతకాల స్మృతులతో ఆర్ద్రీభూతం గావిస్తుందీ ఉదయపూర్!

––ఇంకా ఉంది

నేర్చుకుందాం

# డూడ్లింగ్



దేవరపల్లి పద్మ

దేవరపల్లి పద్మజ గారు ఈ కళలో పేరుమోసిన కళాకారిణి. చిన్నతనంలో బొమ్మలు వెయ్యటం రాదని టీచరు అవమానించటంతో, పట్టుదలతో బొమ్మలు వెయ్యటం నేర్చుకున్నారు. తరువాత డూడుల్ కళపై దృష్టి పెట్టి అందులో ప్రభతిగాంచారు.

డూడ్లింగ్ అనేది చాలా మందికి తెలియని ఒక చిత్ర కళ, 'డూడుల్ ' అనే పదాన్ని మొట్టమొదటి సారి 17 శతాబ్దంలో వాడారు. దీని అర్థం 'అర్థం పర్థం లేని' పని అని . మిగతా చిత్రకళలతో పోలిస్తే డూడ్లింగ్ నేర్చుకోవటం చాలా సులభం.

మనం చిన్నతనంలో వేసిన బొమ్మలు, పోగేసిన వస్తువులు వంటి వాటిని డూడుల్స్ అని పిలు వచ్చు. చిన్నతనంలో చిల్లి గవ్వలు, గోలీలు, సుద్ద పిక్కలు, విరిగిన బొమ్మలు వంటి వాటిని బద్ధంగా దాచుంటారు పిల్లలు ,ఆ వయసులో అవే విలువైనవి. కాని పెరిగిపెద్ద అయిన తరువాత అవి ఎందుకూ పనికి రావు అనిపిస్తుంది. పాఠశాలలో, తరగతి గదిలో ఉపాధ్యాయుని పాఠం అంతగా ఉత్సాహంగా లేనప్పుడు వెనుక బెంచిలో కూర్చుని, నోటు బుక్ నిండా పిచ్చి గీతలు, బొమ్మలు గీస్తుంటారు కొందరు. వాటిని కూడా డూడుల్స్ అని పిలవవచ్చు. చేతిలో పెన్ను. పేపర్లు వుంటే, సుదీర్ఘమైన ఫోన్ కాల్స్ వింటున్నప్పుడు, ఇష్టంలేని మీటింగ్ కి హాజరవుతున్నప్పుడు, ఈ డూడుల్స్ ప్రత్యక్ష మౌతాయి.

దూడుల్ని రెండు రకాలుగా విభజించ వచ్చు, మొదటిది ప్రాథమిక స్థాయి రెండవది ఆధునికమైనది. ప్రాథమిక డూడ్లింగ్ లో వివిధ ఆకారాలు , గీతలతో బొమ్మలు ఏర్పడతాయి. వీటికి పెద్దగా అర్థాలేవి వుండవు. ఆధునిక కళలో ఒక మూల చిత్రాన్ని ఉహించుకుని, వివిధ ఆకారాలను, గీతలను అందుకు అనుగుణంగా చిత్రిస్తూ పోతారు.


డూడ్లింగ్ వల్ల అలసిపోయిన మనసుకు కాస్త విశ్రాంతి దొరికినట్టవుతుంది. దీని వల్ల మన జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఈ బొమ్మలు కాస్తంత ఓపికతో వెయ్యాలి కాబట్టి, సహనం అలవడుతుంది. ఇటువంటి బొమ్మలు ఊహించి వెయ్యటం వల్ల, సృజనాత్మకత పెరుగుతుంది. ప్రతి మనిషిలో భావోద్వేగాలు వుంటాయి. ఈ భావోద్వేగాలను బయటకు వ్యక్త పరచటానికి కూడా ఈ కళ చాలా ఉపకరిస్తుంది. ఆధునిక డూడ్లింగ్ లో నాలుగు రకాల చిత్రాలుంటాయి.

1. జెంటాంగిల్
2. జెన్ డూడ్లింగ్
3. స్టెయిన్ డూడ్లింగ్
4. మండాలాస్

వీటి కలయికతో ఏర్పడిన బొమ్మలను 'డూడుల్ ఆర్ట్ అని పిలుస్తారు.









**వార్తల్లో వ్యక్తి**

# సుధా మూర్తి



ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి, పరోపకారి మరియు ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధా మూర్తి సామాజిక సేవా రంగంలో ఆమె చేసిన సేవలకు పద్మభూషణ్‌తో రాష్ట్రపతి సత్కరించారు. ఈ సందర్భంగా సుధా మూర్తి ప్రసంగిస్తూ భారతదేశ ప్రజలకు,తనకు వారిచ్చిన బేషరతు మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది యువకులు సామాజిక సేవను పూర్తిసమయ వృత్తిగా చేపట్టేందుకు ఇది దారితీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. “ఈ అవార్డుకు నేను భారత ప్రజలకు రుణపడి ఉంటాను. ఈ రోజు నాకు లభించిన గుర్తింపు సామాజిక సంక్షేమాన్ని ఒక వృత్తిగా తీసుకునేలా యువ తరానికి స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను. మన గొప్ప దేశం యొక్క నిరంతర అభివృద్ధికి ఇది అవసరం. కొద్దిమంది ఔదార్యం మిలియన్ల మందికి ఆశను ఇస్తుందని నేను ఎప్పుడూ భావిస్తున్నాను,” అని ఆమె చెప్పింది.



సుధా మూర్తి కన్నడ మాట్లాడే సాధారణ బ్రాహ్మణ కుటుంబంలో 19 ఆగస్టు 1951న భారతదేశంలోని కర్ణాటకలోని హావేరిలోని షిగ్గావ్‌లో డాక్టర్ R. H. కులకర్ణి , పాఠశాల ఉపాధ్యాయిని విమలా కులకర్ణి, కుమార్తెగా జన్మించారు. సుధా మూర్తి B.V.B కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో BE చేసారు. ఆమె తరగతిలో మొదటి స్థానంలో నిలవటమే కాక అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ ఉర్స్ నుండి బంగారు పతకాన్ని అందుకుంది. సుధా మూర్తి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పూర్వ విద్యార్థి మాత్రమే కాక టాటా ఇంజనీరింగ్ & లోకోమోటివ్ కంపెనీలో ఉద్యోగం పొందిన మొదటి మహిళా ఇంజనీర్. అప్పటికి ఈ సంస్థలో కేవలము పురుషులకే స్థానం కల్పించేవారు. దీనిని ప్రశ్నిస్తూ ఆవిడ ఆ సంస్థ అధ్యక్షుడికి ఒక పోస్టుకార్డు రాసింది. దీనికి స్పందించిన ఆయన ఆవిడతో ప్రత్యేకంగా ముఖాముఖి (Interview) నిర్వహించి, అప్పటికప్పుడు నియామక ఉత్తర్వులు అందించాడు. ఆ సంస్థ పూనా శాఖలో పనిచేస్తున్నపుడే ఆవిడకు ఎన్.ఆర్.నారాయణ మూర్తి తో పరిచయమై తర్వాతి కాలంలో వారిద్దరు వివాహం చేసుకోవడానికి దారితీసింది. సమాజానికి సేవ చేసేందుకు 2021లో పదవీ విరమణ చేసే ముందు ఆమె ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

90వ దశకం ప్రారంభంలో ఆమె బెంగళూరులోని ఒక చిన్న మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించేది. ఆమె జీవితాన్ని ప్రేమిస్తున్నప్పుడు, ఆమె ఇంకా ఏదైనా చెయ్యాలని తరచుగా భావించేది. 1996లో, ఆమె ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌ను ప్రారంభించింది. ఈ రోజు వరకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ యొక్క ట్రస్టీగా మరియు బెంగుళూరు విశ్వవిద్యాలయం యొక్క PG సెంటర్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆమె నాయకత్వంలో, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలను విద్యావంతులను చేయడానికి మరియు సాధికారత కల్పించడానికి అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. వరదలు, భూకంపాలు, మారుమూల అరణ్యాలలో గిరిజన సంఘాలతో కలిసి పని చేయడం, ఇతర కార్యకలాపాలలో ఆమె నిరంతరం సహాయక చర్యలలో పాల్గొంటూ ఉండేది. సమాజాభివృద్ధికి, గ్రామీణాభివృద్ధికి ఆమె కృషి చేస్తున్నారు. ప్రభుత్వ ఎయిడెడ్

వార్తల్లో వ్యక్తి

# సుధా మూర్తి





2004: చెన్నైలోని శ్రీ రాజా–లక్ష్మీ ఫౌండేషన్ ద్వారా రాజా–లక్ష్మీ అవార్డు

2006: భారతదేశ నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీ

2006: ఆర్.కె. నారాయణ సాహిత్య పురస్కారం.

2010: కర్ణాటక ప్రభుత్వంచే దాన చింతామణి అత్తిమబ్బే అవార్డు

2011: భారతదేశంలో అధికారిక న్యాయ విద్య మరియు స్కాలర్‌షిప్‌లను ప్రోత్సహించడానికి చేసిన కృషికి మూర్తికి గౌరవ LL.D (డాక్టర్ ఆఫ్ లాస్) డిగ్రీలను ప్రదానం చేశారు

2013: బసవ శ్రీ పురస్కారం నారాయణ మూర్తి & సుధా మూర్తి సమాజానికి చేసిన సేవలకు గాను అందించబడింది.

2018: ప్రముఖ (నాన్–ఫిక్షన్) విభాగంలో మూర్తి క్రాస్‌వర్డ్ బుక్ అవార్డును అందుకున్నారు

2019: IIT కాన్పూర్ ఆమెకు డాక్టర్ ఆఫ్ సైన్స్ గౌరవ డిగ్రీ (హానోరిస్ కాసా) ప్రదానం చేసింది.

2023: మూర్తి భారత రాష్ట్రపతిచే భారతదేశపు మూడవ అత్యున్నత పౌర పురస్కారం పద్మభూషణ్‌తో సత్కరించబడ్డారు.

పాఠశాలలకు కంప్యూటర్ విద్య మరియు లైబ్రరీ సౌకర్యాలను అందించడం ఆమె లక్ష్యం. ఆమె గేట్స్ ఫౌండేషన్స్ యొక్క ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలలో కూడా సభ్యురాలు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో భారతీయ గ్రంథాలతో "ది మూర్తి క్లాసికల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా "ప్రారంభించింది.

రచయిత్రిగా శ్రీమతి మూర్తి అనేక కథలను ప్రచురించారు. ఆమె రచన సాధారణ జీవితాల చుట్టూ తిరుగుతూ ఉంటుంది . ఆమె కన్నడ పుస్తకాలు చాలా వరకు ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి మరి కొన్ని ఆమె రచనలు పిల్లల TV సిరీస్‌లలోకి మార్చబడ్డాయి. . సుధా మూర్తి కన్నడతో పాటు ఇంగ్లీషులో కల్పిత కథా రచయిత్రి. ఆమె చాలా ప్రచురణలు పెంగ్విన్ ద్వారా వచ్చాయి. కన్నడలో ప్రసిద్ధి చెందిన డాలర్ సొసే,కావేరి ఇంద మేకనిగే,రూనా,హక్కియా తెరదల్లి,గుత్తొందు హెలువే వంటివి కథలు అనేక భాషల్లోకి అనువదించబడ్డాయి . డాలర్ బహు ( 'డాలర్ డాటర్–ఇన్–లా'), ఆమె కన్నడలో రచించిన నవల ,తరువాత ఆంగ్లంలోకి డాలర్ బహుగా అనువదించబడింది.దీనిని 2001లో జీ TV టెలివిజన్ ధారావాహికగా ప్రసారం చేసింది . ఆమె విమర్శకుల ప్రశంసలు పొందిన 'మూడు వేల కుట్లు', 'వైజ్ & అధర్ వైజ్', 'మహాశ్వేత వంటి పుస్తకాలను రచించారు.

ఆమె ప్రసిద్ధ రచనలలో ఒకటి "నేను మా అమ్మమ్మకి ఎలా చదవడం నేర్పించాను ". ఈ పుస్తకం 15 ఇతర భాషల్లోకి అనువదించబడింది. ఇది ఆమె తండ్రి తరపు తాతలతో చిన్ననాటి అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. ఆమె మొదటి నవల హౌస్ ఆఫ్ కార్డ్స్ లాభదాయకమైన వైద్యుని భార్య ఎదుర్కొన్న గందరగోళాన్ని వివరిస్తుంది.

సుధా మూర్తి దాతృత్వానికి ,కన్నడ మరియు ఆంగ్ల భాషలలో సాహిత్యానికి ఆమె చేసిన కృషికి ఎన్నో అవార్డులు వరించాయి. వీరికి అక్షత, రోహన్ అనే ఇద్దరు పిల్లలు. యు కే ప్రధాని రుషి సునాక్ ఈమె అల్లుడే.

క్రైం
సీరియల్

# గర్భ శ్లోకం

--ఈదర శ్రీనివాస రెడ్డి

"షాట్ ఓకే, పాకప్" అంటూ పెద్దగా అరిచాడు యువ దర్శకుడు అనిల్. తెలుగు సినీ వినీలాకాశంలో తారగా వెలుగేందు తున్న ప్రముఖ హీరోయిన్ సుస్మిత ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం ఆఖరి షెడ్యూల్ అది.

సీన్ ఓకే కావటంతో, సెట్లో నుండి పరుగులాంటి నడకతో బయటకు వచ్చి, తన కారవాన్ లో కూల బడింది సుస్మిత .

నేడు మన చిత్రల్లో వ్యాంపు దగ్గర నుండి హీరోయిన్ దాకా ఒకే రకమైన కురచ దుస్తులు ధరించి నటించాల్సొస్తోంది. ఒకప్పుడు, వ్యాంపు కేరెక్టర్లు మాత్రమే పొట్టి పొట్టి దుస్తుల్లో కనబడుతూ ప్రేక్షకుల్ని కనువిందు చేసేవాళ్ళు . కాని రాను రాను అన్ని రంగాలలో పోటీ వాతావరణం పెరిగినట్లే, సినీరంగంలో కూడా పెరగటంతో, హీరోయిన్లు సైతం వాటిని ధరించటానికి ఏ మాత్రం సంకోచించటంలేదు.

వారికి ఇష్టం వున్నా లేకపోయినా వాటిని ధరించాల్సిందే. ఇష్టం లేని వాళ్ళు సినిమారంగానికి దూరమయిపోతారు అనటంలో ఏ సందేహంలేదు. అలా దూరమయిన వాళ్ళు చాలా మందే వున్నారు. మరికొంత మంది మనసు చంపుకుని తమ కుటుంబం అవసరాల కోసం రాజీపడి పోతున్నారు.

**"సినిమా రంగంలో భావోద్వేగాల కన్నా, రక్త మాంసాల శరీరాలకే వి-లువేక్కువ .గుండెల్లో కత్తులు దిగబడి గాయలవుతున్నా , పెదవులపై చిరు-నవ్వుతో అంగాంగ ప్రదర్శన చేస్తేనే అక్కడ నిలబడగాలిగేది "**

సినిమా రంగంలో భావోద్వేగాల కన్నా, రక్త మాంసాల శరీరాలకే విలువేక్కువ .గుండెల్లో కత్తులు దిగబడి గాయలవుతున్నా , పెదవులపై చిరునవ్వుతో అంగాంగ ప్రదర్శన చేస్తేనే అక్కడ నిలబడగాలిగేది

సుస్మిత కూడా మొదట్లో బెట్టు చేసినా నిలదొక్కుకోవాలంటే రాజి పడక తప్పదని సన్నిహితులు చెప్పడంతో అల వాటు చేసుకుంది .

ఎంత అలవాటైనా, స్వతహాగా ఆడ పిల్లలకుండే సిగ్గు వల్ల షాట్ అయిపోయిన తరువాత అక్కడ నిలబడలేక పరిగెత్తుకుంటూ వచ్చి కారవాన్ లో కులబడింది. ఏ హీరొయిన్ అయినా , పదిమందిలో బట్టలు విప్పి ఆడినా అది మనసు చంపుకుని చేసేదే ,అందుకే ఎప్పుడెప్పు షాట్ అయిపోతుందా కారవాన్ లోకి ఎప్పుడు వెళదామా అని ఎదురుచూస్తుంటారు.

సుస్మిత వెనుకె అనుపరించాడు ఆ సినిమాలో హీరో నవీన్.

నవీన్ ఒకప్పుడు తెలుగు సినీ చరిత్రలో అగ్రశేణి హీరోగా వెలుగొందాడు. కాని కాలం ఎప్పుడూ ఒకే రకంగా వుండదుగా? ఒడలు బళ్ళు అవ్వటంతో, ఇప్పుడతన్ని ఎవ్వరూ హీరోగా పెట్టి సినిమాలు తియ్యటానికి ముందుకు రాకపోవటంతో ,లేడి ఓరి యంటెడ్ సినిమాల్లో ప్రాధాన్యతలేని హీరోపాత్రలతో సర్దుకుపోతున్నాడు.

కారవాన్ తలుపు ఎవరో తీసిన చప్పుడప్పుడవాటంతో బట్టలు మార్చుకుంటువు సుస్మిత ఒకింత కోపంతో , ఎవరై వుంటారా అని తలుపు వంక చూసింది .

తలుపు సందులో నుంచి తొ ంగి చూస్తున్న నవీన్ కనబడటంతొ ,

"మీరా?" అంటా ఒక నిట్టూర్పు విడిచింది.

మెల్లగా పిల్లిలా కారవాన్ లోకి ఎక్కి సోఫాలో దూరంగా ఓ చివర ఒదిగి కూర్చున్నాడు నవీన్

'చెప్పండి, ఏమిటి విషయం? ' అంటు కారవాన్ లోని మేకప్ చైర్ లో కూర్చుని తల దువ్వ కుంటూ అడిగింది సుస్మిత.

'అదే మన పెళ్ళి సంగతి 'అంటూ నసిగాడు నవీన్.

క్రైం
సీరియల్

# గర్భ శ్లోకం

**జరిగిన కథ**

ఓ గుర్తు తెలియని మహిళ , పోలీసులు వెంబడిస్తుంటే తన బిడ్డతో సహా కృష్ణా నదిలోకి దూకుతుంది .ప్రముఖ హెరాయిన్ సుస్మిత హత్యకు గురవుతుంది .డి సి పి శ్రీనివాస రావు కేసు టేక్ అప్ చేస్తాడు .

**ఇక చదవండి**

'చెప్పానుకదా? మీ ఆవిడ నుండి విడాకులు తీసుకురండి అప్పుడు ఆలోచిద్దాం' అంటూ సన్నగా నవ్వింది.

ఇంతలో కారవానే తలుపు తోసుకుంటూ లోపలికి చొరబడ్డాడు, డైరక్టర్ అనీల్

అనీల్ ను చూడగానే ఒకింత అసహనంతో ' సినిమా పూర్తయిందిగా?' అంటూ ప్రశ్నించింది.

"ఎక్కడ అయిపోయింది. డబ్బింగ్ ఎవరు చెప్తారు?" అంటూ ఎదురు ప్రశ్నించాడు అనిల్

'నా వాయిస్ బాగాలేదు, డబ్బింగ్ వేరే చెప్పించుకుంటాము అని మొదటే చెప్పారు కదా? దాని కోసం నా రెమ్యునరేషన్ కూడా తగ్గించారు. కదా?' అన్నీ తెలిసి ఎందుకిలా మాట్లాడుతున్నారు అన్నట్లు విసుగ్గా అడిగింది.

'అప్పుడు వద్దనుకున్నాం, ఇప్పుడు కావలంటున్నాం కదా?' అంటు గద్దించాడు అనిల్

అతని మాటల్లో ద్వందార్థాలు స్పురించటంలో కాస్తంత భయపడిన సుస్మిత

"చూడండి నవీన్ గారు, మీకు కూడా అన్నీ తెలుసు కదా? 'అంటూ చూసింది నవీన్ వంక దీనంగా

అనుకోని అవకాశం ఎదురవ్వటంతో, కాస్తంత ధైర్యం తెచ్చుకుని

"అవును డైరెక్టరు గారు, ముందే మీరు అక్కర్లేదని, ఇప్పుడు డబ్బింగ్ చెప్పమనటం భావ్యం కాదు ' అంటూ సుస్మితకు అండగా నిలబడ్డాడు నవీన్

సీనియర్ హీరో నవీన్ సుస్మితకు అండగా నిలబడటంతో, వెనక్కు తగ్గాడు అనిల్

"సరేలెండి, మీరు అంతగా చెపుతున్నారుగా" అంటూ వెను తిరిగాడు.

''హమ్మయ్య' అనుకుంటూ ఊపిరి పీల్చుకుంది. సుస్మిత

"చూశావా, ఏతోడు లేని పరాయి ఆడదంటే అందరికి లోకువే. చివరకు ఇండస్ట్రీకి మొన్న మొన్న వచ్చిన ఈ అనిల్ గాడు కూడా నిన్ను బెదిరించేవాడే . అందుకే మనం పెళ్లి చేసుకుందాం అనేది ' అంటూ సుస్మితను లొంగ దీసుకోవాలని చూశాడు నవీన్

***సినిమా రంగంలో నవీన్ లాంటి తోడేళ్ళు ఎక్కువ . అవకాశం ఎప్పుడువస్తుందా అని గోతికాడ నక్కల్లా కాచుకుని ఉంటారు,సుస్మిత లాంటి అమాయకురాళ్ళ జీవితాలని పాడుచేయ్యటానికి."***

సినిమా రంగంలో నవీన్ లాంటి తోడేళ్ళు ఎక్కువ . అవకాశం ఎప్పుడువస్తుందా అని గోతికాడ నక్కల్లా కాచుకుని ఉంటారు,సుస్మిత లాంటి అమాయకురాళ్ళ జీవితాలని పాడుచేయ్యటానికి.

ఏ అందా దండా లేని సుస్మిత లాంటి వాళ్ళకు , ఎవరో ఒకడు ఇందుస్త్రీలో అండగా ఉండాలి కాబట్టి ఇష్టం ఉన్నా లేకపోయినా వాళ్ళకు లొంగి పోతూ ఉంటారు . నవీన్ లాంటి తోడేళ్ళని అక్కడ గాడ్ ఫాదర్ అని ముద్దుగా పిలుచుకుంటు ఉంటారు .

★★★

డిసిపికి వీడ్కోలు పలికి, లోపలికి వస్తూనే కోపంతో

# గర్భ శ్లోకం

ఊగిపోయాడు సి.ఐ. అంబుజం

'నిన్ను నోరు ఎత్తదన్నానా? చెప్పేది వినవా? 'అంటు ఎదురొచ్చిన నవీన్ మీద ఇంత ఎత్తున ఎగిరాడు.

'అదికాదు. అంబుజం, శవాన్ని ఒక్కసారిగా చూసేసరికి, భయం వేసింది. అయినా నేనేమి చెప్పలేదుగా?" అంటూ గొణిగాడు నవీన్

"చెప్పి చూడు, అందరం బొక్కలో వుంటాము?, అసలే డిసిపి ఆవులిస్తే నువ్వు తిన్న ఆవకాయ ఎక్కడిదో కూడా చెపుతాడు ' "అంటూ మొహానికి పట్టిన చెమట తుడుచుకుంటూ హాలులోని సోఫాలో కూలబడ్డాడు.

సోఫా చివర భయం, భయంగా మౌనంగా ఒదిగి కూర్చున్నాడు నవీన్

ఇంతలో ఫారెన్సిక్ బృందం తమ పని ముగించుకుని, పైనుంచి కింద దిగి వచ్చి

"సార్, మా వర్కు పూర్తయ్యింది, శవాన్ని పోస్టు మార్టం కి పంపవచ్చు" అంటూ ముందుకు కదిలారు, అక్కడ వుండి తాము చేసేదేమిలేదన్నట్లు

సరేనన్నట్లు తల ఆడిస్తూ, ఎస్.ఐ వంక చూశాడు అంబుజం

ఆ చూపులోని అర్థం తెలిసిన వాడిలా, "అంబులెన్సుకు కబురు పెట్టాను సార్ ,ఈ పాటికి వచ్చే వుంటుంది, శవాన్ని గవర్నమెంట్ హాస్పటల్కు పంపిస్తాను" అంటూ జవాబిచ్చాడు ఎస్ ఐ

అక్కడ పనులన్నీ పూర్తి కావటంతో, కాస్త రిలాక్సైన అంబుజం జేబులో నుంచి సిగిరెట్ పాకెట్ తీసి, అందులో నుంచి ఓ సిగిరెట్ నోట్లో పెట్టుకుని, వెలిగించటానికి లైటర్ కోసం అటు ఇటు చూసాడు

తన దగ్గరున్న లైటరతో, అంబుజం సిగిరెట్టు వెలిగిస్తూ

"వాడు మనల్ని కూడా వదలడేమో సార్?" అంటూ గొణిగాడు నవీన్

నవీన్ వంక ఒక తీక్షణమైన చూపు చూస్తూ, గట్టిగా సిగిరెట్ దమ్ము పీల్చి, పొగను నవీన్ మొహం మీదకు వదులుతూ

"వాడు అప్పటి దాకా బ్రతికుంటే కదా?" అంటూ లేచి నిలబడ్డాడు అంబుజం

---ఇంకా ఉంది .



బి .కళాగోపాల్

## బహుమతి పొందిన కవిత

నేలను స్మరిస్తున్న ఆకాశం..!!
పుడమితల్లికి పురుడు పోసి..
విత్తనాన్ని భూమి నుండి వెలికి తీసిన చరి–
త్రకారుడివి..!
దేహానికి.. దేశానికి.. అన్నభిక్ష పెడుతూ..
మెతుకు పువ్వై విరిసిన ఆకుపచ్చ రమణీయ
కార్యకర్తవు..!
రాజ్యాధికారం లేని రాజుగా..పదిమంది
కడుపులు నింపుతూ..
పస్తులపొట్టతో పూట గడవకున్నా..ప్రకృతినే
సవాల్ చేస్తూ..
మన్నును జున్నుగా మార్చే రహస్య విద్యనే–
దో నేర్చిన కర్మయోగివి..!
కాడితప్పని తొలిపొద్దును భుజానికెత్తుకొని
దుఃఖిస్తున్న నాగేటిచాళ్ళలో హరితవర్ణపు
జీవరసాన్ని నింపుతూ..
ఎదిగే పంటకు ఆశై..శ్వాసై..నిల్చిన ప్రాణ–
దాతవు..!
అన్నం పరబ్రహ్మ స్వరూమంటూ..ఆకలి–
భాష నెరిగిన భాష్యకారుడివి..!
ఆకుపచ్చని కన్నీళ్ళను దిగమింగుకొని..
మొగులు వైపు చూసే
దిగులు చూపులకు ఇక తావీయకుండా..
సహనం వీడని స్వేదంతో..
కరువునేలపై కురిసే మేఘానివి..!
ఋతువు మారినా.. మారని నుదుటిరా–
తతో..
మన్నును నమ్మిన సంజీవనిగా..
వ్యయం ఎక్కువైనా సాయం చేస్తూ..
మోసపోవడం తప్ప..మోసమెరుగని
వాడివి..!
పంటచేనంటే..ఇక"దిష్టిబొమ్మ"కానే
కాదంటూ..
అది కనిపించే వెన్నెముకైన భూమిపుత్రుడి
ఆధారభూమిక అని..
మొగ్గ తొడిగిన చైతన్యంతో..అనవరతం
పొలం ఒడిలో..
తిరిగే పోరాట భాస్వరానివి..!
"ఎవుసమే..!" ముద్దంటూ..
మా కంచం నింపే అక్షయపాత్రగా..!
మట్టి పాదాలతో ముందడుగేస్తున్నవాడివి
..!పొలమే పూజలు లేని దేవస్థలమై..పచ్చని
పంటే పరమాత్మగా..!
పాలింకిపోయిన బీళ్ళకు అమృతస్తన్యాన్ని
అందించే..

హెల్త్ టిప్స్

# మధుమేహం ఓ మాయరోగం



డా.కె. వేణుగోపాల రెడ్డి

ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువమంది జనాభా బాధపడుతుంది మధుమేహం వ్యాధి తోటే. ప్రముఖ మధుమేహం వైద్యులు **డాక్టర్ కే. వేణుగోపాలరెడ్డి** గారు సుమతి పాటకుల కోసం ప్రతి నెల మధుమేహం వ్యాధి తో బాధపడే వాళ్ళకు తగు సూచనలు సలహాలు ఇవ్వదలచారు. కావున పాటకులు తమ సందేహాలను, ప్రశ్నలును sumathi.doctorsalahalu@gmail.com కు పంపవచ్చు.

**మధుమేహం వ్యాధి లక్షణాలు**

తరుచుగా మూత్ర విసర్జన చేయడం

★అతిగా దాహం వేయడం

★అతిగా ఆకలి వేయడం

★ బరువు తగ్గిపోవడం

★చూపు మందగించడం

★పుండ్లు త్వరగా మానకపోవటం

★బాగా నీరసం, నిస్సత్తువ

★ మర్మావయవాల దగ్గర ఫంగల్ఇన్ఫెక్షన్ రావడం

**మధుమేహం తెలుసుకోవడానికి**

ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ – 126mg/dl ఉన్న అంతకన్నా ఎక్కువగా ఉన్నా మధుమేహం ఉన్నట్లు గుర్తించాలి.

గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్ లో బ్లడ్ షుగర్ 75mg గ్లూకోజ్ తీసుకున్న రెండుగంటలకు 200 mg/dl ఉన్నా అంతకన్నా ఎక్కువగా ఉన్న మధుమేహం ఉన్నట్లు గుర్తించాలి.

అలాగే రాండమ్ బ్లడ్షుగర్ 200 mg/dl ఉన్నా అంతకన్నా ఎక్కువగా ఉన్న మధుమేహం ఉన్నట్లు గుర్తించాలి.

**మధుమేహం పాదాలు**

మధుమేహం వల్ల క్రమంగా రక్తనాళాలే కాదు, నరాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా శరీరం చివర ఉండే నరాలు దెబ్బతింటాయి. కాబట్టి మధుమేహముంటే పెరిఫెరల్ న్యూరోపతి వస్తుందని భయపడుతుంటారు

పాదాలలో, అరచేతుల్లో ఉన్న నరాలు, దెబ్బతిని ముందు తిమ్మిర్లు పుడతాయి. ఆ తర్వాత స్పర్శజ్ఞానం ఎక్కువై క్రమంగా తగ్గిపోతుంది. అలాంటప్పుడు పాదాలలో ఏమి గుచ్చుకున్నా తెలీదు.

**మధుమేహం - కన్ను**

మధుమేహం అదుపులో లేనివారిలో ముందుగా కన్ను వెనుకభాగంలో ఉండే రెటీనా అనే పొరలోని సూక్ష్మరక్తనాళాలు దెబ్బతినటం జరుగుతుంది. దాని వలన చివరకు అంధత్వం కూడా సంభవించవచ్చు.

## హెల్త్ టిప్స్

డయాబెటిస్ వలన ప్రతి సంవత్సరం 30-40 లక్షలకు పైగా మరణాలకు గురవుచున్నారు.

ప్రతి రోజు సగటున 8500 పైగా మరణాలు సంభవిస్తున్నాయి. ప్రతి నిమిషానికి 6 ప్రాణాలని హరిస్తుంది.

ప్రతి సంవత్సరం ప్రపంచంలో న్యూరోపతి బారిన పడి సగటున 10 లక్షలకు పైగా కాళ్ళు తీసివేయబడుచున్నవి.

ఈ కాళ్ళ పుళ్ళు వలన ఏటా హాస్పటల్ కు వచ్చే వారి సంఖ్య 10% పెరుగుతుంది. దురదృష్టవశాత్తు ప్రతి అర నిమిషానికి ఒక కాలు తీసివేయ బడుచున్నది.

**షుగర్ వ్యాధికి చికిత్స**

మధుమేహం వ్యాధి చికిత్సలో నాలుగు ముఖ్యమైన అంశాలను మనం తప్పకుండా పాటించాలి. అందులో

మొదటిది – సరియైన ఆహార నియమాలను పాటించడం

రెండవది – రెగ్యులర్గా వ్యాయామం చేయడం

మూడవది – క్రమం తప్పకుండా మందులు వేసుకోవడం

నాల్గవది – వ్యాధి గురించి పూర్తి అవగాహనా కలిగి ఉండటం

పైన చెప్పిన ఈ నాలుగు అంశాలను చక్కగా పాటించడం ద్వారా మనం మధుమేహ వ్యాధిని చక్కగా అదుపులో ఉంచుకొని ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించడానికి వీలు కలుగుతుంది

**టైప్ 1 మరియు టైప్ 2 షుగర్ వ్యాధులలో వ్యత్యాసము ఏమిటి ?**

టైప్ 1: ఇది ముఖ్యంగా చిన్న పిల్లలో వస్తుంది టైప్ 2. ఇది యువకుల్లో, మధ్యవయసు మరియు ముసలివారిలో వస్తుంది.

1. ఈ వ్యాధి బయటపడటానికి ఎక్కువ సమయం పట్టదు 2. ఇందులో వ్యాధి లక్షణాలు లేకుండాఎక్కువ సంవత్సరాలు షుగర్ ఉండే అవకాసం ఉంది

1. బరువు తక్కువగాని, (లేక) సరిపోనుగాని ఉంటారు 2. శారీరక శ్రమ అధికంగా ఉంటుంది. వీరికి అధిక బరువు పెద్ద సమస్య

1. జీవితాంతము ఇన్సులిన్ ఆధారపడి ఉండవలసి ఉంటుంది. 2. ప్రారంభ దశలో ఇన్సులిన్అవసరం ఉండదు.

★★★★★.

సాధారణ ప్రచురణకు ఎన్నికైన
**కవిత**

## తోలుబొమ్మలు

ఎవరో గిరి గీసినట్టు
ఆ గిరిని దాటి రామంటున్నాయి
బీదల బతుకులు

ఎవరెన్ని చెప్పినా
బతుకును బానిసగా చేస్తున్నాయి
బడుగు జీవులు

నా సొంతవాడివంటూ
నీ అంతవాడు లేదని పలికే
నియంతల కొండంత కోతలకు
ఆసాంతం లొంగిపోతున్నాయి

నీ బరువు నాదని నా పరువు నీదని
బుజ్జగించే బూటకపు మాటలకు
బతుకుతెరువును బహుమతిగా
చేస్తున్నాయి

అర్ధజ్ఞానంతో అర్థంపర్థం లేని కార–
ణాలతో అర్థాకలి తీర్చే తాయిలాలకై
అణాకు అర్థణాకు అమ్ముడు
పోతున్నాయి

పట్టు పరుపులపై పరుండిన మొద్దు
నిద్దురకు
పళ్ళికిలించటంలో పేరొందిన
అత్తరు అద్దిన ఖద్దరుకు
రేయింబవళ్ళ రెక్కల కష్టాన్ని
రంజుగా ధారపోస్తున్నాయి

కార్మికులు, కర్షకులు
ఉపాధ్యాయులు, ఉద్యోగులు
పరిజనము, పర జనము
అందరూ తోలుబొమ్మలే
అప్పుడూ.. ఇప్పుడూ.. ఎప్పుడూ

-- వెంకు సనాతని

సెటైర్

# నెట్టింటి రామాయణం

# దంతావధానం

-ఈ. సాయి అలేఖ్య










పిల్లలిద్దరూ పై చదువుల కోసం అమెరికా, వెళ్ళటంతో, పొద్దున్నే వాళ్ళతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడటం కొన్నాళ్ళుగా అలవాటుగా మారిపోయింది. ఒక రోజు మా వాడు, అప్పుడే నిద్రలేచాడేమో నోట్లో వేపపుల్ల నములుతూ నాకు దర్శన మిచ్చాడు. వాడిని చూసిన నాకెందుకో వింతగా అనిపించింది. విషయం ఏమిటని అడిగితే, 'అర్గానిక్ టూత్ బ్రష్ "వాడు తున్నాని బదులిచ్చాడు. ఇప్పుడు అమెరికాలో అందరూ ఇవే వాడుతున్నారని, వాల్మార్ట్ , అమెజాన్ వంటి ఆన్లైన్ సంస్థలు వీటిని 15 డా॥కు (రు 1200) 200గ్రా వేప పుల్లలను అమ్ముతున్నారన్నాడు.

నిన్నా మొన్నటి వరకూ వేప పుల్లలతో పళ్లు తోముకోమంటే, చదువు రాని పల్లెటూరి మొద్దులే అవి వాడతారని అనేవాడు . అమెరికా వెళ్ళగానే 'ఆర్గానిక్' అని ఒక పేరు తగిలించగానే అదే వేప పుల్లలను వందలకు వందలు పోసి కొంటున్నారు. దీన్ని ఏమనాలి, కొత్త ఒక వింత పాత ఒక రోత అనుకోవాలేమో .

మా చిన్నతనంలో పండగలకు పబ్బాలకు ,మా నాయనమ్మ గారి ఊరెళితే, పొద్దున్నే అందరూ నోటిలో వేపపుల్లలు నములుతూ, చేతుల్లో చెంబులు పట్టుకుని వెళుతూ వీధుల్లో కనపడే వాళ్ళు. మా తాత గారు నాకు , మాతమ్ముడికి చెరో వేప పుల్ల ఇచ్చి దంతావధానం (అదేనండి పళ్ళు తోముకోవటం ) చెయ్య మనే వాళ్ళు . వేప పుల్ల నోట్లో పెట్టుకోగానే నోరంతా చేదుగా అవ్వడంతో, మేమిద్దరం ఇబ్బందిగా మొహాలు పెట్టటం చూసి, మా నాయనమ్మ, "చిన్న పిల్లలకు వేప పుల్లలెందుకు కాస్త ఉప్పు పెడితే సరిపోతుంది కదా ?" అంటూ మా ఇద్దరి చేతుల్లో కాస్త కల్లు ఉప్పు పెట్టి పళ్ళు తముకోమనేది. ఆ రోజుల్లో పల్లెటుళ్ళలో అందరూ పళ్ళు తోముకవటానికి వేపపుల్లలు, కల్లు ఉప్పు, బొగ్గుపొడి, ఇటుకరాయి పొడి వాడేవాళ్ళు, పట్నాల్లో మాత్రం పళ్ళ పొడిని సామాన్యులు వాడితే, డబ్బున్న మారాజులు కాల్గేట్ పేస్టు వాడే వాళ్ళు.

***"గోపాల్ పళ్ళపొడి, ఫారుఖీ పళ్ళ పొడి , కోతి మార్కు పళ్ళ పొడి వంటి దేశీయంగా తయారైన పళ్ళపొడులు పది పైసలకే దొ-రకటంతో సామాన్యులు వాటినే వాడే వాళ్ళు. "***

గోపాల్ పళ్ళపొడి, ఫారుఖీ పళ్ళ పొడి , కోతి మార్కు పళ్ళ పొడి వంటి దేశీయంగా తయారైన పళ్ళపొడులు పది పైసలకే దొరకటంతో సామాన్యులు వాటినే వాడే వాళ్ళు. ఆ తరువాత కాల్గేట్ ,డాబర్ వికో వంటి సంస్థలు ఈ వ్యాపారంలోకి ప్రవేశించటంతో పది పైసల పళ్లపొడి కాస్తా పదిరూపాయలు అయ్యింది . కన్నాళ్ళ క్రితం వరకు ఏ సినిమాహాలు కెళ్ళినా , అసలు సినిమాకు ముందు "వికో వజ్ర దంతి" అంటూ ప్రకటనలు మారుమోగిపోయేవి .

1806 లో స్థాపించిన కాల్గేట్ కంపెనీ 1896 లో మొట్ట మొదట ట్యూబుల్లో టూత్ పేస్టు ప్రారంభించింది. వాటని రిబ్బన్ డెంటల్ క్రీం అని పిలిచేవాళ్ళు. సంస్థ స్థాపించి నూరు సంవత్సరలైన సందర్భంగా టూత్ పౌడర్ కొన్న వాళ్ళకు వంటి సబ్బులను ఉచితంగా ఇచ్చేది. మన దేశంలో వేప పుల్లలను దంతవధానానికి వాడినట్లే అరేబియా దేశంలో సాల్వదోరా చెట్ల పుల్లలను ధన్తావధానానికి వాడతారు. వీటిని మిస్వాక్ పుల్లలని పిలుస్తారు. మన

# 'చిత్ర' కవితలు

## మరణ శాసనం

సదా వత్సలే మాతృభూమి అంటూ
ప్రతిరోజు  వందనం చేస్తున్న
భారతీయత ఎక్కడుంది..?

ఈ దేశ భవిష్యత్ వర్ణ చిత్రమిప్పుడు
అత్యాచారాల నల్ల రంగు
పులుముకొని శోక దగ్ధమవుతున్న
రుధిరాశ్రువులతో తడిసి విషాద
విహ్వల్యత్వం మీదవర్తమానం మీద
నడుస్తుంది

పాపపుణ్యాల నడిచే
దారుల్లోఅపరాద భావం
పశ్చాత్తాపం  అసలే లేదు
అసంఖ్యాకంగా పెరుగుతున్న
కామాంధుల దాహానికి అంతమేది

నిర్మానుష్యమైన సమాజం
మూగబోయింది ప్రలోభాల
కోరలతోపడగవిప్పిన పాముల్లా
విషం చిమ్ముతున్న విషకీటకాలు
వేటలో పసిపాపల అమాయకత్వం
రాలిపోవాల్సిందేనా..

ధ్వంసమవుతున్న జీవన విలువలపై
దాష్టీకాలు పెట్రేగుతుంటే స్వేచ్ఛగా
ఊపిరి పీల్చే పసిపాపలుమట్టి
పొరల కింద సమాధి
కావాల్సిందేనా

నిష్కృతి లేని అరాచకాలు
పైరవీల వ్యవస్థల
సర్దుబాట్లలతోఊరేగుతున్న
ఉన్మాదులు  చరిత్రహీనులుగా మళ్లీ
చరిత్ర కుప్పలోకే

అధికార దండానికీ చిక్కిన
న్యాయం అన్యాయమై
దారుణ దృశ్యాల చీకటి
ప్రపంచంలోఅబలల జీవితాలు
బలవుతుంటే

ఆహారహం తపించే అన్వేషణేలే
చేయాలి పడతుల అత్యాచార
మరణాలపై అతివల అంతరంగ
ఆత్మఘోషలే రుధిరజ్వాలలై ఎగసి
దహించాలి

కబళిస్తున్న రాబందుల మరణ
శాసనాన్ని లిఖిస్తూ అంతిమ
అధ్యాయ ముగింపుకు కదలాలీ స్త్రీ
సమాజం జీవన జ్వాలలై.

**-యన్. శకుంతల**



## రుధిర జ్వాల

మస్తిష్కపు పొరల్లో
ఒక ఉన్మాదపు కణం
మానవత్వంపై నీళ్లు చల్లుతోంది
పసి గుడ్డు నీడనైనా వదలని
పైశాచికత్వం
యథేచ్ఛగా తొక్కుతు వెళుతోంది
అత్యాచార పర్వాలతో
పృథ్వి తల్లడిల్లిపోతోంది
కన్న పేగు బంధాలకే తలమానికమై
మనిషితనానికే మచ్చౌతోంది
ఈ క్రూరత్వపు క్రీనీడలో
జాలి దయా ఓటమి పాలై
సృష్టినే స్తంభింపజేస్తోంది
ఈ విపరీతపు ఆగడాలన్నీ
అధఃపాతాళానికి తొక్కిననాడు
భువిపై పసి కందుల స్వేచ్ఛకు
మనిషి జన్మ హర్షిస్తుంది
మోహంతో మూసుకుపోయిన కళ్ళు
తెరుచుకున్న రోజే
ధరణి ప్రణమిల్లుతుంది

**-- నెల్లుట్ల సునీత**

---

**నెట్టింటి రామాయణం .......**

వేపపుల్లలు  కాని, మిస్వాక్ పుల్లల్లో కాని, యాంటి బాక్టీరియా గుణాలుండటంతో  మన పూర్వీకులు వీటిని వాడేవాళ్ళు. అదే కాక ఈ చెట్లు ఎక్కడైనా పెరగటంతో  ఇవి అందరికీ అందుబాటులో వుంటాయి, పై పెచ్చు ఎటు వంటి ఖర్చులేని పని. ఇప్పుడు 'మిస్వాక్' పేరుతో  కూడా టూత్  పేస్టులను తయారు చేస్తున్నాయి డాబర్ వంటి బడా కంపెనీలు. ఇప్పుడు అదే ఉప్పు, అదే బొగ్గుపొడి కలిపి, కాల్గేట్  విత్ సాల్ట్  , విత్ కోల్ అని అమ్ముతుంటే మనం ఎగబడి కొనుక్కుంటున్నాము.

అమెజాన్ వాళ్ళు పల్లెటూళ్ళలో వేప చెట్లనుండో పదికో పరకకో కొని, వందల రూపాయలకు అమ్ముతుంటే మనం గుడ్లప్పగించి చూస్తున్నాం . పై పెచ్చు ఈ మధ్య పెటంట్లు అని వచ్చాయి . మనం వాడె వేపపుల్లల దగ్గర నుండి పేడ పిడకల దాక ఎవరో విదేశస్తులు పెటంట్లు తీసుకుని అమ్ముకుంటుంటే మనం మాత్రం వాటిని ఆన్లైన్లో కొనుక్కుని ఆనందిస్తున్నాం .ఎంతైనా పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదు కదా .

ఏడు వారాల నగలు

# కొత్తగా వస్తున్నాయి

## ఇంపోర్టెడ్ ప్రీమియం క్వాలిటీ జెమ్స్ ,బీడ్స్ ,జ్యువెలరీ

– జ్ఞానిక క్రిస్టలైన్ వారి సహకారంతో



Code: GCOC058
Name: Olive Jade
Price: ₹2400/-

Code: GCGR044
Name: Aventurine
Price: ₹1500/





Name: RIVER STONE RICE
Price: Rs. 3,000/-
★Imported from Japan★



Code: GCRT014
Name: Red Agate Oval Tube
Price: ₹3000/-

Code: GCAR041
Name: Aqua aura
Price: Rs. 14,000/-
Imported from Japan





Code: GCBR024
Name: Onyx 4 sided
Price: ₹4800/-

జ్ఞానిక క్రిస్టలైన్ వారు సుమతి పాఠకులకు మార్కెట్ ధర పై 10శాతం డిస్కౌంట్ ఇవ్వదలచారు. కావున కొనుగోలు చేయ దలచిన వారు కింది నెంబర్ కు ఫోన్ లో " **సుమతి ఏడూ వరాల నగలు -96369"**అనే మెసేజ్ పెట్టి మీ చిరునామా తెలియచేస్తే ఇంటికే పోస్ట్ ద్వారా పంపుతారు . జ్ఞానిక క్రిస్టలైన్ వారి నెం: **8008338674**

Gnanika's Crystalline
Premium beads, pearls and jewellery collection

# 'రంజాన్' స్పెషల్ వంటకాలు

## ద్రాక్ష హల్వా

11/2 కప్పు ద్రాక్షా రసం

1 కప్పు పంచదార

1 కప్పు నీళ్ళు

1/2 కప్పు కార్న్ ఫ్లోర్

తగినంత నెయ్యి

1. ముందుగా జ్యూస్ లోకార్న్ ఫ్లోర్ వేసి కలపండి . కావలంటే కలర్ కూడా వేయవచ్చు.

2. ఒక పాన్ లో చెక్కెర వేసి నీళ్ళు పోసి 5 నిమిషాలు మరిగించాక కలిపి ఉంచిన మిశ్రమాన్ని వేసి తిప్పుతూ ఉండాలి .

3. అది గట్టి పడిన తర్వాత నెయ్యి వేసి కలపాలి ఇంకో 2 నిమిషాల తర్వాత మరికొంచెం నెయ్యి వేసి కలపాలి .

4.ఆ తర్వాత నెయ్యి రాసి డ్రై ఫ్రూట్స్ వేసి ఉంచిన బౌల్ లో ఈ హల్వాని వేసి ఆరిపోయి సెట్ అయ్యాక వడ్డించాలి



## ఖుబానీ కా మీఠా



200 గ్రా. ఎండు ఆఫ్రికాట్లు

140 గ్రా. పంచదార

1/4 కప్పు బాదాం పప్పు

1/2 టేబుల్ స్పూన్ నిమ్మ రసం

1.ఆఫ్రికాట్లను కడిగి 2కప్పుల నీటిలో 4 నుండి 5 గంటలపాటు నానబెట్టండి. ఆఫ్రికాట్ల నుండి విత్తనాలను వేరు చేసి ముక్కలు చేసి ఒక కప్పు పంచదార ద్రావణముతో సహా ఒక బోరోసిల్ కుక్ వేర్ యందు ఉంచండి. 2.80% విద్యుత్తుపై 10 నిముషాల పాటు లేదా మిశ్రమం గుజ్జుగా అయ్యేంతవరకూ మైక్రోవేవ్ లో ఉంచండి .

3. దానిని చల్లార్చి మృదువైన పేస్టుగా తయారయ్యేవరకూ గ్రైండ్ చేయండి. ఒక సన్నటి జల్లెడలో వడబోయండి. గట్టిగా అయ్యేవరకూ మైక్రోవేవ్ లో ఉంచండి .

4. ఆల్మండ్లు మరియు నిమ్మ రసాన్ని కలపండి. క్రీములేదా కస్టర్డు లేదా రబ్రీతో పాటుగా వేడిగానైనా లేదా చల్లగానయినా వడ్డించండి.

## మిర్చి కా సలాన్

250 గ్రా., పెద్ద పచ్చి మిరపకాయలు క్యాప్సికం–చీల్చి విత్తనాలు తీసివేసి, బాగా వేయించలి ,2ఉల్లిగడ్డలు ముద్దగా నూరాలి. 1 టేబుల్ స్పూను – వెల్లుల్లి ముద్ద,1 టేబుల్ స్పూను ఆవాలు, 5–6 లవంగాలు 8–10 కరివేపాకులు 25 గ్రా. చింతపండు ,3 టేబుల్ స్పూన్లు నూనె, 1 1/2 టేబుల్ స్పూన్లు ఉప్పు

వేయించి మరియు ముద్దగా చేయవలసినవి.

50గ్రా. కొబ్బరి లేదా పచ్చి కొబ్బరికాయ 1 కప్పు తురుము) a 50గ్రా. 1/3 కప్పు వేరుశెనగ గింజలు, 4 ఎండు మిర్చి 3 టేబుల్ స్పూన్లు ధనియాలు, 2 టేబుల్ స్పూన్లు జీలకర్ర 1 టేబుల్ స్పూను నువ్వులు, 1 టేబుల్ స్పూను మిరియాలు

1. చింతపండును పావు కప్పు నీళ్ళలో నానబెట్టండి. గుజ్జు తీయండి.

2. నూనె, ఆవాలు, లవంగాలు మరియు కరివేపాకులను 3 నిముషాల పాటు మైక్రోవేవ్ లో ఉంచండి .

3. ఉల్లిగడ్డల ముద్ద మరియు అల్లం–వెల్లుల్లి ముద్దను కలిపి 6 నిముషాల పాటు మైక్రోవేవ్ చేయండి.

4. సలాన్ పేస్టును దానికి చేర్చి 2 నిముషాల పాటు మైక్రోవేవ్ లో ఉంచండి .5. దానికి చింతపండు గుజ్జు, ఉప్పు మరియు 4 కప్పు నీటిని చేర్చి 2 నిముషాల పాటు మైక్రోవేవ్ చేయండి. వేయించిన మైక్రోవేవ్ చేయబడిన మిరపకాయల్ని గ్రేవీకి చేర్చండి. 3 నిముషాల పాటు మైక్రోవేవ్ లో ఉంచండి .

**చూడాల్సిన ప్రదేశం**

# శ్రీ ముఖ లింగం



***శ్రీముఖలింగం పేరులోనే చక్కని అర్థం ఉంది. శ్రీముఖలింగం అనే పదానికి పరమేశ్వరుడు లింగంలో కనిపించుట అని అర్థం.***

శ్రీ ముఖలింగేశ్వర దేవాలయం శ్రీకాకుళం జిల్లాలో జలుమూరు మండలంలోని ముఖలింగం గ్రామంలో ఉంది. ఇది శ్రీకాకుళం నుండి 46 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ చరిత్ర ప్రసిద్ధినందిన ముఖలింగేశ్వరాస్వామి, భీమేశ్వరాస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాలున్నాయి. ఇవి చక్కని శిల్పాలతో కనుల పండుగ చేస్తాయి. ఈ గ్రామం మామిడి తోటలు, శోభాయమానంగా అగుపించే కొబ్బరి తోటలకు ఆలవాలం. దేవాలయ పరిసరాలలో ఉన్నంతసేపూ భగవంతునిపై భక్తిప్రవత్తులతోపాటు మనసుకు ఆహ్లాదం కలుగుతుంది . శ్రీ ముఖలింగాలయాన్ని సా.శ. 10వ శతాబ్దంలో రెండవ కామార్ణవుడన్న రాజు కట్టించాడని శాసనాల ద్వారా తెలుస్తోంది . ఈ దేవాలయం లోని శివలింగాన్ని ఏ దిశ నుంచి చూసినా మనవైపే చూస్తున్నట్టు ఉంటుంది. దేవాలయ గోపురం చాలా ఎత్తుగా ఉంటుంది. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం.



శ్రీముఖలింగేశ్వరుని ఆలయానికి పక్కనే ఆంజనేయస్వామి ఆలయం ఉంది. భక్తులు శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్న తరువాత ఆంజనేయస్వామిని దర్శించుకోవడం ఇక్కడి ఆనవాయితీ. శ్రీముఖలింగేశ్వరంలో మూడు చోట్ల ముక్కోణపు ఆకారంలో మూడు ఆలయాలు ఉన్నాయి. వాటిలో ప్రధాన ఆలయం మధుకేశ్వర ఆలయం. ప్రస్తుతం ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్







వారు మధుకేశ్వర ఆలయం చుట్టూ సుందరమైన క్యూ కాంప్లెక్స్, పచ్చని మొక్కలతో సుందరమైన పార్కు ఏర్పాటు చేసారు. దీనికి అభిముఖంగా కొంత దూరంలో భీమేశ్వర ఆలయం ఉంది. ఈ రెండు ఆలయాలకు కాస్త దూరంగా ఊరి ప్రథమార్ధంలో అధునాతన వాస్తు పద్ధతిలో అద్భుత సోయగాలు కురిపిస్తూ సోమేశ్వర ఆలయం భక్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఉంటుంది.

ఇందులో ప్రతిష్ఠితమైన లింగాన్ని శ్రీముఖలింగేశ్వరుడు అంటారు. ఈ ఆలయంపై సుమారు 100 సంవత్సరముల క్రిందట పిడుగు పడింది. పిడుగు పడినప్పుడు ఆలయ శిఖరం దెబ్బతినగా దానిని ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా వారు పునరుద్ధరించారు. ప్రస్తుతం ఈ మూడు ఆలయాల్లోనూ శిల్ప కళాసంపద చూపరులకు కనువిందు చేస్తుంది. ఈ ఆలయం చాణుక్య శిల్పకళా వైభవానికి దర్పణం పడుతుంది. ఈ ఆలయాలు సా.శ. 573–1058 సంవత్సరాల మధ్య కాలంలో నిర్మించారని చరిత్రకారులు చెపుతుంటారు.

ఒకప్పుడు హిమాలయాలమీద గొప్ప వైష్ణవయాగం జరిగింది. ఆ యాగాన్ని చూడడానికి గంధర్వరాజైన చిత్రగ్రీవుడు తన గంధర్వ గణాలతో వచ్చాడు. ఆ హిమాలయాలమీద ఉండే శబరకాంతలు కూడా ఆ యాగం చూడడానికి వచ్చారు. శబరకాంతల సౌందర్యం చూసి గంధర్వులు కామవశీభూతులయ్యారు. అది గమనించిన వామదేవ మహర్షి కోపగించి " సభామర్యాదను అతిక్రమించిన దోషానికి మీరంతా శబరజాతిలో జన్మించండి" అని శపించాడు. గంధర్వులంతా శబరులుగా జన్మించారు. వారి నాయకుడైన చిత్రగ్రీవుడు శబర నాయకుడుగా జన్మించాడు. అతని రాణి చిత్తి. రెండవ భార్య చిత్కళ. ఈమె శివభక్తురాలు. ఈ రాణులిద్దరికీ ఒక్క క్షణం పడేదికాదు. చీటికీ మాటికీ కీచులాడుకునేవారు. ఒకరోజు చిత్తి తన భర్తను చేరి "నీతో ఉంటే నేనైనా ఉండాలి...లేదా చిత్కళైనా ఉండాలి. ఏదో ఒకటి తేల్చి చెప్పు" అని నిలదీసింది. శబర నాయకుడు పట్టపురాణి అయిన చిత్తిని వదులుకోలేక తన రెండవరాణి అయిన చిత్కళను పిలిచి తమ వాకిలిలో ఉన్న ఇప్పచెట్టు కొమ్మలు రెండు వంచి, రాలిన పువ్వులు ఏరుకుని, వాటిని అమ్ముకుని బతకమన్నాడు. మహాసాధ్వి అయిన చిత్కళ భర్త మాటకు ఎదురు చెప్పలేక, ఇప్పచెట్టు కొమ్మలు రెండు వంచి ఆ రాలిన

## చూడాల్సిన ప్రదేశం



పువ్వులు రోజూ ఏరుకునేది. అయితే ఆమె శివభక్తురాలు కనుక శివానుగ్రహం వల్ల రాలిన పువ్వులు బంగారు పువ్వులుగా మారిపోయేవి. చిత్కళ ఆ బంగారు పువ్వులను సుమంతపురంలో అమ్ముకుంటూ కాలం గడుపుతోంది. ఈ సంగతి తెలిసి చిత్తి అసూయ చెంది చిత్కళతో గొడవకు దిగింది. విసుగు చెందిన శబర నాయకుడు సవతుల గొడవకు ఆ ఇప్ప చెట్టే కారణమని తలచి, ఆ ఇప్పచెట్టును నరకడానికి సిద్ధపడ్డాడు. అప్పుడు మహాశివుడు రౌద్రాకారంతో ఆ చెట్టు మొదట ప్రత్యక్షమయ్యాడు. అది చూసి శబర నాయకుడు మూర్ఛబోయాడు. దీనికంతటికీ చిత్కళయే కారణమని తలచి శబరులంతా కలిసి చిత్కళను చంపడానికి సిద్ధబడ్డారు. అప్పుడు మహాశివుడు వారి ముందు ప్రత్యక్షమై శబరరూపులైన



ఆ గంధర్వులకు శాపవిముక్తి అనుగ్రహించాడు. ఆ విధంగా మధూక వృక్షంలో సాక్షాత్కరించిన మహాశివుడే మధుకేశ్వరుడుగా వెలసాడు .ఇక్కడ లింగం రాతితో చెక్కింది కాదు. ఇప్ప చెట్టు మొదలను నరికి వేయగా అదే ముఖలింగంగా ప్రసిద్ధి చెందింది. ఆ చెట్టు మొదలుపై “ముఖం “ కనిపిస్తుంది అని చెబుతారు. ఆ చెట్టు మొదలే క్రమంగా రాపడి వల్ల లింగంగా మారిందని చెబుతారు. ఇప్పచెట్టును సంస్కృతంలో మధుకం అంటారని అందువల్ల ఈ గుడికి మధుకేశ్వరస్వామి ఆలయంగా పేరొచ్చిందని అంటారు.

ఈ ఆలయంలో గర్భాలయంకాక ఎనిమిది వైపుల ఎనిమిది లింగాలున్నాయి. ఇక్కడి అమ్మవారు వరాహిదేవి, సప్త మాతృకలలో ఆమె ఒకరు . మిగిలివారు బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, ఇంద్రాణి. వీరు పార్వతీదేవి అవతారాలు. ఇక్కడి శిల్పాలలో వరాహావతారం, వామనావతారం, సూర్య విగ్రహం వుండటం విశేషం. భీమేశ్వరాలయం శిథిలావస్థలో ఉంది. ఇక్కడ కుమారస్వామి, దక్షిణామూర్తి నాలుగు ముఖాలతో బ్రహ్మ, గణపతి విగ్రహాలున్నాయి. సోమేశ్వరాలయానికి గర్భగుడి మాత్రమే ఉంది. ముఖమండపం లేదు. ఎత్తయిన శిఖరంపై బ్రహ్మాండమైన రాతితో కప్పు వేశారు. ఇది ఒకేరాయి. ఒకసారి పిడుగుపడి, ఆరాయి పగిలి అందులో ఒక ముక్క క్రింది పడింది. ఆ ముక్కనే దాదాపు 50 మంది కలిసి కదల్చలేకపోయారంటే, మొత్తం రాయి ఎంత బరువో వూహించుకోవచ్చు. అంతటి రాయిని అంత ఎత్తుకు ఆ రోజుల్లో ఎలా ఎత్తారో, ఎలా అమర్చారో తలచుకుంటే ఆనాటి విశ్వబ్రాహ్మణ శిల్పుల గొప్పతనం, ప్రజ్ఞ అర్థం అవుతాయి.

★★★★★

బహుమతి పొందిన హాస్య కథ

# కల 'వరమాయే'

## హాస్యకథ

ఉదయం ఎనిమిది గంటలయినా భర్త బెడ్రూమ్ వదలి బయటకు రాకపోవడంతో 'ఈయనగారు పడకగదిలో ఏంచేస్తున్నారో" అనుకుంటూ బెడ్రూమ్ తలుపు తోసి లోపలి దృశ్యం చూసి అవాక్కయింది సుహాసిని.

భర్త వెంకటేష్ గుండెలు బాదుకుంటున్నాడు. జుట్టు పీక్కుంటున్నాడు. తలను గోడకేసి కొట్టుకుంటున్నాడు. పిచ్చోడిలా ప్రవర్తిస్తున్న పతిదేవుడిని చూస్తూ ఖంగారుపడింది భార్యామణి.

"ఏమయిందండీ ... ఎందుకలా వేదనతో వ్యధ చెందుతున్నారు" అడిగింది సతీమణి.

“హు. ఏం చెప్పను నా బాధ ... ఎలా చెప్పను నా వ్యధ" గద్గదస్వరంతో అన్నాడు వెంకటేష్, "మన మాతృభాష తెలుగులో చక్కగా చెప్పండి. సావధానంగా వింటాను" అంది సుహాసిని.

ఏం మాట్లాడకుండా మిడిగుడ్లేసుకుని చూస్తున్న శ్రీవారిని చూసి జాలిపడింది.

"నాకు తెల్లవారుజామున కలవచ్చింది. నాకు ఉద్యోగం పోయినట్లు ... మావగారు నన్ను ఇంట్లోంచి తరిమేసినట్లు, నేను బిచ్చమెత్తుకుంటున్నట్లు... అబ్బా... చెప్పలేను. తలచుకుంటే భయమేస్తోంది" అన్నాడు వెంకటేష్ ఏడుపుముఖంతో

**నాకు తెల్లవారుజామున కలవచ్చింది. నాకు ఉద్యోగం పోయినట్లు ... మావగారు నన్ను ఇంట్లోంచి తరిమేసినట్లు, నేను బిచ్చమెత్తుకుంటున్నట్లు... అబ్బా... చెప్పలేను. తలచుకుంటే భయ-మేస్తోంది అన్నాడు వెంకటేష్ ఏడుపుముఖంతో,**

"మీ ఉద్యోగం ఎందుకు పోతుందండీ. మీరు మంచి పనిమంతులు. ఉదయం నుండి సాయంకాలం దాకా పనిచేస్తారు. కదా" సందేహించింది సుహాసిని.

“ఏమో ... ఏం చెప్పను ... రోజులు బాగులేకపోతే తాడే పామై కరుస్తుంది. ఈ మధ్య నాకిచ్చిన ప్రాజెక్ట్ సకాలంలో పూర్తిచేయలేకపోయాను. వారం రోజులు ఆలస్యంగా పూర్తిచేశాను. అందుకు కోపగించిన మా జిఎమ్ నన్ను ఉద్యోగంలోంచి పీకేసినా పీకేయగలడు. నా పనయిపోయింది. నేను రోడ్డున పడతాను” బేరమన్నాడు వెంకటేష్,

"ఓస్... ఈ మాత్రానికే



ఇంద్రగంటి నరసింహ మూర్తి

బాధపడుతున్నారా మీకుద్యోగం పోవడం మన మంచికేనండీ ..." ఆనందంగా చెపుతున్న భార్యవైపు ఆశ్చర్యంగా చూశాడు భర్త.

"అవునండీ ... ఈ మధ్య పేపర్లో నేనో మహిళా వ్యాపారవేత్త అనుభవాలు చదివాను. భర్తకు ఉద్యోగం పోయి బిచ్చమెత్తుకునే స్థితి వస్తుంది. ఆ సమయంలో అతని భార్య పుస్తెలు తాకట్టుపెట్టి వచ్చిన డబ్బుతో చిన్న వ్యాపారం ప్రారంభిస్తుంది. ఆ వ్యాపారం అంతై ఇంతై ఎంతో పెరిగి ఆమె కుబేరురాలవుతుంది. ఆమె భర్త భార్య దగ్గరే పనివాడుగా ఉంటాడు. మీకుద్యోగం పోగానే నేను కూడా నా పుస్తెలు తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో బిజినెస్ స్టార్ట్ చేస్తా. అంబానీ, అదానీలను మించిపోతా.

**బహుమతి పొందిన హాస్య కథ**

# హాస్యకథ

మీరూ నా దగ్గర పనిచేద్దురుగాని" ఉత్సాహంగా చెప్పింది సుహాసిని.

"ఏమో ... ఏం చెప్పను ... రోజులు బాగులేకపోతే తాడే పామై కరుస్తుంది. ఈ మధ్య నాకిచ్చిన ప్రాజెక్ట్ సకాలంలో పూర్తిచేయలేకపోయాను. వారం రోజులు ఆలస్యంగా పూర్తిచేశాను. అందుకు కోపగించిన మా జిఎమ్ నన్ను ఉద్యోగంలోంచి పీకేసినా పీకేయగలడు. నా పనయిపోయింది. నేను రోడ్డున పడతాను" బేరమన్నాడు వెంకటేష్,

"నువ్వు ఇంటర్ చదివావు... బిజినెస్ చేయగలవా ..." సందేహం వెంకటేష్.

"అయ్యో ... అదే అసలు పాయింట్... నేను చెప్పిన మహిళ కూడా ఇంటర్ చదువాపేసింది. బిజినెస్ కు చదువుకు సంబంధం లేదు" వివరించింది సుహాసిని.

"మీ నాన్న కోటీశ్వరుడు కదా... పెట్టుబడికి ఆయన దగ్గర డబ్బు తీసుకోవచ్చు కదా ... పుస్తెలు తాకట్టు పెట్టాలా" అంటూ బుర్ర గోక్కున్నాడు వెంకటేష్,

"మా నాన్న పాలసీ మీకిదివరకే చెప్పారు కదా ... ఆయన దగ్గరనుండి పైసా కూడా మనవరకు రాదు. మన బ్రతుకు మనం బ్రతకాల్సిందే ... మీరు ఇల్లరికం వచ్చారు కనుక ఈ ఇంట్లో మా అమ్మానాన్నలతో ఉండనిస్తున్నారు. ప్రతీనెల ఖర్చులకు పాతికవేలు మీ దగ్గరనుండి పుచ్చుకుంటున్నారు కూడా... ఇంకా మీకు మావగారి ఆస్తిమీద ఆశ చావలేదా" అడిగింది సుహాసిని.

నీళ్లు నమిలాడు వెంకటేష్,

***" లేవండి ... లేవండి ..... హుషారుగా ఆఫీసుకు వెళ్లండి. ఊస్టింగ్ ఆర్డర్తో దర్జాగా ఇంటికి రండి జాలీగా చెప్పింది సుహాసిని."***

"లేవండి ... లేవండి ..... హుషారుగా ఆఫీసుకు వెళ్లండి. ఊస్టింగ్ ఆర్డర్తో దర్జాగా ఇంటికి రండి" జాలీగా చెప్పింది సుహాసిని.

ముఖం ముడుచుకుని కాలకృత్యాలకు లేచాడు వెంకటేష్, గంట తరువాత ఆఫీసుకు బయలుదేరాడు. మరో గంటకు ఆఫీసుకు చేరుకున్నాడు. తన సీట్లో కూర్చోబోతూంటే జనరల్ మేనేజర్ నుండి పిలుపు... కల గుర్తొచ్చింది. ఏడుపు తన్నుకొచ్చింది. బిపి పెరుగుతూంటే భయపడుతూ జిఎమ్ కేబిన్లో అడుగుపెట్టాడు.

"హలో వెంకటేష్ ... నీకు గుడ్ న్యూస్ ... నీ పనితీరు భేషుగ్గా ఉంది. నీ ప్రతిభకు గుర్తింపు వచ్చింది. నిన్ను గ్రూప్ లీడర్ గా ప్రమోట్ చేస్తున్నాం. ఇవిగో ఆర్డర్స్ ... స్వయంగా ఇద్దామని పిలిచాను. కంగ్రాట్స్" అంటూ ప్రమోషన్ ఆర్డర్స్ చేతికిచ్చాడు జిఎమ్.

సంతోషంతో ఉబ్బిపోయాడు వెంకటేష్, జిఎమ్కు థాంక్స్ చెప్పి కేబిన్ బయటకు రాగానే సుహాసినికి ఫోన్ చేశాడు. శుభవార్త వినిపించాడు.

"అయ్యో మీకు ప్రమోషనా... మీ ఉద్యోగం పోతుందని నేను ప్రారంభించే వ్యాపారానికి ప్రణాళికలు వేస్తున్నాను. నాకు కోట్లు గడించే అవకాశం పోయింది. నా ఆశ నిరాశయింది. నన్ను విధి వెక్కిరించింది." భార్య మాటలు వింటూ సెల్ నేలకేసి కొట్టాలన్నంత కోపంతో ఊగిపోయాడు వెంకటేషు.

★★★★★★★

మూడేళ్ళు వెనక్కి వెడితే ...

వెంకటేష్కు పెళ్లి ప్రయత్నాలు ప్రారంభించారు తల్లిదండ్రులు.

"నాన్నా... ఈ సాఫ్ట్వేర్ జాబ్లో లో రోజంతా పని ... పని... విశ్రాంతి లేదు. ఎంజాయ్మెంట్ లేదు. అందుకే బాగా ఆలోచించి నేనో నిర్ణయానికొచ్చా. బాగా ఆస్తిపాస్తులున్న ధనవంతుడి కూతుర్ని పెళ్లాడుతా. ఆయనకు ఒక్కత్తే కూతురుండాలి. ఇల్లరికానికి ఒప్పుకోవాలి. పెళ్లి చేసుకుని హాయిగా

**బహుమతి పొందిన హాస్య కథ**

# హాస్యకథ

ఇల్లరికం వెళ్లి ఉద్యోగం మానేసి కాలుమీద కాలేసుకు కూర్చుని లైఫ్ ఎంజాయ్ చేస్తా ... నాకు కాబోయే భార్య చదువుకోకపోయినా పర్వాలేదు. తండ్రి ధనవంతుడైతే చాలు" అన్నాడు.

> **"ఓరి అప్రాచ్యుడా ... ఇదేం కోరిక ... లక్షణంగా లక్ష్మీ దేవి లాంటి కోడలిని ఇంటికి తెచ్చు-కోవాలని మేమనుకుంటూంటే నువ్వే ఇల్లరికం పోతానంటా-వా బాగా ఆలోచించుకో ... వెంకటేష్ తండ్రి. ... తరువాత జీవితమంతా ఏడుస్తావ్ చెప్పాడు జోగినాథం,"**

"ఓరి అప్రాచ్యుడా ... ఇదేం కోరిక ... లక్షణంగా లక్ష్మీదేవి లాంటి కోడలిని ఇంటికి తెచ్చుకోవాలని మేమనుకుంటూంటే నువ్వే ఇల్లరికం పోతానంటావా బాగా ఆలోచించుకో ... వెంకటేష్ తండ్రి. ... తరువాత జీవితమంతా ఏడుస్తావ్" చెప్పాడు జోగినాథం,

"బాగా ఆలోచించే చెపుతున్నాను నాన్నా... నా మాటే శాసనం. నా నిర్ణయానికి తిరుగులేదు. మీరు వెంటనే నాకు సంబంధాలు వెతకండి. ఇల్లరికం మాట మరచిపోకండి" హుకుం జారీచేశాడు వెంకటేష్,

"నీ ఖర్మ ... నీ తలరాత ఎలా ఉంటే అలా జరుగుతుంది. ఇకపై నీ బతుకు బానిస బతుకే" అన్నాడు జోగినాథం.

కొడుకు మాట కాదనలేక మాట్రిమోనియల్ వెబ్సైట్ నిర్వాహకులను సంప్రదించాడు. తన డిమాండ్లు తెలిపాడు.

చలపతిరావు లాయరు. డబ్బు బాగానే గడించాడు. ఆస్తులు కొన్నాడు. అతనికి ఒక్కగానొక్క కూతురు సుహాసిని గారాబంగా పెరిగింది. ఇంటర్ చదువు ఆపేసింది. టివి సీరియల్స్, సినిమాలు చూస్తూ కాలం గడుపుతోంది. పెళ్లయ్యాక తాను అత్తారింటికి వెళ్లనని, తన మొగుడే తనింటికి రావాలని పంతంపట్టింది.

"అబ్బ ... వంట చేయాలన్నా, ఇంటిపనులన్నా నాకు మహా చిరాకు. మనింట్లో అమ్మ చేసిపెడుతూంటేనే తిని కూర్చుని ఎంజాయ్ చేస్తున్నా. ఈ సుఖం అత్తారింట్లో ఎక్కడుంటుంది ... అందుకే ఇల్లరికం వచ్చే అల్లుడిని చూడు నాన్నా" అని కోరింది సుహాసిని.

"నీకసలే చదువబ్బలేదు. పైగా ఇల్లరికంట ... నీ ఖర్మ... నీకు నచ్చిన పెళ్లికొడుకుని వెతకటం నావల్ల కాదేమొ" విసుక్కున్నాడు చలపతిరావు. మాట్రిమోనియల్ వెబ్సైట్ నిర్వాహకులను ఆశ్రయించాడు.

"మా అమ్మాయి అదృష్టవంతురాలు" అన్నాడు చలపతి వారి ద్వారా వెంకటేష్ సంబంధం వివరాలు తెలుసుకుని వెంటనే జోగినాథాన్ని సంప్రదించాడు. "మన బడుద్ధాయి జాతకం అదిరింది. అందుకే వాడి కోరికలకు తగ్గ సంబంధం దొరికింది" అనుకుంటూ ఆనందించాడు జోగినాథం. వెంటనే పెళ్లిచూపులు జరగడం ... అమ్మాయి, అబ్బాయి ఓకే అనడం ... మంచి ముహూర్తంలో సుహాసిని మెడలో వెంకటేష్ తాళి కట్టడం, ఇల్లరికం వెళ్లడం చకచకా జరిగిపోయాయి.

పెళ్లయిన నెల రోజులకు తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించాడు వెంకటేష్.

> **"అదేమిటి అల్లుడూ ... బంగారం-లాంటి ఉద్యోగం వదులుకుంటావా ... ఆ ఉద్యోగం చూసే నీకు మా అమ్మాయినిచ్చి ఇల్లరికం తెచ్చుకు-న్నాను. ఉద్యోగం లేకపోతే గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటే నిన్ను నీ పెళ్లాన్ని ఎవడు పోషిస్తాడు అన్నాడు. చలపతి."**

"అదేమిటి అల్లుడూ ... బంగారంలాంటి ఉద్యోగం వదులుకుంటావా ... ఆ ఉద్యోగం చూసే నీకు మా అమ్మాయినిచ్చి ఇల్లరికం తెచ్చుకున్నాను. ఉద్యోగం లేకపోతే గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటే నిన్ను నీ పెళ్లాన్ని ఎవడు పోషిస్తాడు" అన్నాడు. చలపతి.

"మీ ఆస్తి ఉందిగా మామయ్యా... బాగా సంపాదించారని తెలిసింది.

బహుమతి పొందిన హాస్య కథ

# హాస్యకథ

ఇంకా నేనెందుకు సంపాదించడం. హాయిగా కాలుమీద కాలేసుకు కూర్చుని ఎంజాయ్ చేస్తా" గంభీరంగా చెప్పాడు వెంకటేష్,

"నా ఆస్తి నాతోనే పోతుంది అల్లుడూ ... నా ఆస్తిని అనాధాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు, దేవాలయాలకు విరాళంగా ఇస్తూ విల్లు రాసేశాను. ఆస్తిని నీకిస్తే నాకేం లాభం. ఆస్తిని దానధర్మాలకు వినియోగించడం వల్ల నాకు పుణ్యం వస్తుంది. మరణించాక నేరుగా స్వర్గానికి పోయి సుఖపడతా. ఈ ఆస్తిలో చిల్లిగవ్వ మీకెవ్వరికీ రాదు. నేను డబ్బు విషయంలో మహాస్ట్రిక్ట్ ... నువ్వు మా ఇంట్లో ఉన్నంతకాలం నెలకు పాతికవేలు ఖర్చులకిచ్చుకోవాలి. మొదటి నెల మాత్రమే ఫ్రీ సర్వీస్. వచ్చే నెల నుండి నీ ఖర్చులు నువ్వు భరించాల్సిందే" నిష్కర్షగా చెప్పాడు చలపతి.

మావగారి మాటలు వింటూంటే తల తిరుగుతున్నట్లనిపించింది వెంకటేష్కు. కనుగుడ్ల నుండి నీరు ప్రవహించింది. తూలిపడబోతూంటే సుహాసిని పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టింది.

★★★★★★

ప్రమోషన్ వచ్చాక పని మరీ ఎక్కువయిందని, విశ్రాంతి లేదని వాపోతున్నాడు వెంకటేష్. ఆరోజు తెల్లవారుజామున కెవ్వుమని కేకవేస్తూ లేచి కూర్చున్నాడు వెంకటేష్. ఆ కేకకు ఉలిక్కిపడి లేచింది సుహాసిని.

"నాకు భయంకరమైన కల వచ్చింది." అన్నాడు వెంకటేష్ కళ్లు నులుముకుంటూ.

"అంత భయంకరమా ..." అడిగింది సుహాసిని వెంకటేష్ వెన్ను నిమురుతూ.

**" అవును సుహా ... నా కలలో మీనాన్న ఆస్తి మొత్తం పోగొట్టుకుని బిచ్చమెత్తుకుంటున్నట్లు కలొచ్చింది. చిరుగుల చొక్కాతో బవిరి గడ్డంతో అడుక్కుంటున్న మీ నాన్నను చూస్తూంటే నా గుండె తరుక్కుపోయింది. మనసు విలవిలలాడింది కళ్లు చెమర్చాయి. నోరు పిడచకట్టుకుపోయిందనుకో చెప్పాడు వెంకటేష్."**

"అవును సుహా ... నా కలలో మీనాన్న ఆస్తి మొత్తం పోగొట్టుకుని బిచ్చమెత్తుకుంటున్నట్లు కలొచ్చింది. చిరుగుల చొక్కాతో బవిరి గడ్డంతో అడుక్కుంటున్న మీ నాన్నను చూస్తూంటే నా గుండె తరుక్కుపోయింది. మనసు విలవిలలాడింది కళ్లు చెమర్చాయి. నోరు పిడచకట్టుకుపోయిందనుకో" చెప్పాడు వెంకటేష్.

"ఓస్ ... ఆ మాత్రానికే మీకన్ని ఫీలింగ్స్ ఎలా వచ్చాయండీ ... మీరేం కంగారు పడకండి. మా నాన్న లాయర్. ఆయనది క్రిమినల్ మైండ్. ఇతరుల ఆస్తి లాక్కోవడమేకాని ఆయనేం పోగొట్టుకోడు. కళ్లు మూసుకుని ఆంజనేయ దండకం చదువుకుని పడుకోండి" అంటూ ముసుగుతన్నింది సుహాసిని.

నిశ్చింతగా పడుకున్న భార్యను చూస్తూ పళ్లు పటపట కొరికాడు వెంకటేష్,

మర్నాడుదయం బ్రేక్ఫాస్ట్ చేస్తూ తనకొచ్చిన కలను మామగారికి చెప్పాడు. "నా కల నిజమయితే ప్రమాదం ... ఎందుకేనా మంచిది. మీ ఆస్తి నా పేరున రాసేయండి మామగారూ ..." అంటూ సలహా ఇచ్చాడు. ఫెళ్లున నవ్వాడు చలపతి.

"అబ్బే ... నీదంతా భ్రమ అల్లుడూ.. నేనే లాయర్ని ... నా ఆస్తికేం ఢోకా లేదు. అవునూ ... ధరలు బాగా పెరుగుతున్నాయి, గమనించావా ..." అడిగాడు లాయర్.

"అవును మావయ్యా ... ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. సామాన్యుడు బ్రతకడం కష్టమనిపిస్తోంది" గద్గదస్వరంతో స్టేట్మెంటిచ్చాడు వెంకటేష్,

"కదా ... అందుకే ... ఈ నెల నుండి నువ్వు ఇంటి ఖర్చుకిస్తున్న మొత్తానికి మరో పదివేలు కలుపు" అంటూ వాష్ బేసిన్ దగ్గరకు

బహుమతి పొందిన హాస్య కథ

# హాస్యకథ

వెళ్లిపోయాడు చలపతి. వెంకటేష్కు పొలమారింది. భర్త నెత్తిపై చేత్తో కొట్టి మంచినీళ్లు గ్లాసు అందిచ్చింది సుహాసిని

ఆరోజు సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికొచ్చిన అల్లుడికి స్వీట్ తినిపించాడు చలపతి.

“అల్లుడూ నీకు శుభవార్త. మా నాన్నగారు పోయాక ఆస్తి పంపకాల్లో మోసం చేశాడని మా అన్నయ్య మీద దావా వేశాను కదా ... ఇవాళ ఆ కేసు తీర్పు నాకనుకూలంగా వచ్చింది. మరో రెండు కోట్ల ఆస్తి కలిసొచ్చింది.” చెప్పాడు చలపతి ముఖంలో ఆనందం తాండవిస్తుండగా.

‘అబ్బో... ఆస్తి కలిసొచ్చిందట ... ఆస్తి ... నాకేం ఒరిగింది ...’ అనుకుంటూ పళ్లునూరుతూ మావగారి వైపు కోపంగా చూశాడు వెంకటేష్,

“ఏమండీ ... మీకొచ్చిన పీడకలలన్నీ రివర్స్లో మనకు వరాలవుతున్నాయి. ఆరోజు మీకు ప్రమోషన్ వచ్చింది. ఈరోజు నాన్నగారికి ఆస్తి కలిసొచ్చింది. ఈసారి మనింట్లో బంగారు నగలు, నా పట్టుచీరలు ఎవరో ఎత్తుకుపోయినట్లు కలొస్తే బాగుండును ... మనిల్లు బంగారంతో పట్టుచీరలతో నిండిపోతుంది” హుషారుగా అంది సుహాసిని.

‘నా ఖర్మ ... నేననుకున్నదొకటి, జరుగుతున్న దొకటి’ అనుకుంటూ సోఫాలో నీరసంగా కూలబడ్డాడు వెంకటేష్, మూడు నెలల తరువాత తను నెల తప్పినట్లు భర్త చెవిలో చెప్పి సిగ్గుపడింది సుహాసిని. ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు వెంకటేష్, సుహాసినిని అపురూపంగా చూసుకోసాగాడు.

మరో ఆరు నెలల తరువాత...

తెల్లవారుజామున లేచి భోరుమన్నాడు వెంకటేష్, కంగారుగా లేచింది సుహాసిని. “మళ్లీ ఏం కల వచ్చింది” అడిగింది.

“ఈ కల మరీ భయకరం. నీకు చెపితే భయపడతావు” అన్నాడు వెంకటేష్,


“ఏం ఫర్వాలేదు. చెప్పండి” రెట్టించింది సుహాసిని.

“కలలో ... నువ్వు నెప్పులతో బాధపడుతూంటే బిడ్డ అడ్డం తిరిగిందని డాక్టర్ పెద్ద ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీసినట్లు ... నువ్వు స్పృహలో లేకపోవడం చూసి నర్స్ మన బిడ్డను మాయం చేసినట్లు ... మన బిడ్డకోసం వెతుకుతూ నేను రోడ్ల మీద పిచ్చోడిలా తిరుగుతున్నట్లు కల వచ్చింది. నాకు భయంగా ఉంది సుహా” అంటూ భోరున విలపించాడు వెంకటేష్. ఆ మాటలు వింటూ కడుపు మీద రాసుకుని ‘అమ్మా’ అంటూ మెలికలు తిరగసాగింది సుహాసిని.


వెంకటేష్ మామగారిని లేపాడు. ఇద్దరూ కలిసి సుహాసినిని కారులో చేర్చారు. కారు వారిని కార్పొరేట్ హాస్పిటల్ కు చేర్చింది ...

రెండు గంటల తరువాత...

“గుడ్ న్యూస్... సుహాసినికి సుఖప్రసవమైంది. కవలపిల్లలు...



**బహుమతి పొందిన హాస్య కథ**







అబ్బాయి... అమ్మాయి ... తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారు. వెళ్లి చూసిరండి" చెప్పింది డాక్టరమ్మ.

మామా అల్లుళ్లు ఆనందంతో పరుగుపరుగున మూడో అంతస్తులోని స్పెషల్ రూమ్ కు చేరుకున్నారు. పండంటి పసిబిడ్డల్ని చూసి మురిసిపోయారు.

"అల్లుడూ ... నా మనవలు చూడముచ్చటగా వున్నారు. వాళ్లను చూస్తూంటే నా మనసు పులకిస్తోంది. ఈ ఆనంద సమయంలో నేనో నిర్ణయం తీసుకున్నా" మీసం మెలేస్తూ చెప్పాడు చలపతి.

"కొంపతీసి మీ మనవల్ని ఏ ఆశ్రమానికైనా దత్తత ఇద్దామని నిర్ణయించారా... నేనొప్పుకోనంతే" అన్నాడు వెంకటేష్,

"అబ్బే ... అదేంలేదు అల్లుడూ... నీకు శుభవార్తే... నా పాత విల్లు చింపేయాలనుకున్నాను. నా ఆస్తి మొత్తం నా మనవలకు చెందేలా విల్లు రాసి ఈరోజే రిజిస్టర్ చేయిస్తా" అన్నాడు చలపతి,

... మావా ... యూ ఆర్ గ్రేట్ ... ఐ లైక్ యూ ..." అంటూ మావగారి చేయిపట్టుకుని స్టెప్పులేశాడు వెంకటేష్.

పిల్లలవైపు, భర్తవైపు చూస్తూ మురిసిపోయింది సుహాసిని.

★★★

# రేపటి కోసం

## ఆకు పచ్చని అంత్యక్రియలు

సుస్థిరమైన జీవన విధానానికి ప్రాధన్యత నిచ్చే ఏవ్యక్తి అయినా వాతవరణ సంక్షోభం యొక్క వాస్తవాలను గుర్తించి తగు జాగ్రత్తలు పడతాడు. తాను మరణించిన తరువాత కూడా తన శరీరం వాతావరణానికి ముప్పుతెస్తోందని గ్రహించిన మానవుడు, ఇప్పుడు 'ఆకుపచ్చని అంత్య క్రియలకు' నాంది పలికాడు. మరణించిన తరువాత . మన శరీరాన్ని భూమిలో పాతిపెడతాము. అది భూమిలో కుళ్ళిపోయి, కలిసిపోవటం అనేది సూదీర్ఘ కర్బన ప్రక్రియ . ప్రతి శవం భూమిలో పాతిపెట్టబడిన తరువాత సగటున 400 కిలోల కార్బన్ డైయాక్సైడును గాలిలోకి




వదులుతాయి. ఈ కాలుష్యాన్ని నివారించటానికి ఇప్పుడు "ఆకుపచ్చని అంత్యక్రియల' ను సిద్ధం చేస్తున్నాయి కొన్ని కంపెనీలు . శవాలను, చెట్ల బెరడు, గడ్డి , మట్టి ఇతర మూలకాలున్న గదులలో కుళ్ళ బెట్టి, కంపోస్టుగా మార్చబడతాయి. తదనంతరం ఈ కంపోష్టును తోటల్లో మొక్కలకు ఎరువులుగా వాడతారు.

2019 లో లూకి కి పెర్రి అనే నటుడి అంత్యక్రియలు ఇదేవిధంగా జరిగాయి. కోయిమో అనే సంస్థ తయారు చేసిన పుట్ట గొడుగుల గోతంలో ఇతని శరీరాన్ని కుళ్ళ పెట్టటం జరిగింది. చచ్చిన శవాన్నుండి వెలువడే విష పదార్థాలను పుట్టగొడుగులు విరుగుడుగా పనిచేస్తాయి . మరొక కంపెనీ, అల్కలీన్ జలాలో అత్యధిక పీడనంతో మానవ శరీరాలను రసాయన భాగాలుగా విభజించి క్షీణింపచేయటం చేస్తోంది . దీనికి 6 గం॥ల సమయం పడుతుంది.

## నీటి బుడగడలు

ఇప్పటికే ఈ భూప్రపంచం ప్లాస్టిక్ తో నిండిపోయి మానవాళికి అత్యంత ప్రమాదకరంగా తయారవుతోంది. చాలా దేశాల్లో ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధుస్తున్నా ఆచరణలో మాత్రం సాధం కావటంలేదు. ముఖ్యంగా ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ బాటిళ్ళలోని నీరు వాడటం అలవాటు చేసుకోవటం కూడా ప్లాస్టిక్ ను అంతమొందించటం అసాధ్యంగా మారింది. ఇప్పుడు ఈ ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళ స్థానంలో త్వరలో 'తినదగిన నీటి బుడగలు' మార్కెట్లోకి రానున్నాయి. ఈ నీటి బుడగలు సహజమైన. సముద్రపు పాచితో తయారు చేసిన సంచుల్లో అందుబాటులోకి రానున్నాయి. వీటిని 6 వారలలోపు వినియోగించకపోతే వాటంతటన అవే నశించిపోతాయి. లండన్కు చెందిన ఇంపీరియల్ కాలేజి విద్యార్థులు వీటిని రూపొందించె పనిలో పడ్డారు. అదే విధంగా, అమెరికాకు చెందిన వ్యవసాయ శాఖ, పాలలోని కెసిన్ అనే ప్రోటీన్ సహాయంతో వస్తువులు ప్యాకేజ్ కోసం వాడే కాగితాన్ని తయారు చేస్తున్నారు .ఈ కాగితం త్వరగా నశించిపోవటమేకాక తినటానికి కూడా ఉపయోగ పడుతుంది.





నోబో అనే పేరుతో షాంపూ బాల్స్ రానున్నాయి. ఇప్పటి వరకూ మనకు షాంపూ పాకెట్లు లేదా ప్లాస్టిక్ బాటిళ్ళలో లభ్యమౌతుంది. ఇక నుండీ కుంకుడు కాయల్లా షాంపుగోలీలు అందుబాటులోకి రానున్నాయి .ఈ గోలీలు నీటిలో తడవగానే షాంపుగా మారతాయి .

టెక్నాలజీ

# GPT - 4

–పి.దేవకాంత్

గత సంచికలో chat GPT గురించి తెలుసుకున్నాము. ఇప్పుడు అసలు chat GPT కి మూలాధారమైన ఉత్పాదక కృత్రిమ మేధస్సు, GPT-4 గురించి తెలుసు కుందాము.

**ఉత్పాదక కృత్రిమ మేధస్సు :**

ఇప్పటి దాకా క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనే సమయంలో నిర్ణయాలు తీసుకోవటానికి కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తూ వస్తున్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి, అందు బాటులో వున్న సమాచారం ఆధారంగా కొత్త వాచకాలను, చిత్రాలను, కంప్యూటర్ కోడ్లను ఉత్పత్తి చేయగల ఉత్పాదక కృత్రిమ మేధ ను సృష్టించింది ఓపెన్ ఎఐ (open Ai) అనే సంస్థ.

ఏ కృత్రిమ మేధ వ్యవస్థ అయినా తనకు ముందుగా ఇచ్చిన శిక్షణ మీద ఆధారపడి పని చేస్తుంది. విశ్లేషణా సామర్థ్యం కల కృత్రిమ మేధ కన్నా ఉత్పాదక కృత్రిమ మేధ శక్తిమంత మైనది. వీటన్నిటికి మూలం యంత్ర అభ్యాసన (Machine Learning). ఈ విశ్లేషణ సామర్థ్యం కల కృత్రిమ మేధ లోతైన అభ్యాసన (Deep Learning) మీద ఆధార పడితే, ఉత్పాదక కృత్రిమ మేధ 'ఉత్పాదక వ్యతిరేక నెట్వర్కులు, (GAN) మీద ఆధారపడి పని చేస్తుంది. వీటిలో రెండు అభ్యాసనా నమూనాలుంటాయి, వీటికి ముందుగానే శిక్షణ నివ్వాల్సిన అవసరం వుంటుంది. మొదటి నమూనా ఉత్పాదక సామర్థ్యం కలిగి, కొత్త వాటిని సృష్టిస్తుంది. రెండవ నమూనా ఉత్పత్తి అయిన కొత్త వాటిని విశ్లేషించి అభిప్రాయాలను ఉత్పాదక నమూనాకు అందిస్తుంది. తద్వారా శిక్షణ నిచ్చిన సమాచారం ఆధారంగా సరికొత్త వ్యాసాలను, చిత్రాలను తదితర ఇతర కొత్త వాటిని ఉత్పత్తి. చేస్తుంది.

**GPT నమూనాల ఆవిర్భావం:**

సహజ భాషలను అర్థం చేసుకుని, వాటిని పునరుత్పత్తి చేయటానికి వీలైన అభ్యాసన ఆధారిత ఉత్పాదక నమూనాలను (GPT) అభివృద్ధి చెయ్యటం జరిగింది. పొందికైన, సందర్భోచిత వ్యాసాలను ఉత్పత్తి చెయ్యటానికి GPTI, GPT2, 3 మరియు 3.5, ఇప్పుడు GPT-4 లను అభివృద్ధి చేయబడ్డాయి. ఇవి భాషను అర్థం చేసుకుని కొత్త వాటిని ఉత్పత్తి చెయ్యటంలో అత్యంత శక్తివంతమైనవి. కృత్రిమ మేధలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని open AI అభివృద్ధి చేసిన భాషా నమూనా GPT-4 .

GPT-4 అందుబాటులోకి రావటం వల్ల కార్పొరేటు సంస్థల వ్యాపార సరళి కొత్త పుంతలు తొక్కబోతోంది. వినియోగదారులకు సలహాలు, సందేహాలకు సమాధానాలు, మార్కెటింగ్ వంటి అనేక పనులు GPT-4 ద్వారా అభివృద్ధి చేసిన చాట్ బోటును వినియోగించి, సులభంగా నిర్వర్తించవచ్చు. ఇప్పటికే GPT-4 పెద్ద పెద్ద వ్యాపార సంస్థల సమాచారాన్ని విశ్లేషించి అవసరమైన సలహాలను అందిస్తొంది.మార్కెట్ విశ్లేషణ, వినియోగదారుల అభిరుచిని, భవిష్యత్ పరిణామాలను అంచనా వేయటం వంటి అనేక పనులు ఇకనుంచి త్వరితగతిన నెరవేరనున్నాయి. వ్యాపార సంస్థల్లోని వనరులను మరింత పొదుపుగా వాడుకోవటమే కాక సంస్థ సామర్థ్యం పెంచటానికి కూడా –ఉపయోగపడనున్నాయి.

వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించు కోవ టానికి, స్వీయ అభ్యసనకు ,అ భ్యాసనలో దోషాల నివారణక ఇవి ఎంతో ఉప యోగ పడనున్నాయి. కేవలం వ్యాసాలు వ్రాయటమే కాక కొత్త కొత్త ఆలోచనలు ఉద్భవించ టానికి కూడా ఇవి సహకరిస్తాయి. ప్రస్తుతం నెలకొన్న సమస్యలకు సరికొత్త మార్గాల్లో పరిష్కరించటానికి GPT – 4 యొక్క సృజనాత్మక సామర్థ్యం ఎంతో బాగా ఉపయోగపడనుంది. కేవలం సలహాలు, సందేహాలు తీర్చడమే కాక, మన మెదళ్ళకు పదును పెట్టే విధంగా, అభ్యాసన ఆహ్లాదంగా కొనసాగెలా ఇవి చూడనున్నాయి. ఇంత కాలం

టెక్నాలజీ

# GPT - 4

చాలా మందికి సమాచారం అందు బాటులో లేక వివక్షకు గురౌతూ వస్తున్నారు. ఇటువంటి వారికి GPT-4 ఒక వరమనే చెప్పాలి. వీటి అధునాతన భాషా విశ్లేషణ సామర్థ్యాలలో సరికొత్త అనువర్తనాలు రూపొందించవచ్చు.

**Chat GPT &GPT-4 మధ్య తేడాలు :**

ఇవి రెండూ చాలా దగ్గర దగ్గరగా వున్నట్లు కనపడినా వీటి ఉపయోగాలు మాత్రం వేరు chatGPT నాణ్యమైన మానవ సంభాషణల మీద దృష్టి పెడితే, అత్యంత శక్తివంతమైన GPT-4 వివిధ రకాల భాషా విశ్లేషణలపై దృష్టిని సారిస్తుంది. ChatGPT ముఖ్యముగా సంభాషణల కోసం వ్యాపార సంస్థల్లో ఎక్కువగా వినియో గిస్తున్నారు. ChatGPT వినియోగదారుల సంభాషణలను అర్థం చేసుకుని, వాటికి అవసరమైన సమాధానాలను అదే భాషలో అందించనున్నాయి.

chatGPT, GPT-4 ల లో నిర్మాణపరంగా, సమాచార నిధి పరంగా, శిక్షణ విధానాల పరంగా చాలా తేడాలున్నాయి. అందువల్ల వీటి సామర్థ్యంలో, ఉపయోగాల్లో, పని తీరులో చాలా తేగాలుంటాయి. వీ ని ఉప యోగించుకోవటం పట్ల మనం ఆసక్తిని కనబరుస్తున్నాము కాని, ఇవి ఉపయోగించటంలోని నైతికత, బద్రత, గోప్యత వంటి అంశాలను మనం పట్టించుకోవటం లేదు. ముందు ముందు వీటిని దుర్వినియోగ పరిచే అవకాశం కూడా లేక పోలేదు.

**chatGPT ని ఎలా ఉపయోగించాలి:**

1) chat GPT వెబ్సైటు

https://chat.openai.com/ వెళ్ళి లాగిన్ అవ్వండి.

2) Chat GPT ని ఉవచితంగా మీ అవసరాలకు వాడుకొండి

3) ఒక వేళ GPT-4 ను వాడు కోదలిస్తే నెలకు 20 డాలర్లు కట్టి వాడుకోవచ్చు.

4) GPT నమునాను ఎంచుకుని అందులో మీ సందేహాలు, ప్రశ్నలు టైపు చెయ్యండి, సమాధానం తెరమీద ప్రత్యక్ష మౌతుంది.

★★★★



## నాన్న

నానీలు :

1.
పైకేమో
మేకపోతు గాంభీర్యం
లోనేమో
కరిగే మంచు పర్వతం.

2.
కొవ్వొత్తిలా
కరగడం
నలుదిశలా వెలుగులు
పంచడం,

3.
ఇంటికి ప్రహరి
మధ్యలో నిట్టాడి
కుటుంబానికి
వెన్నెముకలా నాన్న!

4.
స్వార్థమెరుగని
నిజాయితీపరుడు
మచ్చలేని
కలియుగ చంద్రుడు.

5.
పరహితం కోరే
పవిత్రుడు
కుటుంబసభ్యులకు
ఆప్తమిత్రుడు.


ఆళ్ల నాగేశ్వరరావు

ఫోటో గ్రఫి

మూడో కన్ను




# మానవనేత్రంలా పనిజేసే అత్యంతశక్తివంతమైన కెమేరా ఆవిష్కారం



**తమ్మ శ్రీనివాస రెడ్డి**

★ స్విట్జర్లాండ్ లోని "ఇనిలాబ్స్" అనే కంపెనీ ప్రయోగశాలలో పనిజేసే నిపుణుల బృందం ఒకటి జీవశాస్త్రాంశాలపై కృషి కొనసాగించారు. దీని ఉద్దేశ్యమేమంటే, మానవనేత్రంలోని "రెటీనా" లాగా సమర్ధవంతంగా పనిజేసే ఒక కెమేరాను ఆవిష్కరించే సంకల్పంతో వున్నారని తెలిసింది.

★ మనకంటిలోని "రెటీనా" భాగం ఒక శక్తివంతమైన పరికరం. దానికెన్నో మహాగణాంకాల సామర్ధ్యముంది. ఒక కంప్యూటర్కు ఉపయోగించే మొత్తం శక్తిలో లేదా ఒక మామూలు డిజిటల్ కెమేరాకుపయోగించే మొత్తం శక్తిలో కేవలం ఒక భాగంతోనే మనకంటి 'రెటీనా' పనిజేస్తుంది.

★ శక్తివంతమైన వీక్షణా జ్ఞానికలు (DVS-Dynamic Vision Sensors) కలిగిన ఒక సరికొత్త కెమేరాను ఈ నిపుణుల బృందం, యిది కేవలం ఒక్క దృశ్యవీక్షణామార్పులకు మాత్రమే స్పందిస్తుందని, ఇది మనకంటిలోని న్యూరాన్లకు అతీతంగా పనిజేసే కెమేరాగా నిర్దేశించారు.

★ ఈ నిపుణుల బృందం కృషి విధానంలో ఎన్నో అధికమొత్తం గణాంకాలు బయట పడతాయని ఊహ. అలాగే, ఇటువంటి కెమెరాలు అనేకరంగాల్లో ఎంతో ఉపయోగకరంగా వుంటాయని, వాటిని రోబోటిక్స్, పర్యవేక్షణారంగంలో, సూక్ష్మదర్శనాల శాస్త్రంలో గూడా ఉపకరిస్తాయని ఋజువైంది.

★ ముఖ్య విజ్ఞానశాస్త్రాధికారియైన టీబీ డేల్ బ్రూక్, వివరిస్తూ, డిజిటల్ కెమేరాలంటే మానవనేత్రాలవంటివేనని, కాకపోతే కొంచెం విభిన్నంగా వుంటాయన్నారు.

ఫోటోగ్రఫీ అనేది ఒక కళ, కెమెరాచేతిలో ఉన్న ప్రతి ఒక్కరు ఫోటోగ్రాఫర్ కాలేరు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ తమ్మ శ్రీనివాస రెడ్డి గారు సుమతి పాఠకులకు ప్రతి నెల ఫోటోగ్రఫి లో మెలకువలు నేర్పనున్నారు.

"మారుతున్న దృశ్యాల్లో వచ్చే సమాచారాన్ని కెమేరా పంపుతున్న విధానం గురించి మనం మాట్లాడుకుంటున్నా- దీని మూల కేంద్ర సిద్ధాంతాన్ననుసరించి చెప్పాలంటే - ఈ కృషిలో మెదడు ఎలా పనిజేస్తుందని - లేదా మన నాడీ శాస్త్రజ్ఞులు యిది పనిజేసే విధాన్నెలా భావిస్తున్నారనేది కీలకాంశమని కంప్యూటర్ శాస్త్రవేత్త, నబీల్ ఇమామ్ వివరిస్తున్నారు.

ఫొటోలు, వీడియోలు తేలికపాటి దస్త్రాలవంటివి కాదు, అవి త్వరితగతిన గిగాబైట్ల కొలదీ గణాంకాలను, సమాచారాన్నందించేవిగా వుండి,

ఫోటో గ్రఫి

## మూడో కన్ను

ఒక డీల్ బ్రోకర్ ఎన్నో పరిశోధనల అనంతరమందించే వాటికన్నా ఎక్కువగా వుంటుంది. స్విస్ కంపెనీలోని "ఇనిలాబ్స్" కంపెనీ ఇంజనీర్లు వారి ప్రయోగశాలలో ఒక ఉత్తమస్థాయి కెమేరాను సృష్టించగలిగారు. దీనిలోని యంత్రగతిశాస్త్రం మానవ నేత్రంలోని రెటీనా మహిమలనుండే వారు గ్రహించారు.

శక్తిపూరిత వీక్షణా జ్ఞాణికలు (DVS–Dynamic Vision Sensors) మానవ నేత్రంలోని రెటీనా మాదిరిగా అధిక సమర్థనీయంగా, అత్యంతవేగశీలి కెమేరాను తయారుజేశారు. మన నేత్రగోళాల్లోని ప్రత్యేక న్యూరాన్లు వాస్తవానికి దృశ్యక్షేత్రంలోని సమాచారాన్నంతటినీ కూడా నమోదు చేయజాలవు; అవి కేవలం జరుగుతున్న మార్పుల్ని కదలికల్ని గ్రహిస్తాయి.

ఇవి పరిసర దృశ్యాల్లోని ఎన్నో గణాంకాలను సమీకరించలేక వదిలివేస్తుంది. సరిగ్గా యిదే పనిని శక్తిపూరిత వీక్షణా జ్ఞాణికలు (DVS) నిర్వహిస్తాయి. ఎన్నుకున్న కదలికలను మాత్రమే నమోదుచేయటంలో, DVS వీడియోవాడకాన్ని గంటలకొలదీ నమోదుచేసినా, అతితక్కువ శక్తిని వాడుకుంటూ కొన్ని మెగాబైట్ల డాటాను మాత్రమే నిల్వజేస్తుంది.

అయినా, రెటీనాను అనుకరించలేనంతటి జీవశాస్త్ర అనుసంధానతలు ప్రక్షిప్తమై వుంటాయి. DVS కందించే చిప్స్ వాస్తవానికి IBM కంపెనీ శ్రేణిలోని మెదడు ఆధారిత చిప్స్ నుండే లభిస్తాయని, ట్రూ నార్త్ కంప్యూటర్ వాస్తు శిల్ప భాగాలు మాత్రమే. ఈ విధానంలోని అభివృద్ధి గురించి చెప్పటమంటే, మనిషిని పోలిన మరోమనిషిని తయారుచేయడంలాంటిదేనని పరిశోధకుల అభిప్రాయం.

"మారుతున్న వాస్తవ దృశ్యాల సమాచారాన్ని కెమేరా మనకందించే విధానంలో, ఒక మనిషి నాడీవ్యవస్థద్వారా సమాచారాన్ని మెదడుకు అందించే సిద్ధాంతంపైనే యిది పనిజేస్తుందని నాడీ శాస్త్రవేత్తల అభిప్రాయంగా కార్నెల్ కంప్యూటర్ శాస్త్రవేత్త, నబీల్ ఇమామ్ "టెక్నాలజీ రివ్యూ"కు చెబుతూ "మానవ మేధస్సు గుణగణాలను మనం చాలా ఉన్నతస్థాయిలో అందుకోగలుగుతున్నా"మని చెప్పారు.

అసలు వాస్తవం చెప్పాలంటే, కొన్నిసార్లు, మానవ మెదడు కంటే DVS చాలా ఉత్తమంగా క్రియాశీలమవుతుంది. తక్షణమే జరిగేమార్పుల్ని సైతం గ్రహించే శక్తిని కెమేరా వీక్షణ శక్తిశీలమై వుంది. తద్వారా విధానంలోని గ్రాహకాలు తక్షణమే స్వీకరించి, ప్రతిస్పందించేందుకు అనువుగా వుంటాయి. రోబోటిక్ శాస్త్రవిధానాల్లో జరిగేదిదే. వేగంలోను, సామర్థ్యంలోను పొందే శక్తిని, DVS స్థిరత్వంలో కోల్పోతున్నది. దీన్ని మీరు కారుతున్న పాలచుక్కలను వీడియోలో జారిపోతున్న చిన్న చిన్న రేణువులుగా గమనించగలరు.

### మన కళ్ళకు 576 మెగాపిక్సెల్స్ శక్తి వుంది?

★ దృశ్యజ్ఞాన మూలకాల సంఖ్యతో సరిపోల్చినపుడు, రెండు నేత్రాలకు కలిపి, మన వీడియో కెమేరాల గణనలో అవి 105 మెగాపిక్సెల్స్ శక్తి కలిగిన 5 మిలియన్ల శంఖకాలు (cones) కలిగి వుంటాయి.

★ క్షేత్రస్థాయి దృశ్యవీక్షణా విశ్లేషణతో సరిపోల్చినపుడు – ఆ దృశ్యజ్ఞానశక్తి 576 మెగాపిక్సెల్స్తో సమానంగా వుంటుంది.

వాస్తవంలో మన నేత్రాలు (వర్ణగ్రాహకాలతో కలిపి) ఒక 100 మిలియన్ల దండకణికలు (ఏకవర్ణ దృశ్య గ్రాహకాలుగా సరిపోలే




శక్తి) కలిగి మానవనేత్రాలకు 576 మెగాపిక్సెల్స్ దృశ్యవీక్షణా శక్తినందిస్తాయి. శక్తివంతమైన మన కళ్ళతో మీ కెమేరానైనా ఒక చిన్నసైజు మాంత్రికుడుగా వర్ణించవచ్చు. తాజా పరిశోధనల నివేదికల ద్వారా తెలిసేదేమంటే సాధారణ మానవ నేత్రాలు, వర్ణ దృశ్యవీక్షణకవసరమైన జ్ఞానాన్ని మన కళ్ళకు దృశ్యజ్ఞానశక్తి 5 మిలియన్ల గోపురాకార ఎసినార్ కణాలు అందిస్తాయి. మన కళ్ళ దృశ్యజ్ఞానశక్తి 5 మిలియన్ల పిక్సెల్స్ కెమేరాకు సమానమన్నమాట. అంతేగాక, కంటిలో మరొక 100 మిలియన్ల దండకణికలు కూడా వుంటాయి. అందువలన సాధారణ మానవ వర్ణ జ్ఞాన వీక్షణాశక్తి, ఎంతో అభివృద్ధి జేసిన సాంకేతిక నైపుణ్యాన్నిసైతం అధిగమించింది. మంచి వెలుతురులో 0.6 వ్యాసార్థం గల దూరాన్ని రెండు వేర్వేరు భాగాలైనా, మనకళ్ళు ఆ దృశ్యాన్ని ఏకంగా వీక్షించగలవు. అలాగే, శాస్త్రీయ పరిశోధనా ఫలితాలు తెలియజేసేదేమంటే, సహజంగానే విభిన్న లింగశక్తులకు, వివిధ పిక్సెల్స్ (దృశ్యశక్తులు) కలిగి వుంటాయి.

--టి .శ్రీనివాస రెడ్డి ,FRPS

phototsreddy@gmail.com

## మూడో కన్ను






# ఆశావాహ దృక్పథం

***మన తలరాతను మార్చలేకపోయినా, మన ఆలోచనా విధానం, దృక్పధాన్ని మార్చుకున్నట్లైతే, మన భవిష్యత్తు తప్పకుండా మారు తుందంటాడు - అబ్దుల్ కలామ్***

ఈ తరం యొక్క గొప్ప ఆవిష్కరణ ఏమిటి అంటే "వాళ్ళ దృక్పధాన్ని మార్చుకుని, తద్వారా వారి భవిష్యత్తును మార్చుకోవటం".

మన తలరాతను మార్చలేకపోయినా, మన ఆలోచనా విధానం, దృక్పధాన్ని మార్చుకున్నట్లైతే, మన భవిష్యత్తు తప్పకుండా మారు తుందంటాడు – అబ్దుల్ కలామ్

ప్రతి మనిషి తన జీవితంలో ఏది సాధించినా 85% తన దృక్పథం, మిగతా 15% తెలివితేటలు ఇతర విషయాలమీద ఆధారపడి వుంటుంది. మన దృక్పథం సరియైన దైనప్పుడు మన చుట్టూ అంతా విజయవంతమైన వాళ్ళే తారసపడు తుంటారు. అవకాశాలు కూడా అవే తలుపు తడతాయి. విజయానికి పునాది సరైన దృక్పధం మాత్రమే.

ఏ మనిషి పుట్టుకతో దృక్పధంతో పుట్టడు, దాన్ని అలవర్చుకోవాలి. ముఖ్యంగా మూడు కారణాలపై మీ దృక్పథం ఆధారపడి వుంటుంది.

1. మీ చుట్టూవున్న వాతావరణం, పరిసరాలు

2. మీ అనుభవం

3. మీ చదువు

మన పరిసరాలు అంటే మన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, మన మతం, కులం, సామాజిక వర్గం, మన సంప్రదాయాలు, కట్టుబాట్లు, మనం చదివే పుస్తకాలు సినిమాలు తదితరాలు వీటన్నిటివల్ల మన చుట్టు ఒక చట్రం లేదా మన కళ్ళకు గంతలు ఏర్పడతాయి.

ఆ కళ్ళ గంతల్లో నుంచే మన ప్రపంచాన్ని పరిశీలిస్తాము. అదృష్టవశాత్తు అవి సుగుణ కారకమైన దృక్పధాన్ని ఏర్పరచగలిగితే మనం ఎంతో ఎత్తుకు ఎదగగలుగు తాం. దురదృష్టవశాత్తు అవి దుర్గుణకారకమైన ఆలోచనలు మీలో రేకిస్తే మీ పతనం ప్రారంభమౌతుంది.

కాబట్టి మన చుట్టూ, మనతో మెలిగే వారిచుట్టూ ఆశావాహ వాతావరణం ఏర్పడేట్టు చూసుకోవడం మన బాధ్యత. మన సాంస్కృతిక కట్టుబాట్లు, కులమత మూఢనమ్మకాల నుంచి బయటపడి విశాల దృక్పథం అలవరుచుకోవాలి. గొప్ప గొప్ప వారి జీవిత చరిత్రలు, మంచి పుస్తకాలు, మంచి స్నేహితులతో గడపడంవల్ల ఆశావాహ దృక్పథం ఏర్పడుతుంది.

మనం మన చుట్టూ వున్నవారిని అర్ధం చేసుకునేటప్పుడు మన అనుభవాన్ని పరిగణలోకి తీసుకుంటాం. మనకి ఒకతనితో మంచి అనుభవం ఏర్పడితే అతను దుర్మార్గుడైనా మనకి దేవుడులాగానే కనపడ తాడు. ఉదాహరణకు నేను సాయిబాబాని దర్శించుకుందామని షిర్డీ వెళ్ళిన ప్రతిసారీ ఏదో ఒక కీడు సంభవించింది. ఇలా నాలుగుసార్లు జరగటంతో ఆయనమీద నమ్మకం సన్నగిల్లింది. అనుభవాలు, సంఘటనలు మనకు కొన్ని ప్రమాణికాలను నెలకొల్పుతాయి. వీటిద్వారానే మనం భవిష్యత్తుని

# యువత తెలుసుకో

నిర్దేశించుకుంటాం. కాబట్టి మంచి అనుభవాలు మనకి ఎదురవ్వాలంటేమన ఆలోచనలు, పరిసరాలు మంచివై వుండాలి.

**"మనం చదివే చదువు, జ్ఞానం మీదకూడా మన దృక్పథం ఆధారపడివుంటుంది. చదువు బతకటానికి మాత్రమే కాదు. ఎలా జీవించాలో నేర్పుతుంది. మనిషిగా జీవించగలిగితే సగం విజయం సాధించినట్లే. చదువు మనిషిలోని పరిపూర్ణతకు (సంస్కారానికి) చిహ్నం - వివేకానంద"**

మనం చదివే చదువు, జ్ఞానం మీదకూడా మన దృక్పథం ఆధారపడివుంటుంది. చదువు బతకటానికి మాత్రమే కాదు. ఎలా జీవించాలో నేర్పుతుంది. మనిషిగా జీవించగలిగితే సగం విజయం సాధించినట్లే. చదువు మనిషిలోని పరిపూర్ణతకు (సంస్కారానికి) చిహ్నం – వివేకానంద

ఆశావాహ దృక్పధం వల్ల నూతన శక్తులు ఆవిర్భవించి, ఉత్సాహం వెల్లివిరిసి జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చు. నిరాశావాద దృక్పధంతో గనుక మనం ఎదిగితే మనకు మనమే బందీలమౌతాము. కొన్నాళ్ళు జైలు జీవితం గడిపిన ఖైదీని బయట ప్రపంచంలోకి వదిలినట్లయితే, ఆ స్వేచ్ఛను అతను భరించలేక మరల జైలుకే వెళ్ళాలను కుంటాడు. అతను జైలులోనున్న చీకటికి, సంకెళ్ళకు అలవాటుపడి బయటి ప్రపంచపు వెలుగు విలువ గ్రహించలేడు. అలాగే నిరాశావాద దృక్పథం కలిగిన వ్యక్తి తన చుట్టూ గిరిగీసుకుని, సంకుచిత మనస్తత్వంతో తనకు తనే సంకెళ్ళు వేసుకుని ఒక ఖైదీలా బతుకుతాడు. అటువంటి నిరాశావాద దృక్పధాన్ని, సంకుచిత మనస్తత్వాన్ని విడనాడి, ఆశావాహ దృక్పధంతో ముందడుగు వేయండి. మీ ఆకాంక్షలను నెరవేర్చు కోండి.

★★★

## పాత సీసాలో కొత్త సార

మన అందరికి చాల సామెతలు తెలిసే ఉంటాయి . వాటిని అనుకరిస్తూ కొత్త సామెతలు రాసి పంపండి ప్రచురిస్తాం .ఉత్తమ సామెతకు బహుమతి కూడా ఉంటుంది .

ఉ దా: పాట సామెత :దీపం ఉన్నగానే ఇల్లు చక్క దిద్దు కోవాలి

కొత్త సామెత : వైఫై ఉండగానే డేటా మొత్తం డౌన్లోడ్ చేసుకోవాలి

## కవిత

### అక్షర కురుక్షేత్రాలు

మత విశ్వాసాల మత్తులో
మెదళ్ళు కుళ్ళిన మేధావులు
తోటి మనుషుల మూలాలను
ప్రశ్నిస్తుంటే అవమానంతో
గర్జిస్తున్నాయి కోటి గొంతులు

పొడిపొడి మాటలు చెల్లక
అభిప్రాయాలు పొసగక
వాదోపవాదాలతో విసిగిపోయి
సిద్ధాంతాలే ఆయుధాలుగా
కొనసాగుతున్నాయి అభ్యుదయ
అక్షర కురుక్షేత్రాలు

విరుద్ధ భావాల సంఘర్షణలతో
సరికొత్త జ్ఞానం మొలకెత్తుతుంటే
అనుభవ సారం లేని ఆవేశపు
ఆలోచనల తలలు తెగి పడుతు–
న్నాయి
అక్షర యుద్ధాల రణక్షేత్రంలో

చాందసవాదుల ప్రశ్నల వర్షం
ప్రవాహమై ముంచెత్తుతుంటే తార్కిక
జ్ఞానపు ఎదురుదాడిలో సందేహాలు
శవాల గుట్టలై నేలరాలి పడుతు–
న్నాయి
విజ్ఞానపు సమాజపు వాకిట్లో

అధ్యయన వాదం లేక
చీకటి చాటున నక్కిన పిడి వాదనల
పిరికిపందలు పారిపోతున్నారు
వాస్తవాల సూర్యుడు ఉదయిస్తుంటే
విజ్ఞానపు సమాజపు ముంగిట్లో

–ఈదర శ్రీనివాస రెడ్డి

**ముఖా ముఖి**

## ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు



**ఒకప్పటి ఆంధ్రప్రభ పత్రిక చీఫ్ ఎడిటర్, నిన్నటి ఆర్ టి ఐ కమీషనర్, నేటి ఆంధప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ శ్రీ పి.విజయబాబుగారితో ఈ మాసం ముఖాముఖి.**

సు: జర్నలిస్టుగా మీరు మీ ప్రస్థానాన్ని మొదలు పెట్టారు కదా, అందులో మీకు బాగా తృప్తి నిచ్చిన అంశం ఏమిటి?

పి.వి. ఆంధ) ప్రభలో పని చేస్తున్నప్పుడు, బాలప్రభ, మహిళాప్రభ వంటి కొత్త కొత్త ఫీచర్సుకు రూపకల్పన చేశాను. భక్తి పేజీ ఒకటి పూర్తి నిడివిలో విడుదల చేశాము. ఫీచర్స్ జర్నలిజంకు నాంది పలికాను . ఇప్పాడు వస్తున్న సండే మాగజైన్స్' ఒకప్పుడు ఒకటి రెండు పేజీలే వచ్చేవి. ఇప్పుడు వస్తున్న మినీ విక్లి కూడా రూపకల్పన చేశాను.

సు: ఒక జర్నలిష్టుగా, రచయితగా, రాజకీయ విశ్లేషకుడిగా, సమాచార హక్కు పరిరక్షుడిగా, అధికార భాషా సంఘ చైర్మన్ గా మీరు బహు ముఖ పాత్రలు పోషించారు. వీటిల మీకు తృప్తినిచ్చిన పదవి ఏది.

పి.వి. ఒక జర్నలిస్టుగా ఆ రోజుల్లో 'ఇండియన్ ఎక్సప్రెస్ ' ఆధర్వ్యంలో నడిచే ఆంధ్రప్రభకు ఎడిటర్గా పని చేసి ఎన్నో కొత్త ప్రయోగాలు చేశాను. రచయతగా సమకాలీన సమస్యలపై వ్యాసాలు, గొప్పవాళ్ళ జీవిత చరిత్రలను రాయటం గురజాడ, విశ్వనాధ, దాశరథి, కాళోజి వంటి వారి రచనలపై ఎన్నో వ్యాసాలు, కథలు, కవిత్వాలపై విమర్శనాత్మక వ్యాసాలు రాయటం జరిగింది. అదే విధ రాజకీయ విశ్లేషకుడిగా నిర్మాణాత్మక, తులనాత్మక పరిశీలనతో చేసిన అనేక విశ్లేషణలకు అనేక మంది అభినందించారు. ఏ వృత్తి తీసుకున్నా, పదవి తీసుకున్నా దానికి న్యాయం చెయ్యటం వల్లే నన్ను ఈ పదవులు వరించాయి అనుకుంటున్న.

సు: అధికార భాషా సంఘం చైర్మన్ గా మీరు చేపట్టిన కార్యక్రమాలేమిటి?

పి.వి: నేను అధికారం చేబట్టగానే అధికార భాషా సంఘాన్ని అందరికీ చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో, అప్పటి 'దాకా సెక్రటరియేట్ లో వున్న భాషా సంఘం అఫీసును బయటకు తీసుకొచ్చాను. ప్రస్తుతం డి జి పి ఆఫీసు పక్కనే ఉంది . సామాన్యులు ఎవరైనా ఎప్పుడైనా రావచ్చు .పదవి చేప్పట్టిన రోజునే కృత్రిమ మేథ సహాయంతో పరిపూర్ణమైన తెలుగు భాషా యూనికోడు రూపొందించటానికి చర్యలు చేపడతానని చెప్పాను .ఆదిశగా పనులు జరుగుతున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం తమిళం, కన్నడ భాషల యూనికోడ్స్ తయారీలో పెట్టిన శ్రద్ధ, తెలుగుపై పెట్ట లేదు. అందుకే అది ఇంకా అసంపూర్ణంగా వుంది.

సు: పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టటం వల్ల మాతృ భాషకు ముప్పు వాటిల్లుతుంది అంటున్నారు. ఇందులో నిజం ఎంత?

పి.వి: ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేముందు, మీకొక విషయం చెపుతాను. స్వామి వివేకానంద చికాగోలో ఇచ్చిన ఆంగ్ల ప్రసంగం వల్ల పశ్చిమ దేశాలన్ని భారతదేశ ఔన్నత్యాన్ని గుర్తించటమేకాక, వివేకానందుడు ఒక గొప్ప ఆధ్యాత్మిక గురువుగా ప్రపంచం గుర్తించింది. అదే వివేకానందుడు బెంగాలు భాషలో తన ప్రసంగాన్ని కొనసాగిస్తే అది సాధ్యమయ్యేదా? కాబట్టి మన పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలంటే బహు భాషలు నేర్చుకోక తప్పదు. అంత మాత్రం చేత మాతృభాషకు అన్యాయం జరుగుతుంది అనుకోవటం అపోహే.

# ముఖా ముఖి



సు: మన మాతృ భాష తెలుగు అనేక మార్పులకు లోనై అస్తిత్వాన్ని కోల్పోతోందని కొందరంటున్నారు. దానికి మీరే మయినా చర్యలు తీసుకుంటున్నారా?

పి.వి : మీరన్నది వాస్తవమే. ఇంగ్లీషులోనే బ్రిటిషు ఇంగ్లీషుకు అమెరికన్ ఇంగ్లీషుకు చాలా తేడాలున్నాయి. బ్రిటిషు, ఇంగ్లీషు వ్యాకరణం పై శ్రద్ధపెడితే, అమెరికన్ ఇంగ్లీష భావప్రకటనపై శ్రద్ధ పెట్టింది. మన తెలుగు భాష కూడా మొదట్లో గ్రాంధికంలో వుండటంతో పామరులకు చేరువ కాలేకపోయింది. వ్యవహారిక భాషోద్యమంతో నేడు తెలుగు భాష సామాన్యులకు కూడా చేరువ కాగలిగింది.

అందుకే శ్రీశ్రీ వంటి మహాకవులు ఛందస్సు, వ్యాకరణాలకు ప్రాముఖ్యతనివ్వకుండా భావప్రకటనకు పెద్ద పీత వేయటంతో నేడు వచన కవిత్వం వర్ధిల్ల గలుగుతోంది. ఏది ఏమయినా మీరన్నట్లు పరభాషా ప్రభావంతో , మీడియా ప్రభావంతో కొంత మేర తెలుగు భాష అసిత్యం కాల్పోయే ప్రమాదం లేకపోలేదు. దానికి తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాష గొప్పదనాన్ని, ప్రాముఖ్యతను తెలియ చేసే సరస్సులు గోష్ఠులు నిర్వహిస్తున్నాము. ముందు ముందు మరిన్ని కార్యకలాపాలు రూపకల్పన చేస్తున్నాము. కేవలం ఉగాది, దాసర వంటి పండుగ సందర్భాలలో కాకుండా ప్రతి నెల తెలుగు భాషకు సంబంధించి ,ఒక కార్యక్రమం చెయ్యాలి, దాని ద్వారా తెలుగు రచయతలు, కవులను ప్రోత్సహించాలి అని అనుకుంటున్నాము

## వ్యక్తి గత వివరాలు



జననం :30-06-1958

విద్యార్హతలు : MA పొలిటికల్ సైన్సు ,MA తెలుగు ,MSc సైకాలజీ ,LLM

శ్రీమతి : పి.శారద, 14 పి.జి. డిగ్రీలు సాధించి, వైఎస్ ఆర్ సంక్షేమ పథకాల పై పరిశోధన చేస్తున్నారు

కుమారుడు : కాశిక్ బాబు తెలుగు తెరకు చిరపరిచితుడు స్వామి అయ్యప్ప, జగద్గురు శంకరాచార్య తదితర చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించి నంది అవార్డును అందుకొన్నారు.

కుమార్తె : డా. శృత కీర్తి, ప్రముఖ క్లాసికల్ డాన్సర్, నంది అవార్డు గ్రహీత, టి. వి. యాంకర మరియు సైకాలజిస్టు

కరెంట్ అఫైర్స్

# అంతరిక్షంపై ఆధిపత్య పోరాటం





కొండేటి వీణ

అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్స్ యూనియన్ (ITU) కి రువాండా దేశం ,327320 ఉపగ్రహాలతో తక్కువ భూ కక్ష్య లో ఏర్పాటయ్యే ఉపగ్రహ కూటమి కోసం ప్రతిపాదనను దాఖలు చేసింది. తూర్పు-మధ్య ఆఫ్రికాలో భూమధ్యరేఖకు దక్షిణంగా ఉన్న రువాండాలో ఉపగ్రహ పరిశ్రమ లేదు ,అంతే కాక ఇది ఇప్పటి వరకు కేవలం రెండు క్యూబ్‌శాట్‌లను మాత్రమే నిర్మించింది. ఒక చిన్న భూపరివేష్టిత దేశం మిలియన్ ఉపగ్రహాలలో దాదాపు మూడోవంతు ఉపగ్రహాలను ప్రయోగించడానికి ITU అనుమతిని ఎందుకు కోరింది? అనేది ఇక్కడ ఎవరికైనా వచ్చే సందేహం .

తక్కువ ఎత్తులోని భువలయం (ఆర్బిట్ ) అంతా అమెరికా మరియు మిత్రదేశాల సొంతం కాదని నిర్ధారించే ప్రయత్నంగా పరిశీలకులు దీనిని పరిగణిస్తున్నారు. స్థిరమైన మొబైల్, బ్రాడ్‌కాస్టింగ్, ఔత్సాహిక అంతరిక్ష పరిశోధన, అత్యవసర టెలికమ్యూనికేషన్స్, వాతావరణ శాస్త్రం, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్స్, ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్ వంటి అతి పెద్ద సేవల కు పెరుగుతున్న డిమాండ్ కోసం ఉపగ్రహ కక్ష్యలను కేటాయించడంలో U.N. బాడీ ITU కీలక పాత్ర పోషిస్తుంది.

**"ఆర్టెమిస్ ప్రోగ్రామ్ అనేది US నేతృత్వంలోని అంతర్జాతీయ మానవ అంతరిక్షయాన కార్యక్రమం, దీని కింద NASA 2024 నాటికి మానవులను చంద్రునిపైకి, ప్రత్యేకంగా చంద్ర దక్షిణ ధృవానికి తిరిగి తీసుకురావాలని యోచిస్తోంది "**

ఆర్టెమిస్ ప్రోగ్రామ్ అనేది US నేతృత్వంలోని అంతర్జాతీయ మానవ అంతరిక్షయాన కార్యక్రమం, దీని కింద NASA 2024 నాటికి మానవులను చంద్రునిపైకి, ప్రత్యేకంగా చంద్ర దక్షిణ ధృవానికి తిరిగి తీసుకురావాలని యోచిస్తోంది.

"అంతరిక్షం అనేది ప్రతి దేశానికి దౌత్య సాధనంగా ఉండాలని ప్రతి దేశం కోరుకుంటోంది . అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ISS, 20 సంవత్సరాలకు పైగా కక్ష్యలో ప్రయాణిస్తోంది. అలాగే చైనీస్ స్పేస్ స్టేషన్ ఇప్పటికే కక్ష్యలో ఉంది, గణనీయమైన పురోగతిని ప్రదర్శిస్తుండటమే కాక అంతర్జాతీయ భాగస్వాములను ఆకర్షిస్తుంది. స్పేస్ స్టేషన్ నిర్మాణం 2022 చివరి నాటికి పూర్తవుతుంది. అమెరికాకు చైనా పోటీదారుగా మారే ప్రమాదం ఉందని , జిమ్ బ్రిడెన్‌స్టైన్ అక్టోబర్ 21న చెప్పారు. ఈ ఏడాది చైనా చేపట్టిన ప్రయోగాల నేపథ్యంలో అమెరికా ఆందోళన చెందేలా కనిపిస్తోంది . అంతరిక్షరంగంలో అమెరికాను అధిగమించేలా చైనా ప్రణాళికలు చేస్తోందని స్వయంగా పెంటగాన్ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది-2022 లో స్పష్టం చేసింది. లేకుంటే.. అమెరికా గగనతలానికి 'చైనా గ్రహణం' పడుతుందని



హెచ్చరికలు చేసింది. 2045కల్లా చైనా అంతరిక్ష రంగాన్ని శాసిస్తుందని ఆ నివేదిక అంచనా వేసింది. తమదేశం నిర్వహించే 37జిపిఎస్ ఉపగ్రహాలతో పాటు అనేక వాణిజ్య, వాతావరణ ఉపగ్రహాలు, రక్షణ శాఖ పర్యవేక్షణా కార్యక్రమాల ద్వారా నిర్వహించబడు తున్న అనేక ఉపగ్రహాలపై చైనా–రష్యా సైబర్ దాడులు చేసే ప్రమాదం ఉందని అమెరికా స్పేస్ ఫోర్స్ అధికారులు తెలిపా రు. ఉక్రెయిన్తోపాటు ఇతర చోట్ల అణు క్షిపణి నియంత్రణతో సహా వాయు, భూ సైనిక కార్యకలాపాలను జిపిఎస్ శాటిలైట్ల ద్వారా అమెరికా నిరంతరం సమన్వయం చేస్తుంటుందని చెప్పారు.

**"నివేదికల ప్రకారం, చైనాకు రోబోటిక్ చేయి అమర్చి న ఉపగ్రహం ఉంది. ఇది మరొక ఉపగ్రహాన్ని పంజాతో పట్టుకునే సామర్థ్యాన్ని కలిగివుంటుంది"**

నివేదికల ప్రకారం, చైనాకు రోబోటిక్ చేయి అమర్చి న ఉపగ్రహం ఉంది. ఇది మరొక ఉపగ్రహాన్ని పంజాతో పట్టుకునే సామర్థ్యాన్ని కలిగివుంటుంది. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా అంతరిక్ష సవాళ్లను ఎదుర్కొనేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఇందుకోసం బడ్జెట్లో 25 శాతం మేరకు బైడెన్ కేటాయింపులు పెంచడం జరిగింది.

చైనా ఇటీవల తన 39వ అంతరిక్ష ప్రయోగాన్ని 2021లో పూర్తి చేసింది, 2018 మరియు 2020లో 39 ప్రయోగాల చరిత్రాత్మక రికార్డుతో ముడిపడి ఉంది. చైనీస్ స్పేస్ స్టేషన్ మైక్రోగ్రావిటీలో "వేలాది ప్రయోగాలు" చేసే అవకాశం ఉంది . అంతర్జాతీయ స్థాయికి చేరుకోలేని దేశాల నుండి వచ్చే అభ్యర్థనలను కూడా చైనా అంగీకరించవచ్చు.

గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు దాదాపు 35 ఉపగ్రహాలను చైనా ప్రయోగించింది. ఇవన్నీ తక్కువ ఆర్బిట్ శాటిలైట్లే. భూమికి సమీపంలో ఉండే కక్ష్యలోనే తిరుగుతుంటా యి. తద్వారా తాను అనుకున్న ప్రాంతంపై నిఘాపెట్టి, అక్కడి హైరిజల్యూషన్ చిత్రాలను సేకరించేందుకు ఈ శాటిలైట్లు ఉపకరిస్తాయి. ఇలా ఇప్పటి వరకు అంతరిక్షంలో చైనాకు చెందిన 400కు పైగా లో ఆర్బిట్ ఉపగ్రహాలు ప్రపంచ దేశాలపైనిఘా కొనసాగిస్తున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచ శక్తులు తమ అంతరిక్ష ప్రయోగాలను వేగవంతం చేస్తున్నప్పుడు, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష ప్రయోగాలు గణనీయంగా తగ్గాయి.

***"2021లో, ISRO కేవలం రెండు ప్రయోగాలను నిర్వహించగా, 2020లో 2 మరియు 2019లో 6. నిర్వహించింది . 2018లో U.S. గరిష్ఠంగా 31 ప్రయోగాల-ను చేసింది, రష్యా 2015లో 29 ప్రయోగాలను చేసింది. "***

2021లో, ISRO కేవలం రెండు ప్రయోగాలను నిర్వహించగా, 2020లో 2 మరియు 2019లో 6 నిర్వహించింది. 2018లో U.S. గరిష్ఠంగా 31 ప్రయోగాలను చేసింది, రష్యా 2015లో 29 ప్రయోగాలను చేసింది. ప్రపంచంలోని దేశాలు గత కొన్ని సంవత్సరాలుగా కొత్త సాంకేతికతలను మరియు దౌత్యాన్ని సృష్టించేందుకు తమ కార్యక్రమాన్ని దూకుడుగా ముందుకు తీసుకువెళుతున్నాయి.

## భారతదేశం ఎక్కడ ఉంది?

చైనా అంతరిక్ష కార్యక్రమం 1956లో ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టే అధ్యయనాలతో ప్రారంభమైంది, అయితే భారతదేశం యొక్క కార్యక్రమం 1960లలో ప్రారంభించబడింది. రెండు దేశాలు తమ కార్యక్రమాన్ని పౌర ప్రయోజనాల కోసం ఉపయోగించాలనే ఆశయంతో ప్రారంభించాయి, ఎందుకంటే ఇది అప్లికేషన్–ఆధారితమైనది . రెండు దేశాల విధానాలు వారి గణనీయమైన పేద జనాభాకు సహాయపడే లక్ష్యంతో ఉన్నాయి.

## కరెంట అఫైర్స్



ఏది ఏమైనప్పటికీ, 1990ల చివరలో , 21వ శతాబ్దపు ప్రారంభ సంవత్సరాల్లో రెండు దేశాల మధ్య అంతరాలు పెరిగాయి, ఈ రంగంలో U.S.ని ఎదుర్కోవాలనే లక్ష్యంతో చైనా అంతరిక్షంపై తన వ్యయాన్ని పెంచుకుంది.

ఈ ఏడాది జనవరిలో పార్లమెంటు ముందు సమర్పించిన భారతదేశ ఆర్థిక సర్వే 2020-21, అంతరిక్ష సాంకేతికతలో అమెరికా భారతదేశం కంటే పది రెట్లు ఎక్కువ ఖర్చు చేసిందని, చైనా ఖర్చు ఆరు రెట్లు ఎక్కువ అని పేర్కొంది. భారతదేశం యొక్క వార్షిక అంతరిక్ష వ్యయం కేవలం $1.8 బిలియన్లు మాత్రమే, అయితే చైనా తన అంతరిక్ష కార్యక్రమంలో సంవత్సరానికి $11 బిలియన్లకు పైగా ఖర్చు చేసింది. అమెజాన్ మరియు ఎలోన్ మస్క్ యొక్క స్పేస్ఎక్స్ వంటి ప్రైవేట్ సంస్థల భారీ పెట్టుబడితో పాటు అంతరిక్ష రంగంపై US $19.5 బిలియన్లు ఖర్చు చేసింది.

అంతరిక్ష పోటీలో చైనాతో కొనసాగడానికి, ఆస్ట్రేలియా, భారతదేశం, జపాన్ మరియు యునైటెడ్ స్టేట్స్‌తో కూడిన క్వాడ్ నాయకులు 24 సెప్టెంబర్ 2021న ప్రమాణాలు, మార్గదర్శకాలు, నియమాలు మరియు సూత్రాలను రూపొందించడంలో కలసి పని చేస్తామని అంగీకరించారు.

సెప్టెంబరు 24న, భారత ప్రధాని నరేంద్ర మోదీ మరియు U.S. ప్రెసిడెంట్ జో బిడెన్ కూడా "2021 చివరి నాటికి స్పేస్ సిట్యుయేషనల్ అవేర్‌నెస్ మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ను" ఖరారు చేయడానికి అంగీకరించారు, ఇది బాహ్య అంతరిక్షంలో దీర్ఘకాలిక స్థిరత్వాన్ని నిర్ధారించడానికి డేటా షేరింగ్ మరియు సేవలను పంచుకోవడానికి వీలు కల్పిస్తుంది. అయినప్పటికీ, యుఎస్ యొక్క ఆర్టెమిస్ ఒప్పందంలో చేరుతుందా లేదా అనే దానిపై భారతదేశం ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. ఆర్టెమిస్ అకార్డ్, జపాన్, ఆస్ట్రేలియా, UAE మరియు U.K.తో సహా ఇప్పటివరకు 12 దేశాలు చేరాయి, ఇది చంద్రుని అన్వేషణ మరియు అంతకు మించి అంతర్జాతీయ భాగస్వాములు మరియు వాణిజ్య వేత్తల భాగస్వామ్యంతో ఒక ఒప్పందం.

***"అంతరిక్ష అన్వేషణకు అయ్యే అధిక ఖర్చుల దృష్ట్యా, వివిధ అంతరిక్ష ఏజెన్సీల మధ్య సహకారం ఉండాలి. భారత-దేశం నాసా మరియు రష్యా యొక్క గ్లావ్‌కోస్మోస్‌తో మంచి సంబంధాలను కలిగి ఉంది . అవసరమైనప్పుడు ఈ రెండు ఏజెన్సీల సహాయం తీసుకుం-టుంది. భారతదేశం ఈ విధా-నాన్ని కొనసాగించాలి. "***

"అంతరిక్ష అన్వేషణకు అయ్యే అధిక ఖర్చుల దృష్ట్యా, వివిధ అంతరిక్ష ఏజెన్సీల మధ్య సహకారం ఉండాలి. భారతదేశం నాసా మరియు రష్యా యొక్క గ్లావ్‌కోస్మోస్‌తో మంచి సంబంధాలను కలిగి ఉంది . అవసరమైనప్పుడు ఈ రెండు ఏజెన్సీల సహాయం తీసుకుంటుంది. భారతదేశం ఈ విధానాన్ని కొనసాగించాలి. సహకారం అనేది జీరో-సమ్ గేమ్‌గా మరియు మానవాళి యొక్క ఉమ్మడి ప్రయోజనాల కోసం స్పేస్ అభివృద్ధి మరియు అంతరిక్ష అన్వేషణ కోసం దాని అవసరాల కోసం ఈ రెండు ఏజెన్సీలతో సహకారాన్ని కొనసాగించాలి. ఒకరితో కలిసి పని చేయడం మరొకరికి శత్రుత్వంగా చూడకూడదు. భారతదేశం దాని ఆసక్తులు , అవసరాల గురించి త్వరపడాలి" అని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లోని ఖగోళ శాస్త్రం మరియు ఖగోళ భౌతిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ మయాంక్ వహియా అభిప్రాయపడ్డారు.

"సమస్య గ్రహ వనరుల నిర్వహణకు సంబంధించినది. చంద్రుడు, అంగారక గ్రహం మొదలైనవి మానవాళికి సాధారణ వారసత్వం (CHM).



ఆర్టెమిస్ ఒప్పందం లేదా చైనా నేతృత్వంలోని సమూహంలో ఏదైనా అటువంటి ప్రాజెక్ట్‌లో చేరడానికి ముందు మనం ఈ అంశంపై స్పష్టత కలిగి ఉండాలి. CHM-ఫోకస్‌తో పారదర్శకమైన మరియు చట్టబద్ధంగా కట్టుబడి ఉండే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి భారతదేశం ముందుకు రావాలి" అని మరో అంతరిక్ష నిపుణుడు అజేయ్ లెలే అభిప్రాయపడ్డారు.

## భారతదేశం చేపట్టిన సంస్కరణలు

ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సుమారు $360 బిలియన్ల విలువను కలిగి ఉంది. ISRO నివేదిక ప్రకారం భారతదేశం అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో కేవలం 2% వాటాను కలిగి ఉంది, అయితే మొత్తం మార్కెట్ వాటాలో US 40% మరియు U.K 7% స్వాధీనం చేసుకున్నాయి . ప్రగతిశీల సంస్కరణల నేపథ్యంలో ప్రైవేట్ సంస్థల బలమైన భాగస్వామ్యంతో 2030 నాటికి తన మార్కెట్ వాటాను 9%కి పెంచుకోవాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది.

"SpaceX, Blue Origin, Virgin Galactic మరియు Arianespace వంటి కంపెనీలు ఆవిష్కరణలు మరియు అధునాతన సాంకేతికతతో ఖర్చులు మరియు టర్న్‌అరౌండ్ సమయాన్ని తగ్గించడం ద్వారా అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులను సృష్టించాయి. అయితే భారతదేశంలో ప్రభుత్వ అంతరిక్ష కార్యక్రమానికి, ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమలోని వాళ్ళు విక్రేతలు లేదా సరఫరాదారులుగా మాత్రమే పరిమితమయ్యారని "ఇస్రో 2021 అక్టోబర్‌లో ప్రచురించిన నివేదిక తెలియచేస్తోంది .

***ISRO నివేదిక ప్రకారం భారతదేశం అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో కేవలం 2% వాటాను కలిగి ఉంది, అయితే మొత్తం మార్కెట్ వాటాలో US 40% మరియు U.K 7% స్వాధీనం చేసుకున్నాయి . ప్రగతిశీల సంస్కరణల నేపథ్యంలో ప్రైవేట్ సంస్థల బలమైన భాగస్వామ్యంతో 2030 నాటికి తన మార్కెట్ వాటాను 9%కి పెంచుకోవాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది.***

అంతరిక్ష రంగంలో మరింత మంది ప్రైవేట్ సంస్థలను ఆకర్షించే లక్ష్యంతో, భారత ప్రభుత్వం ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (INSPACe)ని సింగిల్ విండో, స్వతంత్ర నోడల్ ఏజెన్సీగా రూపొందించింది. హ్యాండ్‌హోల్డింగ్, సపోర్ట్ మరియు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్‌ని అందించడం ద్వారా స్పేస్ సెక్టార్‌లో ప్రైవేట్ ఇండస్ట్రీ ప్లేయర్‌ల పాత్రను ప్రోత్సహించడానికి మరియు మెరుగుపరచడానికి ప్రభుత్వం INSPACeని ఆదేశించింది. ఇది ప్రైవేట్ కంపెనీలు ఇస్రో సౌకర్యాలను ఉపయోగించడం, భారతీయ ఉపగ్రహ వ్యవస్థలను అభివృద్ధి చేయడం మరియు ప్రైవేట్ రంగం అభివృద్ధి చేసిన రాకెట్లు/వాహనాలను ప్రయోగించడానికి కూడా అధికారం ఇస్తుంది.

ఇండియన్ స్పేస్ అసోసియేషన్ (ISpA)- అంతరిక్ష మరియు ఉపగ్రహ సంస్థల యొక్క ప్రధాన పరిశ్రమ సంఘం. ISpA మరింత ఉన్నత-నైపుణ్య ఉద్యోగాలను సృష్టించడానికి దేశంలోకి క్లిష్టమైన సాంకేతికత మరియు పెట్టుబడులను తీసుకురావడానికి భారత అంతరిక్ష పరిశ్రమకు ప్రపంచ అనుసంధానాలను నిర్మిస్తుంది. ఈ సంస్థకు భారతీ ఎయిర్‌టెల్, లార్సన్ & టూబ్రో, నెల్కో (టాటా గ్రూప్), వన్‌వెబ్, మ్యాప్‌మిండియా, వాల్‌చంద్‌నగర్ ఇండస్ట్రీస్ మరియు ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఈ ప్రైవేట్ సంస్థలు స్థిరమైన నియంత్రణ విధాన రాజకీయ వాతావరణం ఆశిస్తున్నాయి. రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ కమ్యూనికేషన్ మరియు లాంచ్ పాలసీల వంటి రంగాలలో కొత్త వ్యాపార-స్నేహపూర్వక పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది.

**కరెంట అఫైర్స్**



ఇమేజింగ్ మరియు కమ్యూనికేషన్ ట్రాన్స్‌పాండర్లు, లాంచ్ సర్వీసెస్ మొదలైన వాటితో సహా వాణిజ్య ప్రాతిపదికన స్పేస్ ఆస్తులు/సేవలు డిమాండ్ మరియు సరఫరా రెండింటికీ ప్రత్యేక పబ్లిక్ సెక్టార్ అగ్రిగేటర్‌గా వ్యవహరించడానికి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (NSIL) కి అధికారం ఇచ్చింది. డిమాండ్ అగ్రిగేటర్‌గా, NSIL ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాలు మరియు ఇస్రో లేదా ప్రైవేట్ పరిశ్రమ అభివృద్ధి చేసిన ఇతర ఆస్తులను కొనుగోలు చేస్తుంది. సరఫరా అగ్రిగేటర్‌గా తన పాత్రలో, NSIL ISRO-అభివృద్ధి చేసిన ఉపగ్రహాలు మరియు ప్రయోగ వాహనాలపై ట్రాన్స్‌పాండర్ సామర్థ్యం, ఇమేజింగ్ సేవలు, ప్రయోగ సామర్థ్యం మొదలైన ఆస్తులు మరియు సేవలను వాణిజ్యీకరించనుంది.

ప్రైవేట్ రంగం మాత్రమే పాల్గొనే సైన్స్ అన్వేషణ మిషన్లను కూడా ఇస్రో గుర్తిస్తోంది. స్పేస్ సెక్టార్‌లో పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రైవేట్ రంగానికి భద్రతా భావాన్ని అందిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రయివేటు రంగం ఎంపిక చేసిన రంగాలలో పెట్టుబడులు పెడితే ప్రభుత్వం కొంత నిధులను కూడా అందిస్తుంది.

**"పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) మరియు స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వి) వంటి ప్లాట్‌ఫార-మ్‌లకు సంబంధించిన సాంకేతి-కతలను త్వరలో ప్రైవేట్ రంగానికి బదిలీ చేయాలని ప్రభుత్వం ఇప్పటి-కే నిర్ణయించింది"**

పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) మరియు స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వి) వంటి ప్లాట్‌ఫారమ్‌లకు సంబంధించిన సాంకేతికతలను త్వరలో ప్రైవేట్ రంగానికి బదిలీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. పరిశోధన మరియు అభివృద్ధిపై దృష్టి సారించే అంతరిక్ష రంగంలో ప్రభుత్వ రంగ ప్రయోగశాలలతో ప్రైవేట్ మరియు ప్రభుత్వ రంగ పాత్రను ప్రభుత్వం వర్గీకరణపరంగా విభజించింది. అదే సమయంలో, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలోని వ్యాపార సంస్థలచే తయారీ మరియు వాణిజ్య కార్యకలాపాలు జరుగుతాయి. సరిహద్దుల వెంబడి పెరుగుతున్న శత్రుత్వాల నేపథ్యంలో నిర్దిష్ట అంతరిక్ష సైనిక ఆస్తులకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నందున ఇది భారత సాయుధ దళాలకు గణనీయమైన మద్దతును అందిస్తుంది.

సంస్కరణల తరువాత, అనేక భారతీయ అంతరిక్ష రంగ స్టార్టప్‌లు తమ ప్రణాళికాబద్ధమైన ప్రాజెక్ట్‌ల కోసం వెంచర్ క్యాపిటల్‌ను సేకరించాయి. 40కి పైగా అంతరిక్ష రంగ స్టార్టప్‌లు మరియు చిన్న సంస్థలు ప్రస్తుతం భారతీయ అంతరిక్ష విభాగంలో పాల్గొంటున్నాయి.

**" పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) మరియు స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వి) వంటి ప్లాట్‌ఫారమ్‌లకు సం-బంధించిన సాంకేతికతలను త్వరలో ప్రైవేట్ రంగానికి బదిలీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది "**

పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) మరియు స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వి) వంటి ప్లాట్‌ఫారమ్‌లకు సంబంధించిన సాంకేతికతలను త్వరలో ప్రైవేట్ రంగానికి బదిలీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది.

## అంతరిక్ష దౌత్యం

సెప్టెంబరు 24న, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ భూటాన్ కోసం ఒక చిన్న ఉపగ్రహాన్ని అభివృద్ధి చేయడానికి

# python నేర్చుకోండి

కంప్యూటర్ పైన పైథాన ప్రోగ్రామును రన్ చేసే విధానం:-
1. 'Thonny IDE 'నెట్ లో నుండి డౌన్లోడు చేసుకోండి.

2. ఇనస్టాల్ బటన్ నొక్కి Thonny మీ కంప్యూటరలో రన్ అయ్యేటట్లు చూడండి.

3.'ఫైల్ ' మెనూలో 'న్యూ ' ఎంపిక చేసుకుని, ఫైలను .py తొ పొడిగించండి.

4. ఇప్పుడు పైథాన్ కోడ్ (ప్రోగ్రాం) రాసి ఫైలును సేవ్ చెయ్యండి .

5. F5 బటన్ నొక్కి పైథాన్ ప్రోగాం రన్ చేసి ఫలితాల కోసం చూడండి.

పైథాన్ డైనమిక్ గా తనంతట తనే అన్వయించు కోగల బైట్ కోడ్ కంపైల్ భాష ఈపైథాన్ ప్రోగాము. రాసేటప్పుడు, C లో లాగా వేరియబుల్స్ , ఫంక్షనులు, మెథడ్స్ టైపు డిక్లరేషన్లు వుండవు. ఇందు వల్ల పైథాన్లో లో రాసే ప్రోగ్రాం చిన్నదిగా, అనువైనదిగా వుంటుంది. తద్వారా కంపైల్ సమయంలో కోడ్ తనిఖీ చెయ్యటం కుదరదు. పైథానే లో మనం నేర్చుకోవాల్సినవి

1. వెరియబుల్స్ మరియు పేర్లు

2.స్ప్రింగ్స్ మరియు టెక్స్ట్

3. ఫైల్ రాయటం, చదవటం

4. క్లాసులు మరియు ఆబ్జెక్టులు

5. ఫంక్షన్లు

6. ఫైల్ వినియోగం

7. లిస్టు మరియు డిక్షనరీలు

5. లూపులు, కండిషన్లు, నియంత్రణలు

పైథాన్ డాటా టైపులు:

పైథాన్ లో కింద ఉదహరించిన వివిధ రకాల డాటా టైపులున్నాయి.

1.న్యూమరిక్ : int, float, complex

2. స్ట్రింగ్ : str

3. సీక్వెన్స్: list, tuple, range

4. బైనరి" byte, bytearray

5. బూలియన్ : bool

6. సెట్ :set, frozen sect

7. మాపింగ్ : dict

**న్యూమరిక్ డాటా టైపు:**

సంఖ్యా పరమైన విలువలను ప్రోగ్రాములో నిల్వచేయ టానికి ఇవి ఉపయోగ పడతాయి .

1. : పూర్ణ సంఖ్యలను (ధన, ఋణ అంశములు ) నిల్వచేయ టానికి (-3, -2, -1, 0, 1, 2, 3 )

2. long : పెద్ద పూర్ణ సంఖ్యల కోసం

3. float: అసంపూర్ణ సంఖ్యలకోసం, 15 డెసిమల్ స్థానాల వరకు

4 .complex: కాంప్లెక్స్ సంఖ్యలు, వాస్తవ భాగం మరియు ఊహాతీత భాగం కలవి. a+ib

వేరియయిల్ డాటా వైపును మనం ముందుగా C లో లాగా చెప్పనవసరం లేదు. కాని అవి ఏ రకమైనవో తెలుసుకోవాలంటే మాత్రం type ( ) ను వాడాలి.

ఉదా : a = 100, b= 10.2345 ,C=100+j 3

print (“a”is” type (a))

print ("b"is"type (b))

print("C" is type (c))

Ans: 100 is <class int >
10.345 is <class float>

100+j3 is<class complex>

## కరెంట అఫైర్స్



స్ట్రింగ్ డేటా టైపు :

కొన్ని క్యారెక్టర్ ల సమూహాన్ని స్ట్రింగ్ అంటాము. స్ట్రింగ్ లను సింగిల్ కోట్ లేదా డబుల్ కోట్ తొ సూచిస్తారు.

+, లను ఉపయోగించి రెండు, మూడు స్ట్రింగ్లను ఏకం చెయ్యవచ్చు.

ఉదా:

```
a = "string"

b = 'double'

print (a, b)

Print (a+b)
```

Ans:

string double

string double

★★★★★

అమలు చేసే ఏర్పాటుపై సంతకం చేసింది. ISRO ఇప్పటికే GSAT-9ని ప్రయోగించింది, దీనిని దక్షిణాసియా ఉపగ్రహంగా కూడా పిలుస్తారు, మే 2017లో ఇతర దక్షిణాసియా దేశాలకు అంతరిక్ష ఆధారిత సేవలను అందిస్తుంది. రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల ద్వారా ఆసియా పొరుగు దేశాలకు సహాయం చేయడంతో పాటు, భారతదేశం నానో-శాటిలైట్ అసెంబ్లీ & ట్రైనింగ్ అనే ప్రోగ్రామ్ను కలిగి ఉంది— ఇది అంతర్జాతీయంగా పాల్గొనేవారికి నానో-శాటిలైట్ పై రెండు నెలల శిక్షణను అందిస్తుంది. ఈ కార్యక్రమం కింద ఇప్పటి వరకు 33 దేశాలకు చెందిన 59 మంది అధికారులకు ఇస్రో రెండు బ్యాచ్లలో శిక్షణ ఇచ్చింది.

జూన్ 2021 వరకు ISRO 59 దేశాలు , ఐదు బహుపాక్షిక సంస్థలతో అంతరిక్ష సహకార ఒప్పంద పత్రాలను మార్చుకుంది . అయితే, మారిన పరిస్థితులలో తక్కువ భూ కక్ష్య మరియు పాత ఉపగ్రహాల శిధిలాల గురించి తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతున్నప్పుడు, అంతరిక్ష నిబంధనలను రూపొందించడంలో భారతదేశం మరింత చురుకైన పాత్ర పోసహించాలి .

మొత్తంగా మానవజాతి అభివృద్ధికి తక్కువ అభివృద్ధి చెందిన దేశాల ప్రయోజనాలపై రాజీ పడకుండా ధనవంతులు మరియు శక్తిమంతులు తమలో తాము వనరులను పంచుకోకుండా చూసుకోవడంలో భారతదేశం దృఢంగా నిలబడాలి. సమస్త మానవాళి శ్రేయస్సు కోసం అంతరిక్ష వనరులను ఉపయోగించాలి. భారతదేశం ఈ నైతిక వైఖరిని తీసుకోవాలి ,అన్ని చట్టాలు ఈ లక్ష్యానికి అనుగుణంగా ఉండేలా చూడాలి.

★★★★★★★★

### మీ పిల్లల అల్లరి మాటలు మాకు పంపండి -ప్రచురిస్తాము

చిన్నతనంలో అందరం అల్లరి చేసిన వాళ్ళమే .తెలిసి తెలియని వయసులో అర్థం పర్థం లేని ఎన్నో అల్లరి పనులు చేస్తూ ఉంటాము, వాటిని ఒకసారి గుర్తుచేసుకుంటే మనకే నవ్వు వస్తు ఉంటుంది . అలాగే మన ఇంట్లో చిన్నపిల్లలు కూడా తెలిసి తెలియని మాటలు మాట్లాడుతూ అందరిని నవ్విస్తూ ఉంటారు .ఇటువంటి సంఘటనలు మీ ఇంట్లో జరిగితే, అవి ఇంకా మీకు గుర్తుండి ఉంటె , కాగితం మీద రాసి మాకు పంపండి ప్రచురిస్తాము. అందరం కలసి హాయిగా నవ్వుకుందాము . మీ పిల్లల ఫోటోలు పంపటం మాత్రం మరిచిపోవద్దు .ఉత్తమైన వాటికి బహుమతి కుడా ఉంటుంది .

పంపాల్సిన మెయిల్ అడ్రస్ :sumathi.potilu @gmail.com

**బహుమతి పొందిన కథ**

# అహింసా పరమోధర్మః

**సామజిక స్ఫూర్తి నింపే కథ**



**శింగరాజు శ్రీనివాసరావు**

"ఏమయ్యా శాస్త్రి..ఈ సంవత్సరమన్నా మాకు పప్పన్నం పెట్టేదేమైనా ఉందా..లేదా"

"భలేవాడివి పరంధామా.. దానికేం భాగ్యం రేపు సంక్రాంతికి మా చెల్లెలు కొడుకు లోకేశం వస్తున్నాడు. వాడికోసమని నాగపూర్ కందిపప్పు తెప్పించాను. వాడితో పాటు నీకు పెట్టిస్తా విందుభోజనం. సరేనా"

"ఏడ్చినట్టే ఉంది. నేనడిగేది ఆ పప్పన్నం కాదయ్యా. నీ కూతురికి పెళ్ళిచేసి మాకెప్పుడు విందుభోజనం పెడతావు అని"

"అది నా చేతుల్లో ఉందటయ్యా. ఆ గుడిలో రామయ్య కనికరించాల. నాబిడ్డకు రామచంద్రుడు లాంటి భర్త రావాల"

"రోజూ రామయ్యకు దగ్గరగానే ఉంటావు కదా. అడగకపోయావా"

**"రామదాసంతటి వాడికే పరీక్షలు పెట్టిగానీ కనికరించ-లేదాయన. గుడిలో పూజారిని. నన్నంత తెలికగా కరుణిస్తా-డంటావా. దేనికైనా సమయం రావాలి. అంతవరకు వేచి చూ-డవలసిందే "**

"రామదాసంతటి వాడికే పరీక్షలు పెట్టిగానీ కనికరించలేదాయన. గుడిలో పూజారిని. నన్నంత తేలికగా కరుణిస్తాడంటావా. దేనికైనా సమయం రావాలి. అంతవరకు వేచి చూడవలసిందే"

"ఇదిగో శాస్త్రీ..నీ మేలు కోరేవాడిని కనుక చెబుతున్నాను. మొహమాటానికి పోకుండా నీ అల్లుడు రాగానే ఒకమాట అడుగు. ఎంతయినా వాడు నీ మేనల్లుడు. నీ మాటకు ఎదురు చెప్పడు"

"అది పద్ధతికాదు పరంధామయ్యా. చుట్టపు చూపుగా వస్తున్న వాడిని అలా అడగడం బాగుండదు. ఆ రామయ్యే అంతా చూసుకుంటాడులే. వాడు వచ్చే టైమయింది. పైగా రేపు కోడిపందాలు గుడిముందు ఖాళీస్థలంలో ఏర్పాటు చేస్తున్నారట. సర్పంచిగారు ఉదయాన్నే వచ్చి పూజలు చేయించుకుంటారట, వాటికి ఏర్పాటు చేసుకోవాలి వస్తా" అంటూ వెళ్ళిపోయాడు హనుమత్ శాస్త్రి.

'వీడింత పిచ్చిమాలోకం ఏంటిరా బాబు. రాముడికి అలంకారాలు చేసి ఆనందపడడం తప్ప, నాలుగు మాయమాటలు చెప్పి పనులు వెళ్ళబుచ్చుకోవడమే చేతకాదు' అనుకున్నాడు శాస్త్రికి దూరపు చుట్టము, ఆ ఊరి కరణము అయిన పరంధామయ్య.

★★★★★★

"చాలు వహ్నిజా. ఇంక తినలేను. నన్ను వదిలెయ్"

"రాళ్ళు తిని రాళ్ళు హరాయించుకోవలసిన వయసులో నాలుగు గారెలు తిని చాలంటావేంది బావా. నేను సరిగా వడ్డించలేదని అక్కడ అమ్మ నన్ను తిడుతుంది. ఇంకో రెండు వేసుకో బావ"

"నావల్ల కాదే ఇక. అత్తయ్యకు నేను చెప్తాలే నన్ను వదిలిపెట్టు"

"సరే..కాఫీ తెస్తాను. తాగి గుడి దగ్గరకు వెళ్ళు. అక్కడ ఈరోజు కోడిపందాలట. సంక్రాంతి కదా భలే జోరుగా సాగుతాయిలే"

"అయితే నువ్వూరా. ఇద్దరం కలిసి వెళదాం"

"వద్దు బావా.. జనం చూస్తే బాగోదు"

**బహుమతి పొందిన కథ**

"అబ్బ..ఏంకాదులే వహ్నీ రా" అని బలవంతం చేసేసరికి కాదనలేక తల్లితో చెప్పి లోకేశుతో కలిసి బయలుదేరింది వహ్నిజ.

వాళ్ళ ఇంటినుంచి ఫర్లాంగు దూరం ఉంటుంది గుడి. ఇద్దరూ నడుచుకుంటూ వెళుతున్నారు. పుట్టినప్పటి నుంచి పట్టణంలో పెరగడంతో పల్లె వాతావరణమే తెలియదు లోకేశుకు.

అగ్రికల్చర్ గ్రాడ్యుయేషను చేశాక ఉద్యోగం వచ్చే లోపు ఒకసారైనా తన తల్లి పుట్టిన ఊరికి వెళ్ళి అక్కడందరినీ కలిసి రావాలని బయలుదేరి వచ్చాడు. ఎప్పుడో చిన్నప్పుడు చూసిన వహ్నిజను కూడ చూడాలని వచ్చాడు. అందరూ ఆమెను మేనత్త పోలిక అంటే ఏమో అనుకున్నాడు కానీ, చూస్తే నిజమే అనిపించింది. నిజం చెప్పాలంటే అది అచ్చు మామయ్య పోలిక. పచ్చగా దబ్బపండులా ఉంటుంది. ఎంతవద్దనుకున్నా వయసు మనసును గెలిచి వహ్నిజను ఓరగా చూడసాగింది.

"ఏం బుజ్జమ్మా. ఎవరీ అబ్బాయి. నేనెప్పుడూ చూడలేదే"

అడిగింది ఎదురొచ్చిన కాంతం.

"మా వైశాలి అత్తయ్య కొడుకు పిన్నీ. సంక్రాతికి మా ఇంటి కొచ్చాడు"

"కాబోయే అల్లుడికి అప్పుడే అల్లెం పెడుతుందేమిటే మీ అమ్మ" కిసుక్కున నవ్వింది కాంతం.

"అదిగో అట్టాంటి మాటలే వద్దు పిన్నీ. ఆయన మా బావ అంతే. మేనమామింటికి వచ్చాడు" అంది విసురుగా.

**" చాల్లవే నీ ఏసాలు. కుందనపు బొమ్మవు. నిన్ను కాదని ఏడికి పోగలడే మీ బావ. మీకేం తక్కువే. పదెకరాల మాగాణి. లంకంత కొంప. మీ నాయన ఆ రాముడికి నమ్మినబంటు. సాక్షాత్తు ఆ హనుమయ్యే కదే. ఆ రామయ్య ఊరుకుంటాడా. ఆయనసేత్తో ఆయనే మిమ్మల్ని కలపడూ అంటూ ఓ విసురు విసిరి వెళ్ళిపోయింది కాంతం."**

"చాల్లవే నీ ఏసాలు. కుందనపు బొమ్మవు. నిన్ను కాదని ఏడికి పోగలడే మీ బావ. మీకేం తక్కువే. పదెకరాల మాగాణి. లంకంత కొంప. మీ నాయన ఆ రాముడికి నమ్మినబంటు. సాక్షాత్తు ఆ హనుమయ్యే కదే. ఆ రామయ్య ఊరుకుంటాడా. ఆయనసేత్తో ఆయనే మిమ్మల్ని కలపడూ" అంటూ ఓ విసురు విసిరి వెళ్ళిపోయింది కాంతం.

"ఇందుకే బావ నేను నీ వెంటరానన్నాను. సారీ బావ. పల్లెటూరు కదా..అందుకే అలా.."

"ఇప్పుడేమయింది వహ్నిజా. వరసయిన వాళ్ళం కనుక అలా చలోక్తులాడారు. అంతలోనే ఇంత ఇదయిపోవాలా. లైట్ తీసుకో"

మాటలలోనే ఆలయానికి వచ్చేశారు ఇద్దరూ. అప్పటికే జనమంతా గుమికూడి ఉన్నారు. ఆలయం లోపలికి వెళ్ళి రామయ్యను దర్శించుకుని బయటకు వచ్చారిద్దరూ. కోడిపందాలు మొదలవబోతున్నాయని చెప్పేసరికి హనుమత్ శాస్త్రి కూడ దేవుడికి నైవేద్యం పెట్టి, గుడికి తాళంవేసి వీళ్ళున్న దగ్గరకు వచ్చి నిలుచున్నాడు. కోడిపందాల ఆట మొదలయింది.

మొదట రెండు జట్లు కోడిపుంజులను వదిలి పెట్టాయి. అవి ఎగిరెగిరి కొట్టుకుంటున్నాయి. కేకలు, ఈలలు, ఒకటే గోలగా ఉంది ఆ ప్రాంతమంతా. కొత్తగా ఉంది లోకేశానికి. అయినా చాలా ఆనందంగా ఉంది ఆ పందెపు జోరు చూస్తుంటే. రెండు పుంజులూ పోటాపోటీగా కొట్టుకుంటున్నాయి. వాటి శరీరం నుంచి రక్తపు మరకలు చుక్కలు చుక్కలుగా పడుతున్నాయి. అవి లోకేశు కళ్ళబడ్డాయి. పుంజలకు గాయాలవుతున్నాయి. ముక్కుతో పొడుచుకుంటే అలా కాదు కదా.

**బహుమతి పొందిన కథ**

మరి ఎందుకిలా అని నిశితంగా దృష్టి సారించాడు. అతని కళ్ళకు పుంజుల కాళ్ళకు కట్టబడిన కత్తులు కనిపించాయి. అంటే ఏదో ఒక పుంజు చంపబడుతుందన్న మాట. ఇది అన్యాయం. జీవులను హింసించి ఆనందించడం మహాపాపం. తట్టుకోలేక "ఆపండి" అని బిగ్గరగా అరిచాడు లోకేశం.

ఆ అరుపుకు ఒక్కసారిగా కేకలు ఆగిపోయాయి. పుంజులు కూడ బిత్తరపోయాయేమో ఒక అడుగు వెనక్కు వేశాయి.

"ఏంది బాబు ఏమయింది" అంటూ వచ్చాడు సర్పంచి.

"ఇది చాలా అన్యాయం సార్. కోడిపందాల ఆట పేరు చెప్పి వాటి కాళ్ళకు కత్తులు కట్టి ఏదో ఒక పుంజును చంపడం ఘోరం"

"ఎవరు బాబు నువ్వు. ఇది మాకు అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఇందులో అన్యాయమేముంది. ఓడిపోయిన పుంజు బ్రతకడం వృధానే కదా. గెలవలేని దాని బ్రతుకు దేనికిక"

"అయ్యా సర్పంచి గారూ. వాడు నా మేనల్లుడు. ఊరికి కొత్తగా వచ్చాడు. పండుగ సంబరాలు చూస్తాడని నేనే రమ్మన్నాను. ఇక్కడి అలవాట్లు తెలియక...ఏదో చిన్నతనం. క్షమించండి బాబు" అడ్డుతగిలి బ్రతిమలాడుకున్నాడు శాస్త్రి.

"మీరాగండి మామయ్యా. సార్ మీరు ఈ ఊరికి సర్పంచి కదా. ఒకవేళ మీరు రేపు ఎన్నికలలో ఓడిపోతే, ఇక బ్రతకడం వృధా అని చచ్చిపోతారా" తడుముకోకుండా అడిగాడు లోకేశం.

ఆ మాటకు సర్పంచితో పాటు అక్కడవున్న అందరూ ఖంగుతిన్నారు.

**"క్షమించండి సార్. మనం వినోదం పేరుతో మూగజీవాలను హింసించడం పాపం. మనం కుస్తీపోటీలు పెట్టుకున్నప్పుడు చేతులకు, కాళ్ళకు కత్తులు కట్టుకుని పోటీలో పాల్గొంటామా. లేదే. మరి వీటికెందుకు కత్తులు కడతారు. మనమెవరిమైనా ఏదైనా పోటీలో ఓడిపోతే..ఇక గెలవలేమని చచ్చిపోతామా. మరోసారి గెలవాలని కష్టపడతాం. గెలిచేటంత వరకు పోరాడుతాం. అలాగే ఇవి కూడ. "**

"క్షమించండి సార్. మనం వినోదం పేరుతో మూగజీవాలను హింసించడం పాపం. మనం కుస్తీపోటీలు పెట్టుకున్నప్పుడు చేతులకు, కాళ్ళకు కత్తులు కట్టుకుని పోటీలో పాల్గొంటామా. లేదే. మరి వీటికెందుకు కత్తులు కడతారు. మనమెవరిమైనా ఏదైనా పోటీలో ఓడిపోతే..ఇక గెలవలేమని చచ్చిపోతామా. మరోసారి గెలవాలని కష్టపడతాం. గెలిచేటంత వరకు పోరాడుతాం. అలాగే ఇవి కూడ.

కత్తులు లేకుండా పోటీలు పెట్టండి. అవి పుంజులకు కుస్తీపోటీలులా ఉండాలి కానీ, చావు బాజాలుగా ఉండకూడదు. ఈరోజు ఓడిన పుంజు వచ్చే సంవత్సరం గెలవవచ్చు. అలా దానికి మీరు తర్ఫీదు ఇవ్వండి. ఈ పోటీలలో ఎవరి పుంజైనా చనిపోతే, దాన్ని పెంచిన అతను ఎంత బాధపడతారో ఆలోచించారా. ఏ ఆటైనా వినోదాన్ని పంచాలే తప్ప, విషాదాన్ని మిగల్చకూడదు. నామాట వినండి. 'అహింసా పరమోధర్మః' అనే సంస్కృతి మనది. దాన్ని మరువకండి. పెద్దలు నన్ను మన్నించి ఈ విషసంస్కృతికి చరమగీతం పాడండి" బాధ, ఆవేశం కలగలిపిన అతని మాటలు సర్పంచిని ఆలోచనలో పడవేశాయి.

స్వతహాగ మంచి వ్యక్తి అయిన అతనికి లోకేశు మాటలు గీతాసారంలా అనిపించాయి.

"బాబు.. చిన్నవాడివయినా చాలా చక్కగా చెప్పావు. ఇంతకాలం దీన్ని ఆటనుకున్నామే కానీ, మూగజీవుల

ప్రాణాలతో చెలగాటమనుకోలేదు. మాకు శాస్త్రిగారంటే సాక్షాత్తు ఆ రామయ్య బంటు ఆంజనేయుడితో సమానం. ఆ ఇంట పుట్టిన నీవు మాకు మంచి చెప్పావనే నమ్ముతున్నాం. కాదు ఆ రామయ్యే తన గుడిముందు జరుగుతున్న ఈ తప్పిదాన్ని చూడలేక నీలో ఆవహించి ఇలా పలికించాడనిపించింది. ఇకనుంచి నువ్వు చెప్పినట్లే చేస్తాం" అని లోకేశుకు మాటిచ్చి, "ఒరేయ్ పుంజుల కాళ్ళకున్న కత్తులు తీసి వాటిని బరిలోకి దించండి. ఇకనుంచి ఈ కోడిపందాలాట వినోదమే తప్ప, ఏ మూగజీవిని బలి తీసుకునే కిరాతకపు ఆట కాకూడదు" అని చెప్పి లోకేశును క్షమాపణలు కోరాడు సర్పంచి.

"శాస్త్రిగారూ. మీ మేనల్లుడు బంగారమయ్యా. పోగొట్టుకోమాకు. వహ్నిజమ్మనిచ్చి కట్టబెట్టు. ఈ కుర్రాడు మన ఊరి అల్లుడైతే, ఏదైనా ఇట్టాంటి పొరపాట్లు జరిగితే మొహమాట పడకుండా చెప్తాడు. మన పల్లెను అయోధ్యగా మలుస్తాడు" అని అభినందించాడు.

ఆ మాటతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు వహ్నిజ, లోకేశులు.

'ఆయన నోటివాక్కు ఫలించి, ఆ రామయ్య కరుణించి, లోకేశు నా అల్లుడైతే, ఈజన్మకు ఇంకేంకావాలి. కొడుకైనా, అల్లుడైనా వీడే అవుతాడు నాకు' అని మనసులో అనుకున్నాడు శాస్త్రి. అన్నింటినీ గమనిస్తూ చిద్విలాసంగా నవ్వుకున్నాడు ఆ సీతారాముడు.

నగదు బహుమతికి ఎంపికైన కవిత

# తడి ఆరని గాయం

**చేసెట్టి వరాహ కృష్ణ**



నా గుండెని ఎవరో రాత్రి గుప్పెటతో
పట్టుకుని దొంగిలించారు...

వేకువనే మెలకువొచ్చి చూసుకుంటే
స్మృతులేవో తడుముతున్నాయ్..

మొన్న తగిలిన గాయానికి గుండె
చిల్లు పడి ఇంకా రక్తమోడుతూనే
ఉంది...

ఇంకా తెలవారలేదు..

చీకటి రెప్పలు విప్పుకుంటుంది..

నిద్రలేచిన కళ్ళతో...

అప్పుడెప్పుడో జరిగిన అలజడికి

మన వలపు కావ్యం సాక్ష్యం
కాకూడదని..

నిశీధి కళ్ళకు నల్ల గుడ్డ కప్పాను

నన్ను చూసే నీ కళ్ళు ఇన్నాళ్ళూ..

తుషార బిందువుల్లా మెరిసేవి...

ఇప్పుడు నా చూపులు ముళ్లలా
గుచ్చుకుంటున్నాయేమో...!

అందుకే వెన్నెల మీద
అలుగుతున్నావ్..!

చిక్కటి వెన్నెల్లో నక్షత్రాలన్నీ
పోగేసి మాలగా కట్టి నీ జడపై
అలంకరించేవాణ్ణి..

నీకు గుర్తుందా...!

నీవూ నేనూ కలిసి నడిచిన హంసల
కోనేరు గట్టుపై...

కొంగలు వాలి వేటి కోసమో
వెతుకుతున్నాయ్

మనం నడిచెళ్ళిన పాదాల గుర్తులు
కొన్ని..

పుడమి పొత్తిళ్ళలో భద్రంగా
దాచుకుందట...!

కిటికీ తెరిచిన మన గదిలో శీతల
పవనాలు వీస్తుంటే..

నీ కళ్లు ఎన్ని నిశి రాత్రులు
మోసాయో...!

జ్ఞాపకాల పూదోటలో నిన్న పూసిన
పూలు నేడక్కడ లేవు...

కాటేసే కళ్ళు కొన్ని రాలిన పూలను
చిదిమేశాయ్!

ప్రేమంటే.. ఆకాశంలో

మెరిసే మెరుపు కాదు

ఒక శూన్య బిందువు..

అది రాలిపోవడం తప్ప...


మన కంటికి కనిపించదు.

వినాల్సిన
పాట

# ఆ పాత మధురాలు

# ఈ వేళ నాలో ఎందుకో ఆశలు..

సంగీతం : ఆర్.గోవర్ధనం
సాహిత్యం: డా.సి.నారాయణరెడ్డి
పాడిన వాళ్ళు: ఘంటసాల,సుశీల
దర్శకత్వం :డి.యోగానంద్



దీకొండ చంద్రకళ

1969 వ సంవత్సరంలో దాసరి యోగానంద్ దర్శకత్వంలో అక్కినేని,జమున జంటగా నటించిన మూగనోము చలనచిత్రంలోని

ఈ వేళ నాలో ఎందుకో ఆశలు అనే చక్కని రొమాంటిక్ గీత విశేషాలు తెలుసుకుందాం.

ఒక ఉన్నత అంతస్థువాడైన కథానాయకుడు,పేదరాలైన కథానాయకిల మధ్య ప్రేమను వివరిస్తూ సాగే ప్రేమగీతమిది.

**ఈ వేళ నాలో ఎందుకో ఆశలు**
**లోలోన ఏవో విరిసెలే వలపులు**
**ఈ వేళ నాలో ఎందుకో ఆశలు**
**లోలోన ఏవో విరిసెలే వలపులు**

**నీలోని ఆశలన్నీ నా కోసమే**
**నా పిలుపే నీలో వలపులై విరిసెలే**

అంటూ మొదలవుతుంది ప్రేమపల్లవి.పిలుపుతోనే వలపు విరిసిన వైనం గమనించండి.

**నీ చూపులో స్వర్గమే తొంగిచూసె**
**నీ మాటలో మధువులే**
**పొంగిపోయే**
**నాలోని అణువణువూ నీదాయెలే**
**బ్రతుకంతా నీకే అంకితం**
**చేయనా**

చూపులో స్వర్గం తొంగిచూడడం, మాటలో మధువులు పొంగడం... ప్రేమ మహత్యం!అందంగా పదాలలో పొదిగారు కవి.




బ్రతుకంతా నీకే అంకితం చేయనా అంటూ కథానాయకి నిష్కల్మషమైన ప్రేమను చాటారు.

ఆ తరువాత లా...లలలాల లాలలలా... అంటూ వచ్చే ట్యూన్ చాలా బాగుంటుంది.

ఇక రెండో చరణం...

**నీ రూపమే గుండెలో నిండిపోయే**
**నా స్వప్నమే నేటితో పండిపోయే**
**ఉయ్యాల జంపాల ఊగేములే**
**కలకాలం మనకు ప్రేమయే**
**ప్రాణము**

తొంగిచూసే...పొంగిపోయే
నిండిపోయే... పండిపోయే
పై ప్రాసల్ని గమనించండి.కవి యొక్క ప్రతిభను గుర్తించండి.

**వినాల్సిన పాట**

# ఆ పాత మధురాలు



పాత సినిమా పాటల్లో ఒక విషయం గమనించండి.పాటలో పూలతీగ,చందమామ,నావ, ఊయల... ఇలా ఏ పదం ఉన్నా, అక్కడ దృశ్యమానం అవుతుంది. ఉయ్యాల జంపాల ఊగేములే అన్న దగ్గర ఇద్దరూ ఊయల ఊగుతుంటారు.

అదే ఇప్పటి పాటల్లో పైటే ఉండని కథానాయకిపై ఎగిరే నీ పైట అంటూ చిత్రీకరిస్తున్నారు.

కలకాలం ప్రేమే ప్రాణంగా బ్రతికే ప్రేమైకజీవులపై చిత్రించిన ఈ పాటలో నటీనటుల హావభావాలు సహజంగా ఉంటాయి.

ఈ పాట ట్యూన్ ని 1968 లో విడుదలైన దో కలియా(రెండు మొగ్గలు) అనే హిందీ చిత్రంలోని తుమ్హారీ నజర్ అనే పాటనుంచి తీసుకున్నారు.

పిల్లలూ దేవుడూ చల్లనివారే అంటూ కుట్టిపద్మిని అమ్మకూతురు,నాన్న కూతురిలా రెండు పాత్రల్లో అద్వితీయంగా నటించిన లేతమనసులు సినిమా మీకు గుర్తుండే ఉంటుంది.

కుఝూన్ దైయుమ్ దైవమమ్ అనే తమిళ సినిమాకు రీమేక్ ఇది. దీనికి మూలం The parent trap అనే అమెరికన్ సినిమా.ఇది జెర్మన్ నవల lisa and lottie ఆధారంగా తీసారట! చూసారా...అవేవీ మనం చదవకపోయినా, చూడకపోయినా...మన తెలుగుదనాన్ని సంతరింపజేసి మన కళ్ళ ముందుకు తెచ్చిన నిర్మాతలు,దర్శకుల కృషి అభినందనీయం.

లేతమనసులు చిత్రంలో గడ్డివాముల వద్ద హరనాథ్,జమునలపై చిత్రీకరించిన అందాల ఓ చిలుకా అనే పాటలా ఉంటుంది.ట్యూన్ మాత్రం ఇది.

రవిశంకర్ శర్మ సంగీత దర్శకత్వంలో మాలాసిన్హా,బిశ్వజీత్ లపై చిత్రీకరించబడి, సాహిర్ లుధియాన్విచే రచించబడి... లతా,రఫీల యుగళంలో వీనులవిందు చేసిన ఆ హిందీ పాట సాహిత్యం మీ కోసం...
దీనిలో మూడు చరణాలుంటాయి.

मुलाक़ात पे इतने मगरूर क्यों हो
हमारी ख़ुशामद पे मजबूर क्यों हो
मुलाक़ात पे इतने मगरूर क्यों हो
हमारी ख़ुशामद पे मजबूर क्यों हो
मानाने की आदत कहा पड़ गई
खटाओ की तालीम क्या हो गई
तुम्हारी नज़र क्यों खफा हो गई
खता बख्श दो गर खता हो गई
तुम्हारी नज़र क्यों खफा हो गई
खता बख्श दो गर खता हो गई


सटाते न हम तो मानते ही कैसे
तुम्हे अपने नज़दीक लाते ही कैसे
सटाते न हम तो मानते ही कैसे
तुम्हे अपने नज़दीक लाते ही कैसे
किसी दिन की चाहत अमानत ये थी
वो आज दिल की आवाज़ हो गई
तुम्हारी नज़र क्यों खफा हो गई
खता बख्श दो गर खता हो गई
तुम्हारी नज़र क्यों खफा हो गई
खता बख्श दो गर खता हो गई.



చదవాల్సిన
పుస్తకం



# “బంకోలా”





పద్మావతి రాంభక్త

ఈ మధ్య నేను చదివిన మంచి పుస్తకాలలో “బంకోలా” అనే నవల గుర్తుంచుకోదగింది.

శ్రీ సాధు సుబ్రహ్మణ్యశర్మగారు ఈ నవలా రచయిత.

***"స్వాతంత్ర్యానికి మునుపు డచ్, ఫ్రెంచ్, ఇంగ్లీష్ మొదలైన విదేశీయులు మన దేశంలోకి వ్యాపారమంటూ వచ్చి, దేశం మొత్తాన్ని ఎలా గుప్పెట్లో పెట్టుకున్నారో, కొల్లగొట్టారో ఈ నవలలో రచయిత ప్రస్తావిస్తారు. "***

స్వాతంత్ర్యానికి మునుపు డచ్, ఫ్రెంచ్, ఇంగ్లీష్ మొదలైన విదేశీయులు మన దేశంలోకి వ్యాపారమంటూ వచ్చి దేశం మొత్తాన్ని ఎలా గుప్పెట్లో పెట్టుకున్నారో, కొల్లగొట్టారో ఈ నవలలో రచయిత ప్రస్తావిస్తారు.

నవలలోని కథలోకి వస్తే, కాకినాడ యానాం రోడ్డు మధ్య ఉన్న కోరంగి వంతెన వద్ద ఒక కాలేజీ బృందం బస్సు దిగిన దగ్గర నుండి నవల మొదలవుతుంది. ఆ కాలేజీ విద్యార్థులను పడవలో ఒక ఒడ్డు నుండి మరొక ఒడ్డు తీసుకెళ్ళిన పడవ నడిపే అతడి ద్వారా  కథను చెప్పిస్తారు రచయిత.

వారి సంభాషణల మధ్య “పూర్వం మన వాణిజ్యానికి ఉపయోగపడి ఇప్పుడు నిరుపయోగంగా శిథిలమై మిగిలిన లైట్ హౌస్ ” అని ఒకరంటే “బంకోలాకు” సవరించాడు తెలుగుభాషాభిమాని.ఇలా “బంకోలా” గురించి చెప్తారు రచయిత.

***"గోదావరి నది సముద్రసంగమానికి ముందు ఏడుపాయలైంది. అన్ని బాహువులతోగాని ఆ సంగమానందమనుభవములోకి రాదనేమో."***

గోదావరి నది సముద్రసంగమానికి ముందు ఏడుపాయలైంది. అన్ని బాహువులతోగాని ఆ సంగమానందమనుభవములోకి రాదనేమో.

ఈ సప్తగోదావరములలో యానాం కాకినాడల మధ్య ప్రవహించే కోరంగి ఒకటి. కోరంగిగట్టు మీద కోరంగి ఊరుంది’ అంటూ నవల మొదట్లో తన మాటలో రచయిత చెప్పారు.

భైరి అనే ఒక అల్లరిచిల్లరగా తిరిగే ఒక యువకుడి చుట్టూ కథ తిరుగుతుంటుంది. ఏ పనీ చేయకుండా తన స్నేహితులతో తన ఊరిలో అందరినీ ఆట పట్టిస్తూ అందరి కోపానికి గురవుతూ ఉంటాడు భైరి కానీ ఎవరెంత కసిరినా బుద్ధి చెప్పినా తన పద్ధతి ఏ మాత్రం మార్చుకోడు.

ఆ సమయంలోనే విదేశీ వర్తకుల ప్రలోభాలకు లోబడి రాజులు తమ రాజ్యాలలో వర్తకానికి అనుమతిస్తారు. వారి ఆశలను ఆసరాగా చేసుకుని  చిన్న వ్యాపారుల నుండి వస్తువులను కారుచౌకగా కొని  విదేశీయులు తమ వ్యాపారాలను యదేచ్ఛగా విస్తరిస్తూ ఆ తరువాత తిమింగలాల్లా రాజ్యాలను కబళిస్తారు. పాలనలో సైతం జొరబడి ఏలికలవుతారు. ఇక వారి అరాచకాలకు అంతు ఉండదు. పెద్ద పెద్ద రాజులను మట్టుపెడుతూ లేక సామంతులుగా చేసుకుని దేశం మొత్తాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంటూ రాజకీయాలు

**చదవాల్సిన పుస్తకం**



# "బంకోలా "

నడుపుతారు.

ఇక ఇటు భైరి విషయానికి వస్తే, తను ప్రేమించిన పరదేశికి వేరొకరితో వివాహమైపోవడం, మరి కొన్ని అనుకోని పరిస్థితుల కారణంగా అతడు ఊరు వదలి పోతాడు. అలా దేశదిమ్మరిగా తిరుగుతున్న భైరికి పరిచయమైన మంజరి అనే వేశ్య అతడి జీవితానికి ఒక దిక్సూచిగా మారుతుంది. అతడి అల్లరితనమంతా మాయమై ఒక తెలియని ఆలోచనలో మునిగిపోతాడు భైరి.

విదేశీయుల మంత్రాంగాలన్నీ అతడికి కాస్తకాస్తగా అర్థమవుతుంటాయి. వారి మాట వినని వారిని, ఆర్థిక వ్యవహారాలలో వారికి బాకీ పడిన వారిని విదేశీయులు హింసించే తీరు సైతం భైరిని చాలా బాధపెడతాయి. అతడు కొందరు రాజులను కలిసి ఈ విషయాలన్నీ చర్చించాలని, వారికి అర్థమయ్యేలా వివరించాలని ఎంతో ప్రయత్నిస్తారు. పడవ నడిపే అతడి నోటి వెంట కథంతా ఇలాగే సాగుతుంది. మధ్యమధ్యలో కాలేజీ విద్యార్థుల సరదా సంభాషణలు నడుస్తుంటాయి.

1802 భారతీయ దళానికి చెందిన నావలెంతటివైనా సరే రాగలిగేందుకూ, వచ్చిన వాటిని మరమ్మత్తు చేయడానికి బొంది(అంటే డాక్)నొకదాన్ని ఇ.రోబక్ అనే ఆయన తవ్వించినట్టు చెప్తారు. 155 అడుగుల పొడవూ అందులో సుమారు సగం వెడల్పూ 50 అడుగుల లోతూ ఉండేదిట అది. దాని చిహ్నం కూడా కనబడకుండా ఇప్పుడు కప్పబడిపోయింది'ఇలా రచయిత పరిశీలన చేసి మరీ నవలను వివరాలతో కథను లోతుగా రాస్తారు.
"ఒకనాడు ఘనమైన ఓడలిక్కడకు తెరిపి లేకుండా వస్తూపోతూ ఉండేవని గతవైభవాన్ని గూర్చి గుసగుసలాడుతుంది కోరంగిపాయ. వంతెన పాదాలను క్రూరంగా గీస్తూ నిల్చిన ముళ్ళకర్రలను మెల్లిగా తీస్తుంది కోరంగి.

కడలిరాజు చెలియలికట్టను అతిక్రమించి వచ్చి పిచ్చిపట్టిన కోరంగిని తన హస్తాలలో పొదువుకుంటాడు.
కోరంగి పిచ్చిని చూసి కన్నీళ్ళు కార్చని వారు లేరు. చందమామ కన్నీటి బిందువులు తెల్లనిసోనలై కొబ్బరాకుల మీద జారిపడతాయి"
ఇలాంటి కవితాత్మక వాక్యాలతో గతవైభవాన్ని తలచుకుని దుఃఖించే కోరంగి రేవును వర్ణిస్తూ విస్మయపరుస్తారు రచయిత.
ఈ నవలను ఎంతో ఓపికగా శ్రద్ధగా చదవాలి. అలా చదువుతుంటే గత చరిత్ర కళ్ళ ముందు కదలాడుతుంది. కొన్ని పేజీలలోకి వెడితే విదేశీయుల దురాగతాలకు రక్తం మరిగిపోవడమే కాక వారు చిన్న వ్యాపారులను మోసం చేసి వారి జీవితాలను చెల్లాచెదురు చేసిన తీరుకు కన్నీళ్ళొస్తాయి.

సుబ్రహ్మణ్యశర్మగారు ఈ నవలను పద్దెనిమిది అధ్యాయాలుగా విభజించి రాసారు. పడవ అతడు కథంతా చెప్పడం ముగిసాక విద్యార్థి బృందం కాకినాడకు బయలుదేరుతుంది. అప్పుడు సైతం వారు విన్న కథ మననం చేసుకుంటారు. ఆఖరు అధ్యాయంలో రాముడు అనే విద్యార్థి తమ కాలేజీలో ప్రదర్శించిన " Steel King Versus the Elephant and after" అనే Shadow Play గురించి చెప్తాడు. కొత్తగా రైలు వేస్తున్న రోజుల్లో ఒక చోట ఏనుగొకటి ఇంజన్ ను గుద్దిందన్న ఘటన ఆధారంగా దాన్ని రచించారని కూడా చెప్తాడు. దాని వివరాలు చెప్తూ ఆ షాడో ప్లే (నీడల ఆధారంగా ప్రదర్శించే నాటకం) కళ్ళకు కట్టేలా వర్ణిస్తారు.
చివరగా రాముడనే ఆ విద్యార్థికి జ్వరం వస్తుంది. అతడు జ్వరంలో "మరి కొన్ని శతాబ్దాలు దేశాన్ని వెనకబడనివ్వను" అంటూ కలవరిస్తాడు. అది విన్న రాముడి తండ్రి
"నిజమే నాయనా ! మా కాలంలో స్వాతంత్ర్యానికై మా విధి నెరవేర్చినాము. మా కలలింకా పండలేదు.
నేటి యువకులు నడుం కట్టకపోతే మన దేశం తిరిగి శతాబ్దాలు వెనుకబడే ప్రమాదముంది" అంటారు.
రచయిత ఈ విధంగా ఒక గొప్ప సందేశంతో నవల ముగిస్తారు. మీరూ వీలైతే చదవండి.

చూడాల్సిన
సినిమా


## ఆణిముత్యాలు

# ఈ చరిత్ర ఏ సిరాతో..?



**ఈదర శ్రీవిద్య**

దర్శకత్వం: వేజెళ్ళ సత్యనారాయణ
స్టుడియో: సాయిలక్ష్మి పిక్చర్స్
నిర్మాతలు: గోగినేని ప్రసాదు
సంగీతం: శివాజీరాజా
విడుదల తేదీ: 1982 ఆగస్టు 14



మనదేశం స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకోవడం ప్రారంభించి డెబ్బై అయిదు సంవత్సరాలైనా ఇరకా నిరుద్యోగరక్కసి విలయతాండవంచేస్తూనే వుంది. ఈ రక్కసి కరాళదంష్ట్రలకు ఎన్నో కుటుంబాలు ఆహుతైపోతున్నాయి. మరెన్నో ప్రాణులు అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయి. ఈ సమస్య ఒక్క మధ్యతరగతి వారినే కాకుండా బడుగువర్గాల వారిని కూడా పట్టి పీడిస్తున్నది.

**"దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అన్ని వర్గాల వారికి విద్యావకాశాల మెరుగు పడ్డాయి. విద్యాధికుల సంఖ్య కూడా గణనియంగ పెరిగింది. పెరుగుతున్న విద్యాధికుల సంఖ్యకు సమానంగా ఉద్యోగాల సంఖ్య పెరగక పోవడంతో నిరుద్యోగ సమస్య నానాటికి తీవ్రతరమవుతోంది"**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అన్ని వర్గాల వారికి విద్యావకాశాల మెరుగు పడ్డాయి. విద్యాధికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. పెరుగుతున్న విద్యాధికుల సంఖ్యకు సమానంగా ఉద్యోగాల సంఖ్య పెరగక పోవడంతో నిరుద్యోగ సమస్య నానాటికి తీవ్రతరమవుతోంది. డిగ్రీ, కడుపు చేత బట్టుకుని విదేశాలకు మేధావులు వలసలు పోతున్నారు.

విదేశాల పుణ్యమా అని వృత్తి విద్యల వారికి కొంత ఉపాధి లభించింది. అయినా నిరుద్యోగ సమస్య తీవ్రమైన సమస్యగానే ఈనాటికీ కొనసాగుతోంది . కొన్నిరకాల ఉగ్రావాద మనస్తత్వాలు దేశంలో ప్రబలడానికి ఈ సమస్య కూడా ఒక కారణమవుతోంది.

గోగినేని ప్రసాద్, యం.రాజేంద్రప్రసాద్, మోహన గాంధి సమర్పణలో నిర్మించిన "ఈ చరిత్ర ఏ సిరాతో ...?" చిత్రంలో ఈ నిరాద్యోగ సమస్యను ప్రధానాంగా ఎన్నుకున్నారు. వరకట్నం సమస్య, రిజర్వేషన్లు, అవినీతి లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం సమస్యల పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేసి, యువతరాన్ని సక్రమ మార్గంలో నడిపించ వలసిన కవులు, రచయితలు, స్వార్థపరులకు తొత్తులుగా మారితే జరిగే అనర్థాలను కూడా ఇందులో ప్రస్తావించారు.

**" తమ పిల్లలు తమలా వృత్తి విద్యలు చేసుకోకుండా ఉన్నత విద్యను అభ్యసించి. ఉద్యోగాలు చేసుకోవాలనే తహతహ సీమల్లో ఉండే తల్లిదండ్రులకు బాగా ఉంది"**

తమ పిల్లలు తమలా వృత్తి

చూడాల్సిన సినిమా

ఆణిముత్యాలు

# ఈ చరిత్ర ఏ సిరాతో..?

విద్యలు చేసుకోకుండా ఉన్నత విద్యను అభ్యసించి, ఉద్యోగాలు చేసుకోవాలనే తహతహ సీమల్లో ఉండే తల్లిదండ్రులకు బాగా ఉంది. తమ పొలాలను కుదువబెట్టి షావుకార్ల వద్ద అప్పో సప్పో చేయడం, అది వీలుకాని పరిస్థితుల్లో తమ ఆస్థిపాస్తులను తెగనమ్మి పిల్లలకు చదువు చెప్పించడం ఒక ఎత్తు. కాగా చదువుకున్న తరువాత వారికి ఉద్యోగాలు రావడం మరొక ఎత్తు. బాగా డబ్బు, పలుకుబడి ఉన్నవారికే ఉద్యోగాలు వస్తున్నాయనేది జగమెరిగిన సత్యం. అవి రెండూ లేనివారు ఎంత తెలివైనవారైనా నిరుద్యోగ రక్కిసికి ఆహుతి కాక తప్పదు.

ఒక గ్రామానికి చెందిన కొందరు కుర్రాళ్ళు పట్నం కాలేజీలో చదువుకుంటారు. ఎన్నో యమ యాతనలు అనుభవించి వారు కాలేజీ చదువులు పూర్తిచేసినా వారికి ఉద్యోగాలు ఎండ మావుల్లా ఉంటాయి. వారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి తల్లిదండ్రులు పాతాళానికి వంగిపోతారు. ఉద్యోగాన్వేషణలో తెచ్చుకున్న డబ్బులు ఖర్చుకాగా ఉద్యోగాలు లేక, ఇంటి ముఖం చూపలేక వారు త్రిశంకు స్వర్గాన్ని చవి చూస్తారు.

“వీరిలో ఒక హరిజన యువకుడు తక్కిన వారిలా పిరికిపందగా మిగిలిపోక తన కుటుంబ వృత్తి అయిన చర్మకార వృత్తిని స్వీకరించి తన కాళ్ళ మీద తాను నిలవడమే కాకుండా తన తండ్రికి కూడా డబ్బు పంపుతాడు. తన కొడుకు పట్టభద్రుడై ప్రయోజకుడయ్యాడనే సంతోషంతో అతడు పట్నానికి వస్తే. తన కళ్ళను తానే నమ్మలేని పరమసత్యం అతని ముందు ప్రత్యక్షమవుతుంది. అతడు తేరుకునే లోగా మరొక ఘటన అతని కళ్ళ ముందు మెదిలి తన కొడుకు నిర్ణయం తెలుసుకుంటాడు.

***“ నిరుద్యోగబాధకు తాళలేక దారిద్ర్యంలో ఓలలాడుతున్న తన కుటుంబాన్ని పైకి తీసుకు రావాలనే తపనతో మరొక నిరుద్యోగ యువకుడు కొందరు స్వార్థపరుల మోసానికి బలై ఆత్మాహుతి చేసుకుంటాడు. కాగా తక్కిన నిరుద్యోగులు ఆకలికి తట్టుకోలేక ఒక ధనవంతుడు నిర్వహిస్తున్న యాచక శిబిరంలో చేరిపోతారు"***

నిరుద్యోగబాధకు తాళలేక దారిద్ర్యంలో ఓలలాడుతున్న తన కుటుంబాన్ని పైకి తీసుకు రావాలనే తపనతో మరొక నిరుద్యోగ యువకుడు కొందరు స్వార్థపరుల మోసానికి బలై ఆత్మాహుతి చేసుకుంటాడు. కాగా తక్కిన ‘నిరుద్యోగులు ఆకలికి తట్టుకోలేక ఒక ధనవంతుడు నిర్వహిస్తున్న యాచక శిబిరంలో చేరిపోతారు. వారిలో మానవత్వాన్ని మేల్కొలిపి స్వార్థపరుల ఆటకట్టించడంతో చిత్రం ముగుస్తుంది.

ధనవంతుణ్ని ఆశ్రయించిన కవి స్వాతంత్య దినోత్సవంనాడు దేశ పురోభివృద్ధిని గురించి కాక , ఉగాది రోజున మన కవి వరేణ్యులు దేశ ప్రగతిని గురించి కాక రేడియో కవి సమ్మేళనంలో జరిపే స్తోత్ర కార్యక్రమంపై ఒక చక్కటి చురక అంటిస్తుంది చిత్రం . దారిద్ర్యంలో కవి వేగుచుక్క కావాలి. అంతేకాని అతడు ధనవంతుల కావలి కుక్కగా మిగిలిపోరాదు అనేది ఈ చిత్ర సందేశం .

తరతరాలుగా అణగదొక్కబడిన మార్గాలలో క్రాంతిని, చైతన్య స్రవంతిని తీసుకు రావడానికి చేయవలసిన కృషి ఎంతో ఉంది. వారికి విద్యాబుద్ధులు చెప్పించి, ఆర్థికంగా ఆదుకోవలసిన అవసరం ఎంతగానో ఉంది. అయితే రిజర్వేషన్ల ద్వారా తరతరాలుగా వాటికి జరిగిన అన్యాయాన్ని రూపుమాపాలనుకోవడం కేవలం భ్రమ మాత్రమే అని కూడా ఈ చిత్రం బోసు పాత్ర ద్వారా మరో సందేశం ఇస్తుంది. నిరుద్యోగ యువత ఫలహారశాలలను ప్రారంభించటం స్వయం ఉపాధివథకాలతొ ఎవ్వరి మీద

చూడాల్సిన
సినిమా

ఆణిముత్యాలు

# ఈ చరిత్ర ఏ సిరాతో..?

ఆధార పడకుండా బ్రతకొచ్చని చక్కటి స్ఫూర్తిని కలిగిస్తుంది.

వేజెళ్ళ సత్యనారాయణ "మరో మలుపు" ద్వారా దర్శకుడుగా కొంత గుర్తింపు పొంది ఈ చిత్రంలో తన ప్రతిభను మరింత నిరూపించుకున్నారు. అయితే సాంకేతికపరమైన కొన్ని లోపాలను సరిదిద్దుకున్నట్లయితే చితం మరింత బాగుండేది. పరుచూరి గోపాలకృష్ణ మాటలు ఈ చిత్రంలో ఒక ప్రత్యేకత." "ఎక్కడ ఎక్కడ మద్య శ్యామల మన్న దేశం' అన్న పాట బాగుంది.

నడుస్తున్న చరిత్రను కొందరు తమ స్వార్థం కోసం వక్రంగా చిత్రిస్తున్నారని, దీని వల్ల భావితరాల వారికి తీరని ద్రోహం చేయడం. తప్ప వేరుకాదని, అందుచేత చరిత్రను యదా ర్ధంగా రాయాలని ఈచిత్రం చక్కని సందేశాన్ని ఇస్తున్నది. . డిగ్నిటీ ఆఫ్ లేబర్ ను నొక్కి చెప్పిన ఈ చిత్రం ఒకే ఒక ప్రశ్న వేస్తుంది.అది విద్యాధికులయిన ప్రతి యువతీ యువకుడు వేసే ప్రశ్నే ."మేము చదివిన చదువులు బ్రతుకుతెరువును గురించి మాకు నేర్పిన దేమిటి? చదువుకున్నవాళ్ళు , చేతులు కాళ్ళు బాగా వున్న వాళ్ళమవడం వల్ల అడుక్కోవటం తప్ప వేరే మార్గం లేదా?".

★★★

## రెడ్ లైట్ ఏరియా



నెత్తుటి వెలుగుల ప్రాంగణాలు
సుఖభోగాల పాముల పుట్టలు
నిశి రాత్రిళ్ళలో కొడిగట్టే దీపాలు

నిస్సహాయతతో కూడిన నిరాశలను
నిస్పృహతో కూడిన నిర్వేదాలను
మూటకట్టుకుంటున్న
మాంసపుముద్దలు

గాలి కూడా చొరబడిన చీకటి గదుల్లో
ఎముకలు అతికిన తోలు సంచులు
కొన్ని మూలన పడి ఏడుస్తున్నాయి

గోడకు అంటిన కాటుక మరకలు
పరుపుల కంటిన రక్తపు చారికలు
మౌనంగా కుమిలిపోతున్నాయి

మంచం మీదకు విసిరిన నిర్జీవదేహాలు
బలవంతంగా మూసిన కనురెప్పలు
నిశ్శబ్దంగా కన్నీళ్ళు కారుస్తున్నాయి

కోరికలమంటల్లో కాలుతున్న
కళేబరాలు
సుఖరోగాలకు నిలయమైన శరీరాలు
మరణం కోసం ఎదురు చూస్తున్నాయి

ఎవరికీ కాని వాళ్లలా ఆఖరి క్షణాల్లో
అనాధ శవాల్లా కాటికి తరలిపోతుంటే
తోడులేక నీడలు కంటతడి
పెడుతున్నాయి

ఈదర శ్రీనివాస రెడ్డి

కొత్త
సీరియల్

# పరుగులు తీసే నీ పయసునకు ..!



యలమర్తి అనూరాధ

భూదేవి నింగిని చేరిందా అన్నట్లు ఆకాశమంతా నీలి సముద్రంలా పరచుకుని అద్భుతంగా ఉంది. ఆ అందమైన దృశ్యాన్ని చూడటానికి రెండు కళ్ళూ చాలవనిపిస్తోంది. పూలు కోద్దామని వచ్చిన "ధృతి" వాటి సంగతే మరిచినట్లు అటే దృష్టిని సారించింది.

ఏదో నమ్మలేని నిజాన్ని చూస్తున్నట్లు హృదయం ఉప్పొంగింది. ప్రకృతిలో ఎన్ని వింత అందాలు దాగున్నాయి అని ఆశ్చర్యపోయేంతలో అంతా మారిపోయింది. అప్పటి దాకా పరుగులెత్తిన నదికి ఆనకట్ట వేసి నట్లు అంత ప్రశాంతంగా ఎలా మారి పోయింది. ?

అర్థం కానట్లు అలా చూస్తుండి పోయింది.

“ధృతి పూలు తెస్తున్నావా? పూజకు వేళవుతోంది" అమ్మ మధురిమ పిలుపుతో “ ఆ వస్తున్నానమ్మా! “అంటూ చక చకా మల్లె పూలును కోసి పూలసజ్జలో వేసుకుని లోపలికి పరుగెత్తింది.

నాన్నా! ఇవిగోండి పూలు" అంటూ అందించింది తండ్రి ధర్మతేజకు . అందరి దేవుళ్ళతో అలరారుతున్న పూజ గిదిలో పూజ చేసు కుంటున్న తండ్రిని చూడటం కూడా చాలా ఇష్టం ఆమెకు .

అయిన ప్రతిమలన్నిటికీ పూలు పెడుతుంటే చూస్తు ఉండిపోయింది. పూలను అలంకరించుకుని దేవుళ్ళంతా కళకళలాడిపోతున్నారు.

**"తెల తెలవారుతున్న వేళ నిర్మలంగా ఉన్న వాతావరణంలో వినిపించే శ్లోకాలు ఎంతో ప్రశాంతతను చేకూ-రుస్తాయి అనుకుంది మనసులో"{**

తెల తెలవారుతున్న వేళ నిర్మలంగా ఉన్న వాతావరణంలో వినిపించే శ్లోకాలు ఎంతో ప్రశాంతతను చేకూరుస్తాయి అనుకుంది మనసులో

నిండు ముత్తైదువలా ఉన్న తల్లిని ఒకసారి కళ్ళ నిండా నింపుకుని |లోపలికి వెళ్ళింది ధృతి

అలా వెళుతున్న కూతురిని చూస్తూ 'ఈ రోజు బి.టెక్ లో చేరుతోంది. కాలేజీలో ఎలా ఉంటుందో ఏమో అన్న మీమాంస మనసులో ఉన్నా బయిట పడనివ్వటం లేదు. మొదట్లో అలానే ఉంటుంది. ఆ తర్వాత అలవాటయి పోతుంది “ఏం భయం లేదే !" అని కిరణ్ రాత్రి చెప్పటం కూడా వినిపించింది! నిజంగానే అన్నిటికీ భయపడాల్సిన రోజులవి.

★★★★★

“ధృతి బయలుదేరదామా ?
“అన్న కిరణ్ అన్నయ్య పిలుపుతో “వస్తున్నానన్నయ్యా!' అంటూ వచ్చి బండి మీద అతని వెనుక కూర్చుంది .రోడ్డు మీద పోయే వాహనాలను చూస్తుంటే అవి కుడా తన ఆలోచనల్లానే వేగంగా పరిగెడుతున్నాయి అనిపించింది .

**" అన్నయ్య రాగింగ్ ను నిషేధిం-చారంటారు , మరి ఆత్మహత్యలు, వేధింపులు ఎలా జరుగుతున్నా-యి?!! "**

“అన్నయ్య రాగింగ్ ను నిషేధించారంటారు , మరి ఆత్మహత్యలు, వేధింపులు ఎలా జరుగుతున్నాయి?!!”

“నీకు తెలియనిది ఏముంది రా ? డబ్బుతొ చట్టం కళ్ళు కప్పుతారు. నిజాన్ని అబద్ధాలు చేసేస్తారు. అబద్ధాలను నిజాన్ని చేసేస్తారు. న్యాయం చెయ్యాల్సిన కోర్టుల్లోనే అన్యం జరిగితే ఎలారా ?అదే కదా మన ప్రారబ్ధం , అందరూ నీతిగా నిలబడితే ఈ ఘోరాలు ,నేరాలు ఎందుకు జరుగుతాయి ? “

“మరి మనమేమీ చెయ్యలేమా?”

కొత్త
సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు ..!

"ఎందుకు చెయ్యలేం? మనకెందుకు అనే నిర్లిప్తతను వదిలిపెట్టాలి. ఎదిరించగల ధైర్యం తెచ్చుకోవాలి. అవి రెండూ ఉంటే ఏదైనా సాధించ వచ్చు"

"పరిస్థితులకు భయపడితే అంతా అనర్థమేగా! అసలు అవేలేకుండా చేస్తే ఎంత బాగుంటుందో ??"

"అందరూ ఆశించేది అదే. కానీ జరిగేది, జరుగుతున్నది అంతా వేరు "

***" అదే కదా మొన్నో వైద్య విద్యార్థిన్ని సీనియర్ల వేధింపుల వల్లే చనిపోయిందని వార్తలలో కూడా చూసాం కదా అన్న-య్యా!"***

"అదే కదా ,మొన్నో వైద్య విద్యార్థిన్ని సీనియర్ల వేధింపుల వల్లే చనిపోయిందని వార్తలలో కూడా చూసాం కదా అన్నయ్యా!"

"వాళ్ళ నాన్న ఎస్ ఐ అయ్యి కూడా ఏమీ చెయ్య లేకపోయాడు. ప్రయత్నం మాత్రం ఆపలేదు. కానీ కొన్నాళ్ళే ఈ వార్తలు. ఆ తర్వాత ఏమయిందో ఎవరికీ తెలియదు. డబ్బుతో ఛానెల్స్ నోరు నొక్కేస్తారు."

"పాపం అన్నయ్యా! దీని వలన ఎందరో అమాయకులు బలి అయిపోతున్నారు. సరదాగా చేసుకోవల్సిన దాన్ని కిరాతకంగా మార్చి ఆనందం పొందటమేమిటో నాకర్థం కాదు."

"అది ఆనందం కాదే. పైశాచిక ఆనందం "

" నువ్వు చెప్పంది అక్షరాల నిజం"

"పిల్లలను ఎంత కష్టపడి పెంచి ఉంటారు "

"అవును. చేతి కంది వచ్చే సమయంలో ఇలా చనిపోవటం . అది ఎవరో చంపేసి ఆత్మహత్యగా పరిగణించే టట్లు చెయ్యటం దారుణం కదా ?"

"ఇప్పుడు సమాజంలో జరుగుతున్నవన్ని ఇలాగే ఉన్నాయి? వింటుంటే భయం వేస్తుంది."

" ఏ భయం లేదు. ఈ కాలేజీలో రాగింగ్ తక్కువే . అందుకే నిన్ను ఇక్కడ చేర్చాను "

"నాకేమి భయం లేదు, కాకపోతే కాస్త గుబులుగా ఉంది. అంతే !"

***" అదే అక్కర్లేదు అంటున్నాను . నిన్నే చెప్పానుగా యాంటీ ర్యాగింగ హెల్ప్ లైను ఉంది, అవసరమైతే సంప్ర దించ వచ్చని, చేసిన వాళ్ళ పేర్లు కూడా తెలియవు "***

"అదే అక్కర్లేదు అంటున్నాను . నిన్నే చెప్పానుగా యాంటీ ర్యాగింగ హెల్ప్ లైను ఉంది, అవసరమైతే సంప్రదించ వచ్చు , చేసిన వాళ్ళ పేర్లు కూడా తెలియవు "

"ఓకే! అన్నయ్యా!"

"ఏం భయపడకు. ధైర్యంగా వెళ్ళు. మా చెల్లి అలానాటి ఝాన్సీ లక్ష్మీ స్థాయిలో ఉండాలి ఎప్పుడూ"

ఎదురుగుండా కనిపిస్తున్న "విద్యా జ్యోతి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజి "అని రాసిన బోర్డును చూస్తూ

"అలాగే! బాయ్ అన్నయ్యా!"అని టాటా చెప్పి స్థిరత్వం తో కూడిన అడుగులతో కాలేజీలోఅడుగు పెట్టింది ధృతి .

మొదటి సారి అమ్మా. నాన్నతో వచ్చింది. అప్పుడు అంతా కొత్తగా ఉంది. ఆ రోజు ఫీజు కట్టడం లాంటివి చేసుకున్నారు...

మళ్ళీ ఈ రోజే రావటం,

ఎదురుగా సీనియర్ల గుంపు కనిపించింది. అంతవరకూ రాగింగ్ గురించి చదివిన అనుభవాలు అన్నీ కళ్ళ ముందు కనబడ్డాయి.

అయినా చూడనట్లు వెళ్ళబోయింది.

"ఆగమ్మాయి" అని ఆపేసాడు ఒకతను. ఉంగరాల జుట్టు పక్షి గూడు లా ఉంది .నిజంగా పక్షులు వాటినిచూస్తే కాపురం పెట్టేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

తన ఆలోచనకు రాబోతున్న నవ్వును బలవంతంగా పెదాల

సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు ..!

క్రిందగా దాచేసి వెళ్లి వాళ్ళ ఎదురుగా నిలబడింది

"అనుకున్నది ఒకటి అయ్యింది ఒకటి ,బోల్తా కొట్టిందిలే బుల్ బుల్ పిట్ట పాట పాడు "అన్నాడు వాళ్ళలో ఒకడు

"అది నాకు తెలియదు అన్నది" కాస్త భయం నటిస్తూ

'తెలిసేదేమిటి ? గూగుల్ కొట్టు. సెల్ ఉందిగా"

"వీళ్లకింత పాత పాట ఎలా తెలిసింది? తనకయితే అమ్మ పాటలు వినటానికి పెట్టుకుంటుంది కాబట్టి తెలుసు. మరి ఇతనికో..

వాళ్ళ అమ్మ కూడా మా అమ్మలాగేనేమో!

"ఆమె అలోచనల్లో ఉండగానే అతను పాడేసి వెళ్ళిపోయాడు.

సన్నగా నాజుకుగా లతలా ఉన్న ఆమెను, ఆమె తీరైన కళ్ళను చూస్తూ భరతనాట్యం చెయ్యి అన్నాడు మరొకడు

అమ్మ చిన్నప్పుడే నేర్పించటంతో అది పెద్ద విషయం కాదు. కాని తను వేసుకున్న పంజాబీ డ్రెస్ వంక ఒక సారి చూసుకొంది.

"పరవాలేదులే చెయ్యి"అన్నాడు ఆమె ఉద్దేశం గ్రహించినట్లే.

చక చకా నాలుగు స్టెప్పులు వేసింది.

నవ్వుతూ 'వెళ్ళు" అన్నాడు.

ఈ ఒక్క రోజే రాగింగ్.రేపే ఫ్రె షేర్స్ డే ఇంత సులభంగా బయటపడుతుందని తాను ఊహించలేదు

**"ఇలా ఎప్పుడూ గుర్తు పెట్టుకుని, నరదాగా నవ్వు తున్నట్లు ఉండాలి కానీ, ప్రాణాలు తీసుకొనేంత భీకరంగా ఉండేట్లు ఉంటే దీన్ని నిషే-దించాల్సిందే."**

ఇలా ఎప్పుడూ గుర్తు పెట్టుకుని, నరదాగా నవ్వు తున్నట్లు ఉండాలి కానీ, ప్రాణాలు తీసుకొనేంత భీకరంగా ఉండేట్లు ఉంటే దీన్ని నిషేదించాల్సిందే.

అసలు ర్యాగింగ్ ని బ్యాన్ చేసారు అంటారు. మరి ఇవేమిటో అని మనసులో ప్రశ్న ఉదయిస్తున్నా వడి వడి గా తన రూమ్ వైపు నడిచింది.

అక్కడ హాలులో మీటింగ్ అయ్యాక ఎవరి క్లాసుల్లోకి వాళ్ళు వెళ్ళారు .

మొదటి బెంచి ఖాళీగా ఉండటంతో అక్కడే కూర్చుంది. ఎప్పుడూ అలా కూర్చోవటమే తన అలవాటు కూడా!

'ప్రవాహ' ప్రక్కనమ్మాయి స్నేహ పూర్వకంగా చేయి చాచింది.

" ధృతి " అంది ఆ చేతిని అందుకుంటు , ఆ స్నేహం ముందు ముందు మరింత ధృడ పడుతుందని అప్పుడు వాళ్లకు తెలియదు . భవిష్యత్తు ముందే మనిషికి తెలిస్తే ఇంకేమన్నా ఉందా??

చుట్టూ కలయ చూసింది ,అమ్మాయిలు 21 మంది అబ్బాయిలు 39.

ఈ లోపు లెక్చరర్ రావటంతో తన పరిశీలనను ఆపింది

ఎక్కువగా అందరూ టాప్స్, లేగ్గిన్స్ వేసుకున్నారు.. తనలా ఇద్దరు, ముగ్గురే డ్రస్సులు వేసుకున్నారు..

అందరూ జుట్టు విరబోసుకునే ! అలా జుట్టు వదిలి వెయ్యటమంటే అమ్మకు అస్సలు ఇష్టం ఉండదు. ఎప్పుడో ఒకసారి తప్ప తను అలా చెయ్యదు..జడ వేసుకుంటుంది.

అందుకే కొందరు అదోలా చూస్తున్నారు..

అయినా పట్టించుకునే మనస్తత్వం కాదు. మనమెలా ఉండాలో మన మేమి నిర్ణయించుకోవాలి, ఎదుటి వారి కోసం కాదు. ఇప్పుడు అందరూ ఎదుటి వారి కోసమే బ్రతుకు తున్నారు

పిచ్చి ముఖమా అంది మనసు.

నిజమే. అలాగే ఉంది. ప్రపంచం.

ఆ రోజు ఎక్కువ పరిచయాలతోనే గడిచిపోయింది. సాయంత్రం చిన్నన్నయ్య వరుణ్ వచ్చి ఇంటికి తీసుకు వచ్చాడు.

"ఎలా జరిగింది? అన్నాడు" దారిలో

జరిగిందంతా పూస గుచ్చినట్లు చెప్పింది.. కిరణ్ అన్న య్య ముందే చెప్పాడు. రాగింగ్ నామినల్ హ!" అని నవ్వింది..

సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు ..!

బండి ఆగిన శబ్దం వినగానే అమ్మ ఎదురు వచ్చింది. బాగానే ఉన్నావుగా " అంటూ

"ఏం? ఎర్ర బడ్డ కళ్ళలో వస్తాననుకున్నావా? "అంది నవ్వుతూ

అంతా రాగింగ్ గురించి ఏదో మాట్లాదుతుంటారు . అన్నయ్యల విషయంలో నేనంతగా పట్టించు కోలేదు. కానీ నీ విషయంలో మాత్రం కాస్త కంగారు పడ్డాను .

"ఎందుకమ్మా అలా! అన్నయ్యలను , నన్ను వేరే రకంగా పెంచావా ?నువ్వు ,నాన్న . ఏమాత్రం తేడా చూపించలేదు. అందుకే మేమంతా ఒకరంటే ఒకరం ప్రాణంగా పెరిగాము.

అవునే మీ విషయంలో నేనూ, నాన్న ముందే నిర్ణయించుకున్నాము . పిల్లలంతా సమానం. ఆడ ఏమిటి, మగ ఏమిటి? మాపక్క ఇంట్లో అలాంటి తెడాలు చాలా చూపేవాళ్ళు . అవి మనింట్లో లేకుండా చూసుకుందాం అనుకున్నాం. అలాగే చూపుతున్నాం".

"ఆకలేస్తోంది "

ఇదిగో రెడీగా చేసిపెట్టాను. నీ కిష్టమైన పచ్చిమిర్చి బజ్జి ,అన్నయ్యను కూడా రమ్మను అందరం కలసి తిందాము .

" అత్తయ్య ఎక్కడా కనిపించటం లేదు. "

"గుడి లో ఏదో పురాణం ఉందంటే వెళ్ళింది",

"నానమ్మ "

"ఇద్దరూ కలిపే వెళ్ళారు"

"ఓ"

"వాళ్ళిద్దూరూ తినేసే వెళ్లారు. నానమ్మకు నాలుగు బంగాళ దుమ్ప బజ్జీలు వేసి పెట్టాను."

"ఇంక కాలేజీ విశేషాలు ఏమిటి? "

"ఈ రోజు "ఓరియంటేషన్ డే " అని జరిపారు . ECE, కంప్యూటర, ఐ టి వాళ్ళందరినీ ఒక హాలులో కూర్చో పెట్టారు . కొంత మంది తల్లితండ్రులు కుడా వచ్చారు."

"తర్వాత"

"అందరికి కాలేజి విషయాలు చెప్పారు. కాలేజీ చరిత్ర అంతా చెప్పి మా బిల్డింగులు చుపించారు. ఆ తర్వాత వెళ్ళి మా క్లాసుల్లో కూర్చున్నాము "

" మరి రాగింగ్ ఏం చేసారు? "

"అదే. అక్కడికే వస్తున్నా" అంటు , ఆ విషయాలు కూడ పూను గుచ్చినట్లు చెప్పింది.

ఇంతలో నైట్ డ్రెస్ వేసుకొచ్చి వాళ్ళతో వరుణ్ కుడా చేరాడు

"దీని కాలేజిలో వింతలు విడ్డూరాలు అన్ని చెప్పేసిందా ?"

"ఆ చెప్పేసింది రా "

బజ్జీలను కోసి ఉల్లిపాయ ముక్కలు పెడుతున్న చెల్లి దగ్గర చేరాడు. తను కూడా ఆ పనిలో సాయం చేసాడు .తరువాత అందారు వాటిని తిన్నారు .

వదిన ఇంట్లో లేకపోతే ఏదో వెలితిగా ఉందిరా అన్నయ్య .వదినే కాదు ఈ ఇంట్లో ఒక్కరు లేకపోయినా ఆ లోటు ఎవ్వరు పుడ్చలేనిది .

"అవుననుకో "
ఇక నాన్న వుంటే ఆ సందడే వేరు .

"బాబాయి వాళ్ళు ఏదో పొలం కొంటున్నారు. అందుకే రమ్మంటే వెళ్ళారు. మీ నాన్న లేకుండా ఏ పనీ చేయరు కదా?"

"అవును కదా" అంది ధృతి బజ్జి తింటూ

"అన్నయ్య , వదినకు తెలిసిన వాళ్ళంట్లో పార్టీ ఉందట. ఈ రోజు ఆలస్యంగా వస్తామని చెప్పి వెళ్ళారు "

"అలాగా! ఒట్టి బ్బుజ్జీలు తినే కంటే ఇలా పెట్టుకొని తింటే భలే ఉంటుంది కాదమ్మా ?"

"బాగానే ఉంటుంది నీకు కాని చాలా సమయం పడుతుంది ఉల్లిపాయలు కోసి పెట్టటానికి "

"నానమ్మ ఉల్లి పాయల తొక్కువలిచింది . అత్తయ్య ముక్కలు కోసింది. "

"నానమ్మ, కూర్చో మన్నా ఊరికినే కూర్చోదే ! ఉన్నంత సేపూ ఏదో ఒకటి చేస్తూనే ఉంటుంది .. అందుకే నువ్వు ఎప్పుడూ ఆవిడకు అత్తయ్యలా చుడవు, అమ్మాలా చూసుకుంటావు"

"పెద్దవాళ్ళు పని చేసి పెట్టారా లేదా అని చూడకూడదు. ఆత్మీయత పంచారా లేదా అన్నదే గమనించాలి, వాళ్ళ జీవితమంతా కష్టపడి పిల్లలును పెంచి ఉంటారు. ఎన్నో కష్టాలు పడి ఉంటారు. ఈ వయసులో మనం వాళ్ళను కష్టపెట్టకూడదు " అంది మధురిమ

అలా ఆ సాయంత్రం గడిచిపోయింది

★★★★★★.

ఓ మధ్యాహ్నం క్యాంటిన్ లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు ప్రవాహ ,ధృతి .

మేము ముగ్గురం. అన్నలు ఇద్దరూ ECE అందుకే నేను ఆ బాటే పట్టాను . ఇద్దరికీ చదువుతుండగానే కాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు వచ్చేసాయి.

రెండేళ్ళ తర్వాత అమ్మా నాన్న వాళ్ళకి పెళ్ళిళ చేసేసారు. పెద్ద వదిన కూడా సాఫ్ట్వేర్, చిన్న వదిన మాత్రం ఎం బి ఏ చేసింది. పెళ్ళయిన రెండు సంవత్సరాలకే మా అత్తయ్య భర్త గుండెనొప్పితో చని పోయారు. అప్పటి నుంచి అత్తయ్య మా దగ్గరే ఉంటుంది . బాబాయిలందరి బాధ్యత నాన్నే తీసుకుని వాళ్ళని చదివించారు .

అన్నయ్యలు కూడా మాతోనే .అందరం కలిసే ఉంటాము . అప్పటి దాకా మౌనంగా అలా వింటున్న ప్రవాహ నోరు వెళ్ళ బెట్టింది. ఈ కాలంలో ఉమ్మడి కుటుంబాలు ఎక్కకు ఉన్నా యే? పెళ్ళి చేసుకున్నామా , వేరే కాపురం పెట్టామా అన్నట్లే ఉంది పరిస్థితి..

అదంతా అమ్మ వల్లే ,నాన్నగారిది అమ్మది అయిన సంబంధం కుడా కాదు . తాతయ్య నానమ్మ చూసి మంచి కుటుంబం అని చెబితే చేసుకున్నారు .అసలు వాళ్ళు ఇద్దరు ఎప్పుడు గొడవలు పడటం మేము చూడలేదు అంటే నువ్వు నమ్మాల్సిందే .

అంతా వింతగా ఉందే నువ్వు చెబుతుంటే !

అవునా !

మా అత్తయ్యని కుడా చెల్లిలా చూసుకుంటుంది మా అమ్మ

ఆహా !

సరే నీ విషయం చెప్పు ..

"లెక్కపెట్ట లేనంత ఆస్థి అమ్మకు . అమ్మను పెళ్లి చేసుకుని నాన్న ఇక్కడే ఉండిపోయాడు .అసలు నాన్న వయపు వారు ఎవరో ఏమిటో కూడా తెలియదు .ఎప్పుడన్నా అడిగినా చెప్పారు

నువ్వు కాలేజిలో ఫస్టు అయితే నేను మా కాలేజిలో ఎప్పుడు లాస్టు లో ఉండేదాన్ని .నాకు చిన్నపటినుండి చదువు మీద ఆసక్తి లేదు .


నాన్న వ్యాపారాలలో బిజీ , అమ్మ వ్యాపకాలలో బిజీ, నేను ఆయాల చేతుల్లోనే పెరిగాను .ప్రేమ రాహిత్యమే నా జీవితమంతా . దానికోసమే నేను ఆరాటపడుతూ ఉంటాను .తొందరగా మనుషులను నమ్మేస్తాను . తెలిసాక దూరంగా ఉంటాను . నిన్ను చూడాగానే ఎంతో ఆనందం అనిపించింది .ఇక నీతో మాట్లాడాక అది రెట్టింపు అయ్యింది .అందరూ నా డబ్బు చూసి స్నేహం చేసే వాళ్ళే , నువ్వు ఒక్కదానివే దానికి అతీతంగా ఉన్నావు అనిపించింది ."

"ఒక్క రోజులోనే నా గురించి అంత అంచనా వేశావు?" అంది ధృతి నవ్వుతూ

–ఇంకా ఉంది

బహుమతి పొందిన కథ

# బామ్మ సాహసం



క్రైం కథ



డా ఎం సుగుణరావు

అదొక గ్రూప్ హౌసింగ్. ఏడో, ఎనిమిదో అపార్ట్‌మెంట్లు ఉన్న హౌసింగ్ కాంప్లెక్స్. గేటు దగ్గర ఏ సెక్యురిటీ లేదు. సెల్లార్‌లో ఇస్త్రీ చేస్తున్న ఒక వ్యక్తి తలెత్తి చూశాడు ఆ అపార్ట్‌మెంట్‌లోకి వస్తున్న పెద్దావిడను.

''ఎవరింటికి వెళుతున్నారమ్మా?'' అన్నాడు.

తను వెళ్ళవలసిన ఇంటినెంబరు చెబుతూ, ''ఆ కుర్రాడి పేరు రాజీవ్. నా పేరు వర్ధనమ్మ'' అంటూ చెప్పింది.

బెంచీమీద తను చేస్తున్న ఇస్త్రీ చేయడం ఆపి, పై నుండి కిందకు ఒకసారి వర్ధనమ్మను చూసి ''మీరు వంటమనిషా?'' అన్నాడు.

''ఆ... ఆ.. ఆ..'' అంటూ తడబడిరది.

అతను వెంటనే ''బాబుగారు వంట మనిషి కోసమే చూస్తున్నారు. వెళ్ళండి పైకి. రెండో ఫ్లోర్'' అంటూ లిఫ్ట్‌వైపు చెయ్యి చూపించాడు.

లిఫ్ట్‌వైపు నడుస్తూ.. 'తంతే బూర్లగంపలో పడ్డట్టున్నాను' అనుకుంది వర్ధనమ్మ.

లిఫ్ట్ రెండో అంతస్తుకు చేరుకుంది. తనకు కావలసిన అపార్ట్‌మెంట్ ముందు బెల్ మోగించింది. రెండు నిముషాల తర్వాత తలుపు తెరుచుకుంది.

అతను ప్రశ్నార్ధకంగా చూసేసరికి వెంటనే చెప్పింది ''వంటమనిషి కావాలంటున్నారు కదా. నా పేరు వెంకాయమ్మ'' అంది.

''రండి రండి'' అన్నాడతను నవ్వుతూ.

వర్ధనమ్మ నకసిక పర్యంతం అతన్ని పరిశీలించింది.

భుజాల వరకూ వేలాడుతున్న జుట్టు, పల్చగా పెరిగిన గెడ్డం.

''మీరెక్కడ ఉంటారు?'' అడిగాడు వర్ధనమ్మను పరిశీలనగా చూసి.

''మాది ఈ వూరు కాదు. పొట్ట చేత పట్టుకుని వచ్చాను. పిల్లలు చూడటం లేదు. ఏదో వంటలు చేసుకొని బతుకుదామని'' అంది మెల్లగా.

''ఉండేది ఎక్కడ'' అన్నాడు అతను రెట్టించి.

''ఇక్కడకు దగ్గరలోనే బాబూ, తెలిసిన వాళ్ళింట్లో ఆశ్రయం కల్పించారు. రెండు మూడిళ్ళల్లో వంట మనిషిగా పని దొరికితే, నా భుక్తి గడిచిపోతుంది'' అంది మెల్లగా

''సరే ఎంత జీతం కావాలి?'' అన్నాడతను.

''ముందు నా పని చూడండి బాబు. తర్వాత మీరే ఇస్తారు, మీరు దయతలచినంత'' అంది.

ఆ మాటలు చెబుతున్నప్పుడు అవతలి గదిలోంచి ఇద్దరు కుర్రవాళ్ళు బయటకు వచ్చారు. వాళ్ళదీ అదే వయసు.

''ముగ్గురికి వంటచెయ్యాలి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్. మధ్యాహ్నం లంచ్. ఉదయం ఒకసారి వస్తే చాలు. రెండోసారి రావక్కర్లేదు'' అన్నాడా అబ్బాయి.

''సరే ఈరోజు నుండే మొదులెడతాను బాబు. వంటగదెక్కడ?'' అని అడిగింది.

ఆ అబ్బాయి, ఆ రూముకి ఆనుకుని ఉన్న చిన్న గదిలోకి తీసుకెళ్ళాడు.

**బహుమతి పొందిన కథ**

అక్కడ కిచెన్ ఫ్లాట్‌ఫాం, ఒక స్టవ్వు, కొన్ని పాత్రలు ఉన్నాయి. కూరగాయలు గాని, వంట సరుకులు గాని లేవు.

''బాబూ తీసుకొస్తారా సామాన్లు?'' అంది

''అవును, మేం ఇంతవరకూ ఇంట్లో వంట చేసుకోలేదు. సామాన్లు పట్టుకొస్తాం పావుగంటలో'' అంటూ మిగతా ఆ ఇద్దరిలో ఒకరు బయటకు నడిచారు, అతనితోపాటు.

మూడో వ్యక్తి ''తొందరగా రండి ఆకలేస్తుంది'' అంటూ అక్కడి నుంచి వాష్‌రూమ్‌లోకి నడిచాడు.

వాళ్ళు వెళ్ళిన వెంటనే తలుపు గడియ పెట్టింది వర్ధనమ్మ. మూడో కుర్రాడు వాష్‌రూమ్‌లో ఉన్నాడు. తనకు మంచి సమయం. 'ఇంతకీ ఈ ముగ్గురూ కలిసి ఈ ఇంట్లో ఏం వెలగబెడుతున్నారో?' అనుకుంటూ వంటగదికి ఆనుకుని ఉన్న బెడ్‌రూమ్‌లోకి ప్రవేశించింది.

మెల్లగా ఆ గదిలోని బీరువా తెరిచింది. ఏవో ఫైళ్ళు, పుస్తకాలు, సీడీలు. ఇంకో బీరువా తెరరబోయింది. ఇంతలో ఎవరో వస్తున్న చప్పుడు. గుండె ఆగినంత పనైంది వర్ధనమ్మకి. వాష్‌రూమ్‌లోకి వెళ్ళిన కుర్రాడు బయటకు వచ్చి, వర్ధనమ్మవైపు చూశాడు.

'దొరికిపోకూడదు.. దొరికిపోకూడదు.. ఏడుకొండలవాడా, వెంకటరమణా' అంటూ మనసులో మొక్కుకుంది.

అతను ఏదో చెప్పబోయేంతలో ''ఇంటినిండా దుమ్ము, ఎలా ఉంటున్నారు బాబూ.. గదిలో బూజులు'' అంది పైన సీలింగ్‌కి ఉన్న సాలెగూడును చూసి.

ఆ కుర్రాడు వెంటనే ''మాకు సర్వెంట్ మేడ్ లేదు. మేం వీలైనప్పుడు తుడుచుకుంటాం'' అన్నాడు.

''ఇల్లు బాగుచేద్దామని, చీపురు కోసం చూస్తున్నా'' అంది.

''ఆ మూలన ఉంటాది చూడండి'' అంటూ అతను తన గదిలోకి వెళ్ళిపోయాడు.

'హమ్మయ్యా' అనుకుంటూ, చీపురు చేతా తీసుకుని, గది తుడవడం ప్రారంభించింది. తర్వాత బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది. అక్కడున్న బీరువా తెరచి పరిశీలనగా చూస్తోంది. ఏదో ఫైల్ కనిపించింది. దాని జిప్ లాగేసరికి మనవరాలి చేతిరాతతో ఉత్తరాలు కనిపించాయి. ఇంతలో బెల్ మోగిన శబ్దం. ఆ ఫైల్‌ని గబగబా లోపలకు తోసేసి, వేగంగా వంటగదిలోకి వచ్చేసింది. వచ్చేసినా ఇంకా గుండెదడ తగ్గలేదు.

తలుపు తెరిచేసరికి, రాజీవ్, ఇంకో కుర్రాడు సంచులు మోసుకుంటూ లోపలకు వచ్చారు. కూరగాయలు, పచారీ సామాన్లు. వాళ్ళే ఆ సామాన్లను వంటగదిలోకి చేర్చి, కూరగాయల సంచులు ఆమె చేతికిచ్చారు.

తెచ్చిన కూరగాలయను ఫ్రిజ్‌లో సర్ది, తన పని మొదలెట్టింది.

గంట తర్వాత ఆ ఇంట్లోంచి బయట పడిరది.

★★★

తర్వాతరోజు ఉదయం అదే టైమ్‌కి ఆ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించింది వర్ధనమ్మ. నిన్న తనకు కనిపించిన ఇస్త్రీ అబ్బాయ్ ఆమె వంక నవ్వుతూ చూసి

''వంటపని కుదిరిందామ్మా?'' అన్నాడు.

''కుదిరింది బాబూ..'' అంటూ ముందుకు నడుస్తుంటే

''ఆ బాబు చాలా మంచోడు. మీకు

**బహుమతి పొందిన కథ**

మంచి ఇల్లే దొరికింది. బాగా చేసుకోండి'' అన్నాడు.

ఆ మాటలకు ఆశ్చర్యపడుతూ ముందుకు కదిలింది వర్ధనమ్మ.

'ఈ కుర్రాడికి మంచి ఫాలోయింగే ఉంది. అంటే రికార్డ్ బిల్డప్ చేసుకుని, ఎవరికీ అనుమానం కలగకుండా, చేయాల్సింది చేసేస్తున్నాడా' అనుకుంటూనే లిఫ్ట్ ఎక్కింది.

బెల్ మోగించగానే వెంటనే తలుపు తెరుచుకోలేదు. రెండు నిముషాల తర్వాత తలుపు తీశాడు రాజీవ్.

కళ్ళు ఎర్రగా కనిపిస్తున్నాయ్. తలుపు పూర్తిగా తెరవకుండానే ''ఇవాల్టికి వంట అక్కరలేదులెండి'' అన్నాడు.

''నిన్న కూరగాయలు అన్నీ కోసి పెట్టాను. ఇడ్లీకోసం పప్పు నానబెట్టాను.'' అంటూ లోపలకు రాబోయింది.

''అబ్బే అక్కరలేదండీ.. పోతే పోనివ్వండి'' అన్నాడు విసురుగా.

''అయ్యో వాసన వస్తుంది బాబూ'' అంటూ అతన్ని దాటుకొని లోపలకు వచ్చేసింది.

అతను దఢాలున తలుపు వేసి, బోల్టు పెట్టి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అతని చేష్టలు అనుమానంగా కనిపించాయి వర్ధనమ్మకు.

'నిన్న చాలా ప్రశాంతంగా కనిపించాడు. ఈరోజు ఏమైందో ఈ కుర్రవాడికి? ఆ ఇంట్లో అతను తప్ప మిగతా ఇద్దరు కుర్రవాళ్ళూ లేనట్టున్నారు' అనుకుంది.

పరిసరాలను గమనిస్తూనే వంటగదిలోకి వెళ్ళి కూరగాయలు కట్ చేయడానికి తీసింది. పప్పు రుబ్బడానికి సిద్ధమయ్యింది. మెల్లగా నిన్న తనకు దొరికిన ఆ ఫైల్ ఉన్న ఆ బెడ్‌రూమ్‌వైపు కదిలింది.

అదృష్టవశాత్తూ ఆ రూమ్ ఖాళీగానే ఉంది. 'ఇంతకీ ఈ కుర్రవాడు తలుపు వేసుకొని ఏం చేస్తున్నట్టు ఒక్కడే? ఆ కుర్రవాడ్ని బయటకు లాగడం ఎలా?' అనుకుంటూ తలుపు కొట్టింది.

తలుపు తెరుచుకోలేదు. ఇక తను చేయాల్సిన పని చేయడమే బెటర్, ఆ కుర్రవాడు తలుపు తీయడం లేదు, నిద్రపోతున్నాడేమో' అనుకుంటూ ఆ బెడ్‌రూమ్‌లోపలికి జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి, బీరువా తెరిచింది. ఆ ఫైలు కనిపించింది. గుండెల్లో దడ మొదలైంది. తన గుండె చప్పుడు తనకే వినిపిస్తోంది. చాలా వేగంగా ఆ ఫైలు ఓపెన్ చేసింది. మనవరాలు వ్రాసిన ప్రేమలేఖలు మడతపెట్టి చీరలోపలికి దోపుకుంది. చాలా వేగంగా వంటగదిలోకి వచ్చేసింది.

ఇంతలో తలుపు తెరుచుకున్న శబ్దం. వంటగదిలో కూరగాయలు తీసి గబగబా తరగడం మొదలెట్టింది.

ఆ కుర్రవాడు వచ్చి ''ఏం కావాలి?'' అన్నాడు విసుగ్గా. మనిషి తూలిపోతున్నట్టు కనిపిస్తున్నాడు. మొహం నిండా చెమట్లు.

''ఎంతమందికి వంట చేయమంటారు బాబు?'' అంది.

సమాధానం చెప్పకుండా, ఆ మెయిన్ డోర్‌కు తాళం వేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

'ఏమైంది వీడికి?' ఆమెలో గాబరా ఎక్కువైంది. కొంపదీసి తను ఉత్తరాలు తీయడం చూశాడా. తనను ఏమైనా చేస్తాడా? అసలు ఆ రూమ్‌లో ఏం చేస్తున్నాడు? ఆమెలో అలజడి, ఉత్కంఠ, భయం ఏకకాలంలో కలిగాయి. మెల్లగా నడుచుకుంటూ వంటగదిలోంచి ఆ అబ్బాయి ఉంటున్న రూమ్ పక్కన బెడ్‌రూమ్‌లోకి నడిచింది. ఆ రూమ్‌కి ఆనుకునే బాల్కనీ. ఆ పక్కనే ఆ కుర్రవాడు ఉంటున్న గది కిటికీ కాస్త తెరిచి ఉంది. ధైర్యం చేసి ఆ కిటికీలోంచి చూడవచ్చేమో.. అనుకుంటూ పిల్లిలాగా అడుగులు వేస్తూ కొద్దిగా వంగి, ఆ కిటికీలోంచి చూసింది.

**బహుమతి పొందిన కథ**

అంతే.. ఆమె గుండె ఆగిపోయేంత దృశ్యం. లోపల ఒకమ్మాయి. ఆ అమ్మాయి పడుకుని ఉందో, మగతగా మత్తులో ఉందో తెలియడం లేదు. ఆ గదినిండా సిగరెట్ పొగ. వేగంగా ఆ బాల్కనీ దాటి వంటగదిలోకి వచ్చి పడిరది.

'వీడు తాళం వేసేశాడు. ఇప్పుడు ఈ ఇంటినుండి ఎలా బయటపడడం? కూరగాయలు తీసి అన్యమనస్కంగానే కోస్తోంది. అలా కూరగాయలు కోస్తున్న వర్ధనమ్మకు వేలు తెగింది.

''అమ్మో!'' అంటూ ఒక్కసారిగా అరిచింది. వేలు నుండి రక్తం ధారాపాతంగా. ''అమ్మో.. బాబోయ్'' అంటూ ఇంకా గట్టిగా అరవడం మొదలెట్టింది.

ఆ గదిలోంచి కుర్రవాడు పరుగెట్టుకొంటూ వచ్చి ''ఏమైంది'' అన్నాడు విసుగ్గా.

తన వేలును చూపించింది. రక్తం ప్రవాహంలా కారుతోంది.

పక్కనే తరిగిన కూరగాయ ముక్కలు, రుబ్బడానికి సిద్ధం చేసుకున్న పప్పులు.

''బాబూ నేను అర్జెంటుగా హాస్పటల్‌కి వెళ్ళాలి. నేను డయాబెటిక్ పేషెంట్‌ని'' అంది.

''సరే జాగ్రత్తగా వెళ్ళండి'' అంటూ తలుపు తాళం తీసి, ఆమె బయటకి వెళ్ళగానే వేగంగా తలుపు వేసుకున్నాడు.

'హమ్మయ్యా' అనుకుంటూ లిఫ్ట్‌వైపు పరుగెత్తింది. పరుగెడుతూనే.. రక్తం కారుతున్న తన వేలుకి కొంగు చింపి కట్టు కట్టుకుంది. ఆమె నడుస్తున్న మేర రక్తం చుక్కలు చుక్కలుగా పడుతుంది. లిఫ్ట్ ఎంత నొక్కినా పైకి రాలేదు. కొంపదీసి కరెంటు లేదేమో అనుకుంటూ.. పరుగెత్తుకుంటూ మెట్లగుండా కిందకు దిగింది, ఆయాసం వస్తున్నా.

పరుగెడుతున్న ఆమెను చూసిన ఆ ఇస్త్రీ అబ్బాయి ''ఏమైందమ్మా'' అన్నాడు.

సమాధానం చెప్పకుండానే గేటు దాటింది వర్ధనమ్మ. గుడ్డ కట్టినా రక్తం కారుతూనే ఉంది. ఇప్పుడు తను బయట పడిరది. లక్ష్యాన్ని పూర్తి చేసింది. కానీ మనవరాలంటి మరో అమ్మాయి, ఆ దుర్మార్గుడి వలలో చిక్కుకుంది. ఇప్పుడు ఆమెను రక్షించాలి. దానికంటే ముందుగా తను, ఈ వేలుకు కట్టు కట్టించుకోవాలి అనుకుంటూ, కనిపించిన ఆటో ఎక్కేసి,

''ఏదైనా హాస్పటల్‌కి పోనీయ్ బాబూ. వేలు తెగింది, ముసలిదాన్ని'' అంటూ కంగారు పెట్టింది.

పావుగంటలో ఆటో అబ్బాయి ఆమెను ఒక చిన్న క్లినిక్ ముందు దింపి, డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు.

క్లినిక్ లోపల నర్స్‌ను పిలిచి, ''అర్జెంటమ్మా.. రక్తం కారిపోతోంది'' అంటూ తెగిన వేలు చూపించింది.

''అయ్యో'' అంటూ ఆ నర్సు వేలికి చుట్టిన గుడ్డను విప్పి, దాన్ని డెట్టాల్‌తో కడిగి కట్టు కట్టి, ఇంజెక్షన్ చేసింది. చేతులు కడుక్కోవడానికి ఆ నర్సు వాష్‌రూమ్‌లోకి వెళ్ళగానే, అక్కడే ఉన్న లాండ్‌లైన్ నుంచి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసింది.

అవతల ఫోనెత్తిన కానిస్టేబుల్‌తో, రాజీవ్ ఉంటున్న అపార్ట్‌మెంట్ పేరు చెప్పి, ''ఆ అపార్ట్‌మెంట్‌లో ఏదో ఘోరం జరుగుతోంది. రాజీవ్ అనే అబ్బాయ్ ఏదో చేయబోతున్నాడు. మీరు వెంటనే అక్కడికి వెళ్ళి ఆ అమ్మాయిని కాపాడండి'' అంది.

''మీరెవరు ఇంతకీ'' అంటూ అవతలి నుండి అరుస్తున్నా, సమాధానం చెప్పకుండా ఫోన్ పెట్టేసింది.

ఆ క్లినిక్‌లోని నర్సుకి బిల్ చెల్లించి, ఆటోలో ఇంటివైపు సాగింది.

ఇంటివైపు వెళుతున్న వర్ధనమ్మకు వారం రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

★★★

వంట చేస్తున్న వర్ధనమ్మకు చిన్నగా

**బహుమతి పొందిన కథ**

మనవరాలు ఏడుస్తున్న శబ్దం వినిపించింది.

''ఎందుకు ఏడుస్తున్నావు?'' అంది కంగారుగా.

ఆ మాటలకు సమాధానం చెప్పకుండా ఏడుస్తూనే ఉంది అపర్ణ.

''చెప్పు ఏమైంది?'' అంటూ మనవరాలి భుజాన్ని పట్టుకుని కుదిపింది.

అయినా ఏడుపు ఆపలేదు.

ఒక్కసారి ఆలోచనలో పడిరది వర్ధనమ్మ.

ఇంకో రెండు నెలల్లో పెళ్ళి. కొంపదీసి పెళ్ళి ఇష్టం లేదా? అంతా నిర్ణయించేశాం. అబ్బాయి బాగున్నాడు, మనవరాలికీ నచ్చాడు. ఇద్దరూ కలిసి అమెరికా వెళ్ళబోతున్నారు. నిశ్చితార్థం కూడా అయిపోయింది. ఈ పరిస్థితుల్లో తను పెళ్ళి వద్దనుకుంటోందా? ఆలోచనల్లోంచి బయటకు వచ్చి`

''ఏమిటి పెళ్ళి ఇష్టం లేదా?'' అంది వర్ధనమ్మ మనవరాలి నుదుటిమీద చేతితో రాస్తూ...

''ఇష్టమే..'' అంది ఏడుపు ఆపకుండా.

''మరైతే ఎందుకు ఏడుస్తున్నావ్...'' అంది.

''ఒక సమస్యలో ఇరుక్కున్నాను'' అంది మనవరాలు.

''బాబోయ్..'' అంది ఆ మాటలకు వర్ధనమ్మ.

తన కొడుకు, కోడలు అమెరికా వెళ్లారు. పెద్ద మనవరాలి డెలివరీ దగ్గర పడిరది. ఇప్పుడిలాంటి సమస్యను తనొక్కత్తే ఎదుర్కోగలదా. అసలేం సమస్యో... అనుకుంటూ

''ఉండు.. కాఫీ తెస్తాను తాగేసి, స్థిమిత పడుదువుగాని.'' అంటూ వంటగదిలోకి వెళ్ళింది.

పది నిముషాల్లో కాఫీ తయారు చేసి వచ్చింది. అప్పటికి ఇంక ఏడ్చే ఓపిక లేనట్టుగా దిగాలుగా కూర్చుంది అపర్ణ.

ఒక గుక్క కాఫీ తాగి, ''నన్నొకడు బెదిరిస్తున్నాడు'' అంది.

''ఎవడు వాడు? దేనికి?'' అంది ఆదుర్దాగా.

''ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్‌లో ఉన్నప్పుడు, మా క్లాస్‌మేట్ ఒకడితో స్నేహం చేశాను. ఇద్దరం సినిమాలకు, బీచ్‌కు తిరిగేవాళ్ళం. అప్పుడప్పుడు వాడికి నేను ఉత్తరాలు వ్రాసేదాన్ని. తనూ నాకు వ్రాసేవాడు. ఆ తర్వాత వాడు మంచివాడు కాదని తెలిసింది. చాలామంది అమ్మాయిలను ఇలానే ట్రాప్ చేస్తాడట. అందుకని వాడికి బ్రేకప్ చెప్పేశాను. ఇంజనీరింగ్ పూర్తయ్యే వరకూ వాడితో కాంటాక్ట్‌లో లేను. అంతా ముగిసిపోయిందనుకున్నాను. ఈరోజే నా సెల్‌కి ఫోను చేశాడు. ఆ ప్రేమలేఖలన్నీ బయట పెడతాను అంటున్నాడు. తనకు రెండు లక్షల రూపాయలు ఇస్తే, వాటిని తిరిగి ఇచ్చేస్తాడట'' అంది మళ్ళీ చిన్నగా ఏడుస్తూ.

ఆ మాటలకు వర్ధనమ్మ గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

''ఈ కాలంలో ప్రేమలేఖలు రాసుకోవడమేంటి? విడ్డూరంగా ఉంది. మీరు సెల్‌ఫోన్‌లోనే మెసేజ్‌లు పెట్టుకుంటారు. వాట్సాప్‌లోనే కదా సందేశాలన్నీ... మీ తరం ప్రేమలేఖలు వ్రాసుకోవడమేంటి? విచిత్రంగా ఉంది'' అంది.

ఆ మాటలకు ''వాడూ వ్రాసేవాడు, నేనూ వ్రాశాను'' అంది దిగులుగా.

''ఇంజనీరింగ్ చదివేవాడికి ఇదేం పని! వాడికి ఉద్యోగం, సద్యోగం లేదా'' అంది వర్ధనమ్మ.

''వాడు ఇంజనీరింగ్ పూర్తి చేయలేకపోయాడు. ఏదో కంపెనీ పెడుతున్నాడట. డబ్బులు అవసరమట. ఈ ఊళ్ళోనే ఏదో అపార్ట్‌మెంట్‌లో ఉంటానని, ఆ ప్రేమలేఖలు కావాలంటే రెండు లక్షల డబ్బులు పట్టుకుని ఈరోజే రమ్మన్నాడు'' అంది అపర్ణ.

**బహుమతి పొందిన కథ**

ఒక్కసారి ఆలోచనల్లో పడిరది వర్ధనమ్మ. వెంటనే అంది

‘‘ఏం చేద్దామనుకుంటున్నావు?’’

‘‘రెండు లక్షలు ఇచ్చేసి అవి తెచ్చేసుకుంటాను. అవి బయట పడతే ఇబ్బంది కదా!’’ అంది మనవరాలు మెల్లగా.

‘‘పిచ్చిదానా.. వాడు నిన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. నీకు పెళ్ళి కుదిరిందని తెలిసి, నువ్వు సాఫ్ట్‌వేర్ కంపెనీలో

ఉద్యోగం చేస్తున్నావని, డబ్బులు లాగుదామని చూస్తున్నాడు. ఈ విషయం నాకు వదిలై, నేను చూసుకుంటాను. వాడుండే అడ్రస్ నాకు చెప్పు’’ అంది వర్ధనమ్మ మనవరాలి తల నిమురుతూ.

‘‘నువ్వా? ఈ వయసులోనా...?’’ అంది మనవరాలు బామ్మ ముఖంలోకి పరిశీలనగా చూస్తూ..

‘‘నాకేం వయసైపోయిందని. అరవై దాటాయి. చిన్నప్పుడే పెళ్ళి కావడం, పదహారేళ్ళకే మీ నాన్న పుట్టడంతో ముసలిదానిలా కనిపిస్తున్నాను’’ అంది.

ఆ మాటలకు అపర్ణ బామ్మ చేతులు పట్టుకొని ‘‘నువ్వు వాడి దగ్గరకు వెళ్ళడం రిస్కేమో.. నేను కూడా వస్తాను’’ అంది.

‘‘లేదు వాడికి ఫోన్ చేసి, రెండు రోజులు టైం అడుగు. ఈలోగా నేను పని చక్కబెడతాను’’ అంది.

‘‘ఇది వాడుంటున్న అడ్రస్’’ అంటూ కాగితం మీద రాసి ఇచ్చింది.

ఆ అడ్రస్ చదువుకున్న వర్ధనమ్మ ‘‘మన ఇంటికి దగ్గరే.. రేపు ఉదయమే కార్య రంగంలోకి దూకుతాను’’ అంది దృఢంగా.

‘‘ఏం చేస్తావు?’’ అంటూ బామ్మ ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది.

‘‘ప్రస్తుతం ప్లాన్ ఏమీ లేదు. పనిచేసుకుంటూ ప్లానింగ్ చేయడమే నా పని’’ అంది.

బామ్మ వంక ఆరాధనాపూర్వకంగా చూసి, ఆమె మెడమీద చేతులు వేసి దగ్గరకు లాక్కుంది అపర్ణ.

ౘ

అదీ విషయం.. మనవరాలిని రక్షించడం కోసం అంత సాహసం చేయాల్సివచ్చింది వర్ధనమ్మ.

★★★

తర్వాతిరోజు ఉదయం కాఫీ తాగుతూ, పేపర్ చదువుతున్న వర్ధనమ్మ ‘‘సూపర్’’ అంటూ గావుకేక పెట్టింది.

‘‘ఏమైంది’’ అంటూ అపర్ణ పరుగెత్తుకుంటూ వచ్చింది.

‘‘ఆ రాజీవ్‌ను పట్టుకున్నారట. ఆ ఇంట్లో డ్రగ్స్ దొరికాయి. వాడి వలలో పడ్డ అమ్మాయిని రక్షించారు’’ అంది.

‘‘థాంక్యూ బామ్మా... నీ మనవరాలితో పాటు ఇంకో మనవరాలిని కూడా రక్షించావు’’ అంది అపర్ణ బామ్మ వంక ఆపేక్షగా చూస్తూ.

ఆ మాటలకు తలూపి, పేపర్లో తల దూర్చిన ఆమెను చూసి, ‘‘అనవసరంగా గాయం తగిలించుకున్నావు. అసలే నీకు షుగర్ ఉంది’’ అంది.

‘‘అనవసరంగా కాదు, అవసరంగా వేలు తెగ్గోసుకున్నాను’’ అంది బామ్మ గట్టిగా నవ్వుతూ.

‘‘మైగాడ్’’ అంది ఆశ్చర్యంగా అపర్ణ.

‘‘అవును ఆ ఇంటిలోంచి బయట పడాలంటే, ఇంకో మార్గం లేదు’’ అంది తన వేలివంక చూసుకుంటూ.

‘‘నువ్వు సూపర్ బామ్మా..’’ అంటూ అపర్ణ వర్ధనమ్మను గట్టిగా హత్తుకుంది.

★★★

వాస్తవ కథ

# చెక్క గుర్రాలు



–ఈదర శ్రీనివాస రెడ్డి

"పది రూపాయలు కాదు కదా, పది పైసలు కూడా ఇవ్వను, ఆ కుక్క దగ్గరకు ఎవరు వెళ్ళమన్నారు? ఎవరు కరిపించుకోమన్నారు?" అందరూ వినేటట్లు పెద్దగా అరుస్తున్నాడు పంచవటి ప్లాట్ ఓనర్స్ యూనియన్ సెక్రటరీ వామనరావు

ఆ అరుపులకు, ఈ పాటికి ఏం జరిగిందోననే ఆందోళనతో అపార్ట్మెంట్లలో నివసించే వాళ్ళు చాలామంది బయటకు రావాలి, కాని ఒకరిద్దరు మాత్రమే కిటికీల గుండా తలలు బయట పెట్టి తొంగి చూస్తున్నారు మౌనంగా , కాంక్రీట్ గూళ్లలో రెక్కలు తెగిన పక్షులలా.

నేటి అంతర్జాల యుగంలో, ప్రపంచం మొత్తం అరచేతిలో ఇమిడిపోయిందనేమో మనుషులు ఎవరూ బయటికి రావడం కూడా మానేశారు. పైపెచ్చు "ఆకలి కాలం" కావడంతో పక్క వాడి గురించి పట్టించుకునే ఆలోచన, అవసరం, అవకాశం రావట్లేదు జనానికి.

నడిరోడ్డు మీద ప్రమాదాలు జరిగి ప్రాణాపాయంలో పడి కొట్టుకుంటున్నా, చోద్యం చూస్తూ వెళ్ళిపోతున్నారు తప్ప, సాయం చేద్దామని ఎవరికీ అనిపించక పోవటాన్ని ఏమనాలో తెలియటం లేదు.

ఆ అరుపులకి సిగ్గు తో చచ్చిపోయాడు ఓబులేసు.పుట్టి బుద్దెరిగిన తర్వాత ఓబులేసును అలా తిట్టిన వాళ్ళు ఎవరూ లేరు. ఇంకా ఒక్క నిమిషం కూడా అక్కడ ఉండబుద్ధి కాలేదు, కానీ అతని అవసరం అతన్ని అక్కడనుంచి కదలనివ్వలేదు.

"ఊరికే వద్దయ్యా, పోనే అప్పుగా నైనా ఇవ్వండి. ఈయాల పిల్లాడికి కుక్క ఇంజక్షన్ చేయించకపోతే ప్రమాదమట" అవమానంతో పూడుకుపోయిన ఓబులేసు గొంతులో నుంచి సన్నగా బయటకు వచ్చాయి మాటలు

"ఇప్పటికే నువ్వు తీసుకున్న అప్పు జమేసుకుంటే, ఆరునెలల దాకా నీకు ఒక్క రూపాయి కూడా రాదు. ఆ ఇంజక్షన్ ఏదో గవర్నమెంట్ హాస్పిటల్లో చేస్తారు గాని తీసుకెళ్ళు" అంటూ ఒక ఉచిత సలహా పారేసాడు వామనరావు

"ఆ ఇంజక్షన్లు ఏవో అక్కడ ఉండవట అయ్యా, బయట ప్రైవేటు ఆస్పత్రిలోనే దొరుకుతాయట, అందుకని" మళ్లీ నసిగాడు ఓబులేసు

"ఇన్ని తెలిసిన వాళ్ళు ,కుక్క నోటికాడి బిస్కెట్లు తీస్తే కరుస్తుందని తెలియదా మీకు" ఓబులేసు చేసిన తప్పును ఎత్తిచూపుతూ కాస్త కరువుగా అడిగాడు వామనరావు

"చిన్న పిల్లాడికి ఏమి తెలుసయ్యా? ఆకలేసిందో ఏమో ?కుక్క దగ్గరి బిస్కెట్లు తీసుకోపోతే, అది కాస్తా పిల్లాడి మీదకి ఎగబడి కరిచిందయ్యా , వళ్ళంతా గాట్లే" ఓబులేసు గొంతులో నుంచి మాటలు రాకముందే కళ్ళలోంచి కన్నీళ్లు జలజలా రాలాయి

"నువ్వు ఎన్నైనా చెప్పు, నీకు మాత్రం ఒక్క రూపాయి కూడా రాదు ఈనెల" అంటూఅక్కడి నుంచి లేచి వెళ్లిపోయాడు రామారావు.

ఈ చోద్యం అంతా అక్కడ నిలబడి చూస్తున్న ఒకరిద్దరికీ కూడా ఓబులేష్ కి పది రూపాయలు సాయం చేద్దామనిపించలేదు.

ఇటువంటి సంఘటనలు గమనిస్తున్నప్పుడు, ఒక్కోసారి మనం మనుషుల మధ్య ఉన్నామా లేకపోతే అరణ్యాలలో ఉన్నామా అని అనిపిస్తుంది.

ఓబులేసు ఏడాది కాలంగా పంచవటి అపార్ట్మెంట్లో వాచ్ మెన్ గా పని చేస్తున్నాడు. అపార్ట్మెంట్ సెల్లార్లోని ఒక గదిలో ఓబులేష్ తన భార్య, పిల్లాడితో కాలం గడుపుతూ వస్తున్నాడు. ఓబులేసు భార్య రత్తాలు అదే అపార్ట్మెంట్లో నాలుగిళ్లలో పాచిపని చేస్తూ భర్త సంపాదించే వేడి నీళ్లకు కాసిన్ని చన్నీళ్ళు కలుపుతూ అండగా నిలుస్తోంది.

ఓబులేషు నాలుగేళ్ల పిల్లాడు

## వాస్తవ కథ



అపార్ట్ మెంట్ లో కాపలాకు ఉంచిన కుక్కకు వేసిన బిస్కెట్లు తీసుకోపోతే, అది కాస్తా ఆ పిల్లాడి మీద పడి ఒంటినిండా రక్కి పెట్టింది.

డాక్టరు దగ్గరకి వెళితే బొడ్డు చుట్టూ నాలుగు ఇంజక్షన్లు పొడవాలి, నాలుగు వేలు అవుతుందన్నాడు.

ఇప్పుడు అపార్ట్మెంట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సెక్రెటరీ రూపాయి కూడా ఇవ్వను పొమ్మంటున్నాడు. నిజానకి అపార్ట్మెంట్లో కాపలాగా ఉండే కుటుంబం యొక్క మంచిచెడ్డలు అన్నీ కూడా అసోసియేషనే చూసుకోవాలి. కానీ ఈ నియమం ఎవ్వరు కూడా పాటిస్తున్నట్లు కనపడరు.

అపార్ట్మెంట్లలో పనిచేసే వాళ్ళందరూ ,ఏదో తమ దయాదాక్షిణ్యాల మీద బతుకుతున్న పరాన్నజీవులు అని అనుకుంటూ ఉంటారు, అపార్ట్మెంట్లలో నివసించే వాళ్ళందరూ. కానీ నిజానికి తామే నిజమైన పరాన్నజీవులమని,ఆ పని వాళ్లే లేకపోతే తమ ఇంటి పొయ్యిలో పిల్లి కూడా లెగవదని తెలుసుకోలేకపోతున్నారు చాలామంది.

ఇక చేసేదేమీలేక బిక్క మొహం వేసుకుని తన ఇల్లు అనబడే సెల్లార్లోని ఇరుకు చీకటి గదివైపు నడిచాడు ఓబులేసు.

బహుశా వామనరావు అరుపులు విన్నదో ఏమో ,మొగుడు వాలకం చూసి అంతా అర్థమైనదానిలా, తన మెడలో పుస్తెలతాడు తీసి ఓబులేష్ చేతిలో పెట్టింది రత్తాలు, ఎక్కడైనా తాకట్టు పెట్టి డబ్బులు తీసుకు రమ్మన్నట్లు.

పెళ్లైన దగ్గర నుంచి రత్తాలు మెడలో కంటే తాకట్టు కొట్లోనే ఎక్కువ కాలం గడిపింది ఆ పుస్తెలతాడు.

చేసేదేమీలేక పుస్తెల తాడుని ఎక్కడన్నా మార్వాడీ కోట్లో తాకట్టు పెట్టి డబ్బులు తేవడానికి రోడ్డెక్కాడు ఓబులేసు.

మొగుడు వెళ్లిన వైపే చూస్తూ గతంలోకి జారుకుంది రత్తాలు

★★★

"టౌనుకి పోయి ఏదన్నా పని చూసుకుందాం అనుకుంటున్నాను" తండ్రి పక్కన కూర్చుని చిన్నగా నసిగాడు ఓబులేషు.

ఆ మాటలకు ఒకింత ఆశ్చర్యపోయిన యాదయ్య అంతలోనే తేరుకుని," ఏంది రా అంటుండావు, మమ్మల్ని అందర్నీ వదిలేసి టౌనుకి పోతావా, ఇది నీకు పుట్టిన బుద్ధా? మీ ఆవిడకి పుట్టిన బుద్ధా?" అంటూ నిలదీశాడు ఓబులేసుని

"ఎవరికి పుట్టిన బుద్ధి అయితే ఏంది, నేనన్న మాటలలో తప్పేముంది? రెండేళ్లుగా పంటలు పండక నానా తిప్పలు పడుతున్నాము. ఇంకా ఎన్నాళ్లు అని అప్పులతో బతుకుల్ని వెళ్లదీస్తాము. అందుకనే పట్నానికి పోయి ఏదన్నా పని చూసుకుందాం అనుకుంటున్నా" తండ్రికి కోపం వచ్చిందని అర్థం అయినవాడిలా వాస్తవం వివరించబోయాడు ఓబులేసు.

యాదయ్య, తాత ముత్తాతల నుండి సంక్రమించిన రెండెకరాల మెట్ట భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు ఇన్నాళ్ళు. పండినా పండకపోయినా, తిన్న తినకపోయినా ఊర్లో మాత్రం తలెత్తుకుని గౌరవంగా తిరిగేవాడు,ఏనాడూ ఒకరిని చెయ్యి చాచింది లేదు.

కానీ కొడుకు ఓబులేసు హయాం వచ్చేసరికి వానలు సకాలంలో కురవక, ప్రభుత్వాల నుండి సాయం అందక, పంటలు సరిగా పండక, అప్పుల పాలు అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దానికి కారణం కూడా

వాస్తవ

# కథ



లేకపోలేదు. కుటుంబం పెరిగింది అవసరాలు పెరిగాయి, కానీ ఆదాయం మాత్రం పెరగలేదు యాదయ్య కుటుంబానికి.

"ఇదేమన్నా మనకు కొత్తా? ఎప్పుడూ ఉండేదేగా, ఒక్కో ఏడాది పండుతాయి ,ఒక్కో ఏడాది పండవు . అంతమాత్రాన నేల తల్లిని వదులుకొని పోతామా?" కొడుకు బాధ అర్థం అయిన వాడిలా సముదాయించ బోయాడు యాదయ్య.

"ఎంతకాలమని ఓపిక పడతాము ఆకలి పేగులతో. కనీసం కట్టుకున్నదానికి, కడుపున పుట్టిన వాళ్ళ కడుపు నింపలేనప్పుడు ఎంత భూమి ఉండి ఏమి ఉపయోగం?"అంటూ నిట్టూర్చాడు ఓబులేసు.

"ఒకరి దగ్గర నౌకరీ చేసేకంటే, కలో గంజో తాగి కడుపులో కాళ్లు పెట్టుకొని హాయిగా నిద్ర పోవడం మంచిది కదరా, ఓబయ్యా" అప్పటిదాకా తండ్రి కొడుకుల వాదన వింటూ ఉన్న ఓబులేసు తల్లి దేవమ్మ మొగుడికి వంత పాడింది

"ఈ పల్లెటూర్లో ఉంటే నా కొడుకు కూడా నీ కొడుకులా మట్టి పిసుకుకోవాల్సిందే. అదే పట్నంలో అయితే మంచి స్కూల్లో నా బిడ్డను చదివించు కుంటే, ఏదో ఒక నౌకరీ అన్నా దొరుకుతుంది" అప్పటి దాకా మౌనంగా వున్న రత్తాలు అత్తకు ఎదురు జవాబిచ్చింది, తన మొగుడికి వత్తాసుగా తానున్నాను అన్నట్లు.

గొడవ పెద్దది అవుతుందని గ్రహించిన యాదయ్య, "ఈయన్నీ సరే, ఇంతకీ ఇప్పటికిప్పుడు నీకు నౌకరి ఎవరిస్తారు ఓబయ్య "అంటూ కొడుకును ప్రశ్నించాడు యాదయ్య.

"మన ఊరి ముసలయ్య కొడుకు సోములు పట్నంలో పని చేస్తున్నాడు. వాడు నౌకరీ ఇప్పిస్తానన్నాడు " అంతా ముందుగానే చూసుకున్నాం అన్నట్లు జవాబిచ్చాడు ఓబులేసు

"వాడా? ఆ సోములు గాడేదో పట్నంలోని అపార్ట్మెంట్లో వాచ్ మెన్ గా పని చేస్తున్నాడని విన్నానే. ఆడు నీకేం నౌకరీ ఇప్పిస్తాడు" అనుమానంగా ప్రశ్నించాడు యాదయ్య

"అదే నౌకరి, నాకు కూడా ఇంకో అపార్ట్మెంట్లో వాచ్ మెన్ గా ఉద్యోగం చూసి పెట్టాడు" చిన్నగా అసలు విషయం బయట పెట్టాడు ఓబులేసు.

"ఆడంటే తాడు బొంగరం లేనోడు, ఆడు ఇక్కడా చేసేది కూలి పనే, అక్కడా చేసేది కూలిపనే. నీకా కర్మ ఏం పెట్టింది. మనకున్న భూమితో పాటు, నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని కష్టపడి వ్యవసాయం చేసావంటే రాజా లాగా బతకొచ్చు. ఇన్నాళ్ళూ మనం ఒకరికి అన్నం పెట్టినోళ్ళమే కాని, ఒకరి దగ్గర చెయ్యి చాచిన్నవాళ్ళం కాదురా? ఇంకోసారి ఆలోచించరా ఓబయ్యా" కొడుకుని మనసు మార్చుకోమని బ్రతిమిలాడాడు యాదయ్య

పట్నం మోజులో పీకల్లోతులో మునిగిపోయిన ఓబులేసుకు తండ్రి మాటలు చెవిదాకా కూడా చేరలేదు. తల్లిదండ్రులను వాళ్ల మానానకు వదిలేసి ,భార్యా బిడ్డలతో పట్నం వలస వెళ్ళి పోయాడు ఓబులేసు పెట్టాబేడా సర్దుకుని.

పట్టణంలోని అపార్ట్మెంట్లోని సెల్లార్లోని చీకటి గదిలోకి దిగిన తరువాత గాని తెలిసి రాలేదు తన సొంత ఇంటి విలువ.

అప్పటిదాకా పల్లెటూల్లో స్వచ్ఛమైన గాలి పీలుస్తూ ,తన సొంత ఇంటిలో స్వేచ్ఛగా బతికిన ఓబులేసుకు అపార్ట్మెంట్లో వాచ్మెన్ గా చేరిన నాలుగు రోజుల్లోనే ఏదో పోగొట్టుకున్నట్టు, అన్నీ ఉండి ఏమీ లేనట్టు అనిపించ సాగింది.

తిరిగి తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళిపోదాం అనుకున్నాడు కాని, ఎక్కడా ఉద్యోగం దొరక్క తిరిగి వచ్చాడని అందరూ వెక్కిరిస్తారనే భయం ఒక పక్క, ఓటమిని అంగీకరించలేని అహంకారం మరో పక్క వేధించడంతో ఆ ఆలోచనను విరమించుకుని కొత్త జీవితానికి సర్దుకుపోవడం నేర్చుకున్నాడు ఓబులేసు.

పట్నం వస్తే నాలుగు రాళ్లు

## వాస్తవ కథ



వెనకేసుకోవచ్చు అనుకున్న ఓబులేసు, రత్తాలుకు నిరాశే మిగిలింది. పల్లెటూర్లో ఉన్నప్పుడు అవసరమైనవి మాత్రమే కొనుక్కునేవాళ్లు ఓబులేసు కుటుంబం .అందువల్ల రాబడి తక్కువ ఉన్నా ఏదో రకంగా ఖర్చులకు సరిపోయేది.

కానీ పట్నం వచ్చిన తర్వాత ప్రతి వస్తువు రేటు ఎక్కువగా ఉండటమే కాక, అనవవసరమైన వస్తువులు కొనడం మొదలుపెట్టారు . దాంతో ఓబులేసు ఒక్కడి సంపాదన ఏ మూలకు సరిపోకపోవడంతో, రత్తాలు కూడా నాలుగిళ్లలో పని చేయక తప్పలేదు.

★★★

మార్వాడి కొట్టు నుండి వస్తూ వస్తూ పిల్లాడిని హాస్పిటల్కి తీసుకెళ్లటానికి ఆటోను కూడా పిలుచుకొచ్చుకున్నాడు ఓబులేసు.

అపార్ట్ మెంట్లో చాలా మందికి కార్లు ఉన్నాయి కానీ, ఓబులేసు కొడుక్కి అంత పెద్ద ప్రమాదం జరిగితే హాస్పిటల్కి తీసుకెళ్లడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు.

అప్పుడు కాని ఓబులేసుకు తెలిసి రాలేదు మనసులేని మనుషుల మధ్య బతుకుతున్నానని.

తన చిన్నతనంలో పొలంలో పాముకాటుకు గురైతే, చుట్టుపక్కల పొలాల రైతులందరూ పరిగెత్తుకుంటూ వచ్చి ట్రాక్టర్లో తనని హాస్పటల్కి తీసుకెళ్లిన సంఘటన ఇంకా ఓబులేసు కళ్ళముందే కదలాడుతోంది.

పాము కాటు నుండి బయటపడి తనకు స్పృహ వచ్చేంతవరకు ఊరు, ఊరు మొత్తం హాస్పిటల్ దగ్గరే నిద్రాహారాలు మాని తన తల్లిదండ్రులకు అండగా నిలవటం తన జ్ఞాపకాల పొరల నుండి ఇంకా తొలగిపోలేదు.

ఆటోలో పిల్లాడితో, హాస్పిటల్కి వెళుతూ ఉంటే దారి పొడుగునా ఎటు చూసినా ఆకాశాన్నంటే అపార్ట్మెంట్లే తారస పడుతున్నాయి వాళ్లకి . ఎందుకో అవన్నీ ఎత్తయిన సమాధులలా కనబడుతున్నాయి అవి ఇప్పుడు ఓబులేసుకి, రత్తాలుకి. వాటిని చూస్తూ ఇద్దరూ ఆలోచనలలో మునిగి పోయారు.

ఒకప్పుడు పల్లెటూర్లో బతికే రోజుల్లో, ఏ పండగకో ,పబ్బానికో సినిమాలు చూడటానికి పట్నం వచ్చేవాళ్ళు ఓబులేసు ,రత్తాలు. అప్పుడు వాళ్ళ కళ్ళకు అందంగా,ఆశ్చర్యం గొలుపుతూ కనపడేవి ఆ అపార్ట్మెంట్లు. అపార్ట్మెంట్లో బతికే వాళ్ళందరూ ఆకాశంలో రెక్కల గుర్రాలపై విహరించే మహారాజుల్లా కనపాడే వాళ్ళు వాళ్ల కళ్ళకి. తాము కూడా ఏదో ఒక అపార్ట్మెంట్లో ఇంత చోటు సంపాదించి ,వాళ్లలా ఆకాశంలో విహరించాలని కలలు కనే వాళ్లు.

కానీ వాళ్లందరూ కూపస్థ మండూకాలలా బతుకుతూ, పక్కవాడి గురించి ఏమాత్రం ఆలోచించని, మానవత్వం లేని మనుషులని ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది . ఆకాశంలో ఉంటున్నా , వాళ్ళ ఆలోచనలు మాత్రం పాతాళంలోకి కూరుకుపోతూ, నేలపైన ముందుకు వెనక్కి ఉన్నచోటే ఊగే జీవం లేని చెక్క గుర్రాలపై ఉగుతున్నారని అప్పటికి గాని తెలిసిరాలేదు వాళ్ళిద్దరికీ.

★★★

"హాస్పిటల్ వచ్చింది, దిగండి" అంటూ ఆటోడ్రైవర్ వాళ్ల ఆలోచనలకు అడ్డుతగలడంతో ,ఆలోచనల సుడుల నుంచి ఈ లోకంలోకి వచ్చిపడ్డారు ఇద్దరూ.

పిల్లాడిని భుజాన వేసుకుని ఓబులేసు ఆస్పత్రిలోకి నడుస్తూ ఉంటే, "పిల్లాడికి జబ్బు తగ్గిన తరువాత మన ఊరు వెళ్లి పోదాం మావా"అంటూ గొణిగింది రత్తాలు.

“నిజమే, ఇంకా ఎక్కువ కాలం ఇక్కడే ఉంటే, తాము కూడా మనిషి తత్వం మరచిన ప్రాణం లేని చేక్క గుర్రాలలా మారిపోతామని”, మనసులోనే అనుకుంటూ మౌనంగా అలాగే అన్నట్లు తల ఊపాడు ఓబులేషు.

★★★★★★★


V.G.R DIABETES SPECIALITIES HOSPITAL
మీరు 30 సంవత్సరాలు పైబడి ఉన్నారా...?
ఖచ్చితంగా ప్రతి సంవత్సరం షుగర్ మరియు ముఖ్యమైన అవయవాలన్నింటిని తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోండి.
వి.జి.ఆర్. రక్త పరీక్షల ల్యాబ్ కి క్వాలిటీ పరంగా BIORAD అనే ప్రతిష్ఠాత్మక అమెరికన్ ల్యాబ్ నుండి గుర్తింపు రావడం జరిగినది.
మా వద్ద Cobas C111, Cobas C311 మరియు Cobas e411 వంటి అధునాతనమైన Fully Automatic మిషన్ లతో అతి తక్కువ రేట్లకే అనుభవజ్ఞులైన నిపుణులచే కంటికి మరియు కాళ్ళకు సంబంధించిన కంప్లీట్ షుగర్ పరీక్షలు మరియు హార్మోన్ పరీక్షలు చేయబడును..
• రాష్ట్ర ప్రభుత్వ E.H.S రీయంబర్స్‌మెంట్ సదుపాయం కలదు.
• 50 పడకల హాస్పిటల్
• ప్రపంచస్థాయి అత్యాధునిక డయాబెటిస్ ల్యాబ్
• ఫుట్ కేర్ బృందం అందుబాటులో కలదు
• ప్రైవేటు క్యాష్ లెస్ హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయం కలదు
Cobas C311
Cobas e411
Philips CV 350
3 Nethra
Sysmex
JAMMI CHETTU CENTER, MOGHALRAJAPURAM, VIJAYAWADA
Ph: 0866 - 2485933,944, 7702954455

# యయాతి మహారాజుకథ



ఆచార్య N.మాధవి

యయాతి మహారాజు కథ లోకంలో ఎవరికైనా తమ పూర్వుల గురించి తెలుసుకోవాలనే కోరిక సహజంగా ఉంటుంది. అలాగే అభిమన్యుడి మనుమడైన జనమేజయుడు తన వంశకర్తల గురించి తెలుసుకోవాలనుకున్నాడు. తమ వంశాన్ని వృద్ధి చేసిన యయాతి మహారాజు వృత్తాంతాన్ని తెలుపమని వైశంపాయన మహర్షిని కోరాడు. వైశంపాయనుడు జనమేజయుడికి యయాతి మహారాజు కథను తెలియజేశాడు.

వృషపర్వుడు అనే రాక్షస రాజుకు శుక్రుడు గురువై రాక్షసులకు తన నీతులతో, ఉపాయాలతో ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాడు. తన దగ్గర ఉన్న మృత సంజీవని విద్య చేత దేవతలు రాక్షసులకు జరిగే యుద్ధంలో మరణిస్తున్న రాక్షసులను వెంటనే బతికిస్తున్నాడు. ఇది తెలిసిన దేవతలు భయపడి రాక్షసులను గెలవలేక శుక్రాచార్యుడి దగ్గర నుండి మృత సంజీవని విద్యను నేర్చుకొని రాగలిగినవాడు ఎవరా అని ఆలోచించి, దేవతల గురువైన బృహస్పతి కుమారుడైన కచుడి దగ్గరికి వెళ్లి అతడిని ప్రార్థించారు. బాలుడివి, నియమాలు, వ్రతాలు సహజంగా చేసేవాడివి అయిన నిన్ను శుక్రాచార్యుడు శిష్యుడుగా స్వీకరించి విద్యాదానం చేస్తాడని దేవతలు కోరగా దేవతల మేలుకోరి కచుడు శుక్రాచార్యుడి దగ్గరకు విద్యార్థి అయి వెళ్ళాడు. వెళ్లి నేను కచుడిని,బృహస్పతి కుమారుడని, మీకు శుశ్రూష చేసి సేవించడానికి వచ్చాను అన్న కచుడి సుకుమారత్వాన్ని, వినయ ప్రియవచనాలను, నిత్య నియమ వ్రతాలు ఆచరించడం వలన అతని ముఖంలో వెలుగుతున్న ప్రశాంతతను చూసి శుక్రుడు ఇతడిని పూజిస్తే బృహస్పతిని పూజించినట్లే అని భావించి కచుడికి అతిథి మర్యాదలు చేసి అతడిని సంతృప్తి పరిచి శిష్యుడిగా స్వీకరించాడు.

కచుడు ఏ పని చెప్పినా తర్వాత చేస్తాననక వెంటనే చేస్తూ శుక్రుడు మనస్తత్వానికి తగిన విధంగా ప్రవర్తిస్తూ త్రికరణ శుద్ధిగా అతడిని సేవిస్తూ అంతకంటే అధికంగా శుక్రాచార్యుడి కుమార్తె అయిన దేవయానికి తన మంచి మాటలతోనూ, పువ్వులు పండ్లు తెచ్చి ఇవ్వడం ద్వారానూ ఆమెకు సంతోషం కలిగిస్తున్నాడు. ఈ విధంగా ఎన్నో సంవత్సరాలు గడిచాయి. కచుడు నేర్పుతో గురువుగారి ప్రేమ పొంది ప్రియ శిష్యుడవ్వటం చూసిన రాక్షసులు బృహస్పతి పట్ల తమకున్న వైరం కారణంగా సహించలేకపోయారు. ఒకరోజు అడవిలో హోమధేనువులను కాస్తూ ఒంటరిగా ఉన్న కచుడిని చంపి ఒక పెద్ద చెట్టుకు కట్టి వెళ్ళిపోయారు. ఆవులు కచుడు లేకుండానే ఇంటికి రావడాన్ని, సాయంత్రం అయినా కచుడు ఆశ్రమానికి రాకపోవటాన్ని గమనించిన దేవయాని దుఃఖిస్తూ తండ్రికి విషయం చెప్పింది. తన దివ్య దృష్టితో రాక్షసులు చేసిన దురాగతాన్ని తెలుసుకున్న శుక్రుడు సంజీవని విద్యతో కచుడిని బ్రతికించాడు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ రాక్షసులు పువ్వులు తేవడానికి అడవికి వెళ్లిన కచుడిని చంపి కాల్చి, ఆ బూడిదను శుక్రుడు తాగే మద్యంతో కలిపి శుక్రుడు చేత తాగించారు. ఎంత చీకటైనా కచుడు రాకపోవడంతో దేవయాని మళ్లీ తండ్రిని ప్రార్థించగా మద్యం మత్తులో ఉన్న అతడు చాలాసేపటికి ప్రసన్నుడై జరిగింది తెలుసుకొని తన కడుపులో ఉన్న కచుడిని బ్రతికించి అతనికి మృత సంజీవని విద్యను ఉపదేశించి, తన కడుపు

## యయాతి మహారాజు కథ

చీల్చుకొని బయటకు రమ్మన్నాడు. అలా బయటకు వచ్చిన కచుడు మృతసంజీవనీ విద్యతో గురువుని బ్రతికించాడు. ఈ విధంగా కచుడు మృత సంజీవని విద్యను పొంది. చాలాకాలం గురువు దగ్గరే ఉండి గురువు చేత అనుమతి పొంది తిరిగి స్వర్గానికి వెళుతూ దేవయానికి చెప్పాడు. దేవయాని కచుడితో నువ్వు బ్రహ్మచారివి, నేను కన్యను, నా భావనలో నీకు నాకు ముందుగానే వివాహం అయింది, నన్ను స్వీకరించు అని అడిగింది . దానికి కచుడు ఎంతో విషాదాన్ని పొంది ఇలాంటి మాటలు మాట్లాడటం ఉచితం కాదు, నువ్వు నాకు సహోదరివి. లోకంలో గురువులకు శిష్యులు కుమారులతో సమానం అదే లోకధర్మం. దానిని ఆలోచించకుండా నువ్వు ఇలాంటి మాటలు మాట్లాడటం ఉచితం కాదన్నాడు. దానికి దేవయాని ఎంతో కోపించి తన కోరిక తీర్చలేదు కాబట్టి నీకు మృత సంజీవని విద్య పనిచేయదని శాపం ఇచ్చింది. అప్పుడు కచుడు నేను ధర్మం తప్పని వాడను నీ శాపం కారణంగా సంజీవని నాకు పని చేయకపోయినా నా చేత ఉపదేశం పొందిన వారికి సంజీవని పనిచేస్తుంది. నువ్వు ధర్మం కానిదానిని ఆలోచించావు కాబట్టి నిన్ను బ్రాహ్మణుడు పెండ్లాడకుండు అని ప్రతి శాపం ఇచ్చి స్వర్గానికి బయలుదేరాడు . స్వర్గంలో తాను నేర్చుకున్న సంజీవని దేవతలకు ఉపదేశిస్తూ వారికి మేలు చేశాడు.

వృషపర్వపురంలో వృషపర్వుడి కూతురు శర్మిష్ఠ ,దేవయాని మరియు వెయ్యి మంది కన్యలతో కలిసి అడవికి వెళ్ళింది . కొలను ఒడ్డున వారు తమ వస్త్రాలు ఉంచి జల క్రీడలు ఆడారు. సుడిగాలికి ఆ వస్త్రాలన్నీ కలిసిపోయాయి. ఎవరికి వారు ముందుగా ఒడ్డుకు రావాలనే ఆరాటంతో ఒకరి బట్టలు ఒకరు ధరించారు. దేవయాని వస్త్రాన్ని శర్మిష్ఠ ధరించగా శర్మిష్ఠ వస్త్రాలు ధరించడానికి ఇష్టపడని దేవయాని తాను బ్రాహ్మణ కన్యనని శర్మిష్ఠ ఆరాధించదగిన దానినని దుర్భాషలాడింది. శర్మిష్ఠ కోపించి నీ తండ్రి నా తండ్రి దగ్గర పనిచేస్తుంటాడు, నా బట్టలు నువ్వు ధరించటానికి ఏమి అని దేవయానిని ఒక నూతిలోకి తోసి చెలికత్తెలతో వెళ్ళిపోయింది. అడవికి వేట కోసం వచ్చిన యయాతి మహారాజు దాహంతో ఆ నూతి దగ్గరకొచ్చి నూతిలో ఉన్న దేవయానిని రక్షించి బయటకు తీశాడు. ఎవరు నీవు అని అడగగా ప్రమాదవశాన నూతిలో పడ్డానని, తాను శుక్రాచార్యుడి కూతురినని చెప్పింది దేవయాని. యయాతి తన పురానికి వెళ్లిపోయాడు. తనను వెతుకుతూ వచ్చిన పరిచారికకు దేవయాని తనకు జరిగిన అవమానం చెప్పి తను ఇంక ఆ రాజ్యంలోకి రానని తన తండ్రికి చెప్పమని పంపింది. పరిచారిక ద్వారా విషయం తెలుసుకున్న శుక్రుడు వెంటనే దేవయాని దగ్గరకు వచ్చి శర్మిష్ఠ చిన్న పిల్లని రాజకూతురని ఆమెతో నీకెందుకని చెప్పాడు. ఎన్నో దానాలు ఇచ్చి చేసే యాగాలు వేల కొద్దీ చేసినవారి కంటే కోపం లేని వారే గొప్పవారు. ఇతరులు కోపిస్తే కోపించకుండా, నిందించినా విననట్లే ఉండి తిరిగి నిందించకుండా ఉండేవాడు ధర్మజ్ఞుడు. బుద్ధిమంతులకు కోపం తగదు రమ్మన్నాడు. తండ్రి ఎంత చెప్పినా దేవయాని అంగీకరించకపోవడంతో నాకు నువ్వే దిక్కు,నువ్వు ఎక్కడికి వెళ్తే అక్కడికే నేను వస్తాను అని తాను దేవయానితో బయలుదేరాడు. గూఢచారుల ద్వారా విషయం తెలిసిన వృషపరుడు వెంటనే వారి దగ్గరకు వచ్చాడు. నీ మృత సంజీవని విద్య గొప్పతనం చేతే రాక్షసులు దేవతలను జయిస్తూ స్థిరమైన సంపదలు పొంది ఉన్నారు. నువ్వు లేకపోతే దేవతల ముందు రాక్షసులు గెలవలేరు. ఉన్న సంపదతో పాటు రాక్షసులందరినీ నీ ధనంగానే భావించు దేవయానికి ఏది ఇష్టమో అది ఇస్తాను అడుగమన్నాడు. దానికి దేవయాని వెంటనే వెయ్యి మంది కన్యలతో పాటు శర్మిష్ఠ తనకు దాసి కావాలని కోరింది. వెంటనే

## యయాతి మహారాజు కథ

వృషపర్వుడు శర్మిష్ఠను పిలిచి వెయ్యి మంది కన్యలతో పాటు ఆమెను దేవయానికి దాసిగా చేసాడు. తండ్రి మాటకు కట్టుబడి దేవయానిని సేవిస్తూ ఉంది. ఒకరోజు దేవయాని శర్మిష్ఠ వెయ్యి మంది కన్యలు తనను సేవిస్తూ రాగా అడవికి విహారానికి వెళ్ళింది. వారందరూ ఒక సెలయేటి తీరాన చెట్ల నీడలో వినోదిస్తుండగా వేట కోసం అడవికి వచ్చిన యయాతి మహారాజు అలసినవాడై వారున్న దగ్గరకు వచ్చాడు. వారు అతడిని పూజించారు . అతడు సుఖంగా కూర్చొని దేవయాని ముందే తెలుసు కనుక వారిలో ఎంతో అందమైనది,మంచి గుణాలు కలిగినది అయిన శర్మిష్ఠ గురించి తెలుసుకో వాలని మీరెవరు అని అడిగాడు. దానికి దేవయాని నేను ముందే " మీకు తెలుసు కదా ఈమె నా దాసి వృషపర్వుడు అనే రాక్షస రాజు కుమార్తె, శర్మిష్ఠ అని చెప్పింది. ఈమె నన్ను వదలక సేవ చేస్తుంటుంది. నన్ను ఆరోజు నూతి నుండి బయటకు తీసేటప్పుడే నా చెయ్యి పట్టి నన్ను రక్షించావు. దానిని నువ్వు మర్చిపోవచ్చా, నా పాణిగ్రహణం చేశావు కాబట్టి నువ్వు నన్ను వివాహం చేసుకున్నట్లే. నన్ను వివాహం చేసుకొని ఈ కన్యలు అందరూ ఈ శర్మిష్ఠ నిన్ను సేవిస్తుండగా ఇంద్రుడిలాగా సుఖాలను అనుభవించు అని దేవయాని అన్నది. దానికి యయాతి అధర్మంగా ఇలాంటి కోరిక కోరవచ్చా, ఎక్కడైనా బ్రాహ్మణ కన్యలను క్షత్రియులు వివాహం చేసుకుంటారా, సర్వవర్ణ ధర్మాలు సంకరం కాకుండా రక్షించే రాజును నేనే అధర్మానికి ఒడిగడితే లోకమంతా చెడిపోదా అన్నాడు. వెంటనే దేవయాని లోకం చేత పూజించబడే శుక్రుడు ఆజ్ఞాపించి, ధర్మ విరుద్ధం కాదంటే నన్ను వివాహం చేసుకుంటావా అంది. చేసుకుంటానని యయాతి అంగీకరించాడు. వెంటనే దేవయాని శుక్రుడిని అక్కడకు రప్పించి ఈ జన్మలో ఇతడే నాకు భర్త నీ మాటలతో ఇతడు నన్ను వివాహం చేసుకుంటాను అన్నాడనగా శుక్రాచార్యుడు వారి వివాహం ధర్మ విరుద్ధం కాదనే వరం ఇచ్చి వారి ఇరువురికీ వివాహం చేశాడు.

యయాతికి శర్మిష్ఠ ను చూపుతూ శుక్రుడు ఈమె రాక్షస రాజు కూతురు. ఈమెకు భోజనం, పానీయాలు, అలంకారాలు, వస్త్రాలు, దండలు, శరీరానికి పూసుకునే లేపనాలు మొదలైనవన్నీ ఇచ్చి ఆనందం కలిగించు. పడక విషయంలో మాత్రం ఈమెను దూరంగా ఉంచు అని చెప్పి కూతురుని అల్లుడిని సాగనంపాడు. దేవయానిని, శర్మిష్ఠను, 1000 మంది కన్యలను తీసుకొని తన పట్టణానికి వెళ్లి ఒక అందమైన మేడలో దేవయానిని ఉంచి ఆమె అంగీకారంతో అశోకవనానికి దగ్గరలో ఉన్న ఒక ఇంట్లో శర్మిష్ఠను, వెయ్యి మంది కన్యలను ఉంచాడు యయాతి. దేవయానితో సుఖాలను అనుభవిస్తూ ఉండగా దేవయానికి యదువు, తుర్వసుడు అనే కొడుకులు పుట్టారు.

శర్మిష్ఠ యవ్వనవతి, పుష్పవతి అయి నా యవ్వనం అంతా అడవుల్లో పూచిన పూల లాగా వృధా అవుతుందా, దేవయాని ఏం పుణ్యం చేసుకుందో కోరిన వాడిని భర్తగా పొంది కొడుకులను కన్నది. ఆమె అదృష్టానికి ఎవరు సాటిరారు కదా. నేను కూడా ఆమె లాగానే యయాతినే భర్తగా చేసుకుంటాను. నా మనసు ఎప్పుడూ అతని పట్ల లగ్నమై ఉంటుంది. అతడు నన్ను ఎంతో అనురాగం ఉన్నట్లు చూస్తాడు అనుకుంది. ఆమె అదృష్టవశాన ఆమె ఒంటరిగా ఉండగా యయాతి అశోక వనానికి వచ్చాడు. ఆమె అతడితో భార్య, పుత్రుడు, దాసి అనేవి విడదీయరాని బంధం కలవి. కాబట్టి నేను దేవయాని దాసిని కాబట్టి ఆమెను స్వీకరించిననాడే నన్ను స్వీకరించినట్లయింది. ఋతుకాలానికి ఉచితమైన సంగమాన్ని నాకు అనుగ్రహించు అంది . అప్పుడు యయాతి శుక్రుడు నిన్ను దూరంగా ఉంచమన్నాడు, నేను దానికి ఆ రోజు అంగీకరించాను, ఇప్పుడు దానిని జవదాటితే అసత్య దోషం అంటుకుంటుందన్నాడు. దానికి శర్మిష్ఠ ప్రాణహాని జరిగేటప్పుడు, ధనమంతా దొంగలించబడేటప్పుడు, బ్రాహ్మణుడిని రక్షించే సమయంలో, స్త్రీలతో కూడేటప్పుడు, పెళ్లి సమయంలో

## యయాతి మహారాజుకథ

అబద్ధాలు చెప్పవచ్చు. నువ్వు వివాహ సమయంలో చెప్పావు కాబట్టి అసత్య దోషం నీకు అంటదు అంది. అప్పుడు యయాతి ఆమె కోరిక తీర్చాడు. ఆమె గర్భవతి అయి ఒక కొడుకును కనగా దేవయాని ఆశ్చర్యపోయి అడుగగా ఒక ముని ఎక్కడినుండో వచ్చి తనను అనుగ్రహించాడని చెప్పింది. ఆవిధంగా శర్మిష్ఠకు వరుసగా ద్రుహ్యు, అనువు, పూరుడు అనే ముగ్గురు కొడుకులు కలిగారు.

ఒకరోజు యయాతి ప్రతిరూపాలు లాగా ఉన్న ఆ ముగ్గురు పిల్లలు యయాతి ముందు ఆడుతుండగా చూసిన దేవయాని ఎవరి పిల్లలని అడగగా అతడు సమాధానం చెప్పలేదు. ఆమె ఆ పిల్లలని అడగగా వారి తల్లిదండ్రులు శర్మిష్ఠ, యయాతికి అని చూపారు. అది విని వెయ్యి మంది కన్యలు ఎంతో సంతోషించారు. దేవయాని తనను మోసం చేసిన భర్త పై కోపంతో తండ్రి దగ్గరకు వెళ్లి దుఃఖిస్తూ ధర్మాన్ని అధర్మంతో తక్కువ చేశాడని, శర్మిష్ఠ పట్ల ప్రేమ కలిగి ఆమె ద్వారా కొడుకులను కన్నాడని తెలియజేసింది. అది విన్న శుక్రుడు దేవయానిని ఓదారుస్తూ ఆమె వెనకే వచ్చిన యయాతిని యౌవన గర్వంతో నా కూతురికి అప్రియం కలిగించావు కాబట్టి ముసలివాడవు కమ్మని శాపం ఇచ్చాడు. దానికి యయాతి ఋతుకాలోచితాన్ని కోరిన భార్యని కాదంటే అది గర్భస్థ శిశువును హత్య చేసిన పాపం చేసినట్లేనని అందుకే శర్మిష్ఠ కోరిక తీర్చానని, తనకి ఇంకా దేవయాని పట్ల కోరిక తీరలేదని వేడుకున్నాడు. శుక్రుడు దయతలచి అయితే నీ ముసలితనం నీ కొడుకులలో ఒకరికి ఇచ్చి వారి యవ్వనం నువ్వు తీసుకో నీకు కోరికలన్నీ తీరిన తర్వాత వారి యౌవనం వారికి ఇవ్వు. ఎవరు నీ కోరిక తీరుస్తారో వారే నీ రాజ్యానికి అధికారి, వంశకర్త అవుతాడని చెప్పాడు. యయాతి దేవయానితో కలిసి ఇంటికి వచ్చాడు. శుక్రుడి శాపం కారణంగా ముసలివాడైన యయాతి పెద్దవారైన తన నలుగురు కొడుకులను పిలిచి తన వృద్ధాప్యం తీసుకొని వారి యౌవనాన్ని ఇవ్వమనగా ఆ నలుగురు కొడుకులు ఎంత తెలివి తక్కువ వాళ్ళు అయినా కోరికోరి ముసలితనాన్ని తీసుకుంటారా, కుబేరుడైనా ముసలివాడు అయితే కోరుకున్న సుఖాలు పొందలేడు కదా అని ఒప్పుకోలేదు. దానికి కోపించి ఆ నలుగురు కొడుకులకు శాపాలు ఇచ్చి అందరికంటే చిన్నవాడైన పూరుడిని పిలిచి తన కోరిక తెలుపగా పూరుడు అంగీకరించి తన యౌవనాన్ని తండ్రికిచ్చి, తండ్రి ముసలితనాన్ని తాను తీసుకున్నాడు.

యయాతి కోరిన సుఖాలన్నీ అనుభవించి తృప్తి చెందిన తర్వాత పూరుడికి అతడు యౌవనాన్ని తిరిగి ఇచ్చి పూరుడిని రాజ్యానికి అభిషిక్తుడిని చేశాడు. అప్పుడు పెద్దలందరూ శుక్రుడి మనమడు, పెద్దవాడు, సమర్థుడు అయిన యదువుండగా చిన్నవాడు శూద్రస్త్రీకి పుట్టిన వాడిని రాజును చేయడమేమిటి అని ప్రశ్నించారు. దానికి యయాతి కొడుకు తల్లిదండ్రుల మాట వినకపోతే వారి వాక్యం ఎదలో స్వీకరించకపోతే అలాంటివాడు కొడుకు ఎలా అవుతాడు, తండ్రి సంపాదించిన ధనానికి అర్హుడు ఎలా అవుతాడు, చిన్నవాడైనా పూరుడు సహనం కలవాడు అవడం కారణంగా రాజ్యానికి అధికారి,రాజ్య భారాన్ని వహించడానికి సమర్థుడు అయ్యాడు అని తెలిపాడు . ఆ విధంగా యయాతి కొడుకులందరినీ రాజ్యాలకు రాజులను చేసి తాను తపోవనానికి వెళ్ళటంతో నిష్ఠతో తపస్సు చేసి దివ్య విమానంలో దేవలోకానికి, ఆ తర్వాత బ్రహ్మలోకానికి, ఆ తర్వాత ఇంద్రలోక కానికి వెళ్ళాడు. ఇంద్రుడు పూరుడికి రాజ్యం ఇచ్చేటప్పుడు అతడికి ఏం బోధించావంటే యయాతి " జ్ఞానం కలవారి చరిత్ర అభ్యసిస్తూ, మంచి స్నేహం చేస్తూ, ధర్మం తెలుసుకుంటూ, తెలుసు కొన్న దాన్ని మర్చిపోకుండా న్యాయంతో కూడిన జీవనం ఆచరించాలి. సభలలో మేలు అయినది, ఉన్నాతమైనది, సత్యమయింది, తీయనిది, మనసుకుఆనందాన్ని ఇచ్చేది, ధర్మంతో కూడినది అయిన మాటలు పల కాలి.మనసుకు గాయం చేసే మాటలు మాట్లాడే వారి దగ్గర నివసించ కూడదు. ఋజుత్వం, ఇంద్రియ జయం,

## యయాతి మహారాజుకథ

సత్యం, బహిరింద్రియ నిగ్రహం, శుచిత్వం హృదయంలో నిలపాలి. అరిషడ్వర్గాలను జయించాలి. అలా లోపల శత్రువులను జయించిన వాడే బాహ్య శత్రువులను జయించగలడు "అని చెప్పానన్నాడు. ఏమి తపస్సు చేశావని ఇంద్రుడు అడగగా దేవతలు, రాక్షసులు, యక్షులు, మానవులు, సిద్ధులు, మునులు మొదలైన వారు చేసిన తపస్సులు నా తపస్సుకు సమానం కావని అహంకారంతో పలికాడు. అంత అహంకారంతో మాట్లాడావు, పెద్దలను అవమానించావు కాబట్టి నీ అహంకారం నీ తపస్సు ఫలాన్ని నశింపపజేసింది,ఇంక నువ్వు స్వర్గ లోకంలో ఉండటానికి తగవు. క్రింది లోకాలకు వెళ్ళమంటే క్రింది లోకాలకు వెళ్లలేను నక్షత్ర లోకంలో ఉండేటట్లు అనుగ్రహించమనగా ఇంద్రుడు అంగీకరించాడు. నక్షత్ర లోకంలో నక్షత్రాల ఆశ్చర్యపోయేటట్లుగా ఎంతో కాంతితో యయాతి వెలుగొందాడు. యయాతి కూతురు కొడుకులైన ఆ నక్షత్ర వాసులు అతడి తేజస్సు చూసి వచ్చి అడగగా తాను చేసిన తప్పు వారికి తెలియజేశాడు. కొంచెం గర్వమైనా చాలా కాలం చేసిన తపస్సుఫలాన్ని నాశనం చేస్తుందని చెప్పాడు. వారు అడిగిన ప్రశ్నలు అన్నిటికీ ఎంతో జ్ఞానంతో సమాధానాన్ని ఇచ్చాడు. అతడి జ్ఞానాన్ని చూసినటువంటివారు మేము నీ మనుమలమే అని చెప్పారు. వారందరూ ఉత్తమ లోకాలకు వెళ్లారు.

ఈ యయాతి కథ వలన వ్యక్తుల మనస్తత్వాలు ఏ విధంగా ఉంటాయో తెలుస్తుంది. ఇంకా దేవయాని, శర్మిష్ఠ పాత్రల వల్ల స్త్రీల గుణాల్లో ఉండేటువంటి వ్యత్యాసాలు అర్థమవుతాయి .తండ్రి మాట ఏనాడు దేవయాని పాటించలేదు అలాగే ఆమె కుమారులు ఆమె తండ్రి కోరికను మన్నించలేదు. రాజపుత్రి అయి కూడా దాసి కమ్మని ఆజ్ఞాపించగానే తండ్రి ఆజ్ఞను అనుసరించిన శర్మిష్ఠ పూర్ణుడికి తల్లి అవడం వలన తర్వాత గౌరవాన్ని పొందింది. శర్మిష్ఠ సహనమే పూరుడు కనబరిచాడు అనిపిస్తుంది. కానీ ఈ కథలో స్త్రీలు చాలా దృఢమైన సంకల్పం కలవారు. అనుకున్నది ఎలా సాధించుకోవాలో తెలిసినవారు. ధర్మ సూక్ష్మాలు తెలిసినవారు. సుఖాలు కోరుకుంటే ధర్మబద్ధంగా భార్య ద్వారానే తీర్చుకోవాలనీ సందేశం ఇస్తుంది యయాతి కథ. తండ్రి మాట విన్నవాడికి అతని ఆస్తి అనుభవించే అధికారం ఉంటుందని తెలియజేస్తుంది. ఇంద్రియనిగ్రహం సాధించి, అరిషడ్వర్గాలను జయిస్తే దేవతలే జ్ఞానబోధ వింటారని తెలియజేస్తుంది. కులం కన్నా గుణమే ప్రధానమని, అహంకారం అనర్ధహేతువని ఈ కథ తెలియజేస్తుంది. రాచరిక వ్యవస్థను స్త్రీలపై రాజుల కుండేఅధికారాన్ని తెలియజేస్తుంది. ఇంకా కచుడి పాత్ర ద్వారా విద్యార్థి ఎలా ఉండాలో, అనుకున్నది సాధించడం కోసం మరణానికి భయపడని ధైర్యం ఉండాలని తెలియజేస్తుంది. రాక్షసుల కృత్యాల వల్ల కచుడు నష్టపోయినట్లు కనిపించినా అతని కోరిక తీరటం కూడా జరిగింది. దాన్నిబట్టి ఏది జరిగినా మన మంచికే అనే విశ్వాసాన్ని ఈ కథ సమర్థించినట్లయింది. దేవయాని ఇచ్చిన శాపం కారణంగా విద్య ఒకరి దగ్గరే ఉండకుండా అందరికీ అందించే అవకాశం ఏర్పడింది, దేవయాని శాపం వల్ల రెండు వర్ణాల మధ్య వివాహం జరిగింది. దీన్నిబట్టి ఒక్కోసారి కొందరి శాపాలు సమాజానికి వరాలవుతాయని అనిపిస్తుంది. తల్లిదండ్రుల పెంపకాన్ని బట్టే పిల్లలు బుద్ధులు ఉంటాయి అని తెలుస్తుంది. కామ క్రోధ లోభమోహమదమాత్సర్యాలను జయించిన వారు దేవతల కంటే గొప్పవారు అనే సందేశం ఈ కథ ఇస్తుంది. మద్యపానం ఎంత పాపహేతువో, దానివల్ల ఎలా అనర్థాలు జరుగుతాయో తెలుపుతుంది. గురువులు ఎలా ఉండాలో తెలుపుతుంది. రాజులు తమ ప్రజల క్షేమం కోసం కన్నబిడ్డను కష్టాల పాలు చేయటానికి వెనుకాడరని తెలియజేస్తుంది.

★★★

క్రీడా ప్రపంచం

# పసిడి పంచుల నిఖిత



మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్షిప్స్ లో తెలంగాణ సంచలనం నిఖత్ జరీన్ మరోసారి విజేతగా నిలిచింది. 26-03-2023,ఆది వారం 50 కేజీల ఫైనల్లో ఆమె 5-0 తేడాతో గుయెన్ థి టామ్పె (వియత్నాం) ను చిత్తుచేసింది. 26 ఏళ్ల నిఖత్.. తుదిపోరు లో జోరు కొనసాగించి ఏకపక్ష విజయాన్ని అందు కోవటమే కాక సునాయాసంగా ప్రత్యర్థిని చిత్తుచేసింది. రెండుసార్లు ఆసియా చాంపియన్ షిప్ విజేత అయిన వియత్నాం బాక్సర్ గుయెన్ థి టామ్పె 5-0తో నిఖత్ సంచలన విజయం నమోదు చేసింది. గతేడాది స్వర్ణంతో మెరిసిన నిఖత్ వరుసగా రెండవ ఏడాది కూడా ప్రపంచ చాంపియన్ గా నిలిచి రికార్డు సృష్టించింది.

భారత ఆలెమ్ దిగ్గజ మహిళా బాక్సర్ మేరీకోమ్ తర్వాత ఒకటి కంటే ఎక్కువసార్లు ప్రపంచ టైటిల్ నెగ్గిన రెండవ భారత బాక్సర్గా నిఖత్ చరిత్ర సృష్టించింది. గతేడాది 52 కేజీల విభాగంలో ఆమె పసిడి పతకం సొంతం చేసుకుని, తొలిసారి ప్రపంచ చాంపియన్ గా నిలిచింది. ఈసారి 50 కేజీల విభాగంలో మరోసారి దుమ్మురేపింది.

నిజామాబాద్ లోని సంప్రదాయ ముస్లిం కుటుంబం నుంచి జగజ్జేతగా ఎదిగిన నిఖత్ జరీన్, కెరీర్ తొలినాళ్లలో బంధువులు, ఇరుగుపొరుగు వారి నుంచి అనేక విమర్శలు ఎదుర్కొంది. ఆడపిల్ల, మగపిల్లలతో కలిసి సాధన చేయడమేంటి? ఆ వస్త్రధారణ సరైనదేనా? అసలు ఆడవాళ్లకి బాక్సింగ్ అవసరమా? అనే ప్రశ్నలను పట్టించుకో కుండా తల్లిదండ్రుల సహకారంతో ముందడుగు వేసింది.

2007లో నిజామాబాద్ కలెక్టరేట్ క్రీడా ప్రాంగ ణంలో ఓనమాలు నేర్చుకున్న నిఖత్, ఆ తర్వాత తన పంచు పదును పెట్టేందుకు కుటుం బంతో సహా హైదరాబాద్కు తరలి వచ్చింది. ఇక్కడ కోచ్ చిరంజీవి దగ్గర రాటుదేలిన నిఖత్ కు విశాఖపట్నం 'సాయ్' సెంటర్లో శిక్షణ తీసుకునే అవకాశం లభించింది. అప్పటికే జాతీయ స్థాయిలో తన ఉనికిని చాటిన నిఖత్, విశాఖ తీరం చేరాక జూనియర్ వరల్డ్ చాంపియన్గా అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించింది.

2019లోనే నిఖత్ జరీన్కు వరల్డ్ చాంపియన్షిప్లో సత్తా చాటే అవకాశం రావాల్సి ఉంది. ఆ ఏడాది నిఖత్ స్ట్రాంజాలో స్వర్ణం, థాయ్లాండ్ ఓపెన్లో రజతం నెగ్గి మంచి ఫామ్లో ఉంది. అయితే, ట్రయల్స్ లేకుండా దిగ్గజ మేరీకోమ్ను జాతీయ బాక్సింగ్ సమాఖ్య వరల్డ్ చాంపియన్ షిప్ కు పంపడంతో నిఖత్ ఆశలు అడియాశలయ్యాయి. ఆ తర్వాత టోక్యో ఒలింపిక్కు కూడా ట్రయల్స్ లేకుండానే మేరీని ఎంపిక చేస్తే, నిఖత్ ఒక్క చాన్స్ అంటూ గళమెత్తింది. ఒలింపిక్స్ ట్రయల్స్లో మేరీ చేతిలో పరాభవం ఎదురైనా తర్వాతే నిఖత్ అసలుసిసలు సత్తా బయటపడింది. రింగ్ లో తన అటాకింగ్ స్టయిల్ను పూర్తిగా మార్చేసింది. బ్యాక్ఫుట్ను తగ్గించి డిఫెన్స్ను మెరుగు చేసుకుంది. ప్రత్యర్థిని అంచనా వేయ డంలో పరిణితి సాధించి, అన్ని రకాలుగా రాటుదేలింది. స్వల్ప కాలంలోనే తన పంచ్ పవ ర్ తో విమర్శకుల నోళ్లను మూయించింది.

దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ ఆరుసార్లు విజేతగా నిలిచింది.2002, 2005, 2006, 2008, 2010, 2018లలో పసిడి పతకాలు సాధించింది. అలాగే 2006లో సరితాదేవి, జెన్నీఆర్ఎల్, లేఖ పసిడిపతాలు గెలిస్తే నిఖత్ జరీన్

## క్రీడా ప్రపంచం

### సాధించిన విజయాలు

2011

జూనియర్ వరల్డ్ చాంపియన్షిప్లో స్వర్ణం

2014 యూత్ వరల్డ్ చాంపియన్షిప్ లో రజతం

2014 నేషన్స్ కప్ అంతర్జాతీయ టోర్నీలో స్వర్ణం

2015 సీనియర్ జాతీయ చాంపియన్షిప్లో స్వర్ణం

2018 బెల్డ్ అంతర్జాతీయ టోర్నీలో పసిడి

2019 ఆసియా చాంపియన్షిప్లో కాంస్యం

2019, 2022

స్ట్రాంజా అంతర్జాతీయ టోర్నీలో స్వర్ణాలు

2022 బర్మింగ్ హామ్ కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం,

వరల్డ్ చాంపియన్షిప్ స్వర్ణం (52 కిలోలు)

2023 వరల్డ్ చాంపియన్షిప్లో స్వర్ణం (50 కిలోలు)

2022, 2023 పసిడిపతకాలు సాధించింది. ఆసియా చాంపియన్ షిప్ కాంస్యంతో పాటు మరో ఆరు అంతర్జాతీయ పతకాలు సాధించినా నిఖత ఫై ఎక్కువగా అంచ నాలు లేవు. ఆమె ప్రదర్శనపై కూడా ఫర్వాలేదన్న వారే తప్ప అద్భుతం అని, ముున్ముందు గొప్ప విజయాలు సాధించగలదని ఎవరూ ఊహిం చలేదు. అందుకు కారణం అప్పటికే ఉత్తరాది, ముఖ్యంగా హరియాణా బాక్సర్లతోనే భారత బృందం నిండి ఉంది. ఆటా వారిదే, ఫలితాలు వారి నుంచే అన్నట్లుగా పరిస్థితి ఉంది. పైగా మేరీకో మ్ తో పోటీ పడేందుకు సిద్ధపడి అదేదో తప్పు చేసినట్లుగా తన ప్రమేయం లేకుండానే చాలా మంది దృష్టిలో నిఖత్ విలన్ గా మారిపోయింది. కానీ ఒక్క అద్భుత ప్రదర్శన అంతా మార్చేసింది... వరల్డ్ చాంపియన్ షిప్ విజేతగా నిలవడంతో నిఖత్ సత్తా అందరికీ అర్థమైంది. నిఖత్ ప్రతిభను ప్రపంచం గుర్తించింది. భారత్ నుంచి విశ్వ వేదికపై నిలబడగల అథ్లెట్ల జాబితాలో ఆమె కూడా చేరింది. టోర్నీ మొత్తం నిలకడగా రాణించిన నిఖత కు 'బెస్ట్ బాక్సర్' అవార్డు కూడా లభించింది. విజేతగా నిలిచిన నిఖతకు లక్ష డాలర్లు (రూ.82 లక్షల 34 వేలు) ప్రైజ్మనీతోపాటు 'బెస్ట్ బాక్సర్' పురస్కారం కింద 'మహీంద్రా థార్' వాహనం లభించింది.మరో ఏడాదిలో జరగనున్న పారిస్ ఒలింపిక్స్లో భారత్ కు బాక్సింగ్ తొలి స్వర్ణం అందించేందుకు నిఖత్ అడుగులు వేస్తోంది.





# సాహితీ శిఖరాలు

## 'సాహితీ రత్న' యలవర్తి అనురాధ



శ్రీమతి యలవర్తి అనూరాధ గత 48 సం॥లుగా సాహితి సేద్యం చేస్తున్నారు. ఆమె నవలలు, ఎన్నో కథలు, మరెన్నో కవితలు, ఎన్నెన్నో వ్యాసాలు అన్ని ప్రముఖ పత్రికలలోనూ చోటు చేసుకున్నాయి. రాష్ట్రస్థాయిలో ముఖ్య మంత్రి చేతుల మీదుగా ఉత్తమ సాహితి వేత్త అవార్డును అందుకున్నాడు.

1957 అక్టోబరులో లక్కింశెట్టి శ్యామల కృష్ణ మోహనరావు, సీత రావమ్మ దంపతులకు కృష్ణాజిల్లా ముదునూరు లో జన్మించారు. 1978 ఆంధ్ర పత్రిక సంచికలో 'రాధిక' అనే కవిత ప్రచురించ బడంటతో వీరి సాహితి ప్రస్థానం మొదలయ్యింది . 1980 నుంచి ఇప్పటి దాక ఆకాశవాణి లో, కవితలు, కథలు , వ్యాసాలు, నాటికలు ప్రసారమవుతునే ఉన్నాయి.దూరదర్శన్ లో కూడా వీరి ఇంటర్వ్యూలు వచ్చాయి. 'నేను – నా రచనలు' రూపంలో కవి సమ్మేళనాలలో కూడా పాల్గొన్నారు .

లక్నో జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొనటం ,తానా పురస్కారం అందుకోవటం మధురమైన అనుభుతిని పంచింది . గుఱ్ఱం జాషువా, రావూరి బరద్వాజ ల అవార్డులు, సన్మానాలు 100కి పైగానే పొందారు .

ముఖ్య అతిధిగా , వక్తగా, ఆత్మీయ అతిధిగా పలు కార్యక్రమల్లలో పాల్గొన్నారు .

పలు పత్రికలలో శీర్షికలు నిర్వహించారు. వండర్ వరల్డ్లో సంసారంలో సరిగమలు, వనిత జ్యోతి లో మనస్విని (సైక్రియాటిక్ కథలు), వార్త లో ' నేస్తం', ఆంధ్రప్రదేశ్ లో 'ఆలోచించండి', మహిళా విజయంలో 'మానసవీణ', స్వర్ణఆంధ్రాలో లో కవితా సుమాలు', మొ.వి . నిర్వహించారు

పచ్చ బొట్టు, విలువల లోగిలి ఆంధ్రభూమి దినపత్రికలో ధారావాహిక నవలలుగా వచ్చాయి .ప్రేమ వసంతం డైరెక్ట్ నవల తీసుకు వచ్చారు. ఇవి కాక పసిమొగ్గలు (బాలల కథలు), పొట్టి శ్రీరాములు యూని వర్సిటి వారు స్పాన్సర్ చేసారు. ఎద సవ్వడి కవిత్వం ,సంసారంలో సరిగములు (వ్యాసాలు), చిట్కాల పుస్తకం, వెజిటేరియన్ వంటకాలు, పెద్ద బాలశిక్ష లో మహిళా పేజీలు,100 పుస్తకాలుగా వెలువ డ్డాయి.

ప్రపంచ మహాసభలలో వైజాగ్ తిరుపతి , విజయవాడలలో అతిధిగా పాల్గొని పలువురి మన్ననలను పొందారు. ఉత్తమ సాహితీ అవార్డు గ్రహీత (రాష్ట్రస్థాయిలో) తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, బుక్ ఆఫ్ స్టేట్ రికార్డ్స్ , భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్. ఆంధ్ర బుక్ ఆఫ్ రికార్డలో వీరి పేరు నమోదు చేయబడినది. 'సాహితి రత్న ' బిరుదును విజ్ఞాన వేదిక, శ్రీ కాళహస్తి వారి ద్వారా అందుకున్నారు. అలాగే మరో 'సాహితీ రత్న' అవార్డును భారతీయ సాహిత్యఅకాడమి . ఖాజీపేట వారి ద్వారా అందుకున్నారు

సృజనా మండలి అధ్యక్షురాలిగా. మార్కాపురంలో, ఆశ్రిత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా తణుకు, హైద్రాబాదు లో సమాజ సేవకు పాటు పడ్డారు.

పశ్చిమగోదావరి జిల్లా రచయితల సంఘం, తణుకుకు అధ్యక్షురాలిగా తెలుగు భాష కు ఎనలేని సేవను అందించారు.

ఈ టి.వి లో 8 కార్యక్రమాలలో పాల్గొన్నారు. తన రచనల ద్వారా విడాకులు తీసుకోవాలనుకున్న జంటలు ఆ ప్రయత్నం మానుకున్నారని, 5 సం॥లుగా మాట్లాడుకొని తండ్రీ కొడుకులు "మంచి వ్యక్తిత్వం – మనిషికి వరం" వ్యాసం చదివి కలుసుకున్నారని, ఫ్యామిలీ పూల తోట వ్యాసం చదివి ఓ జడ్జి నాకు ఈ అమ్మాయి కౌన్సిలింగ్ చేస్తే ఏ జంటా విడిపోదని చెప్పటం, ఎంతో ఆనందాన్ని ఇచ్చిందంటారు .భర్త ప్రసాదరావు గారి పూర్తి సహకారమే తన ఈ విజయాలు అన్నిటికీ కారణం అంటారు.

జీవన
చిత్రాలు

# "మట్టి బొమ్మల " మాంత్రికుడు



లంక లక్ష్మణ రావు

మన దేశం లో కులవృత్తులను నమ్ముకుని జీవించే వాళ్ళు ఎంతోమంది ఉన్నారు .కాలక్రమేణ వీటితో జీవనం గడపటం దుర్భరంగా మారటంతో, చాలామంది వీటిని వదిలి వేరే వృత్తులను స్వీకరిస్తున్నారు .

***"ఆధునిక సమాజంలో రోజురోజుకు కళాకారులు, వారిచేసే కళాఖండాలు కను-మరుగు అవుతూ వస్తున్నాయి. ఎన్నో కళలు నేటి సమాజంలో కలగానే మిగిలిపోతున్న సంద-ర్భాలు ఉన్నాయి."***

ఆధునిక సమాజంలో రోజురోజుకు కళాకారులు, వారు చేసే కళాఖండాలు కనుమరుగు అవుతూ వస్తున్నాయి. ఎన్నో కళలు నేటి సమాజంలో కలగానే మిగిలిపోతున్న సందర్భాలు ఉన్నాయి.



యాంత్రిక జీవన విధానం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పుంతలు తొక్కుతున్న నేటి సమాజంలో పూర్వీకుల ఆచారాలు, అలవాట్లను మరచి పాశ్చాత్య సంస్కృతి వైపు అడుగులు వేస్తున్న . ఇలాంటి సమయంలో మట్టితో మాణిక్యాలు రూపొందించే కళ అంతరించి పోకూడదనే ఉద్దేశంతో తన కూల వృత్తినే నమ్ముకుని తాడేపల్లికి చెందిన లంకా లక్ష్మణరావు గారు మన్నుతో అద్భుతాలు చేస్తున్నారు .

మట్టి పాత్రల కోసం ప్రారంభమైన పాత్రల తయారీ.. సుమారు మూడు దశాబ్దాలకు ముందు వివిధ కళాకృతకు జీవంపోసే ప్రక్రియగా మారి అనేక కళా ఖండాలకు ప్రాణం పోసుకున్నాయి . మరో వైపు సంస్కృతి, పల్లె కళ, సంప్రదాయాలకు ప్రతి రూపంగా ఈ మట్టిబొమ్మలు నిలుస్తున్నాయి.

లక్ష్మణరావు గారి చేతులనే మంత్రదండాలు చేసి మట్టికి అద్భుతమైన రూపు తెస్తున్నారు.

లక్ష్మణరావు గారి చేతులు మీదుగా ఎన్నో అద్భుతాలు మరెన్నో కళాఖండాలకు ప్రాణం పోసుకున్నాయి . ప్రాణం లేకుండా నిర్జీవంగా ఉండే ఈ బొమ్మలు మానవులతో భావాలు పంచుకునట్లు అనిపిస్తుంటాయి. ప్రజలను ఆకట్టుకునేలా మట్టి శిల్పాలను తయారు చేస్తున్నారు. షిర్డీ సాయిబాబా ,గౌతమ బుద్ధుడు, శ్రీవేంకటేశ్వరుడు, వినాయకుడు, ఇతర దేవత





మూర్తులు, వివిధ రకాల జంతువులు, మనుషుల మట్టి శిల్పాలను సైతం ఇట్టే తయారు చేసేస్తారు.

**"అమరావతి స్తుపానికి నకలు మట్టితో చేసి పలువురి మన్ననల-ను అందుకున్నారు. వీరు కేవలం బొమ్మలే కాకుండా లైఫ్ స్కెచ్ లను కుడా తయారు చేస్తున్నారు. "**


అమరావతి స్తుపానికి నకలు మట్టితో చేసి పలువురి మన్ననలను అందుకున్నారు. వీరు కేవలం బొమ్మలే కాకుండా లైఫ్ స్కెచ్ లను కుడా తయారు చేస్తున్నారు. జీవం ఉట్టిపడేలా ఉండే లైఫ్ స్కెచ్ లను ఎంతోమంది తయారు చేయించుకుని తమ ఇళ్ళలో , గార్డన్లలో పెట్టుకుంటున్నారు .

వీరు ఈ కళ తనతోనే అంతరించి పోకుడదనే సదుద్దేశ్యంతో తన పిల్లలను సైతం ఈ కళలోనె తీర్చి దిద్దటం వీరికి ఈ కళ పట్ల ఎంత మక్కువ ఉన్నదో తెలియ చేస్తుంది .

ఈ కళను పదిమందికి నేర్పాలనే తపనతో , 2005 నుండి అనేక పాఠశాలలు , కళాశాలల విద్యార్థులకు ఉచితంగా ఈ కళను నేర్పిస్తున్నారు .కరోన సమయంలో డిడి సప్తగిరి ద్వార అనేక వీడియో పాఠలను విద్య వారధి అనే కార్యక్రమంలో ప్రసారం చెయ్యటం జరిగింది .



కేవలం మట్టితో పాత్రలు మాత్రమే చేస్తే , తన కుటుంబం కూడా ఏనాడో ఈ కళకు దూరం అయ్యేదని , మార్కెట్ అవసరాల బట్టి వివిధ రకాల ఆకృతులను , పిల్లలు ఆడుకునే బొమ్మలను తయారు చేసి అమ్మటం వల్ల ఏ ఇబ్బంది లేకుండా సాగిపోతున్నదన్నారు . చాల మంది కళాకారులు కాలాన్ని బట్టి మారకుండా కళను తప్పు పడుతూ , దానిని వదిలి వేరే వృత్తులకు వెళ్లి పోతున్నారు .



ప్రభుత్వమ్ ఎంతోమందికి ఎన్నోరకాలుగా సహాయం చేస్తోంది కాని, ఇటువంటి కళాకారులకు మాత్రం ఏ సహాయం లేదు.కాళ్ళు ,చేతులు ఆడినంత వరకు ఏ ఇబ్బంది లేదు కానీ , రేపు ఏదన్న జరిగితే తమ కుటుంబాలకు ఆధారం ఏమి ఉండదు అని వాపోయారు .కనీసం కళాకారులకు పెన్షన్ లాంటిది ఇస్తే ఇటువంటి కళలు సజీవంగా నిలుస్తాయి అన్నారు లక్ష్మణ రావు గారు .యువకులకు స్కాలర్ షిప్పులు ఇస్తే కొంతమంది అన్నా వీటిని నేర్చుకోటానికి ముందుకు వస్తారన్నారు .



ఈ నెల స్మరణీయులు

# అంబేద్కర్ అవసరం ఇంకా ఉందా ?



బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ఒక గొప్ప వ్యక్తిగా, గొప్ప మార్గదర్శకుడిగా భారత జాతి మొత్తం గర్వంగా చెప్పుకోవటానికి ఏ మాత్రం సందేహం పడాల్సిన అవసరం లేదు. హిందూత్వ మితవాదులు కూడా అంబేద్కర్‌ను హిందూ సంఘ సంస్కర్తగా గుర్తించేందుకు అంగీకరించారు. హిందూ సాంస్కృతిక వైవిధ్యంలో కీలకమైన భాగంగా ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడారు. లెఫ్ట్–లిబరల్ మేధావి వర్గం కూడా అంబేద్కర్‌ను దేశ నిర్మాతగా, తత్వశాస్త్రం లేదా మేధో సంప్రదాయం యొక్క రంగంలో ప్రభావవంతమైన ఆయన ఉనికిని గుర్తించాలని కోరుకుంది. అంబేద్కర్ కేవలం 'దళిత వర్గాలకే కాక దేశంలోని ప్రతి వర్గానికి చెందిన గొప్ప వ్యక్తిగా, సార్వత్రిక తత్వశాస్త్రం యొక్క అత్యున్నత శిఖరంగా ఆయనను పోల్చుడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

అంబేద్కర్ కేవలం దళిత నాయకుడు మాత్రమే కాదు , సామాజిక న్యాయ రాజకీయాలలో ఒక భావోద్వేగ స్వరం. అయన ఖచ్చితంగా అటువంటి వర్గీకరణలకు అతీతుడు – శ్రామిక వర్గ సమస్యలను నొక్కిచెప్పడంలో ఆయన ప్రశంసనీయమైన నాయకత్వాన్ని పోషించారని చెప్పక తప్పదు. మార్క్సిస్ట్–సోషలిస్ట్ ఆలోచనలతో ఆయన జరిపే విమర్శనాత్మక పరిశీలన చాలా ముఖ్యమైనది. వైస్రాయ్ కౌన్సిల్‌లో కార్మిక మంత్రిగా, ఎనిమిది గంటల పనిదినాలు, సమాన వేతనాలు మరియు ప్రసూతి సెలవుల డిమాండ్లపై కార్మిక వర్గాలకు అనేక ప్రయోజనాలను అందించటంలో కీలక పాత్ర పోషించాడు. భారతదేశంలో మహిళా విముక్తి కోసం పోరాటాలను బలోపేతం చేయడంలో, ఆయన రచనలు అత్యంత కీలకమైన పాత్ర పోషించాయి. రాజ్యాంగకర్తగా అంబేద్కర్ భారతదేశాన్ని ఆధునిక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా స్థాపించడానికి విపరీతమైన ఆసక్తిని రాజకీయ దృక్పథాన్ని ప్రదర్శించారని చెప్పక తప్పదు. మేధావిగా, పౌరసత్వం, స్వేచ్ఛ, సమానత్వం మరియు న్యాయం వంటి కీలక రాజకీయ భావనలను అర్థం చేసుకోవడానికి ఆయన ఆలోచనలు చాలా ముఖ్యమైనవి.

అంబేద్కర్‌ను జాతీయ నాయకుడిగా లేదా రాజకీయ తత్వవేత్తగా చూడాలా అనే చర్చ తరచుగా అయన తన జీవితకాలంలో నిమగ్నమై ప్రధాన సామాజిక , రాజకీయ లక్ష్యాల నుండి దూరంగా జరుగుతోంది దళితులను అంటరానితనం సంకెళ్ల నుండి విముక్తి చేయడానికి అంబేద్కర్ చేసిన పోరాటం , ఆయన రాజకీయ మేధో వ్యక్తిత్వం ఆచంచలమైనది. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా చేసిన పోరాటం,దేశ నిర్మాణం, రాజ్యాంగ వాదం లేదా సూత్రప్రాయ తత్వశాస్త్రం యొక్క సమస్యల కంటే, ఆయన కుల సమాజంలోని క్రూరమైన వాస్తవాలను సరిదిద్దడానికి దృఢంగా నిమగ్నమై కట్టుబడి ఉన్నాడు . కుల వివక్షను సమూలంగా నాశనం చేసి మెరుగైన మానవ ప్రపంచంగా మార్చాలని కోరుకున్నాడు. మనం కులం , అంటరానితనం అనే ప్రాథమిక ప్రశ్నలను విస్మరించి, ఆయనను అమూర్త జాతీయ నాయకునిగా అభివర్ణిస్తే, అది అంబేద్కర్‌కు , ఆయన మేధో విజ్ఞానానికి అపచారం చేసిన వాళ్లమవుతాం.

నేటికీ భారతదేశ సామాజిక మరియు రాజకీయ జీవితంలో కులం క్రూరమైన వాస్తవం.

## ఈ నెల స్మరణీయులు



సాంప్రదాయిక మతపరమైన ప్రమాణంగా, కులం మానవుల మధ్య అధికారిక సమానత్వాన్ని అనుమతించదు; బదులుగా అది శాశ్వతంగా వేరు చేయబడిన , క్రమానుగత విభాగాలలో కుటుంబ , పౌర సంబంధాలను నియంత్రిస్తుంది. కులం యొక్క అహంకారం ,సామాజిక స్థితి ,ప్రతిభ, వృత్తిపరమైన నైపుణ్యం లేదా ఆర్థిక చైతన్యం ద్వారా కాకుండా, పుట్టుకతోనే నిర్ణయించబడుతుంది.కుల సమాజంలోని రుగ్మతలను గుర్తించడంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారు. సామాజిక వివక్ష, ఆర్థిక పరాయీకరణ మరియు రాజకీయ బహిష్కరణ నుండి దళితులను విముక్తి చేయడానికి తన జీవితాంతం పోరాడారు. ఆయన ఆధునికత యొక్క గొప్ప రూపం. రాబోయే పారిశ్రామిక అభివృద్ధి, ప్రజాస్వామ్య సంస్థలు, గణతంత్ర విలువలు అంటరానివారి విముక్తికి హామీ ఇచ్చే నూతన విధానాలను ఏర్పరుస్తాయని ఆశించారు. ఆధునిక ప్రజాస్వామ్యం సెక్యులర్‌గా ఉంటుందని,పూర్వపు సామాజిక హోదాలు క్రమానుగతంగా కనుమరుగవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్దేశాలతో ,ఆధునిక సంస్థలచే రక్షించబడిన, దళితులు ఆధునిక పౌరులుగా ఉద్భవిస్తారని సామాజిక భయాలు మరియు పక్షపాతాలు లేకుండా ఉదార ప్రజాస్వామ్య ప్రయోజనాలను పొందుతారని భావించారు.

ఆధునిక లౌకిక జీవితం యొక్క ప్రగతిశీల మూల్యాంకన విధానాన్ని అంబేద్కర్ ఒప్పుకోలేదు. బదులుగా, ఆయన బ్రాహ్మణ సామాజిక ప్రపంచం మరియు కొత్త లౌకిక రాజకీయ రంగాల మధ్య విభజనను గుర్తించాడు. భారతదేశం యొక్క గణతంత్ర రాజ్యంలో, "నేడు భారతీయులు రెండు భిన్నమైన భావజాలాలచే పాలించబడుతున్నారు ఆయన అన్నారు. ఆయన రాజకీయ ఆదర్శం, రాజ్యాంగ ప్రవేశికలో, స్వేచ్ఛ, సమానత్వం మరియు సౌభ్రాతృత్వం ఆయన జీవితాన్ని ధృవీకరిస్తుంది. సమాజాన్ని కుల మతాల నుండి సంస్కరించకపోతే, సామాజిక క్రమం తప్పకుండా కొత్త లౌకిక ప్రపంచంలోని విప్లవాత్మక ఆధారాలను కలుషితం చేసి నాశనం చేయగలదని హెచ్చరించారు. హిందూ సమాజంలో సమూల సంస్కరణలు లేకుండా, ప్రజాస్వామ్యంలో కీలకమైన పురోగతి సాధించడం చాలా కష్టం. ఆధునిక రాజ్యాంగం చాలా సూక్ష్మంగా రూపొందించిన మానవతా ధర్మాలు మరియు లక్ష్యాలకు సామాజిక క్రమం తప్పనిసరిగా అనుబంధంగా ఉండాలి. కుల క్రమం తప్పనిసరిగా మానవతావాద సామాజిక వ్యవస్థగా మార్చబడాలి, ప్రతి వ్యక్తికి సమాన సామర్థ్యాలు, స్వేచ్ఛ మరియు శక్తిని వారి జీవిత లక్ష్యాలను సాధించడానికి వాగ్దానం చేయాలి.

బౌద్ధ తత్వశాస్త్రం మెరుగైన నైతిక ఆధారాలను కలిగి ఉందని ,ఆధునిక సమాజం యొక్క నైతిక పునాదులకు అనుబంధంగా ఉంటుందని అంబేద్కర్ విశ్వసించారు. ఆయన కొత్త సామాజిక, మత క్రమానికి మార్గదర్శక సూత్రంగా 'సహోదరత్వాన్ని' అందించాడు. అక్టోబరు 14, 1956న లక్షలాది మంది అనుచరులతో కలిసి బౌద్ధమతం



## ఈ నెల స్మరణీయులు



స్వీకరించి, చైతన్యవంతమైన సామాజిక, మతపరమైన మార్పుల ఆవశ్యకతను చర్చించేందుకు కొత్త అధ్యాయానికి తెరతీశారు. మత మార్పిడి యొక్క ప్రధాన ఆవశ్యకత కుల క్రమాన్ని తిరస్కరించడం.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, దేశం ప్రగతిశీల చట్టాలు, నిశ్చయాత్మక కార్యాచరణ విధానాలు మరియు మత–సామాజిక సంస్కరణల కారణంగా సానుకూల మార్పులను చూసింది. పట్టణీకరణ అంటరానివారిని పౌరసత్వ స్థితికి దగ్గరగా తీసుకువచ్చాయి. 1990 అనంతర కాలంలో దళితుల ప్రశ్నపై ఒక సారవంతమైన సమీక్ష కూడా దళితుల్లో కనిపించే విభాగాలు తమ తరగతి , సామాజిక స్థానాలను మెరుగుపరుచుకున్నాయని , మధ్యతరగతి వర్గాలలోకి ప్రవేశించాయని రుజువు చేస్తుంది. దళిత రాజకీయం ఏది ఏమైనప్పటికీ, సమాజంలోని ఒక చిన్న వర్గం యొక్క వాస్తవాలను ప్రతిబింబిస్తుంది.దళితులు అధిక జనాభా, రాజ్యాంగ మార్పుల వల్ల కొద్దిమంది మాత్రమే లబ్ధిదారులుగా పరిగణించబడతారు. క్రూరమైన గతం యొక్క వారసత్వం , వారి గౌరవం లేని శ్రమ జ్ఞాపకాలు ఇప్పటికీ వారి దైనందిన జీవితంలో వారిని వెంటాడుతున్నందున ఇంకా చాలా మంది 'నిర్మాణంలో లో ఉన్న పౌరులు'గా మిగిలిపోయారు. దళిత జనాభాలో పెద్ద భాగం ఇప్పటికీ గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో కుల దౌర్జన్యాలు మరియు హింసను ఎదుర్కొంటూ అత్యంత వెనుకబడిన వారిగా మనుగడ సాగిస్తున్నారు. వారి పరిస్థితి పట్ల రాష్ట్రం తరచుగా నేరపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది.

అధికారం యొక్క సాంప్రదాయిక సామాజిక ఏర్పాటులో, దళిత వ్యక్తి సమాన హక్కులు కలిగిన ఆధునిక పౌరుడిగా ఉండాలనే ఆలోచన ఇంకా ఆమోదించబడలేదు. దళితులు కొంత ఆర్థిక చైతన్యం లేదా విద్యా స్థితిని పొందడం వల్ల కుల సోపానక్రమాలను మార్చవచ్చని సామాజిక ఉన్నత వర్గాలు లేదా ఆధిపత్య కులాలు అంగీకరించడానికి ఇష్టపడరు. అందువల్ల, మానవ హక్కులు, సామాజిక గౌరవం మరియు రాజకీయ దృక్పథం కోసం వారి వాదనలు కూడా వివక్షాపూరిత పద్ధతులు లేదా క్రూరమైన అణచివేతకు గురవుతాయి. దళితుల ప్రశ్న అసహ్యం ద్వేషాన్ని కలిగిస్తుంది, ప్రత్యేకించి వివాహ అవకాశాలు, ఆచారాలు మరియు మతపరమైన సంప్రదాయాలపై చర్చల సమయంలో మరియు ఉద్యోగాల కోసం ఉద్యోగార్థిని ఎంపిక చేసే సమయంలో.కుల దౌర్జన్యాలను సాధారణ సమీక్షిస్తే మూడు ప్రధాన సమస్యలపై దళితులపై ఆధిపత్య కులాలు హింసకు పాల్పడుతున్నాయని తెలుస్తుంది. మొదటిది, దళిత పురుషులను పాలక వర్గాల సామాజిక గౌరవానికి ముప్పుగా పరిగణిస్తారు. ఒక దళిత వ్యక్తి ‘ఉన్నత’ కులానికి చెందిన అమ్మాయితో ప్రేమలో పడే అవకాశం భూస్వామ్య అధికారానికి మరియు సామాజిక హోదాకు సవాలుగా పరిగణించబడుతుంది.

రెండవది, దళితుల ప్రాథమిక ఆర్థిక హక్కులు, భూమి హక్కులు లేదా సరైన వేతనాల డిమాండ్లు కూడా గ్రామ సంప్రదాయాలకు మరియు భూస్వామ్య వ్యవస్థకు సవాలుగా పరిగణించబడతాయి. 1990వ దశకంలో బీహార్‌లో రాడికల్ మావోయిస్టులు దళితులను ప్రధానంగా వ్యవసాయ సమస్యలపై సమీకరించి, భూస్వామ్య భూస్వాములతో పోరాడేందుకు వారిని ప్రోత్సహించారు. అయితే, అటువంటి సమీకరణ త్వరలో రక్తపాత కుల ఘర్షణలు మరియు హింసాత్మక హత్యలతో ముగిసింది.

మూడవది, దళితులు ప్రభుత్వ సంస్థలలోకి ప్రవేశించడానికి మరియు వారి ఆర్థిక స్థితిని మెరుగుపర్చడానికి కృషి చేయడానికి రాజ్యాంగపరమైన రక్షణలను ఉపయోగించుకుంటారు.



అయినప్పటికీ, ఆధునిక పట్టణ సంస్థలలో కూడా, వారు కుల వివక్ష మరియు బహిష్కరణను ఎదుర్కొంటున్నారు. రోహిత్ వేముల మరియు పాయల్ తాడ్వి యొక్క భయంకరమైన ముగింపులు, రెండు ప్రతిష్టాత్మక ఉన్నత విద్యా సంస్థలలో, అటువంటి శిక్షించబడని నేరపూరిత చర్యలకు సాక్ష్యంగా ఉన్నాయి.దళిత మహిళలు తరచుగా అత్యంత దారుణమైన దహనాలను ఎదుర్కొంటారు. దళితులపై నేరాలలో, దళిత మహిళలపై లైంగిక వేధింపులు మరియు అత్యాచారాలకు సంబంధించిన క్రూరమైన కేసుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. సెప్టెంబరు 29, 2006న మహారాష్ట్రలోని భండారా జిల్లాలోని ఖైర్లాంజీ అనే చిన్న గ్రామంలో మహర్ కులానికి చెందిన భోత్మాంగే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు హత్యకు గురయ్యారు. హత్యకు ముందు కుటుంబానికి చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించారు. సంఘటన జరిగిన దాదాపు రెండు నెలల తర్వాత, ఎలక్ట్రానిక్ మీడియాలో వార్తలు విస్తృతంగా వ్యాపించాయి ఆ తర్వాతే దళితులు అన్ని ప్రధాన నగరాల్లో దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభించారు. ఈ వార్త ప్రపంచవ్యాప్తం అయ్యి ప్రభుత్వంపై పెద్దఎత్తున ఒత్తిడి తెచ్చిన తర్వాత మాత్రమే అధికారులు చర్యకు దిగారు.

2016 నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం, షెడ్యూల్డ్ కులాల సభ్యులపై జరిగిన అన్ని నేరాలలో, అత్యధిక సంఖ్యలో దళిత మహిళలపై జరిగినవే. ప్రతిరోజూ నలుగురికి పైగా దళిత స్త్రీలు అత్యాచారానికి గురవుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి . కుల దురాగతాల నుండి దళితులను రక్షించడానికి శక్తివంతమైన రాజ్యాంగ ఆదేశాలతో రాష్ట్రం అమర్చబడినప్పటికీ, ఇది తరచుగా ఆత్మసంతృప్త సహచరుడిగా మిగిలి పోతున్నది అన్నది వాస్తవం.

అయినప్పటికీ, దేశం నిరంతర రిపబ్లికన్ విలువలను సంతరించుకుంటూనే వుంది ,ఎన్నికల ప్రజాస్వామ్య ప్రక్రియలలో అత్యధికంగా పాల్గొంటోంది, సామాజిక మరియు సాంస్కృతిక పరిసరాలు దాని సాంప్రదాయిక అవసరాన్ని నిలుపుతుంది. బాబాసాహెబ్ అంబేద్కర్ హిందూ సమాజంలోని చారిత్రక తప్పులను సరిదిద్దడానికి స్ఫూర్తిదాయకమైన పోరాటానికి నాయకత్వం వహించారు. ఏదైనా సామాజిక–మతపరమైన క్రమం యొక్క ప్రామాణికతను తప్పనిసరిగా స్వేచ్ఛ, సమానత్వం మరియు సౌభ్రాతృత్వం యొక్క పునాది నైతిక సూత్రాలపై నిర్ణయించాలని ఆయన సూచించారు. సోదర సాంఘిక జీవితం కోసం, 'అధో–ఉన్నత' కుల అనుబంధాలు తప్పనిసరిగా నిలిపివేయబడాలి ,ప్రజలు వివక్షతతో కూడిన సాంస్కృతిక మరియు ఆచార నిబంధనలకు విరుద్ధంగా పని చేయాలి.దళితుల నుండి వచ్చిన అనేక చెదురుమదురు గొంతెత్తిన పోరాటాలు వారి క్రియాశీల సంస్థ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సమాజంపై నేరపూరిత పట్టును నిలుపుకోవడానికి అనుమతించదని నిరూపించాయి. సామాజిక న్యాయం మరియు మానవ హక్కుల కోసం జరిగే అన్ని పోరాటాలలో, దళితులు అంబేద్కర్‌ను అర్థం చేసుకోవడానికి ప్రధాన వనరుగా చూస్తారు. అతని పేరు, చిత్రపటం లేదా విగ్రహం దళితుల దృఢత్వానికి ప్రతీకలు.

అన్ని చట్టవిరుద్ధమైన సామాజిక అసమానతలు మరియు మతపరమైన బలవంతాన నుండి దళితులకు గణనీయమైన విముక్తి లభించనంత వరకు, సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటాలలో అంబేద్కర్ అన్నింటికంటే ఎక్కువగా అవసరం.

★★★★★★★

పండుగ

# రంజాన్

**నమాజ్ దుష్టచింతనల్ని, దురాగతాల్ని, కుహనా సంస్కారాన్ని ఎదుర్కోగలదు. సత్ప్రవర్తనను నేర్పించగలదు. సత్ప్రవర్తనగల వ్యక్తి సర్వేశ్వరుని దృష్టిలో అందరికన్నా మిన్న (ఖురాన్ 49:13)**



రంజాన్ పండుగ ప్రపంచంలోని ముస్లింలందరికీ ఎంతో పవిత్రమైంది. ఈ మాసంలోనే ఎంతోమంది ముస్లింలు 30 రోజుల పాటు ఉపవాసం ఉంటారు. మరి ఈ మాసంలోనే వీళ్లు ఉపవాసం ఎందుకు ఉంటారు...? ఈ మాసం యొక్క ప్రత్యేకత ఏంటో తెలుసుకుందాం.

ముస్లింలు చాంద్రమాన కేలండర్ను అనుసరిస్తారు. చాంద్రమానాన్ని అనుసరించే ఇస్లామీయ కేలండర్ తొమ్మిదవ నెల 'రంజాన్', దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా ఈ నెలను భావిస్తారు. దానికి ప్రధానమైన కారణం ' దివ్య ఖురాన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే! క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే ' రంజాన్ మాసం' ఈ ఏడాదిలో ఏప్రిల్ 3 వ తేదీ ఆదివారం నుంచి రంజాన్ వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ రోజు నుంచి మొదలుకుని 30 రోజులకు అంటే మే రెండో తారీఖున ఈ పండుగ ముగుస్తుంది.

ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యమున్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు, కఠిన 'రోజా' ఉపవాస దీక్షలు, దానధర్మాలు, ఆధ్యాత్మిక సందేశాలతో సాగుతుంది. మహ్మద్ ప్రవక్త లా ఇల్లాహ ఇల్లాల్ల అనే సూత్రం ప్రకారం మానవులను కష్టాల నుంచి కాపాడేందుకు ఈ మాసాన్ని సృష్టించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ మాసంలో రోజుకు ఐదు పర్యాయాలు నమాజ్తో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. పవిత్ర మాసంలో దానధర్మాలకు కూడా ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ నెలలో చనిపోతే నేరుగా స్వర్గానికి చేరుతారని, నరకపు ద్వారాలు మూసి ఉంటాయని ముస్లింల ప్రగాఢ నమ్మకం.

## ఉపవాస దీక్షలు :

రంజాన్ మాసంలో సూర్యోదయం కంటే ముందు నుండి సూర్యాస్తమయం వరకు నీరు, ఆహారం, కనీసం ఉమ్మి కూడా మింగ కుండా కఠోర ఉపవాస దీక్ష చేపడతారు. వయస్సులో తారతమ్యం లేకుండా చిన్న, పెద్ద, ముసలి వారు సైతం భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలో ఉంటారు. ఉపవాస దీక్షలతో బలహీనతలు, వ్యసనాలను జయించవచ్చని ఇస్లాం మత గురువులు చెబుతారు. ఉపవాస దీక్షల వల్ల జీర్ణశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని శాస్త్రం చెబుతుంది. ఉపవాస దీక్షలు (రోజా)సహారీతో ప్రారంభమై ఇఫ్తార్తో ముగుస్తుంది.

## జకాత్:

జకాత్ రమదాన్ నెలలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం. సంపాదనాపరులైనవారు, సంపన్నులైనవారు రమదాన్ నెలలో ' జకాత్ ' అచరించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలో నుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని ' జకాత్' అని అంటారు. దీనిని పేదల ఆర్థిక హక్కుగా పేర్కొంటారు. దీని ప్రకారం ప్రతి ధనికుడు సంవత్సరాంతంలో మిగిలిన తన సంపద నుండి 30 శాతం చొప్పున ధన, వస్తు, కనకాలను ఏవైనా నిరుపేదలకు దానంగా యిస్తారు. పేదవారు కూడా అందరితో పాటు పండుగను జరుపుకొనడానికి, సంతోషంలో పాలుపంచుకునేందుకు ఈ ' జకాత్ ' ఉపయోగపడుతుంది.

## ఫిత్రా:

'జకాత్' తో పాటు ' ఫిత్రా' దానానికి రమదాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. మూడుపూటల తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు ఎంతోమంది వున్నారు . ఇలాంటి అభాగ్యులకు, పేదవారికి పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం దీన్ (ధర్మం) ఉద్బోధిస్తూవుంది. దీనినే 'ఫిత్రాదానం' అని పిలుస్తారు. ఉపవాసవ్రతాలు విజయవంతంగా

పండుగ

**"రమదాన్" అనేది ఒక నెల. చాలా వరకు తెలియని వాళ్ళు "రంజాన్" అని అంటారు. వాస్తవానికి అది "రమదాన్" అని పిలవాలి**



ముగిసినందులకు దేవుడి పట్ల కృతజ్ఞతగా పేదలకు ఈ ఫిత్రాదానం విధిగా అందజేస్తారు. ఈ ఫిత్రాదానంలో 50 గ్రాముల తక్కువ రెండు కిలోల గోధుమలను గానీ, దానికి సమానమైన ఇతర ఆహారధాన్యాలను గానీ, దానికి సమానమైన ధనాన్ని గానీ పంచిపెట్టాలి. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు అందజేయాలి. దీనివల్ల పుణ్యం దక్కుతుందనే నమ్మకం ఉంది.

దైవ ప్రవక్త ఫిత్రాధానాన్ని విధిగా నిర్ణయించడానికి కారణం – ఉపవాస వ్రత నియమాన్ని పాటించే సమయంలో హృదయంలో కలిగే చెడు తలంపులు, ఆలోచనలు, నోటినుంచి వెలువడే అసత్యాలు, పనికిమాలిన మాటలు వంటి పొరపాట్లు జరుగుతూ వుంటాయి. ఇలాంటి అనాలోచిత పొరపాట్లు అన్నీ ఫిత్రాదానం వల్ల క్షమించబడతాయి అని మహమ్మద్ ప్రవక్త సహాబి (సహచరులు) అబ్దుల్లా బిన్ మసూద్ తెలిపారు.

## ఈద్ ముబారక్:

నెల పొడుపుతో రమదాన్ ఉపవాస దీక్షలు విరమించి మరుసటి దినాన్ని "ఈద్ ఉల్ ఫితర్ " పండుగగా నిర్ణయిస్తారు. అల్లా రక్షణ, కరుణ అందరూ పొందాలన్న ఆశయంతో ఈద్గాలో బారులుతీరి పండుగ నమాజు చేస్తారు. కొత్త వస్త్రాలు, పరిమళ ద్రవ్యాలతో వాతావరణమంతా ఆహ్లాదకరమవుతుంది. ధనిక, బీద తారతమ్యం లేక, సహృదయాలతో సద్భావనలతో ఆలింగనం చేసుకుంటారు. ద్వేషాలన్నీ సమసి ప్రేమపూరిత భావం ఇనుమడిస్తుంది. ప్రత్యేకంగా సేమ్యాతో చేసిన ఖీర్ తినిపించుకొని ముస్లింలే కాక ముస్లిమేతర సోదరులు కూడా కలిసి శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. మానవుల మధ్య నెలకొన్న వర్గ వైషమ్యాలు తొలగించి అందరిలో ఆధ్యాత్మిక చింతన కలిగించి చిరుజీవితాన్ని ఆనందంతో నింపి పుణ్యకార్యాల వైపు దృష్టి మరల్చే రమదాన్ మాసం చైతన్యాన్ని కలిగించి ముందుకు సాగే ధైర్యాన్నిస్తుంది. ఈ పండుగను పేద, ధనిక తేడా లేకుండా అత్యంత భక్తి ప్రవత్తులతో జరుపుకుంటారు. ప్రతి ఒక్కరూ కొత్త బట్టలు ధరించి పండుగ నమాజును ఊరిబయట నిర్ణీత ప్రదేశాలైన ఈద్‌గాహ్ లలో చేస్తారు. అనంతరం ఒకరికొకరు ' ఈద్‌ముబారక్(శుభాకాంక్షలు) చెప్పుకుంటారు.

## ఇఫ్తార్ విందు:

ఈ నెలలో జరిగే ' ఇఫ్తార్ విందుల్లో ఆత్మీయత సహృద్భావాలు ప్రస్ఫుటమవుతాయి. పరస్పర ధోరణికి, విశాల ఆలోచనా దృక్పథానికి ఇవి నిదర్శనం.

ఈవిధంగా పవిత్ర ఆరాధనలకు ధార్మిక చింతనకూ, దైవభక్తికీ, క్రమశిక్షణకూ, దాతృత్వానికి రమదాను నెల ఆలవాలం అవుతుంది. మనిషి సత్ప్రవర్తన దిశలో సాగడానికి మహమ్మద్ ప్రవక్త బోధించిన మార్గాన్ని సుగమం చేస్తుంది



ముస్లిం సోదరులందరికి రమదాన్ శుభాకాంక్షలు.

★★★★

పుస్తక వీక్షణం

# ధనవంతులుగా మారటం అసాధ్యం కాదు

– డాక్టర్ పార్థసారథి చిరువోలు




మానవ జీవితంలో డబ్బుకి ఉన్న ప్రాధాన్యత తెలియంది కాదు. మన వాలెట్ డబ్బుతో బరువుగా ఉన్నప్పుడు మనలో తెలియకుండానే ఆత్మవిశ్వాసం ఉట్టిపడుతుంది. అదే ఖాళీజేబు ఆత్మన్యూనతను పెంచుతుంది. ఆరోగ్యం మాదిరిగానే డబ్బు కూడా అది లేనప్పుడే దాని విలువ బాగా తెలిసొస్తుంది.

మీరు బాగా డబ్బు సంపాదించగలరు. ధనవంతులు కాగలరు అని ఎవరైనా అంటే మనకు నవ్వొస్తుంది. ఆ మాటలను కొట్టిపారేస్తాం. ముందుగా కుటుంబ నేపథ్యం గురించి మాట్లాడతాం. ఆ తర్వాత ఆస్తిపాస్తుల వివరాలను ఏకరవు పెడతాం. మనం చేస్తున్న ఉద్యోగమో, వ్యాపారమో ద్వారా పెద్దగా ఆదాయం గడించటం సాధ్యంకాని పని అని ఒప్పించే ప్రయత్నం చేస్తాం.

***"బాగా డబ్బు సంపాదించిన వారంతా సాధారణ కుటుంబంలో నుంచి వచ్చిన వారని, వారేమీ అసాధారణ తెలివితేటలు ఉన్నవారు కాదన్న విషయాన్ని ఉదాహరణలతో వివరించి చెప్పినప్పుడు విస్తుపోతాం. "***

బాగా డబ్బు సంపాదించిన వారంతా సాధారణ కుటుంబంలో నుంచి వచ్చిన వారని, వారేమీ అసాధారణ తెలివితేటలు ఉన్నవారు కాదన్న విషయాన్ని ఉదాహరణలతో వివరించి చెప్పినప్పుడు విస్తుపోతాం.

అమెరికాకు చెందిన వాల్లస్ డి. వాటిల్స్ ''మీరు ఎవరయినా, ఎక్కడ వారయినా సులభంగా డబ్బు సంపాదించవచ్చు.




ధనికులు కావచ్చు. అయితే అలా కావాలన్న సంకల్పం బలీయంగా ఉండాలి. అందుకు కొన్ని సిద్ధాంతాలు పాటించాలి'' అని చెప్పారు. వందేళ్ల క్రితం.. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే 113 ఏళ్ల క్రితం.. అంటే 1910 ప్రాంతంలో ఈ సిద్ధాంతాన్నే ప్రతిపాదిస్తూ ఆయన ఓ గొప్ప పుస్తకం రాశారు. దాని పేరు 'సైన్స్ ఆఫ్ గెట్టింగ్ రిచ్'. దాదాపు వంద పేజీలు ఉండే ఈ పుస్తకంలో మెటాఫిజికల్ కాన్సెప్ట్ ల ద్వారా శాస్త్రీయ పద్ధతిలో సంపదను ఎలా కూడగట్టాలో వివరించారు. ఒక్క అమెరికాలోనే కాదు, ప్రపంచం అంతా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత కాలంలో డబ్బు సంపాదించటం పైన వందలాది పుస్తకాలు మార్కెట్ ను ముంచెత్తినా దాని ప్రభావం తగ్గలేదు. 'మాస్టర్ పీస్' గా అది నేటికీ చదువరులను ఆకట్టుకుంటూనే ఉంది. ఈ పాపులర్ పుస్తకాన్ని 'రెడ్ నిబ్ ' ప్రచురణ సంస్థ తాజాగా 'సంపద సృష్టించే రహస్యం' పేరుతో తెలుగులోకి తీసుకొచ్చింది. ఆ పుస్తకంలో విశేషాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**సంపద సృష్టి ఇలా...**

ధనవంతుల శాస్త్రంలో మొదటి సూత్రం ఆలోచన. మనిషి చేసే ప్రతి రూపం తొలుత అతని మెదడులో మెదిలిన ఆలోచనతో రూపుదిద్దుకుంటుంది. మీరు ఒక కంప్యూటర్ కావాలని కోరుకున్నారనుకోండి. అది

పుస్తక వీక్షణం

# ధనవంతులుగా మారటం అసాధ్యం కాదు

తప్పకుండా వస్తుందనే నమ్మకాన్ని మీరు కలిగి ఉండాలి. దాన్ని సాధించే వరకూ ఆ ఆలోచనను విడనాడకూడదు. ఇది మనుషుల అత్యున్నత మేథోశక్తి ద్వారా అందించబడుతుంది. డబ్బు విషయం కూడా అంతే.

***"సంపద కోసం సాధారణ కోరిక ఉంటే సరిపోదు. అస్పష్టంగా, అసంకల్పితంగా ఉన్నప్పుడు మీలో ఉన్న సృజనాత్మక శక్తిని బయటకు తీసుకురాలేరు. డబ్బు సంపాదించాలన్న వాంఛ ప్రగాఢంగా ఉండాలి.***

సంపద కోసం సాధారణ కోరిక ఉంటే సరిపోదు. అస్పష్టంగా, అసంకల్పితంగా ఉన్నప్పుడు మీలో ఉన్న సృజనాత్మక శక్తిని బయటకు తీసుకురాలేరు. డబ్బు సంపాదించాలన్న వాంఛ ప్రగాఢంగా ఉండాలి. దాన్ని సాధించేందుకు ఇప్పటి వరకూ భౌతిక శ్రమకే పరిమితమైనా ఇప్పటి నుంచి నిరాకార పదార్థం (విశ్వం) నుంచి కొత్త రూపాల సృష్టికి అవసరమయ్యే వాటి గురించి ఆలోచించటం నేర్చుకోవాలి. ప్రకృతి అనేది సంపదకు తరగని భాండాగారం. సంపదకు అవసరమైన మూలపదార్థం సృజనాత్మక శక్తితో ఎప్పుడూ సజీవంగా ఉంటుంది. సమృద్ధిగా ఉంటుంది. దాన్ని అందిపుచ్చుకోవటం ఎలాగో తెలుసుకోవాలి. పైకి కనిపించే సప్లయ్ గురించి ఆలోచించకండి. భూగర్భంలో దాగున్న నిధి నిక్షేపాల మాదిరిగా నిరాకారమైన పదార్థంలో అపారమైన సంపాదన చూడటం అలవాటు చేసుకోవాలి. ఆలోచనలను క్రమంగా పేర్చుకుంటూ ముందుకు వెళ్లాలి. ఈ ఆలోచలను విరుద్ధమైన వాదనలను వినకూడదు. వీటికి ప్రభావితమైతే మీ ప్రయత్నం విఫలమవుతుంది.

ఇప్పుడు మీరు అనుసరించవలసిన మార్గం.. మనకు పరిచయం లేని పదార్థం ఒకటి ఉందని నమ్మటం, దాని ద్వారా మనం కోరుకున్నవన్నీ సాధించగలనని విశ్వసించటం, మూడోది ప్రగాఢమైన కృతజ్ఞతాభావాన్ని కలిగిఉండటం. ఇది దేవుడు మనకు ఇచ్చిన బహుమతిగా భావించాలి. ఇదెంత బలంగా, స్థిరంగా ఉంటే నిరాకార పదార్థంలో ప్రతి చర్య అంత బలంగా, స్థిరంగా ఉంటుంది. మీరు కోరుకున్న వస్తువులన్నీ చెంతకు చేరతాయి. ధన్యవాదాలతో కూడిన థ్యాంక్స్ గివింగ్ విశ్వాసాన్ని పెంచుతుంది.

''నా సంపద ప్రతి రోజూ వృద్ధి చెందుతోంది. ఆర్థికంగా నేను ముందుకు వెళుతున్నాను'' అని పదేపదే చెప్పుకోండి. ఉపచేతన మనస్సును దానిపైనే లగ్నం చేయండి.

మీలో విశ్వాసం ఎంతగా ఉంటే మీరు అంతగా ధనవంతులు కాగలుగుతారు. మీరెప్పుడూ నెగెటివ్ అంశాల గురించి దృష్టి సారిస్తుంటే, నిజమైన స్పష్టమైన దృష్టిని కేంద్రీకరించలేరు. మీ గత ఆర్థిక ఇబ్బందుల గురించి ప్రస్తావించకండి. మీరు చిన్నతనంలో అనుభవించిన కష్టాల గురించి, పేదరికం గురించి మాట్లాడకండి. ఆ ఆలోచనలను పాతేయ్యండి.

***"నిర్దిష్ట పద్ధతిలో ఏ రోజు పని ఆ రోజు చేసుకుంటూ పొండి. అందుకు అవసరమైన ప్రతిభను మీరే వృద్ధి చేసుకోగలుగుతారు. డబ్బు మన దగ్గరకు వచ్చినప్పుడు అందుకోవటానికి సిద్ధంగా ఉండాలి. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగమో, వ్యాపారం మారితే తప్ప డబ్బుగడించలేమన్న భావనను వదులుకోండి. "***

నిర్దిష్ట పద్ధతిలో ఏ రోజు పని ఆ రోజు చేసుకుంటూ పొండి. అందుకు అవసరమైన ప్రతిభను మీరే వృద్ధి చేసుకోగలుగుతారు. డబ్బు మన దగ్గరకు వచ్చినప్పుడు అందుకోవటానికి సిద్ధంగా ఉండాలి. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగమో, వ్యాపారం మారితే తప్ప డబ్బుగడించలేమన్న భావనను వదులుకోండి.

**డబ్బు వెనక రహస్యం**

నిజమైన పరిపూర్ణమైన జీవితం అంటే, శరీరం,మనసు, ఆత్మ మూడింటికి సమప్రాధాన్యత ఇవ్వాలి. భౌతిక వస్తువుల వినియోగం ద్వారానే మనిషి శారీరక జీవితాన్ని అనుభవిస్తూ, మనసును,

పుస్తక వీక్షణం

# ధనవంతులుగా మారటం అసాధ్యం కాదు

ఆత్మను సంతృప్తిని పరుస్తాడు. ఆయా వస్తువులను సొంతం చేసుకోవటానికి సమృద్ధిగా డబ్బు కావాలి. ఇందుకు సంపన్నులయ్యే శాస్త్రాన్ని అర్థం చేసుకోవటం ముఖ్యం.

బీజగణితం, అంకగణితం మాదిరిగానే ధనవంతులు కావటం కూడా ఒక శాస్త్రం. ఒక నిర్దిష్టమార్గంలో పనిచేయటం వల్లనే సంపన్నులు కావటం వీలవుతుంది. అలా చేయకపోతే, ఎంత కష్టపడినా, పేదలుగానే మిగిలిపోవలసి వస్తుంది.

ఒక ప్రాంతంలోనో, ఒక రాష్ట్రంలోనో నివసించే వారు ధనికులవుతారని చెప్పటానికి లేదు. ఒకే వ్యాపారంలో ఒకే పరిసరాల్లో ఉన్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ధనివంతునిగా నిలబడితే మరొకరు పేదవాడిగానే మిగిలిపోతారు. పొదుపు చేస్తే డబ్బు సంపాదించగలరు అనుకోవటం కూడా తప్పు. దుబారా ఖర్చులు చేసే వాళ్లు కూడా ధనవంతులయిన దాఖలాలు ఉన్నాయి. అలాగే మూలధనం లేనంత మాత్రాన ధనవంతులు కాకుండా మిమ్మల్ని ఎవరూ అడ్డుకోలేరు.

యజమానుల కింద పనిచేసినంత మాత్రాన ఎవరూ అవకాశాలను కోల్పోవలసిన పనిలేదు. కింద స్థాయి ఉద్యోగులు, తక్కువ జీతం ఉన్నవారు కూడా పైకి రావచ్చు. సంపన్నులు కావటానికి సొంత తెలివితేటలు, శ్రద్ధ, సృజనాత్మకత, నిబద్ధత అవసరం.

ఇతరుల కోసం త్యాగం చేయాలని దేవుడు కోరుకుంటున్నాడని అనుకోవటం తప్పు. దేవుడు కోరుకునేది మిమ్మల్ని మీరు మీ కోసం వినియోగించుకోవటం. మిమ్మల్ని మీరు ఎక్కువగా వినియోగించుకోవటం ద్వారా ఇతరులకు మరింత సాయం చేయవచ్చు. కనుక మీరు డబ్బు సంపాదించే పనిపైన దృష్టిపెట్టటం మంచిది. ఇప్పటికే సృష్టించ బడిన వాటి కోసం పోటీపడకండి. కొత్తవాటిని సృష్టించాలి.

ఒక పుస్తకాన్ని వంద రూపాయలకో, రెండొందల రూపాయలకో మనం కొంటాం. దానిలో ఉన్న విషయాలను ఆకళింపచేసుకుని మన జీవితంలోకి వర్తింపచేసుకుంటే దాని ద్వారా లభించే ప్రయోజనం అంతకు కొన్ని రెట్లు ఎక్కువ ఉంటుంది. వాటిల్స్ ఇదే మాట చెప్పారు. ''ఒక వ్యాపారి అమ్మే వస్తువు, వారు అందించే సేవలకు తీసుకునే నగదు విలువ కంటే వినియోగదారుడు పొందే 'ఉపయోగ విలువ' ఎక్కువ ఉండాలని చెబుతారు. అప్పుడే మనం చేసే లావాదేవీ వారి మెరుగైన జీవితానికి ఉపయోగపడుతుందని చెబుతారు.

చివరగా ఒక మాట. 'సంపద సృష్టించే రహస్యం' పుస్తకంలో రచయిత చేసిన సూచనలు సరళంగా, ఆచరణ యోగ్యంగా ఉంటాయి. ఒక నవల మాదిరిగా కాకుండా పాఠ్యపుస్తకం మాదిరిగా మళ్లీ మళ్లీ చదవటం వల్ల మాత్రమే అందులో ఉన్న సూత్రాలను ఒంటపట్టించుకోగలుగుతారు. ధనవంతులు కాగలుగుతారు. ఈ పుస్తకం వెంటనే ఈ పుస్తకం చదవాలని మీకు అనిపిస్తోందా? వెంటనే ప్రచురణకర్తలను సంప్రదించండి. ఆన్ లైన్ లో కావాలనుకునేవారు www.pustakalayam.com లో ప్రయత్నించవచ్చు.

**సంపద సృష్టించే రహస్యం**

('ది సైన్స్ ఆఫ్ గెట్టింగ్ రిచ్' పుస్తకం తెలుగు అనువాదం)

రచయిత : వాల్లస్ డి. వాటిల్స్

అనువాదం : వేమూరి ఆయుబాబు

వెల : రూ.175

ప్రచురణ : రెడ్ నిబ్ పబ్లికేషన్స్

ప్రతులకు: ఆలపాటి శరణ్యకుమార్, పబ్లిషర్, ఫోన్ 90307 66609

సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# చరమాంకం

-వీరేశ్వర రావు మూల

సెల్ మోగుతోంది ! వాట్సాప్ మెసేజ్ లు వరద లా వస్తున్నాయి.

వర్కింగ్ ఉమెన్ హాస్టల్ లో ఉన్న వందన స్పందించడం లేదు.

ఫోన్ ఫోన్ మోగి మోగి ఆగి పోయింది.వాట్సాప్ మేసేజ్ లు కూడా ఆగిపోయాయి.

ఇది నిజమా అంటూ గొణుక్కుంటూ మంచం మీదకి చేరింది ! నిద్ర రాలేదు . "ఛ ఇన్నాళ్ళు తను ఆ పాపిష్టి డబ్బు తో చదువుకుందా ?

ఆలోచనల తో మెదడు వేడెక్కింది !

"పోర్న్ స్టార్ సావిత్రి " వెక్కిరింత గా తన రూమ్ మేట్ రాగిణి అన్న మాటలు బాణాల్లా గుచ్చసాగాయి

★★★★★★

ఆరోజు సాయంత్రం ! రెస్టారెంట్ లో వందన ఎదురుగా

వందన స్నేహితుడు ఎంబీఏ క్లాస్ మేట్ వర్ధన్ ఉన్నాడు.

" ఏమిటో డల్ గా ఉన్నావు ? " అడిగాడు వర్ధన్

"సీరియస్ విషయం ఏలా చెప్పాలి ?"

" నోటి తో చెప్పు " సరదాగా వర్ధన్

" ఈ పాత జోకులకేం లోటు లేదు . నా పర్సనల్ విషయాలు నీ తో షేర్ చేసుకోవాలి "

"చెప్పు "

" నాకు నాన్న ఎవరో తెలియదు. అమ్మ,నాన్న అన్నీ అమ్మే ! అమ్మ సినిమా ల్లో జూనియర్ ఆర్టిస్ట్ గా పని చేసి నన్ను చదివించింది. నేను హైస్కూలు నుండి హాస్టల్ లో ఉండి చదువుకున్నాను.స్కూలు సెలవులు ఇచ్చినప్పుడు అమ్మ దగ్గరికి వెళ్ళేదాన్ని. ఎప్పుడూ అమ్మ నా దగ్గరే ఉంటే బాగుండునిపించేది. సెలవులయిపోగానే మళ్ళీ స్కూలు. ఎప్పుడూ అమ్మ అనేది "నువ్వు బాగా చదువుకుని గొప్ప దానివి కావాలి అని"

"మీ అమ్మ గారు నిన్ను కష్టపడి చదివించారు "

"అమ్మ గురించి షాకింగ్ నిజం ఒకటి తెలిసింది "

"ఏమిటది ? "

" అమ్మ ఒక పోర్న్ ఫిలిం లో నటించింది. ఛీ ఛీ అలా సంపాదించిన డబ్బు తో నన్ను చదివించిందా ? తలుచుకుంటే ఒళ్ళు కంపరం మెత్తుతోంది ! "

వర్ధన్ ఏం మాట్లాడలేదు. సర్వర్ వచ్చి కాఫీ ఇచ్చి వెళ్ళాడు.

"ఏ పరిస్థితుల్లో ఆవిడ మీద ఏ ఒత్తిడి పని చేసి అలా చేయవలిసి వచ్చిందో ! "అన్నాడు వర్ధన్

"ఆ మనిషిని అమ్మా అని ఏలా పిలవాలి ? రూమ్మేట్ రాగిణి చూపించిన వీడియో చూసి మతి పోయింది.అందులో పచ్చిగా... "

"నీ రూమ్మేట్ రాగిణి క్లాసు పుస్తకాలు మానేసి వీడియోలు చూస్తుందా ? "

" దాని కదే పని ! ఇప్పటికే ముగ్గురు బాయ్ ఫ్రెండ్స్,రెండు అబార్షన్లయ్యాయి. "

"ముందు రూమ్మేట్ ని మార్చు. మిగతా విషయాలు తరువాత మాట్లాడుదాం "

"అమ్మ తో మాట్లాడి వారమయ్యింది "

"ఆ రోజు అమ్మ తో నీ నీచమైన డబ్బు నాకు పంపకు .నాకు ఉద్యోగం వచ్చేలా ఉంది అని చెప్పి పెట్టేసాను. అప్పటినుండి మాటలు లేవు.

" తల్లి కదా ఒకసారి మాట్లాడు.తను ముళ్ళ దారి నడిచి నీకు పూల బాట ను పరిచింది " అన్నాడు వర్ధన్

అంతా విని , "ఏమో వర్ధన్ షాక్ లో ఉన్నా !"

కూల్ గా ఆలోచించు అన్నాడు. ఇద్దరూ రెస్టారెంట్ బయటికి వచ్చారు. బైక్ మీద హాస్టల్ దగ్గర దిగబెట్టాడు

★★★★★★

వందన మొబైల్ లో చాలా పెద్ద వాట్సాప్ మెసేజ్ వచ్చింది

" వందూ , తొందరపడి ఈ మెసేజ్ డిలీట్ చేయకమ్మా.పూర్తి గా చదివి నీ

సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# చరమాంకం

ఇష్టం వచ్చినట్టు చెయ్యమ్మా !

అందరి లాగా యవ్వనం లో ఉన్నప్పుడు ముందు వెనకా ఆలోచించకుండా అసిస్టెంట్ డైరక్టర్ ని పట్టుకుని హీరోయినయిపోదామని చెన్నై వచ్చేసాను.హీరోయిన్ గా మారవలసిన దానిని వైకుంఠ పాళి లో నిచ్చెన పక్కన పాము నోట్లో పడినట్లు ,ఆకలి చూపుల అడ్డా లో అర్ధ నగ్నంగా ఆడి జూనియర్ ఆర్టిస్ట్ గా మిగిలాను. అడవి కన్యలు సినిమాలో అర్ధ నగ్నంగా నటించినందుకు ఐదువందలే దక్కింది. స్టంట్ మాస్టర్ తిట్లు బోనస్ !. అందులో రెండు వందలు నీ స్కూలు ఫీజు కి పోయింది. ఘన కార్యం చేసానని చెప్పడం లేదు. నా పాడు నీడ నీ మీద పడకూడదని నా సినిమాలకి,షూటింగ్ లకి దూరం గా ఉంచి పెంచాను.

సినిమా లు వదిలి వేరే పని చూసుకుందామంటే నా చదువు కి పనిమనిషి ఉద్యోగం వచ్చింది. అక్కడ ఇంటి ఓనర్ కొడుకు నన్ను బలాత్కరించ బోయాడు.

మళ్ళీ రంగుల వల లో పడ్డాను.

నీ కాలేజి ఫీజు కోసం రెండు లక్షలు అవసరమైంది.అప్పుడే నమ్మా !మొదటి సారి సిగ్గు ని పూర్తిగా చంపేసుకొని కెమెరా ముందు బట్టల్లేకుండా... ఆ సినిమా తీసి నోడు బాగా డబ్బున్నోడే. నన్ను మనవాడతాన్నాడు. నాకు సుమంగళి రాత లేదు. అతను యాక్సిడెంట్ లో చనిపోయాడు. నీ కోసమే నమ్మా బ్రతికేది ! నా దారి సరైనది కాక పోవచ్చు. అప్పటికే ఊబిలోకి వచ్చేసాను.ఈ తల్లిని క్షమించి మాట్లాడమ్మా "

"నీ డబ్బు తో పెరిగానంటే అదోలా ఉంది " అనుకుని వాట్సప్ మెసేజ్ డిలిట్ చేసింది.

వందన కీ ఫోన్ వచ్చింది. తల్లి సావిత్రి నుండి. కాల్ కి స్పందించ లేదు.

★★★★★

నాలుగు రోజుల తర్వాత ! ఏదో అపరిచిత నెంబర్ నుండి ఫోన్ !

" నేను రాజన్ లాయర్ని మాట్లాడుతున్నా "

"చెప్పండి"

"మీరు సావిత్రి గారి అమ్మాయి కదా "

" అవును. "

" మీరోక సారి చెన్నై రావలిసి ఉంటుంది. వీలునామ మీద సంతకం పెట్టాలి "

లాయర్ ఎడ్రస్ ఇచ్చాడు. వీలునామా ఏమిటా అని విమానం లో ,వర్ధన్ తోడు రాగా చెన్నై చేరింది. లాయర్ అక్కడ వేచి ఉన్నాడు.

" రండి మీరే నా వందన ? "

"నేనే వందన ని "

" సావిత్రి గారు తన కున్న ఇల్లు, స్థలం అన్ని మీకు చెందేలా విల్లు రాసారు ! "

"విల్లు రాయాల్సిన అవసరమేముంది? ఆవిడ ఎక్కడ "

కొంచెం అసహనం గా అడిగింది.

" ఆవిడ లేరమ్మా ! అంటే ఉత్తర భారత దేశం లో ఎక్కడో ఆశ్రమం లో ఉంటున్నానని చెప్ప మన్నారు. ఆశ్రమం వివరాలు గోప్యంగా ఉంచారు "

"మీరు సంతకం పెట్టి ఒక కాపీ నాకు ఇస్తే నేను వెడతాను. "

అన్నాడు లాయర్ రాజన్ !

ఒక్క సారి వందన లో దుఃఖం పొంగుకొచ్చింది.

" పాపిష్టి దాన్ని ! చివరి సారి అమ్మ కి ఫోన్ కి జవాబు ఇవ్వ లేదు. " వర్ధన్ మీద పడి రోదిస్తోంది వందన.

వందన కన్నీళ్ళ తో విల్లు తడుస్తోంది.

★★★★

సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# పరోపాఖ్యానం

–నన్ద త్రినాధారావు

"మాస్టారూ! ఆరో నంబరు బస్సు వెళ్లిపోయిందా?" అడిగాను అక్కడ నిల్చున్న ఓ శాల్తీని.

"అయ్ .. నాకు నంబర్లు తెలవండి. తవరడిగేది నగల బస్సా? బట్టల బస్సా?" అన్నాడు యాసగా.

"నగల బస్సూ, బట్టల బస్సూనా!.. అంటే ఏమిటి?" అడిగాను అయోమయంగా.

"అదేనండి! బస్సులపై పెద్ద పెద్ద బొమ్మలుంటాయి కదా! అవన్న మాట.." అన్నాడతడు. నాకు నవ్వొచ్చింది.

"నగల బస్సే!" అన్నాను. అతని భాష నాకూ అంటుకుంది.

"అదయితే ఇంకా రానేదండి"

అతడు టక్ చేసుకున్నాడు. స్పెక్ట్స్ పెట్టుకున్నాడు. స్టైల్ గా ఉన్నాడు. భాష అలాగుందేమిటి చెప్మా?! పల్లె బాపతేమో అనుకున్నాను. నా డౌటు వెంటనే తీరిపోయింది.

"ఓలమ్మీ తిక్కరేగిందా.. ఒళ్ళంతా తిమ్మిరెక్కిందా" అంటూ అతని మొబైల్ అరిచి గగ్గోలు పెట్టింది. అతడు పచ్చ స్విచ్చు నొక్కాడు.

"ఆఁ.. సెప్పరా.. అప్పిగా!.. ఏటి.. ఇప్పట్లో నాయుడు గోరి ఇంటికి స్లేబు కాంక్రీట్ నేదా!.. సర్లే.. ఊరెల్తాన్న.. ఆనక సెయ్యి" అన్నాడు ఫోన్ కట్ చేస్తూ.

"బాబూ! నువ్వు మేస్త్రీవా? మరి ఇంత స్టైల్ గా.." అడిగాను.

"అయ్. నాకు సిన్నప్పట్నుంచీ టైలుగా ముత్తాబవడం ఇట్టమండి" అని నవ్వేడు పళ్ళన్నీ బయటపెట్టి.

నేనూ నవ్వాను. వఠి అమాయకుడు అనుకున్నాను.

"నువ్వే బస్సు కోసం ఎదురు చూస్తున్నావోయ్?" అడిగాను.

"నానూ ఆ నగల బస్సు కోసమేనండి బాబయ్యా!" అన్నాడు.

కాసేపు అతనితో బాతాఖానీ కొట్టాను.

ఇంతలో మాక్కావాల్సిన నగల బస్సు.. అదే ఆరో నంబరు బస్సు నిండు గర్భిణిలా వచ్చింది.

బస్సు చాలా రద్దీగా ఉంది. లోపల జనం అగ్గిపెట్టెలో పుల్లల్లా కిక్కిరిసి పోయి ఉన్నారు. దిగేవాళ్ళని దిగనీయకుండా ఎక్కేవాళ్ళు అడ్డు పడుతున్నారు. దాంతో అక్కడో చిన్న సైజు ముష్టి యుద్ధం జరిగింది.

ఇంతమందిని తోసుకొని లోపలికి ఎలా వెళ్లాలా అని భయపడ్డాను. ఈ బస్సు మిస్సయితే మళ్ళీ గంట వరకూ బస్సు లేదాయె. అసలే ఆర్. టి.సి. అంటే బస్సు రాదు.. తెలియదు ..చెప్పలేం.. అని కదా! ఎలాగోలా నేనూ, అమాయకుడు కష్టపడి ఎక్కేసాం.

అసలే అది కాలేజీలు, ఆఫీసులకు వెళ్లే టైమాయె. ఫుట్ బోర్డులు పై జనం బెల్లం ముక్కకి పట్టిన చీమల్లా వేళ్ళాడుతున్నారు. మేం ఎందులోనూ తీసిపోం అన్నట్టు స్టూడెంట్స్ తో పాటూ, వృద్ధ ఉద్యోగులు కూడా డోర్లు పట్టుకొని వేళ్ళాడుతున్నారు.

బస్సు భారంగా కదిలింది.

ఒక పక్కగా నిల్చున్నాను. ఇంతలో నా కాలి కింద ఏదో మెత్తగా తగిలింది. తడిమి చూసాను. నా గుండె గుభిల్లుమంది. అదొక పర్సు! ఉబ్బెత్తుగా ఉంది. నాకు కంగారు మొదలైంది. ఈ రోజు రాశిఫలాల్లో నాకు అనుకోని అదృష్టం ఎదురవుతుందని రాసుంది. అది ఇదేనేమో అనుకున్నాను. ఎవరూ చూడకుండా దాన్ని చటుక్కున తీసి లటుక్కున నా జేబులో కుక్కేసాను.

అప్పుడే ఓ కాలేజీ కుర్రాడు నన్ను చూసి కిసుక్కున నవ్వేడు. నేను చూసేసాను సుమా అనే అర్థం వచ్చేట్టుగా. నాకు గుండె ఆగినంత పనయ్యింది. వీడి దుంప తెగా, కొంపతీసి నేను కూడా చూశానని అందులో సగం వాటా కాని అడుగుతాడా త్రాష్టుడు అని భయపడ్డాను. ఏబ్రాసి మొహం పెట్టి, "ఆ పర్సు నాదేనోయ్. కింద పడిపోయింది" అని ఓ వెర్రి నవ్వు నవ్వేను. తర్వాత ఆ కుర్రాడు మొబైల్లో తల దూర్చేసాడు. నేను ఊపిరి పీల్చుకున్నాను.

అసలే నెలాఖరు. డబ్బులకి

సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# పర్సోపాఖ్యానం

మొహం వాచున్నాను. దీంతో కొంచెం ఖర్చులు గట్టెక్కుతాయి. సంతోషంతో గాల్లో తేలిపోయాను. ఆ పర్సులో ఎంతుందో అన్న ఆలోచనలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి.

ఇంతలో పద్మవ్యూహంలో అభిమన్యుడిలా జనాల్ని తోసుకుంటూ వచ్చాడు కండక్టర్. నాకు పర్సు అలవాటు లేదు. డబ్బులు పై చొక్కా జేబులోనే పెట్టుకుంటాను. టిక్కెట్ తీసుకున్నాను. గడి గడికీ దొరికిన పర్సు ని చెక్ చేసుకుంటూ ఉన్నాను. దానిపై నాకు విపరీతమైన మోజొచ్చేసింది.

బస్సు వెళ్తోంది. కొంచెం రద్దీ తగ్గింది. అమాయకుడు ఇప్పుడు నా పక్కన నిల్చున్నాడు. కండక్టర్ అతనికి టిక్కెట్ కొట్టాడు. అతడు జేబులు తడుముకొని చూసాడు. ఒక్కసారి గట్టిగా గావుకేక పెట్టాడు. బస్లో అందరూ అతని కేకకి అదిరిపడ్డారు.

“ఏవయ్యింది?” అడిగాడు కండక్టర్.

“జోబులో పర్సు నేదండి! యాడో పడిపోనాదండి!” అన్నాడతడు దీనంగా. కంగారుగా జేబులన్నీ వెతుక్కుంటున్నాడు.

అదిరిపడ్డాను. కొంపతీసి నాకు దొరికిన పర్సు అతడిదా అనుకున్నాను.

కండక్టర్ అతని మాటలు నమ్మినట్టు లేదు.

“చూడయ్యా! రోజూ నీలాంటోళ్ళు నాకు చాలామంది తగుల్తూనే ఉంటారు. వాళ్లంతా చెప్పే సోదే ఇది. ఏదో ఒకటి చేసి వెంటనే టిక్కెట్ తీస్కో, లేదా బస్ దిగిపో! త్వరగా ఏదో ఒకటి తేల్చుకో!" ఇది నామాట. నా మాటే శాసనం అన్నట్టు చెప్పి వచ్చినంత వేగంగా ముందుకు వెళ్లి పోయాడు.

అమాయకుడు భోరుమన్నాడు. పిచ్చోడిలా తన పర్సు కిందన పడిపోయిందేమోనని వెతుక్కుంటున్నాడు.

అందరూ అతనికేసి జాలిగా చూస్తున్నారు.

“ఇతడో వెంగళ్లాయిలా ఉన్నాడే! వెధవది పర్సు పడిపోవడం ఏమిటి?! ఎవడో కొట్టేసుంటాడు. బస్సుల్లో దొంగ వెధవలు ఎక్కువై పోయారు” అని ఓ బట్టతల బూతులు లంకించుకున్నాడు. ఆయనకి సపోర్టుగా మారో పైజామా లాల్చీ కూడా తిట్లు అందుకున్నాడు. ఆడాళ్ళు కూడా దొంగని శాపనార్థాలు పెట్టసాగారు.

నాకు తల కొట్టేసినట్టయింది. వెధవది ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చచ్చినట్టయింది నా పరిస్థితి.

నాకు పర్సు దొరికిన ఆనందం పోయి బాధ మొదలయి పోయింది. పోనీ పర్సు నాకు దొరికిందని ఇచ్చేస్తేనో అనుకున్నాను. ఒక వేళ నా దురదృష్టం కొద్దీ సీన్ రివర్సయితే? కొంపలంటుకుంటాయి. నేనే దొంగతనం చేసానని భ్రమించి, మూర్ఖ జనం నాకు దేహశుద్ధి చేసే ప్రమాదం ఉందని వెనక్కు తగ్గాను. ఏం చేయాలో అర్థం కాక బుర్ర పీక్కున్నాను.

“పర్సులో డబ్బెంత ఉందయ్యా?” సానుభూతిగా అడిగాడో పెద్దాయన.

“పదివేలు వరకూ ఉంది బాబయ్యా! సెల్లి పెల్లికి అప్పు సేశా” అన్నాడు అమాయకుడు.

“బస్లో అందర్నీ చెక్ చేయండి. దొంగ దొరికిపోతాడు. ఇలాంటి వాళ్ళని మామూలుగా వదలకూడదండీ. ఎముకల్లో సున్నం లేకుండా చితక్కొట్టాలి ” అన్నాడో జీన్ ఫేంట్ ఆవేశంగా.

నా పై ప్రాణాలు పైనే పోయాయి. వీళ్ళ అసాధ్యం గూలా? చేయని తప్పుకి నాకు వీపు చిట్లేలా ఉందే! సిగ్గు సిగ్గు! ఈ బస్సులో తెల్సిన వాళ్ళుంటే పరువు కూడా పోయేట్టుంది. ఏం చేయాల్రా దేవుడా అనుకున్నాను. అందరూ బస్ని చెక్ చేయడాన్నే సమర్థించారు.

“అయినా మన పిచ్చి గానీ పర్సు

సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# పర్సోపాఖ్యానం

కొట్టేసిన వెధవ ఇంకా ఈ బస్సులోనే ఉంటాట్టండీ? ఎప్పుడో చెక్కేసి ఉంటాడు" ఓ పంతులు గారు పిలక సవరించుకున్నారు.

అయినా ఆశ చావక అమాయకుడు అందర్నీ పర్సులు చూపించమని వేడుకుంటున్నాడు. కొందరు చూపిస్తున్నారు. కొందరు చిర్రుబుర్రులాడుతున్నారు. నాకు బీపీ పెరిగిపోయింది. మనసులోనే దేవుళ్లందరికీ మొక్కేసాను. నన్నుఈ గండం నుంచి గట్టెక్కించమని. అయినా నా పిచ్చిగాని ఇలాంటి బుద్ధి తక్కువ పనులకి దేవుడు మాత్రం ఎందుకు సాయపడతాడు?! ఈ రోజు నాకు ఫుల్ కోటింగ్ తప్పదు. పొద్దున్నేఎవడి మొహం చూసానో ఏమో నా ఖర్మ ఇలా తగలడింది అని తిట్టుకున్నాను.

"బాబయ్యా! ఏమీ అనుకోకండి. తవరి పర్సు కూడా కాస్త సూపిత్తారా?!" అంటున్నాడు అమాయకుడు.

ఎవరో నన్ను ఫెడీల్మని మొహమ్మీద గుద్దినట్టయింది. హి హి అని పళ్ళికిలించాను. వెర్రి మొహం వేస్కొని అతని కేసి అయోమయంగా చూసాను.

ఇంతలో నన్ను రక్షించడానికా అన్నట్టు ఆపత్బాంధవుడిలా వచ్చాడు కండక్టర్.

"ఏమయ్యా! పర్సు దొరికిందా?" అని అడిగాడు. అమాయకుడు బుర్ర అడ్డంగా ఊపాడు. అప్పటికే బస్సు సగం గమ్యానికి చేరుకుంది.

"నీ గురించి ఆలోచిస్తే నా ఉద్యోగం ఊడేట్టుంది. నువ్వు వెంటనే బస్సు దిగటం మంచిది" అంటూ "హోల్డాన్" అన్నాడు కండక్టర్.

బస్సాగి పోయింది.

బస్సులో వాళ్లంతా మాటలతో సరిపెట్టారు కానీ ఒక్కరూ ఒక్కరూపాయి తీసిన పాపాన పోలేదు.

ఇంతలో ఓ తలపాగా తన చిక్కంలోంచి డబ్బులు తీసి కండక్టర్ కి ఇచ్చాడు. అమాయకుడు అతడికి రెండు చేతులూ జోడించాడు.

బస్సు కదిలింది. అమాయకుడికి దుఃఖం ఆగటం లేదు. పొగిలి పొగిలి ఏడుస్తున్నాడు.

ఇంతలో నేను దిగాల్సిన స్టాప్ వచ్చింది. దిగాను. ఆశ్చర్యంగా అమాయకుడు కూడా అక్కడే దిగాడు.

తలపాగా అతను తల కిటికీలోంచి బయటికి పెట్టి చూస్తున్నాడు. అతను చేసిన సహాయానికి అమాయకుడు మళ్ళీ మళ్ళీ కృతజ్ఞతలు తెలిపాడు. అతడు నవ్వాడు.

బస్సు కదిలిపోతున్న సమయంలో అతడు అమాయకుడి చేతిలో ఏదో పెట్టాడు. అమాయకుడు నివ్వెరపోయాడు. అతని కళ్ళు ఆనందంతో మెరిసాయి. అది అతని పర్సే!.. అంటే తలపాగా అతనే దొంగా?! మేమిద్దరం చేష్టలుడిగి నిల్చున్నాం.

బస్సు వేగం అందుకుంది.

'దొంగయితేనేమి ఎవరూ చేయని గొప్పపని చేసాడ'ని వేనోళ్ళ పొగిడాం.

అమాయకుడు లోపల డబ్బులు చూసుకున్నాడు. రూపాయి కూడా దొంగ తీసుకోలేదు. ఆడపిల్ల పెళ్లి దొంగ మనసునే మార్చింది. మంచి దొంగ అనుకున్నాను. అమాయకుడు సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

నేనూ సంతోషించాను. ఒకటి దొంగ మానవత్వానికి! రెండోది నాకు దొరికిన పర్సు అమాయకుడిది కానందుకు!! నా పంట పండిందని సంబర పడ్డాను.

దార్లో ఇద్దరం ఒక చోట విడిపోయాం. నాకు చాలా టెన్షన్ గా ఉంది. వెంటనే పక్కకు వెళ్లి ఆత్రంగా పర్సు తెరిచి చూసాను. నిర్ఘాంతపోయాను! అది చిరిగి పాడయి పోయి, ఎందుకూ పనికిరాని పాత పర్సు! లోపల చిత్తుకాగితాలు తప్పా ఏం లేవు!! నన్ను చూసి కాలేజీ కుర్రాడు ఎందుకు నవ్వాడో నాకిప్పుడు అర్థమైంది.

# సభలు - సత్కారాలు

ఎం. ఆర్. వి. సత్యనారాయణ మూర్తి, పెనుగొండ గారు ఆదివారం 19.3.23 న బెంగుళూరులో కర్ణాటక తెలుగు రచయితల సంఘం వారి నుంచి ఉగాది పురస్కారం అందుకున్నారు





లీలాక్రిష్ణ గారు ప్రపంచ కవితా దినోత్సవం మరియు ఉగాది పండుగ సందర్భంగా కవితా గానము చేసి.. గజల్ మాస్ట్రో మరియు ట్రిపుల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత డాక్టర్. గజల్ శ్రీనివాస్ గారి చేతుల మీదగా ఉగాది సత్కారం అందుకున్నారు

కె రవికుమార్ గారికి శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనంలో కవితుచదివినందుకు జరిగిన సన్మానం





అద్దేపల్లి జ్యోతి గారికి ఉగాది సన్మానం



అవ్వారు శ్రీధరబాబు గారు తెలుగు రచయితల సమాఖ్య వారిచే వారి ఎగురుతున్న పద్యం కవితా సంపుటికి ఉగాది పురస్కారం సీబీఐ మాజీ చీఫ్ లక్ష్మీ నారాయణ గారి చేతుల మీదగా అందుకున్నారు

శుభాకాంక్షలు

# గ్రంధావిష్కరణలు



ఎం. ఆర్. వి. సత్యనారాయణ మూర్తి, పెనుగొండ గారి పదమూడో కథల పుస్తకం

**"గోదావరి నవ్వింది "**ని

ఆవిష్కరణ చేసిన సిబిఐ మాజీ జె డి శ్రీ లక్ష్మీ నారాయణగారు..

బి హెచ్ గౌరీ శంకర్ గారు రచించిన 53వ్యాసాల సంకలనం. రామచంద్రాపురం 'సాహితి గోదావరి ' అనే సాహితి సంస్థ జనవరి 8,2023ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. .



## సాహితి పద సుమతి –1 జవాబులు

అడ్డం: 1. కొరివి 2. చందమామ 3. శచిపతి 4. మద్దెల 5 .నన్నయ్య 6.రా వి శాస్త్రి 7.తృష్ణ 8. వారధి 9. శంఖు


నిలువు :1. కొలకలూరి 2. చంపకమాల 3. శని 4. ఉమా 5. వెంకయ్య 6. రామకృష్ణ 7. త్రుప్రాయం 8. దాశరధి 9.పాశం

పుస్తక పరామర్శ

# కొత్త పుస్తకాలు వచ్చాయి..



## స్వర్ణ శిఖారాలు



స్వర్ణ శిఖారాలు


నల్లబాటి రాఘవేంద్ర రావు

కస్తూరి విజయం ప్రచురణ

ఈ కథలు చదివితే పిల్లలకు ఓర్పు, నేర్పు వస్తుంది. పెద్దలకు వారి పెద్దరికం నిలబెట్టుకోవడం అర్థమవుతుంది. ప్రస్తుతాన్ని దేశ కాలమాన పరి స్థితులను బట్టి అర్థం చేసుకునే తీరులో మార్పొస్తుంది. మొత్తానికి కుటుంబ ఆప్యాయతలు, సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయి. ఈ పుస్తకం పాఠకునిగా ఎందుకు చదవాలి అంటే... ఇక్కడి ఇరవై కథలు జీవితానికి, వ్యక్తులకు చెందిన తాత్వికతను మరో ఇరవై మార్గాలుగా చూపిస్తాయి. అందుకనే రచయిత దిక్సూచిలా 'స్వర్ణశిఖరాలు' చేరుకోవడానికి ఈ కథా ప్రపంచం సృష్టించారా అన్నట్టుంది. ఇది పాఠకులు తప్పక కొని చదవాల్సిన పుస్తకం. ఈ కథలన్నీ మన సంస్కృతిని, సంప్రదాయాలను సమన్వయం చేసే వెలుగు రేఖలు కావున, బహుమతిగా ఇచ్చేంతటి మంచి కథలతో ఈ పుస్తకాన్ని వ్రాసిన రచయిత నల్లబాటి రాఘవేంద్రరావు గారికి అభినందనలు.

## ఆకాశం లో ఒక నక్షత్రం


విభిన్నరకాల ఇతివృత్తాలతో రూపొందిన ఈ కథల్లో మానవ జీవితంలోని వైశాల్యం, భిన్న ప్రవృత్తులతో సంచరించే మనుషుల నైజం సాక్షాత్కారిస్తుంది. సమాజం మారుతున్నట్టే కనిపిస్తున్నా మారని మనుషుల ప్రవర్తనాసరళిని చిత్రించడానికి ప్రయత్నించారు రచయత . తాము ఎక్కడ్నించి వచ్చామో ఆ మూలాల్ని మరచిపోయే ధనికుల కురచబుద్ధిని వారి మనసుకే తాకేలా చిత్రించడం మెచ్చదగిన విషయం. అయితే ఈ కథల్లో ఎక్కడా కులవివక్ష, దళితులు, బహుజనులు, ఆధిపత్యకులాల పెత్తనం వంటి మాటలు ఉపయోగించలేదు. అసలు ఎవరిది ఏ కులమో చెప్పకుండానే కథలో పాత్రల చిత్రణలో, సన్నివేశాల కల్పనలో సూచిస్తారు. ఇది రచయిత కథనాత్మక వ్యూహంలోని మేలిమి అంశం. ఎందుకంటే కథ అన్నది పాఠకుల్లో ఆలోచనని, సంస్కారాన్ని ప్రోది చేయాలి. సాటి మనుషుల పట్ల అమానవీయంగా ప్రవర్తించకూడదనే ఎరుక తీసుకురావాలి. ఇందుకు రచయత తాను అనుసరించిన కథనశైలి తోడ్పడుతుంది. ఈ కథల్లో ఎన్నో స్ఫూర్తిదాయకమైన పాత్రలున్నాయి. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అవసరమని చెబుతాయి ఈ కథలు. మనుషుల నడుమ తేడాలు చూపకపోవడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలబడటం, మరీ ముఖ్యంగా ఎదురుదెబ్బలు తిన్నప్పటికి ధైర్యంగా ముందుకు పోవడమనే లక్షణాల్ని చిత్రించిన కథల సమాహారం ఇది. “నేనే విశ్వం, విశ్వమానవుడి వీలునామా, ప్రొటోకాల్, గంగ పొంగింది, ఒక ప్రమాదం తర్వాత, రెయిన్ డాన్స్, నమ్మకం, సృష్టిలో తీయనిది” వంటి కథలు మరింత ప్రత్యేకమైనవి.



ఆకాశం లో ఒక నక్షత్రం

డా. ఎం .సుగుణరావు

పాలపిట్ట ప్రచురణ



పిల్లల కథ

# గంధపు బొగ్గులు



అనగనగా ఒక రాజుగారు. ఒక రోజు సపరివారంగా వేటకెళ్ళారు. వేటాడుతూ వేటాడుతూ రాజు గారు దారి తప్పారు. తిరిగి తిరిగి ఎంత తిరిగినా రాజుగారికి దారి కనపడక పోగా అలసిపోయి ఒక చెట్టు క్రింద కూల బడ్డారు. ఈ లోగా చీకటి పడింది. రాజుగారి కోసం వెతుకుతూ ఇతర సైనికులు కూడా ఇక చేసేదేమి లేక తిరు గుముఖం పట్టారు.

ఆ అడవిలో కొంత మంది అనాగరికులు నివసిస్తున్నారు. వారి వృత్తి చెట్లని నరికి, కాల్చి బొగ్గుగా మార్చి అమ్ముకోవడం. చీకటీ పడటం తో ఇంటి దారి పట్టారు. దారిలో రాజు గార్ని చూసి, గుర్తు పట్టి వాళ్ళ గూడానికి తీసుకు వెళ్లి సపర్యలు చేసి రాజుగార్ని మాములు స్థితికి తీసుకొచ్చారు. రాజుగారు ఆరాత్రి అక్కగే గడిపి, మరుసటి రోజు తన రాజ్యానికి చేరుకున్నారు. ఈ లోగా రాణిగారు, మంత్రి ఇతరులు రాజు గారే మయ్యారా అని ఆందోళన చెందుతున్నారు. రాజుగార్ని చూడగానే అనందంతొ జరిగింది విని సంతోషించారు.

తనకు మేలు చేసిన వారికి ఏదో ఒకటి చేయాలని రాజుగారు ఒక రోజు అనాగరికులను తన రాజ సభకు పిలిపించి వారిని సన్మానించి వారి గురించి విచారించారు. వారి వృత్తి చెట్లను కొట్టి బొగ్గుగా చేసి అమ్ముకుంటారని తెలుసుకుని జాలిపడి వెంటనే వారికి గంధ పు చెట్లు వున్న ఒక వనాన్ని వారికిచ్చి, ఆనందంగా జీవించుమని పంపారు.

కొన్నాళ్ళ తరువాత రాజుగారి కొక రోజు తనకు సహాయం చేసిన అనాగరికులు ఎలా వున్నది. వారి జీవనం అభిన్నద్ధి చెందిన్దో లేదో చూద్దామని, సపరి వారంగా గంధపు చెట్ల వనానికి బయలు చేరారు. అక్కడ, పూర్వం గంధపు చెట్ల తో కళకళ లాడిన వనంలో ముచ్చుకు ఒక్క చెట్టు కుడా కనబడక పోగా, బొగ్గురాశులు, కనిపించాయి. ఇదేమిటని వారిని విచారించగా. గంధపు చెట్లను నరికి బొగ్గుగా మార్చి అమ్మ కుంటున్నామని శలవిచ్చారు.

రాజుగారు నిర్ఘాంత పోయి మంత్రి నోఎందుకిలా జరిగిందన్నారు. దానికి మంత్రి గారు మహారాజ వారి ఉన్నతిని కోరి మీరు గంధపు చెట్లను దానం చేశారు. కాని ఆ అనాగరికులకు వాటి విలువ తెలియక యధా ప్రకారం నడుచు కున్నారు. ఒక వ్యక్తి వ్నున్నత స్థితికి తీసుకు రావాలంటే అతని వైపుణ్యాలను పెంచటానికి దోహదం చెయ్యాలి. అనాగరికులను నాగరికులుగా మార్పు చేసే విద్య నందించాలి కాని, బహుమతులు ఇవ్వటం సరికాదు అన్నారు . రాజుగారికి తను చేసిన తప్పేమిటో తెలిసొచ్చింది .

తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు ఎవరైనా విద్యార్థులకు ఎక్కువ డబ్బు కాని, మార్కులు కాని ఇవ్వటం వల్ల ఎటువంటి ఉపయోగం లేదు . వారి నైపుణ్యాన్ని పెంచే దిశగా ప్రయత్నం చెయ్యాలి లేక పోతే పైన చెప్పిన విధంగా మనం ఇచ్చే ఖరీదైన బహుమానాలు గంధపు బొగ్గులుగా మిగిలిపోతాయి తప్ప దేనికీ ఉపయోగ పడవు .

**---ఈ మణికంఠ**





దారి కనిపెట్టటానికి సహాయం చెయ్యండి



నేనెవరో కనుక్కోండి

## ఖాళీలు పూరించండి పిల్లలు(ఇంగ్లీషులో )






బొమ్మకు రంగులు వెయ్యండి


## మెదడుకు మేత

1. 5 పిల్లులు 5 నిమిషాలలో 5 ఎలుకాలని చంపితే ,10 పిల్లులు 10 నిమిషాలలో ఎన్ని నిమిషాలలో చంపుతాయి

2.5 తొమ్మిదులు ఉపయోగించి 10 కి సమానం చెయ్యండి

సమధానాలు పక్క పేజీలలో చుడండి

# సాహితీ పద సుమతి – 2



* ఈ పేజీ ప్రింట్ తీసి జవాబులు వ్రాసి పంపండి.
* కరెక్టుగా వ్రాసి పంపిన వారిలో లాటరీ తీసి ఇద్దరికి రూ.116/–నగదు బహుమతి
* పంపవలసిన చివరి తేది

2 చరమాంకం

**మెదడుకు మేత సమాధానాలు**

1. 5
2. 9+99/99

**ఖాళీలు పూరించండి**

1. Apple
2. Fish
3. Moon
4. Snail

అడ్డం

1. కిన్నెరసాని రచించిన కవి
2. ఏనుగుకు మరో పేరు
3. కొంగు ......లో చివరిది
4. స్వప్నమే
5. పెన్నేటి పాట రచయిత
6. Dam తెలుగులో
7. అటు నుంచి ‘ మావి ...... ‘
8. కాగితపు డబ్బు అటు ఇటు కలిసి కట్టుగా
9. కాలక్షేపము మరో పేరు తిరగబడింది

నిలువు

1. చేమకూర వారి రచన
2. శివభారతం రచించిన కవి ఇంటి పేరు
3. తిలకాష్ఠ మహిష ....కట్టివేసింది
4. కవితత్వ విచారం రాసిన కవి ఇంటి పేరు
5. ఉనికి పర్యాయ పదం
6. గుర్రానికి మరో పేరు సాగింది

sumathi.potilu@gmail.com

# చిత్ర కథ

ఈ క్రింది బొమ్మకు సరసమైన కథ రాసి పంపండి. ఉత్తమ మైన కథకు నగదు బహుమతి అందించ బడును.



# చిత్ర కవిత

ఈ క్రింది బొమ్మకు కవిత రాసి పంపండి. ఉత్తమ మైన కవితకు నగదు బహుమతి అందించ బడును.



సుమతి పాఠకుల అభిప్రాయాలకు అత్యంత విలువను ఇస్తుంది. మీ మంచి సలహాలే మా అభివృద్ధికి సోపానం. పాటకుల సలహాలను, అభిప్రాయాలను ఈ క్రింది మెయిల్ కు పంపడి. పంపవలసిన చివరి

తేది 30/04/2023

sumathi.salahalu@gmail.com



చీఫ్ ఎడిటర్
**శ్రీమతి ఎ. శ్రీవిద్య**






ఎడిటర్
**శ్రీమతి కె. వీణ**




# సుమతి చందాదారులుకండి

ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని శోభకృతు నామ సంవత్సరం ఉగాది నుండి మీ ముందుకు వస్తుంది

## సుమతి

కుటుంబ మాసపత్రిక

**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల. **రూ. 25 /-** రూపాయలు

సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారికి 200 విలువచేసే పుస్తకాలను ఉచితంగా పంపబడును

ఈ క్రింది ఫోన్కు గూగుల్ పే కు లేదా ఫోనేపే కు చేయవచ్చు.

7893111985

# సుమతి కార్టూన్లు & కారికేచర్ పోటీలు

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక శోభకృతు నామ సంవత్సర ఉగాది నుండి వెలువడుతున్న సందర్భంగా తెలుగు కార్టూనిస్ట్ లకు, చిత్రకారులకు ఇదే మా ఆహ్వానం. మీ విలువైన కార్టూన్లు & కారికేచర్ లను పోటీలకు పంప వలసినదిగా కోరుతున్నాము.

ఉత్తమ కార్టూన్లు & కారికేచర్ లకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందించబడుతుంది. సాధారణ ప్రచురణకు ఎంపికైన వాటికి ప్రశంసా పత్రం ఇవ్వబడుతుంది.

## నిబంధనలు

* కార్టూన్లు & కారికేచర్లు A4 సైజ్ లో ఉండాలి.
* ఎవ్వరినీ కించ పరిచే విధంగా ఉండరాదు.
* కార్టూన్లు & కారికేచర్ లు ఎక్కడా ప్రచురించ లేదని హామీ పత్రం తప్పనిసరి

**పంపుటకు చివరి తేది : 20-04-23**

**రచనలను పంపవలసిన ఈ మెయిల్ ఐ.డి.**

నవలలు : sumathi.cartoons2023@gmail.com

# సుమతి నాటిక & నాటకాల పోటీలు

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక శోభకృతు నామ సంవత్సర ఉగాది నుండి వెలుబడుతున్న సందర్భంగా తెలుగు రచయితలు, రచయిత్రుల నుండి తెలుగు నాటిక & నాటకాలను పోటీలకు ఆహ్వానిస్తున్నాము. వీటిని పంపగోరె రచయితలు ఈ క్రింది విభాగాలలో తమ నవలలను పంపవచ్చు.

* సామాజిక స్ఫూర్తి నింపే నాటికలు ,నాటకాలు
* చారిత్రాత్మక సంఘటనలు పరిణామాలను వివరించే నాటకాలు
* పౌరాణిక నాటికలు ,నాటకాలు
* కామెడీ నాటకాలు,నాటికలు

ప్రతి విభాగంలో ఎంపికైన వాటికి 1000/- నగదు , ప్రశంసా పత్రం ఇవ్వబడును.
సాధారణ ప్రచురణకు ఎంపికైన నవలలకు ప్రశంసా పత్రం ఇవ్వబడును.

**నిబంధనలు**

* నాటిక & నాటకం డిటిపి లో 15 నుండి 20 పేజీలకు మధ్య ఉండాలి
* ప్రతి పేజీకి 20-25 లైన్లు ఉండాలి
* ప్రతి రచన మొదటినుండి చివరి వరకు చదివించే గుణం ఉండాలి
* ప్రతి రచనతో హామీ పత్రాలు తప్పనిసరి
* రచయిత రచనలు అన్నీ యూనికోడ్లో టైప్ చేసి పంపాలి

**రచనలను పంపుటకు చివరి తేది : 20-04-23**

**రచనలను పంపవలసిన ఈ మెయిల్ ఐ.డి.**

: sumathi.natakalu223@gmail.com



ఎరుకేశ్వరాలయం (పిల్లలమర్రి)